Dalithayugam-2

03-09-09

1

బి.ఎస్.రాములు

60వ జన్మదిన ప్రచురణ

49వ పుస్తకం

దళిత సాహిత్యయుగం

రెండో సంపుటి

సంపాదకులు :

డాక్టర్ మొయిలి శ్రీరాములు

M.A., T.P.T., B.Ed., M.Phil., Ph.D., SLET.

ప్రచురణ

సామాజిక తాత్విక విశ్వవిద్యాలయం

హైదరాబాద్ – 500 044

2008

దళిత సాహిత్యయుగం

రెండో సంపుటి

బి.ఎస్.రాములు

Ph. 9391036987
e-mail : bsramulu@gmail.com
blog :

సంపాదకులు :
డాక్టర్ మొయిలి శ్రీరాములు
M.A., T.P.T., B.Ed., M.Phil., Ph.D., SLET.

ప్రథమ ముద్రణ : అక్టోబర్, 2008
బి.ఎస్.రాములుగారి 47వ పుస్తకం

బుక్ డిజైనింగ్ : జుగాష్‌విలి, 9848266384

డిటిపి : ఏవిఎమ్ గ్రాఫిక్స్, 9440096321

Publishers & Distributors:
University of Social Philosophy
Vishala Sahitya Acadamy
406, Usha Kiran Arcade, Osmania University Road,
Vidyanagar, Hyderabad - 500 044
✆ : 040- 65164929, 9391036987

వెల : యాభై రూపాయలు

Dalithayugam-2

03-09-09

2

విషయ సూచిక

శంబుక - దళిత సాహిత్య గర్జన

దళిత సాహిత్యం అంటే ఏమిటి? దళితుల మేలు కోరేది దళిత సాహిత్యం. ఈ జవాబుతో ఎవరికీ పేచీ లేదనుకుంటాను. ఇంత సుళువైన ప్రశ్నకు యింత సులభమైన జవాబుండగా దళిత సాహిత్యం అనగానే కొందరు ఎందుకు ఉలిక్కి పడుతున్నారో అర్థం కావడం లేదు. బహుశా దళితుల మేలుకోరే సాహిత్యం తమకు కీడు కలుగజేస్తుందని వాళ్ళ భయం కాబోలు.

అయితే ఒకటి వాస్తవం. ఎవరు దళితులనే వివరణ పట్ల తేడాలు ఉండవచ్చు. ఏది దళితులకు మేలు చేస్తుందనే దానిపట్ల బేధాభిప్రాయాలుండవచ్చు. దాన్ని అర్థం చేసుకోవచ్చు. కానీ కొందరు దళితుల మేలు కోరే దళిత సాహిత్యం అనే మాట పట్ల కూడా ఎందుకు పేజీ పెడుతున్నారో తెలియదు.

వాళ్ళల్లో కొందరు అభ్యుదయ సాహిత్యం అనో, ప్రజా సాహిత్యం అనో, విప్లవ సాహిత్యం అనో, హిందూ సాహిత్యం అనో పిల్చుకుంటే సరిపోతుంది గదా అని ప్రశ్నిస్తుంటారు. ఇవన్నీ నిజంగా ప్రజలందరి మేలు కోరేవి గనుక అయితే అవి దళితుల వ్యతిరేక సాహిత్యమేమీ కాదుగదా! అయినపుడు అభ్యుదయ సాహిత్యం అనో, ప్రజా సాహిత్యం అనో, విప్లవ సాహిత్యం అనో, హిందూ సాహిత్యం అనో మాత్రమే పిలవాలనే వాదం ఎంతో బలహీనంగానైనా ఎందుకు ముందుకు వస్తున్నది? అసలా ప్రశ్నే ఎందుకు ఉత్పన్నమవుతుంది.

సమాజంలో దళితులు తమ సొంత కాళ్ళమీద నిలబట్టం యిష్టంలేని వారు కొందరున్నారు. అందుకు వాళ్ళలో కొందరు సాహిత్య రంగంలోనూ కృషి చేస్తారు. అలాంటి వారు దళితులు తమ సొంతకాళ్ళమీద నిలబడ్డం యిష్టం లేని తనానికి సాహిత్య రూపం యిస్తారు. అప్పుడు వారి వాదం "దళిత సాహిత్యం, దళిత దృక్పథం" అంటూ ప్రత్యేకంగా ఉండనవసరం లేదనే రూపం తీసుకుంటుంది. దళితులు తమ

సొంత కాళ్ళ మీద నిలబడనవసరం లేదనటానికి, ప్రత్యేకంగా "దళిత సాహిత్యం, దళిత దృక్పథం", దళిత సంఘాలు, దళిత రచయితల సంఘాలంటూ ఉండనవసరం లేదనటానికి మధ్య పెద్ద తేడా ఏమీ లేదు. మొదటిది వారి ప్రాపంచిక దృక్పథం అయితే రెండోది సాహిత్యంలో దాని ఆచరణా, వ్యక్తీకరణా, అంతే.అందువల్ల ఎందరు ఎంతగట్టిగా "దళిత సాహిత్యం", "దళిత దృక్పథం", "దళిత సంఘాలు" దళిత రచయితల సంఘాలు అంటూ అవసరం లేదని వాదిస్తారో సరిగ్గా వారిలో అంత మేరకు దళిత వ్యతిరేక దృక్పథం ఆచరణ కొనసాగుతోందని అర్థం.

అయితే, వీళ్ళు నాజూకుగా వ్యవహరిస్తున్నారు. ఒక సాధారణీకరణ పొందగలిగే సాహిత్యాన్ని నిర్దిష్టంగా దళిత సాహిత్యం అంటూ కుదించటం ఎందుకు అని వగలుపోతారు. వాళ్ళన్నదే నిజమైతే, సాహిత్యాన్ని, ప్రజా సాహిత్యం, అభ్యుదయ సాహిత్యం, విప్లవ సాహిత్యం, హిందూ సాహిత్యం అని ఎందుకు నిర్దిష్టం చేస్తున్నట్టు? "సాహిత్యం" అని పిలవవచ్చుగదా!

ప్రజాసాహిత్యం అని పిలుస్తున్నారంటే ప్రజా సాహిత్యేతర సాహిత్యం కూడా వుంటుందనే గదా! విప్లవ సాహిత్యం అని పిలుస్తున్నారంటే విప్లవేతర సాహిత్యం కూడా ఉంటుందనీ అర్థం. అలాగే దళిత సాహిత్యం అని పిలుస్తున్నామంటే దళితేతర సాహిత్యం కూడా ఉంటుందని అర్థం. దళితేతర సాహిత్యంలో దళిత వ్యతిరేక సాహిత్యం కూడా వుండవచ్చు.

సాధారణీకరణ పొందే తాత్వికతను, ప్రాపంచిక దృక్పథాన్ని దళిత దృక్పథం, దళిత సాహిత్యం అని పిలవడం, కుదించడం ఎందుకు కనబడుతుంది వారికి? దళితుల్ని; దళిత దృక్పథాన్ని కుదించి చూసే దళిత వ్యతిరేకులకు తప్ప అలా మరొకరికి ఎందుకు కనబడుతుంది? ఇలాంటి వాళ్ళే దీన్ని సామాజిక రంగంలో నన్ను నేను "హిందువుననో; భారతీయ పౌరున్ననో, పీడితవర్గంననో, ప్రపంచ మానవుడిననో, సగర్వంగా ప్రకటించుకోకుండా మళ్ళీ నేను మాలమాదిగను, డెక్కలినీ, ఛండాలి, కిరాతుడిని, చాకలిని, మంగలినీ, సాలెను, గొల్లను అని నీకు నీవే ఎందుకు కించపరచుకుంటావు అని ప్రశ్నిస్తారు.

ఈ ప్రశ్న దళితుడిని గౌరవించటం కోసమేననుకుంటారు. కానీ వాళ్ళు ఆ మాట అన్నప్పుడల్లా నా హృదయం బల్లెంతో తూట్లు పొడిచినట్టు విలవిలలాడి పోతున్నదని వారికి తెలియదు; తెలియదా! ఏమో వారికి తెలుసో, తెలియదో కూడా తెలియదు. నన్ను నేను మాల మాదిగను, డెక్కలిని, ఛండాలిని, గొల్లను, సాలెను,

మంగలిని, చాకలిని అని సగర్వంగా ప్రకటించుకోవటం నన్ను నేను కించపరచుకోవటంగా వారికి కనిపిస్తున్నదా? నేను బ్రాహ్మణుడని, రెడ్డిని, వెలమను, కమ్మను, ముస్లింను, హిందువును, పీడిత వర్గాన్ని అని నీవు నీ యింటి పేరులోను, లోకంలోను, నీ సంస్కృతిలోను ఆచరణలోను ప్రకటించుకోవటానికి నీకు సిగ్గెందుకు లేకుండా పోయిందోతెలుసుకోవచ్చా? నీకు గల బ్రాహ్మణుడు, కోమటి, రెడ్డి, హిందువు, ముస్లిం, పీడిత వర్గం అనే నిర్దిష్టతలు నీలోని భారతీయుడు, మానవత్వం అనే సాధారణీకరణల్ని, విలువల్ని నాలోని పీడితవర్గం వాటిని కించపరుస్తాయా! అంటే ఏమిటి? నీ కులం హోదాకు హీనత్వమేమీ లేదని దాన్ని నీవు కూడా అనుభవిస్తున్నావు. నాకు గల కులం, తద్వారా నాకు గల నిర్దిష్ట సామాజిక హోదా చిహ్నం, గుర్తింపు చిహ్నంను నీవు కూడా కించపరచడం వల్లనే కదా నీలో ఈ భావం కలుగుతోంది.

అయ్యా! యిలా నన్నూ నా కులాన్నీ, నా దృక్పథాన్ని, "దళిత దృక్పథం", "దళిత సాహిత్యం" అనే నిర్దిష్టత్వంలోకి కుదించకుండా ప్రజా దృక్పథం అనో, వర్గ దృక్పథం అనో, మరొకటనో ఒక సాధారణీకరణ పొందే ప్రయత్నం చేయాలనడంలోనే నన్నూ, నా జాతినీ, కులాన్నీ, పేరునూ, నా దృక్పథాన్నీ కించపరచి చిత్రవధ చేయటమౌతుందని నీకు మాత్రం తెలియదా? దళితులు ఒక వాస్తవం. దళిత దృక్పథం, దళిత సాహిత్యం అనేవి కాలం తీరినవైపోతాయి. అంతదాకా దళిత దృక్పథాన్నీ, దళిత సాహిత్యాన్నీ వాటి అస్తిత్వాన్నీ ఆవశ్యకతను అంగీకరించని వారు వాస్తవాలను గుర్తించ నిరాకరించే వారే కాకుండా అగ్రకులతత్వ పూరిత హిందూ మనుధర్మాన్ని గుండెల్లో నింపుకొని 'పజలు, ప్రజలంటూ'పైపైన అరిచే పచ్చిస్వార్థపరులు, స్వప్రయోజనపరులు అని స్పష్టం అవుతున్నది.

ఇలాంటి వీరు అందమైన పదాలు, ఆవేశపూరిత ఆర్భాటాలు తమ దళిత వ్యతిరేకతకు నగిషీలుగా ఉపయోగిస్తారు. దాంతో వీరి అరుపులు హిందూవర్గ గోడమీది పిల్లుల్లాగుంటాయి. వీరి పిల్లి కూతలకు దళిత దృక్పథం ఉట్టితెగదు. దళిత సాహిత్యం ఆగిపోదు. వారు ఏ దృక్పథంతో రాసినా అది దళితులకు మేలు చేసేదైనపుడు "వారిది దళిత దృక్పథం కూడా" అని వర్గీకరించడాన్ని అభ్యంతర పెట్టేవాళ్ళు, రాసేదీ చేసేదీ ప్రజా సాహిత్యంగానీ, విప్లవ సాహిత్యంగానీ, హిందూ సాహిత్యంగానీ, వర్గ సాహిత్యం గానీ, ఎలా అవుతుందో వారికే తెలియాలి. అంటే మన ఇంటికి పిల్లను ఇవ్వడం గానీ, మన ఇంటి పిల్లను చేసుకోవడంగానీ వారికి యిష్టం లేదన్న మాట. వారు మనతో మంచం పొత్తు, కంచంపొత్తుకే కాకుండా మాట పొత్తుకు కూడా

వ్యతిరేకులన్నమాట.

అందువల్ల దళితులకు ఉపయోగపడే ప్రజాసాహిత్యంగానీ, విప్లవ సాహిత్యంగానీ, వర్గ సాహిత్యంగానీ, దళితసాహిత్యంగా వర్గీకరించడానికి చెప్పే అభ్యంతరాలు స్పష్టంగా అస్పృశ్యతకు సంబంధించినవే. అస్పృశ్యతకు ఏడేళ్ల జైలుశిక్ష. కాగా వీరిలోకొందరు ఘరానా పెద్ద మనుషులుగా, తత్వవేత్తలుగా, హిందువులుగా, రచయితలుగా, రాజకీయ నాయకులుగా, విప్లవకారులుగా చలామణి కావడం విచిత్రం. తాత్విక, సామాజిక విమర్శ రూపంలో, సాహిత్య విమర్శ రూపంలో సాగుతున్న యీ తాత్విక, సామాజిక సాహిత్య అస్పృశ్యతను దళితులు, ప్రజాస్వామిక వాదులు నిరంతరం ఎండగట్టాల్సి వున్నది.

అది నిజంగా ప్రజాసాహిత్యంగానీ, అభ్యుదయ సాహిత్యంగానీ, విప్లవ సాహిత్యం గానీ, వర్గ సాహిత్యంగానీ, హిందూ సాహిత్యంగానీ అయితే అది దళితుల మేలు కోరే దళిత సాహిత్యానికి, దళిత దృక్పథానికి, దళిత ఆచరణకు వెలుపలవుండే సమస్యే ఉత్పన్నం కాదు. దళిత సాహిత్యంలో, దళిత దృక్పథంలో, దళిత ఆచరణలో భాగం కాలేనిది,దళితులతో, దళిత సంఘాలతో, దళిత సాహిత్యకారులతో, దళిత రచయితల సంఘాలతో కలిసి పని చేలేనిది ప్రజాదృక్పథంగానీ, వర్గ దృక్పథంగానీ, హిందూ దృక్పథంగానీ, మానవతా దృక్పథంగానీ ఎలా కాగలదు? అది స్వప్రయోనం కోరే సాహిత్యం అవుతుందేగానీ, పరుల ప్రయోజనం కోరే సాహిత్యం ఎలా కాగలదు? అది ఏ సాహిత్యమైనా, ఏ ఆచరణైనా పరోపకారాన్ని కోరుతున్నదా? స్వప్రయోజనాలకు పరిమితమైనదా? ప్రజావ్యతిరేక అంశాలేమైనా వున్నాయా? అని నిర్ధారించడానికి దళితులను, దళిత ప్రయోజనాలను, దళిత సాహిత్య ప్రమాణాలను కూడా ఒక గీటురాయిగా తీసుకోవటం అనివార్యమవుతుంది. నిర్మాణ రూపాల్లో ఇదే ప్రత్యేకంగా దళిత సంఘాలు, దళిత రచయితలు, దళిత సాహిత్యానికి వెలుపల వుండే సాహిత్యంలో దళిత వ్యతిరేక అంశాలుంటే అవకాశాలున్నాయి. వాటి దృక్పథాన్ని, ఆచరణను విశ్లేషించాలన్నా, సరిచేయాలన్నా, వాటన్నింటిని దళిత దృక్పథం, దళిత సాహిత్యం పరిధి లోపలికి తెచ్చి చర్చించక తప్పదు. అందువల్ల కూడా ఎన్ని రకాల దృక్పథాలున్నా తిరిగి వాటన్నింటిలో దళిత దృక్పథం, దళిత సాహిత్యం, దాని అస్తిత్వం ఆచరణ అనివార్యమవుతున్నది. దళిత రచయిత సంఘాలు, దళిత సాహిత్యోద్యమం మొదలైన వాటి అస్తిత్వాన్ని, ఆచరణని ఉత్పన్నం చేస్తున్నది. అదే సమయంలో వివిధ సమస్త దృక్పథాల్లో, సాహిత్యాల్లో, దళిత సాహిత్య విభాగాలను, దళితుల ప్రత్యేక సెల్స్ విభాగాలను కూడా అనివార్యం చేస్తున్నది. దళితుల ప్రయోజనం మేరకు యివి ఆయా సంస్థలలో, సాహిత్యాలలో, వాటిపై ఉన్నతాధికార సంస్థగా, సాహిత్యంగా నిర్దేశించగలిగినపుడే వీటి లక్ష్యం నెరవేరుతుందని కూడా స్పష్టమవుతున్నది.

వివిధ దృక్పథాల్లో సామాజిక జీవితాన్ని, ప్రజా జీవితాన్ని విశ్లేషించే సాహిత్యాన్ని, ఆచరణను ఆయా దృక్పథాలతోనే చూడాలిగానీ దళిత దృక్పథంతో చూడ్డం సరికాదు అని ఎవరైనా వాదించవచ్చు. వారు వాస్తవాలను ఏ దృక్పథంతో చిత్రించినా దళితుల మేలుకోరే సాహిత్యంగా ఉన్నదా లేదా అని తేల్చడం అత్యంత ముఖ్యమైన విషయం.

వారు ఏ దృక్పథంతోనైనా రాయనీగానీ, కులం అనేది యిప్పటికే ఒకరి అభివృద్ధికీ మరొకరి అణచివేతకు సాధనంగా కొనసాగుతోందా లేదా అనేది అసలైన సూటిప్రశ్న. లేదు అనేవాడు పుట్టుగ్రుడ్డి లేదా పెట్టుగుడ్డి, వారికి రెండు కళ్ళూ అమర్చాలి. అందుకు వారి దృక్పథం, జీవితం అనే ఎందు కళ్ళకూ ఆపరేషన్ చేయాల్సి వుంటుంది. కులప్రాతిపదికపై రిజర్వేషన్లను అంగీకరించేవారూ, వ్యతిరేకించే వారూ కులం అనేది ఒకరి అభివృద్ధికీ, మరొకరి అణచివేతకు సాధనంగా సాగుతోందని అంగీకరిస్తున్న వారే. కులాన్నీ, కులంలోగల యీ లక్షణాన్నీ గుర్తించనివాడు, అది అగ్రకులతత్వంగానీ, పీడిత కులతత్వంగానీ దాన్ని "కులతత్వం" అనే పదాల్లో చెప్పడం మోసం, వంచన. వాళ్ళు వర్గం, హిందువు తాలూకు పదాల ద్వారానే కులతత్వాన్ని, దళిత సాహిత్యాన్ని, దళిత సంఘాలను, దళిత రచయితల సంఘాలను వర్గీకరించుకోవాలి. తమ రచనల్లో అన్నిటితో పాటు కులాన్నీ, కుల అణచివేతను చిత్రించనివారు, ఈ దేశంలోని ఒక ముఖ్య వాస్తవాన్ని వదిలేసి మాయావాదంతో స్వప్నజగత్తులో విహరించే బాధ్యతారహితులే.

జ్ఞానానికి మత స్వభావం వుంది. జాతి స్వభావం వుంది. వర్గ స్వభావం వుంది. కుల స్వభావం వుంది. యూరప్‌లో గుర్రాల వినియోగం ఎక్కువ. అందువల్ల అక్కడ కనుక్కున్న కరెంటును కొలవడాన్ని గుర్రపు శక్తి (హార్స్‌పవర్) అని పిలిచారు. కరెంటును మన దేశంలో కనుక్కుంటే దాన్ని ఎద్దుశక్తి (ఆక్స్‌పవర్)తో కొలిచేవారు. ఒక గిరిజనుడు కనుక్కుంటే దాన్ని "దున్నపోతు" శక్తితో కొలిచేవారు. హిందూ మతతత్వం గల బ్రాహ్మణిస్టు దాన్ని కనుక్కుంటే ఎద్దుశక్తి అని గాకుండా గోశక్తి (కౌపవర్) అని పిలిచే వారు. ఇలా జ్ఞానానికి వర్గ స్వభావం, మత స్వభావం, కుల స్వభావం, జాతి స్వభావం ఏకకాలంలో కొనసాగుతాయి. మన దేశంలో పీడిత కులాల ప్రజలే ఎక్కువ మేరకు నిరక్షరాస్యులుగా, పేదలుగా బతుకీడుస్తున్నారంటే, మన దేశ భాషలు, మతాలు,

జ్ఞానం, అభివృద్ధి, కులవ్యవస్థ, సంస్కృతి, రాజకీయాలు, విప్లవపోరాటాలు మొదలైనవన్నీ అగ్రకుల స్వప్రయోజనాల కనువుగా పరివర్తన చెందించబడుతున్నాయని అర్థం.

ఇలాంటి విషయాలెన్నో యీ కవితా సంపుటిలో కవిత్వీకరించిన భాషలో వ్యక్తీకరించబడ్డాయి. ఇందులో నాస్తిక దృక్పథం వుంది. హేతువాద దృక్పథం వుంది. కుల దృక్పథం వుంది. వర్గ దృక్పథం వుంది. స్త్రీ దృక్పథం వుంది. జాతి దృక్పథం వుంది. ప్రజా దృక్పథం ఉంది. విప్లవ దృక్పథం వుంది. అన్నిటినీ మించి యివన్నీ కలసి ఒక సమగ్ర దృక్పథంగా పరివర్తన చెందబోతున్న ఒక అభివృద్ధి క్రమం వుంది.

ఇతడు అభివృద్ధి చెందాక కూడా యిన్ని దృక్పథాలు ఏకకాలంలో ఒక సమగ్రతలో కొనసాగడం ఎలా సాధ్యం? అని కొందరికి అనుమానం రావచ్చు. ఒకే వ్యక్తిలో తల్లి దృక్పథశం, కూతురు దృక్పథం మొదలుకొని ప్రేయసి, భార్య, చెల్లెలు, అక్క, కోడలు, యారాలు (తోడికోడలు), అత్త, మరదలు, అడపడుచు, అమ్మమ్మ, నాన్నమ్మ, మనవరాలు వగైరా దృక్పథాల్లో సహా ఆ వూరి దృక్పథం, కుల దృక్పథం, జాతి దృక్పథం, ప్రాంతీయ దృక్పథం, పౌరుని దృక్పథం, ప్రాపంచిక దృక్పథం వంటి మరెన్నో దాదాపు ఏక కాలంలో కొనసాగుతుండడం వల్లే ఆచరణలో యిది ప్రతిఫలించడం సాధ్యపడుతున్నది. ఇవన్నీ పరస్పర సంబంధంలో పరస్పర ప్రభావానికి లోనవుతాయి.

ఇలా జరగడానికి ప్రాతిపదికన ఏమిటి? పరస్పర సంబంధంలోకి వచ్చే ప్రతిదాన్నీ అనుసరించి (అనువుగా, తటస్థంగా, వ్యతిరేకంగా) ఆ నిర్దిష్ట సంబంధానికి సంబంధించిన ఆచరణ, ప్రాపంచిక దృక్పథం అస్తిత్వంలోకి వస్తున్నది. ఆయా పరిక్యులారిటీలు అన్నీ కలిసే అతనిది ఒక సమగ్ర దృక్పథం అవుతున్నది. సమగ్ర వ్యక్తిత్వం అవుతున్నది. అవన్నీ అతని వ్యక్తీకరణలే. అందువల్ల ఒక స్థూల దశను మించి ఏది ప్రాథమికం అని సాగదీసే చర్చ అర్థం లేనిదవుతుంది. ఇలా సాగదీయాల్సిన అవసరం ఒక పర్టిక్యులర్‌ను దానికదే పూర్తిస్థాయి యూనివర్సల్ అని ప్రతిపాదించి కుందేటికొమ్మును సాధించే వారికే వుంటుంది.

అట్లే చెల్లెలిగా ఆమె ఆచరణ బాగుండవచ్చు. అక్కగా సరిగ్గా లేకపోవచ్చు. అత్తగా తనలోని తల్లికి భిన్నంగా ప్రవర్తించవచ్చు. ఇలా ఎన్నయినా చెప్పవచ్చు. అందువల్ల ఒక కోణంలో, ఒక విషయంలో సరిగ్గా ఉన్నంత మాత్రాన అన్ని కోణాల్లో సరిగ్గా వున్నట్టు కాదు, అందువల్ల ప్రతి నిర్దిష్ట సంబంధంలోనూ, ప్రాపంచిక

దృక్పథంలోను, ఆచరణలోను అన్నింటితోపాటు దళిత దృక్పథంలో కూడా మరింత నిర్దిష్టంగా పరిశీలించడం, ఆచరించడమే దళిత దృక్పథం. ఇన్ని కారణాల రీత్యా ఇందులో ఎన్ని ఉన్నప్పటికీ ఇది దళితుల మేలుకోరే దళిత సాహిత్యమవుతున్నది.

నిబద్ధత (కమిట్‌మెంట్) అవసరమేగానీ నిమగ్నత (ఇన్‌వాల్వ్‌మెంట్) అవసరం లేదనే వాదన ఒకటుంది. తాను చెప్తున్న దాని ఆచరణలో నిమగ్నం కాలేకపోవడం ఒక దశను సూచిస్తుంది. నిమగ్నం కాలేకపోయిన తనాన్ని తాత్వికీకరించడం ఆ దశను స్థిరీకరిస్తుంది. తద్వారా అది నిమగ్నం కానవసరం లేదు. తనే ఆచరణను ముందుకు తెస్తుంది. అనగా అది తాను చెప్పేదాన్ని తాను ఆచరించనవసరం లేదని చెప్పడమే. దాంతో పాటు చెప్పేవాడు, చేసేవాడు వేరువేరుగాను వుండటాన్ని అనివార్యం చేస్తుంది. అది మరింత ముందుకుసాగి చెప్పేవాడికి చేసే వాడిని లోకువ చేస్తుంది. తద్వారా ఆచరణలో లేనివాడు ఆచరణలో ఉన్నవాడిపై పెత్తనం చెలాయించడంగా మారుతుంది. ఇలా నిబద్ధత అవసరమేగానీ నిమగ్నత అవసరం లేదనే వాదన బ్రాహ్మణిజం. అది కుల వ్యవస్థ యొక్క ఒక బ్రాహ్మణిస్టు ఆచరణ మాత్రమే. దళిత దృక్పథం దాన్ని వ్యతిరేకిస్తుంది. ఇలాంటి వారికి సాహిత్యం ఒక సాధనం కాదు. వారికి దానికదే ఏకైక గమ్యం. దీన్ని జడాత్మక భావకం అనీ, కెరీరిజం అనీ, స్వీయ మానసిక ధోరణి అనిపిలుస్తారు. ఇలాంటి వారి చేతుల్లో దళిత సాహిత్యమైనా అభ్యుదయ, విప్లవ సాహిత్యాలైనా, హిందూ సాహిత్యమైనా కాలక్షేపం కబుర్లుగా మారిపోతుంది. యథాతథ వాదాన్ని, పలాయన వాదాన్ని వీరు కొనసాగిస్తారు. దళితులకు సాహిత్యంగానీ, సంస్కృతిగానీ ఒక కాలక్షేపం కాదు, అది వారు చరిత్రను పునర్నిర్మించే కృషిలో, సామాజిక ఆచరణలో ఒక సాధనం, శంబుకుడు అలాంటి వారిలో ఒకడు.

రామాయణంలోనే శంబుకుడి కథలాగే ఈ శంబుకుడి పరిచయం ఎంతో సహజంగా జరిగింది. నాటి శంబుకుడిని తెలుగుజాతి మేలు రత్నమైన సి.వి. పరిచయం చేస్తే, నేటి శంబుకుడిని నా "గతితర్కతత్వదర్శన భూమికే" నాకు పరిచయం చేసింది. భయం భయంగా ఆరేళ్ళు ఆలస్యం చేసి కూడా అక్కడికి మళ్ళీ ఏమనుకుంటారోననే సంకోచంతోనే దాన్ని వెలువరించినా నాకు ఇలా యెంతోమంది మంచి మిత్రుల్ని సంపాదించి పెట్టింది.

1992 నవంబరు 14, 15 తేదీల్లో గుంటూరులో జరిగిన అరసం పదకొండవ రాష్ట్ర మహాసభల్లో నాకు కేటాయించిన "దళిత సాహిత్యం" అనే అంశంపై ప్రసంగ

వ్యాసం కోసం ప్రిపేరవుతున్నాను. ఒక ఉత్తరం వచ్చింది. తన పుస్తకానికి ముందుమాట రాయాలని, అతడెవరో నాకప్పటికేమీ తెలియదు. నిర్బంధాల పాలైన అతని జీవితమే చాలు నేను అంగీకరించడానికి అని నిశ్చయించుకున్నాను.

నాకు తెలిసినంతలో అతడు సామాజిక విప్లవంలో ఇంకా అలసిపోని క్షతగాత్రుడు. అతనికైన గాయాలు పెద్దవి. అవి ఇంకా పచ్చిపుండులాగే సలుపుతున్నాయి. 1975 నుంచీ (నాలాగే) వివిధ రంగాల్లో సామాజిక, ఆర్థిక, సాహిత్య, సాంస్కృతిక పోరాటం చేస్తున్న వాడతడు. అతడు అతని రంగాలలో గల వారికి సుపరిచితుడు. అతడొక కార్మికవర్గ రాష్ట్ర నాయకుడు. దళితుడు. అతని పేరు వింటే ఆ కత్తిమీద సాము నేర్చినవాడు యితడేనా అని ఆంధ్రదేవం ఆశ్చర్యపోక మానదు. అయినప్పటికీ అతనికి కులం పేరుతోనే పిలిపించుకోవాలని ఆకాంక్ష. అందువల్ల అతడు శంబుకడయ్యాడు. లేనట్టయితే అందరికీ తెలిసిన అతడు అతడుగానే పరిచయమ్యేవాడు. అతడు అతడుగానే పరిచయం కావాలని మరోసారి కోరుతున్నారు. అలా అతను నిర్ణయించుకునే దాకా అతని సామాజిక కృషి, త్యాగం, గోప్యంగా ఉంచక తప్పడం లేదు. అయితే ఒకటి చెప్పక తప్పదు. గద్దర్ తన ఆచరణ క్రమంలో ఉద్యోగాన్ని వదిలేశాడు. చెరబండరాజు తన ఉద్యోగాన్ని పోగొట్టుకోవాల్సి వచ్చింది. ఈ ఒరవడిలో బాలగోపాల్, బి.ఎస్.రాములుతో పాటు శంబుకుడూ ఒకడు. పోయిన ఉద్యోగం కోసం అతని వెతుకులాట కాదు. అలా ఈ వ్యవస్థ తన శిరస్సును ఖండించే ప్రయత్నం చేసినా తన శిరస్సు ఎక్కడ వుందో తెలుసుకుని ఉద్యమిస్తున్న చిరంజీవుడు యీ శంబుకుడు. ఈ శంబుకుడిని అలాంటి నిర్బంధాలు ఏమీ చేయలేకపోయాయి. అతని చైతన్యాన్ని, సామాజిక ఆచరణి మరింత పదునెక్కించడం తప్ప.

ఈ కవి కలం పదునైనది. అతని దృష్టి నుండి వర్గం, కులం, మతం, జాతి అసమానతలు, మూఢవిశ్వాసాలు మొ॥ ఏవీ తప్పించుకోలేకపోయాయి. తనవాడైనంత మాత్రాన ఆశ్రిత పక్షపాతంతో అన్యాయాన్ని సహించేవ్యక్తి మాత్రం కాదు అతడు. అందుకే దళితుల కోసం కృషి చేస్తూనే నాయకత్వ స్వార్థానికి పాల్పడుతున్న దళితులను వదిలిపెట్టలేదు. బుద్ధుడినీ, అంబేద్కర్‌ని కూడా ప్రశ్నించాడు.

ప్రశ్నించడం తెలుసుకోవడానికి తొలిమెట్టు. అదొక జ్ఞానక్రమం. ప్రశ్నించలేని వాడు కొత్తగా తెలుసుకొనేదిగాని, తెలుపగలిగేది గానీ ఏముంటుంది? అందువల్ల ప్రశ్నించడాన్ని ప్రోత్సహించవలసి వున్నది. ప్రతిదాన్నీ ప్రశ్నించాలి. ప్రశ్నించడం నుండే కొత్త జవాబులు, కొత్త చరిత్ర, నూతన సమాజం ఆవిర్భవిస్తాయి.

శంబుకుడు మహోన్నత సామాజిక విప్లవకారులైన బుద్ధుడినీ, అంబేద్కర్‌ని ప్రేమిస్తాడు. అయినప్పటికీ వారి బోధనల మధ్య సమన్వయం లేదేమని నిలదీస్తాడు. "సింహాల్లా పోరడాలా?/ బుద్ధునిలా అహింసను జపించాలా?/ లేక పరస్పర విరుద్ధమైన యీ రెంటినీ బోధించే / వాళ్ళ సైద్ధాంతిక బురదను కడిగివేయాలా? / అని ప్రశ్నిస్తాడు. అంతటితే ఆగకుండా, "ఒక వరలో రెండు కత్తులు యిమడనట్లే / ఒక సమస్యకు రెండు పరిష్కారాలుండవు/ అని తేల్చేస్తాడు.

కవిలోని ఆవేశాన్ని అర్థం చేసుకోవాల్సిందే. అయితే సింహాల్లా పోరాడటానికి, అహింసను బోధించడానికి మధ్య సమన్వయం వున్నది. అదే జీవితం, ఒకపరి సింహాల్లా పోరాడాల్సి వస్తుంది. ఒకపరి అహింసాయుతంగా మానవీయ విలువలకై కృషి చేయాల్సి వస్తుంది. అయిదు వేళ్ళూ కలిసినపుడే అన్నం ముద్ద కడుపులోకి దిగుతుంది. "సామదాన భేద, సమ-ఐక్య, దండోపాయాలనే" పంచ విధసాధనాలు స్థల, కాల, నిర్దిష్టతలు బట్టి దాదాపు ఏకకాలంలో ఉపయోగపడుతుంటాయి. ప్రపంచంలో పనికిరాని పోరాట రూపమంటూ ఏదీ లేదు. ఒక సమస్యకు రెండు పరిష్కారాలే కాదు, వంద రకాల పరిష్కారాలుండవచ్చు. ఒకేసారి ప్రారంభమైన వర్షపు చినుకులు ఒకే విధంగా పరిష్కారం కావు. ఒక చినుకు మురిక్కాలవలో పడుతుంది. ఒక చినుకు పూల రెమ్మలపై రాలి నిలిచిపోతుంది. ఒక చినుకు కొండపై పడుతుంది. ఒక చినుకు ముత్యం చిప్పలోపడి ముత్యమవుతుంది. అన్ని చినుకులూ ఒకే ఒక మేఘం యొక్క బహువిధ పరిష్కారాలే. ఒకరిక ఉద్యోగం రావడంతో దరిద్రం తీరుతుంది. ఒకరికి రెండెకరాలు దొరకటంతో దరిద్రం తీరుతుంది. ఒకరికి వృత్తిపనితో భృతి దొరుకుతుంది. అందరికీ, అన్నింటికీ ఒక రకమైన పరిష్కారాలుండవు. సమస్త రకాల పరిష్కారాల రూపంలోనే సమస్య యొక్క ఒక ఉజ్జాయింపు పరిష్కారం సాగుతూ వుంటుంది. అందువల్ల ఏ ఒక్క పోరాట రూపమూ దానికదే సమగ్రమైంది కాదు.

శంబుకుడు రైతాంగ పోరాటాన్ని ప్రేమిస్తాడు. అందులో ఎన్నో ఏళ్ళుగా కృషి చేస్తున్నవాడు కూడా. అయినప్పటికీ, ఏదో అసంతృప్తి అతనిలో వెన్నాడుతోంది. అది అతని ఒక్కడి అసంతృప్తి కాదు. అది ఈ దేశంలోని డెబ్బయి శాతం జనాభా అయిన దళితులందరిలోనూ నువ్వు అసంతృప్తే. అన్నిట్లో తానై చరించినా, ఆచరించినా, దేబిరించినా, ధిక్కరించినా తమ ఆచరణలో తమ చరిత్ర మధనంలో తమ పేరు, తమ నాయకత్వం స్థానే పరాయి నాయకత్వం మీద గుదిబండగా, మెడకత్తిగా "దిగుబడి" అవుతోంది. అంటే పంటవేసే క్రమంలోనే, విత్తనాల ఎన్నికలోనే మనం ఎక్కడో

పొరపాటు చేస్తున్నామా? ఈ ప్రశ్నని కవి యిలా సూటిగా ప్రశ్నిస్తాడు. "పెరుగుతోట కూరలో/పెరుగు లభించనట్టే, నేతిబీరకాయలో నెయ్యి లభించనట్టే / ధర్మాసుపత్రిలో ధర్మం పూజ్యం అయినట్టే / రైతాంగ పోరాటాల్లో రైతు కనిపించడం లేదు." ఈ ప్రశ్న 70 ఏళ్ళ ఉద్యమం మీద గురి చూసి వేస్తున్న ప్రశ్న. కోట్లాది శ్రమజీవులు, పీడిత కులాల ప్రజలు, రక్తాలు ధారపోసి నిర్మించిన చరిత్రలో వారి త్యాగాలతో పోల్చదగిన స్థాయి నాయకత్వం ఎందుకు ఎదగలేకపోయింది?

స్పష్టంగా, సూటిగా వుండే యితని కవితల్లో కవిత్వమే లేదు అని కొందరు అనవచ్చు. అలాంటి వాతావరణం ఒకటి తెలుగు కవితా రంగంలో రాజ్యమేలుతున్నది కూడా. ముఖ్యంగా వచన కవిత్వంలో కొన్ని అవాంఛనీయ ధోరణులు ప్రాచుర్యంలోకి వచ్చాయి. ఇంటర్ చదివినా, డిగ్రీ చదివినా మా కవిత్వం అర్థం కావాలనే రూలేమీలేదు అనే అగ్రకుల దురహంకారం ప్రతీకల మాటున, వస్తువును, వర్ణను అస్పష్టం చేయడం మాటున పడగలెత్తుతున్నది. కవిత్వం సరిగ్గా రాయడం చేతగాని దద్దమ్మలే కవిత్వం కూడా ఒక దశలో ఇలాంటి హిపోక్రసీతో భ్రష్టుపట్టిపోయి అదే గొప్ప కవిత్వంగా చలామణి అయింది. శివారెడ్డి 'మో'. అప్సర్ అజంతాలు యిందుకొక ప్రతీకగా చర్చించబడ్డారు. అంతేతప్ప, వాళ్ళు యిందుకు బాధ్యులూకాదు చివరివారూ కాదు, అదే వరవడిలోవరవరరావు తన "సముద్రం" ద్వారా తానెంత హిపోక్రసీలో మునిగితేలుతున్నాడో 'ఈస్థితికే' రూపంలో ప్రదర్శించుకున్నాడు. ఈ అవాంఛనీయ సంఘ వ్యతిరేక శక్తుల ధోరణి నుంచి కొందరు వచన కవులు బయటపడ్డారు. ఆ ధోరణి నుండి బయటపడ్డాక మంచి కవిత్వం మరింత బలంగా రాయడం మొదలైంది. సరిగ్గా చెప్పాలంటే ఆ ధోరణి నుండి బయటపడ్డాకే వారి కవిత్వంలో వారి సొంతగొంతు, సొంత ముద్ర, సొంత శైలీశిల్పం బాగా శ్యాగపారింది.

ఇపుడు దేవరాజు మహారాజు, ఎండ్లూరి సుధాకర్, నందినీ సిద్ధారెడ్డి, బోయజంగయ్య, డా॥ దామెర రాములు, సతీష్‌చందర్, సౌదా, గోపి, జూకంటి జగన్నాథం, అద్దేపల్లి, యువక, సవేరా, అల్లం నారాయణ, పి.సి.రాములు, అలిశెట్టి ప్రభాకర్, కోలపూడి ప్రసాద్, విమల, హెచ్చార్కే, కత్తి పద్మారావు, స్త్రీవాద కవులు, ఖాదర్, ఎ.ఎన్., సుద్దాల అశోక్ తదితర కవులెందరో (అందరినీ పేరుపేరునా పేర్కొనలేకపోయిన అశక్త స్థితికి క్షమించాలి) స్పష్టమైన, బలమైన కవిత్వాన్ని రాస్తున్నారు. శివసాగర్, వరవరరావు, శివారెడ్డి, కె.రామ్మోహన్‌రాజు, నారాయణస్వామి, పాపినేని శివశంకర్ వంటి వాళ్ళు, కొన్ని కవితలు పాత పద్ధతిలోనూ, కొన్ని స్పష్టమైన

పద్ధతిలో రాస్తున్నారు.

కొందరు స్పష్టంగానే రాస్తున్నా కవిత్వంలో వుండాల్సిన బలమైన వ్యక్తీకరణ తక్కువగా వుంటోంది. సినారె, జె.బాపురెడ్డి, నగ్నముని, నిఖిలేశ్వర్ వంటి వాళ్ళు మొదటి నుండి కొంత స్పష్టంగానే రాస్తున్నా, కవిత్వంలో వుండాల్సిన బలమైన వ్యక్తీకరణ యిటీవల బాగా తగ్గిపోయి నీరసించిపోతోంది. ఒక దశలో వచనం తప్ప కవిత్వమేదీ అనుకొనే కవితలు కొన్ని వస్తున్నాయి. అలాంటి కవితలు యిందులోనూ లేకపోలేదు.

అయితే మార్మికత, హిపోక్రసీల జోలికెళ్ళకుండా మొదటి నుండి ఎంతో స్పష్టంగా అందరికీ అర్థమయ్యే రీతిలో గురజాడ, జాషువా, కాళోజీ, కొలకలూరి ఇనాక్‌ల్లా రాస్తున్న వారు ఎందరో వున్నారు. వారిలో అలిశెట్టి ప్రభాకర్ ప్రముఖుడు. రోజూ విధిగా కోడిగుడ్డు పెట్టినట్టు కవిత్వం రాయాలా అని శివారెడ్డి సూచనను వెక్కిరించిన అలిశెట్టి యిపుడు రోజూ రాసే భాస్కరుడయ్యాడు. వచనం లాగే కనపడుతూ గుండెల్ని తాకే అలిశెట్టి ఒరవడి తెలుగునాట ఎందరికో మార్గదర్శకమైంది. అలాంటి స్పష్టతతో రాయాలనే స్పష్టత గల యీ కవి నిర్ణయం అతని వచన కవితల్లోనూ, పాటలలోనూ, పద్యాలలోనూ కనపడకపోదు.

పాటల విషయంలో ప్రజల భాష, ప్రజల బాణి తప్పనిసరిగా స్వీకరించాల్సి వుంది. నాజర్, సుద్దాల హనుమంతుల వొరవడికి మరింత మెరుగులు పెడుతూ, జానపద కవులతో పాటు, గద్దర్, వంగపండు, గూండ అంజయ్య (ఊరు మనదిరా), సాహూ, మాస్టార్జీ, ఉ.సాంబశివరావు, రామారావు, యువక, బి.ఎన్.బి. తదితరులు చూపిన బాటలోని మంచిని యీ కవి ఇంకా సొంతం చేసుకోవలసి వున్నది.

అగ్రకులాల వాళ్లు రాసే చరిత్రలోను, సాహిత్య చరిత్రలోను సాధారణంగా అగ్రకులతత్వ పరిమితులుంటాయి. ఉదా॥కు మనకు రాజా రామ్మోహన్‌రాయ్ తెలిసినంతగా, మహాత్మా జ్యోతిబా పూలే గురించి తెలియదు. విశ్వనాథ సత్యనారాయణ, శ్రీశ్రీల గురించి తెలిసినంతగా మహాకవి జాషువా గురించి తెలియదు. విశ్వనాథ సత్యనారాయణ బ్రాహ్మణిజాన్ని పెంచిపోషించే కవి. బ్రాహ్మణిజాన్ని, అగ్రకులతత్వాన్ని నేలమట్టం చేసే పీడిత కుల మహాకవి జాషువా చరిత్ర యిలా రాయబడవలసి వుండగా విశ్వనాథకు పోటీగా శ్రీశ్రీని మధ్యలో దూర్చడం చరిత్ర రచనపై దౌర్జన్యంగా చేయి చేసుకోవడమే. విశ్వనాథకు పోటీక్రమం ఉన్నవ, జాషువా, బోయి భీమన్న, సి.వి., నాస్తిక, హేతువాద కవుల పరంపర వస్తుంది. ఈ పరంపరలో వర్గకవుల స్థానం

ఎక్కడో యింకా నిర్ధారించవలసే వుంది. గురజాడ, కందుకూరిల సంస్కరణలు బ్రాహ్మణకుల కుటుంబ సంస్కరణలే అయినా, అవి బ్రాహ్మణిజంలోని ఒక అంశం యొక్క సంస్కరణలు. జాషువా, బోయి భీమన్న, కుసుమ ధర్మన్న, సి.వి., కత్తి పద్మారావు వంటి వాళ్ళు దాని మరో అంశం యొక్క సామాజిక స్థాయి సంస్కరణల్ని, విప్లవాల్ని కోరినవారు. అందువల్ల గురజాడ, కందుకూరిల పరంపర త్రిపురనేని రామస్వామి, జాషువా, బోయి భీమన్న, సి.వి., కత్తి పద్మారావుల ద్వారా సాగుతున్నది. ఆధునిక వర్గ సాహిత్యం యొక్క పరంపరకు ఈ రెంటి మధ్యగల మూలాలను వెతుక్కోవలసి వున్నది.

బ్రాహ్మణిజాన్ని ఫ్యూడలిజంగా వ్యాఖ్యానించి ఫ్యూడల్ వ్యతిరేక కవులుగా శ్రీశ్రీ తదితరులు వర్గ సాహిత్య పరంపరను సాహిత్య చరిత్రగా రాయడం ద్వారా, బ్రాహ్మణాజానికి వ్యతిరేకంగా నిజంగా ప్రత్యక్షంగా పోరాడిన, ప్రత్యక్ష పీడితులైన జాషువా, బోయి భీమన్న కుసుమ ధర్మన్నకవి, సి.వి. ఆదిగా గల ఎందరో రచయితలు, కవులు సాహిత్య చరిత్ర క్రమత నుండి దానికి గల కంటిన్యుటి నుండి తప్పించి శకలాలు, శకలాలుగా చూపించడం సాధ్యపడుతున్నది. అలా ప్రగతిశీల, వర్గ సాహిత్యం పేరిట ఒక పరంపరకు పరంపరనే ఇలా శకలాలు, శకలాలుగా చూపించే సాహిత్య చరిత్ర క్రమం అగ్రకులతత్వ పరిమితుల నుండే పుట్టింది. వర్గ సాహిత్యంలో పీడిత కులాలు నాయకత్వంలో వుండి వున్నా ఈ క్రమం యిలా సాగి వుండేది కాదు. బ్రాహ్మణిస్టు వ్యతిరేక కవులూ, వర్గ కవులూ, ఒకే సాహిత్య చరిత్రలో సమన్వయం చెందించబడే అవకాశాలుండేవి. అగ్రకులాల వారే ప్రగతిశీలత పేరిట సాహిత్య చరిత్రలోనూ ఊరేగడం వల్ల అలా జరగలేదు. వీరు అలా సమన్వంచాలనే విషయం కావాలని మరిచిపోలేదు. మరచిపోవడాన్నే సహజక్రమం చేసిన అంతచ్చేతనలో ఉండిపోయిన అగ్రకుల దురహంకారమే వారిచే తనను నడిపిస్తుండడమే అందుకు కారణం. అలాగే దిగంబర కవుల గురించి, తిరగబడు కవుల గురించి, పైగంబర కవుల గురించి, విప్లవ కవుల గురించి, భూసంభోంతరాలు దద్దరిల్లేంత చర్చలు చేసే, పుస్తకాలు రాసే అగ్రకుల దురహంకార పీడిత సాహితీ విమర్శకులు, సి.వి. అనే ఒక గొప్ప కవి వున్నాడనీ, 1950 నుండి 1965 మధ్యగల సాహిత్య చరిత్రకు వారధిగా సాగి ఇంకా ఇప్పటికీ రాస్తూనే వున్నాడనీ, మరచిపోవడానికి కారణం కూడా అదే. అస్పృశ్యతా సమస్య సాహిత్య చరిత్రలోనూ ఇలా ఇంకా విస్తృతమవుతూ కొనసాగుతూనే వున్నది. సరిగ్గా కవితలే కనబడని వాళ్ళు గొప్ప కవులుగా, దశాబ్దాలుగా

కీర్తింపబడటం మరోవైపు కన్పిస్తున్న దౌర్భాగ్యం. అజంతా వంటి అప్రాచ్యులు అందుకొక ఉదాహరణ. కాగా, వందలకొద్దీ పేజీలు, ఎన్నో కవితా పుస్తకాలు వెలువరించిన సి.వి. మాత్రం ప్రగతిశీల, విప్లవ సాహితీ విమర్శకుల కంటికి ఆనకపోవడం అగ్రకుల తత్వవాద తెలుగు సాహితీ చరిత్రకు సజీవ సాక్ష్యం. అతనికి ఏ అవార్డు ఎందుకు రాలేదో అనే విషయం అటుంచినా, సాహిత్య చరిత్రలో అతడికి కావాల్సిన సముచిత స్థానం ఇవ్వకపోవడం ప్రగతిశీలత పేర వూరేగుతున్న మనుధర్మ పరాయణమే. అతనికి సాహిత్య చరిత్రలో జరిగిన అవమానం, అన్యాయం చూస్తే సాహిత్య రంగాన్ని అస్పృశ్యత ఎంతగా పట్టి పీడిస్తుందో తెలుస్తుంది. అందువల్ల కాపీలు, వెయ్యి కాపీలు అచ్చేసుకుని, పంపిణీ చేసుకుని, చంకలు గుద్దుకని సాహిత్య చరిత్రలో రికార్డయి, మలిముద్రణైనా లేకుండా, పత్తా లేకుండా పోతుంటే, ఎన్నో ముద్రణలు, ఎన్నో పుస్తకాలు కన్పించే సి.వి. సాహిత్య చరిత్ర రికార్డు కాకపోవడాన్ని యింతకన్నా మరే విధంగా అర్థం చేసుకోగలం? అందువల్ల అందులోగల సి.వి.పై రాసిన కవిత కేవలం ఒక కవిత కాదు. అది తెలుగు సాహిత్య చరిత్రను సరియైన దిలో పునర్నిర్మిస్తున్న కావ్యం కూడా.

ఏ కారణాల వల్లనైతేనేమీ, వచన కవిత్వం పద్యం కన్నా కఠినంగా మారిపోవడం ద్వారా వచన కవిత్వం పుట్టుకకు దారి తీసిన ప్రాతిపదికల్లో ఒకటి హరించుకుపోయి నట్టయింది. నేటి పాఠకుడు వచన కవిత్వం కన్నా పద్యమే హాయిగా వుంది అనుకుంటే, ఆ తప్పు వచనకవులదే తప్ప పాఠకులది కాదు. అలాంటి మార్మిక హిపోక్రసీ వచన కవిత్వం కన్నా సుమతీ పద్యాలు, వేమన పద్యాలు ఎంతో హాయిగా వుంటాయి. పద్యంలో లయ కూడా కలసి వస్తుందని కొందరు పద్యంవపు ఆలోచనలో పడుతున్నారు. గణ, యతి, ప్రాసలు సరిపోవడంతోనే కవిత్వం అవదని ఈ కవికి తెలుసు. అందుకే అందమైన పద్యాలు రాయగలిగాడు. అయితే ఇతడు కవితలు పద్యాల్లో రాయడానికి కారణాలు వేరు. ఏ కాగితమూ అందని శత్రునిర్బంధంలో న్యూస్‌పేపర్ అంచులే తాటాకులైనపుడు సుళువుగా మానవానికి భావం ముగియడానికి అతడు పద్యాల్ని ఎన్నుకొని రాయాల్సి వచ్చింది. నిర్బంధాల్లో శత్రువుల చేతికి చిక్కిపోయినవి పోగా మిగిలిన వాటిలోంచే కొన్ని ఎన్నిక చేసి ఈ సంపుటిగా కూర్చబడ్డాయి.

"ఓరి ఢిల్లీవోడా"! "శంఖారావం" వంటి కవితల్లో భారత పాలకవర్గాలపై సంధించిన శరపరంపర వుంది. కవి ఆవేదనతో ఏకీవిస్తూనే ఇక్కడ ఒక మాట చెప్పాల్సి వుంది. "భూగోళంలో/పెద్ద అబద్ధమేదైనా వుందంటే! అది 'భారతజాతి'

అయి వుండాలి" అంటాడు ఈ కవి. ఇలా భారతజాతి అంటూ లేదని ఈ కవి చేసిన ప్రకటన తాను కోరుతున్న దళితులంతా ఒక్కటే అనే వాస్తవాన్ని కూడా నిరాకరిస్తున్నదనే విషయాన్ని గుర్తిస్తారని ఆశిస్తాను. కవి చెప్పినట్టు తెలుగుజాతి, తమిళజాతి వంటి జాతితో పాటు భారతదేశం, భారతజాతి అనేది కూడా ఒకటుంది. అది ఈ దేశంలో డెబ్బయిశాతం జనాభా అయిన ఎస్సీ, ఎస్టీ, బీసీలే. వారి సమస్యల్లో గల ఏకత్వమే భారతజాతిని ఒక జాతిగా అస్తిత్వంలోకి తెస్తున్నది. భారతజాతి అనే వాస్తవంతో పాటు ఈ కవి చెప్పుచున్న జాతుల అస్తిత్వం కూడా ఏకకాలంలో కొనసాగుతున్నది. ఒకే వ్యక్తిలో వివిధ వ్యక్తీకరణలు, ఆచరణలు ఎలా వుంటాయో పైనే చూశాం. అందువల్ల ఈ రెండూ ఒక సమన్వయంలో కొనసాగితేనే కవి తాను చెప్పుచున్న శతృవుల ఆటకట్టించడం సాధ్యం. చుండూరులో జరిగిన దుర్మార్గంపై సూరుకుపైబడి ఎంపీలు, రాష్ట్రపతిని కలిసేందుకు చేసిన ప్రయత్నంలో భారతజాతి ఆత్మవుంది. చుండూరు క్రమం దళిత ఉపరాష్ట్రపతిని తెచ్చుకున్న చైతన్యంలో భారతజాతి ఐక్యత వుంది. చుండూరుపై మండల్ కమిషన్ అమలుపై దేశమంతా కదిలిన వారు సజాతీయులే. భారతజాతీయతే వారిని కదిలించింది. వాస్తవాలను వాస్తవాలుగా గుర్తించ నిరాకరించేదిగా మార్బ్నిజం ఈ దేశంలో కొనసాగుతున్నది. కులం యొక్క అస్తిత్వాన్ని, ఆచరణని దాని ప్రాధాన్యతలో గుర్తించ నిరాకరించడంలో, కార్యక్రమాలు తీసుకోవడంలో అది గజం మిధ్య, పలాయనం మిధ్య తాలూకు అద్వైత మాయావాదంగా కొనసాగుతున్నది. అప్పుడది భారతజాతి ఒక జాతి ఒక మాయ – అని, తమ ఊహల్నే వాస్తవాలంటూ మరో కొత్త మాయా వాదాన్ని ప్రవేశ పెదుతున్నది. ఇపుడు ప్రాంతీయ, జాతుల పేర విద్వేషాల్ని రెచ్చగొడుతున్నది ప్రాంతీయ, పాలకవర్గ, దోపిడీ కులాలే. వారికి అధికారం, ఆర్థికం పెరిగిన కొద్దీ కారంచేదులు సృష్టి అవుతున్నాయి. అందువల్ల నిజమైన జాతుల ప్రతినిధులుగా పీడిల కులాల వాళ్ళు రాగలిగినపుడు జాతుల సమస్య పెద్ద సమస్యేమీ కాదు. అగ్రకుల దుర్మార్గాలను ఎదిరిస్తే జాతుల సమస్య కూడా సహృదయతతో పరిష్కారంలోకి వస్తుందని ఆశిద్దాం.

ఒకరి ప్రాపంచిక దృక్పథాన్ని, ఆచరణని మరొకరు మూఢవిశ్వాసం అనవచ్చు. అది ఎవరికి మూఢవిశ్వాసం? నమ్మని వారికి అవి మూఢవిశ్వాసాలు. నమ్మి ఆచరించే వారికి అవి ప్రాపంచిక దృక్పథం ఆచరణ. వారి ప్రాపంచిక దృక్పథం ఎలా అశాస్త్రీయమో వివరించగలగాలి. ఇద్దరు స్నేహితురాళ్ళు గుడిని చూద్దామని వెళ్ళారు. ఒకామె నేను దేవుడిని నమ్మను అందువల్ల లోపలికి రాను అందట. రెండో ఆవిడ అయితే నీవు గుళ్లో దేవుడున్నాడని నమ్ముతున్నట్టేగదా అని నిలదీసిందట! అపుడుగానీ

మొదటి ఆవిడకు తన అవగాహనలని లోపం అర్థం కాలేదు. మతం మీద, విశ్వాసాల మీద కూడా ఇలాంటి వ్యతిరేకత వుంటే అది కూడా ఒక మూఢవిశ్వాసం అవుతుంది.

విప్లవోద్యదమం, దళిత ఉద్యమం విచ్ఛిన్నతకు గురవుతున్నది. ఒక కనీస కార్యక్రమంపై వీరందరూ కలిసి పనిచేసే ఐక్యతను సాధించడం చరిత్ర ముందున్న కర్తవ్యం. ఈ కర్తవ్యంలో భాగంగా సాగిన ఆత్మవిమర్శ ఇందులో వుంది.

ఇందులో స్త్రీ సమస్య, కుల సమస్య, మత సమస్య, వర్గ సమస్య, జాతుల సమస్య పట్ల ఆర్ద్రత వుంది. జరుగుతున్న అన్యాయాల పట్ల కసి వుంది. ఈ కవి కలంలోని వేగం, ఆవేశం చూస్తుంటే యితడు మునుముందు మరింత ఉన్నత శిఖరాలనందుకోవడం ఎంతో దూరంలో లేదు.

"నేను జెండ మసి నేను పార్టీని పెంచి
జీవితమంత సేవజేయ
నాయకత్వమెపుడు నాకు దక్కకపోయో
విప్లవాశతోటి వెట్టినయితి"

ఈ కవితలోని సారం ఈ కవి ఒక్కడి జీవితమే కాదు. అరవై కోట్ల దళిత భారతీయుల హృదయావేదన యిది.

అందుకే కొత్త జ్ఞానాన్ని తెలుసుకున్న దళిత చైతన్యం, దళిత కవిత, దళిత సాహిత్యం కొత్తశక్తితో, కొత్త ఆచరణతో, కొత్త, ఉత్సాహంతో, కొత్త ప్రాపంచిక దృక్పధంతో ముందుకు సాగుతోంది. సామాజిక, సాహిత్య, సాంస్కృతిక, రాజకీయార్థిక, తాత్విక రంగాల్లో యిక వినిపించేది "దళిత గర్జనే".

30-11-92

జగిత్యాల

సాహితీ సామాజిక సేనాని సాహు

నిజమయిన ప్రజల చరిత్రని, ప్రజల నిజమయిన చరిత్రని వెలికితీసి 'కొమురం భీం' నవలని అందించిన వాడు, గోండు జన జీవితంలో మమేకమై గోండు భాష నేర్చుకుని పాటలు రాసి వారిలో ఒకడుగా పోరాట యోధుడిగా నిలిచిన వాడు, రక్త పింజెరలాంటి అనేకానేక కథలతో తెలుగు సాహితీ ప్రపంచంలో తనదైన స్థానాన్ని ఏర్పరచుకున్న సాహు (శనిగరం వెంకటేశ్వర్లు) అకస్మాత్తుగా కనుమరుగయ్యాడు. 16-3-1993 మంగళవారం అమరుడయ్యాడు. సోమవారం అర్ధరాత్రి ప్రారంభమైన గుండెపోటు తీవ్రమై మంగళవారం ఉదయానికి ఆగిపోయింది. అప్పుడు గానీ అది ఛాతి నొప్పి కాదని గుండెపోటనీ అర్థం కాలేదు.

సాహు మృతి ప్రపంచ సాహిత్యానికి తీరనిలోటు. ప్రపంచ సాహిత్యానికి కరీంనగర్ జిల్లా అందించిన మరో ఆణిముత్యం సాహు.

సాహు ఒక వ్యక్తి కాదు. అతడొక చారిత్రక శక్తి. సమాజ పరిణామ క్రమంలో ముందుండి సాగే ప్రగతిశీల శక్తులకు ప్రతీక సాహు. ప్రతినిధి సాహు.

ప్రపంచమంతట పోరాటాలు ఉవ్వెత్తున ఉధృతమవుతున్న కాలం అది. దేశ మంతటా వివిధ రూపాల్లో జాతులు, తెగలు, పోరాటాలు చేస్తున్న కాలం అది. నక్సల్బరీ వసంతమేఘ ఘర్జన కుంభవృష్టిగా ముసురుపట్టిన కాలం అది. సగం రాష్ట్రాల్లో కాంగ్రెస్‌ను ప్రజలు ఓడించిన కాలం అది. జై తెలంగాణా ఉద్యమం ప్రారంభమైన కాలం అది. అపుడు కాలం కడుపుతో విప్లవాల ప్రసవ వేదన పడుతోంది.

జై తెలంగాణ ఉద్యమం ఏమిచ్చినా ఇవ్వకపోయినా ప్రజలకు పోరాడే చైతన్యాన్నిచ్చింది. అది పల్లెలకు ప్రవహించే క్రమంలో రైతాంగ పోరాటాలుగా స్వరూపం మారింది, స్వభావం మారింది. అందుకు తొలుత ఆ చైతన్యం నాటి తెలంగాణా రైతాంగ పోరాటాల్ని, నక్సల్బరీ, శ్రీకాకుళాల్ని తన వారసత్వంగా స్వీకరించింది. అలా

జై తెలంగాణా ఉద్యమం నుండి పెల్లుబికిన యువతరం పదేళ్ళలో దండకారణ్యా పోరాట ప్రాంత నాయకత్వంగా విస్తరించింది. ఈ చరిత్ర క్రమానికంతటికీ సజీవ సాక్ష్యం సాహు. ఈ చరిత్రకు ఒక ప్రతినిధి, ఒక ప్రతీక సాహు. అందులో ఒక కార్యకర్త, నిరాత్మ, ఒక సేనాని సాహు.

అలాంటి మహోన్నతమైన సాహు జీవితం ఎన్నో మహానదుల్లాగే ఎందరో మహనీయుల్లాగే సర్వసామాన్యంగానే ప్రారంభమైంది. భీమదేవరపల్లి తాలూకా మాణిక్యాపూర్‌లో 2-10-55న పుట్టిన సాహు అక్కడే ప్రాథమిక విద్య నభ్యసించినాడు. హైస్కూలు, జూనియర్ కాలేజీ చదువులకు హుజూరాబాద్ చేరాడు. ఆదర్శ డిగ్రీ కాలేజీ జమ్మికుంటలో డిగ్రీ.

హుజూరాబాద్‌లో ఆరో తరగతి విద్యార్థి దశలోనే లింగయ్య వంటి ప్రగతిశీల భావాలు గల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయుడూ, ప్రముఖ రచయితా అయిన తాడిగిరి పోతరాజు వంటివారు సాహుకు గురువులుగా లభించడం చరిత్ర చేసుకొన్న భాగ్యం. సాహు తోటి విద్యార్థులు సాహిత్య వాతావరణాన్నిచ్చారు. అలా సామాజిక చైతన్యం మొగ్గ తొడగనారంభించింది.

ఆరవ తరగతి పిల్లలకు తాను శ్రీశ్రీ సాహిత్యాన్ని పరిచయం చేయడం చరిత్రను మలుపు తిప్పుతుందని లింగయ్య సారూ అనుకోలేదు. పరిస్థితులే విప్లవాలని సృష్టిస్తాయి. చైతన్యవంతులు వాటికి నాయకులుగా ఎదుగుతారు. ఈ క్రమాన్ని వేగవంతం చేసింది సాహిత్య పరిచయం. జమ్మికుంట డిగ్రీ కాలేజీ నుంచి విప్లవ కార్యకర్తలుగా సాహుతో పాటు చదువుకుని లింగయ్య శిష్యరికంలో వున్నవారే కావడం యాధృచ్ఛికం కాదు. సాహిత్యం మీద పెరిగిన అభిరుచి సమాజాన్ని మార్చాలనే కర్తవ్యానికి పురికొల్పిన క్రమం అది.

ప్రముఖ రచయిత విరసం వ్యవస్థాపక సభ్యులు తాడిగిరి పోతరాజు, లింగయ్యాసారు వంటి వారి ప్రోత్సాహంతో 1973లో హుజూరాబాద్‌లో "సాహితీ మిత్రమండలి" ఉషోదయమైంది. ఆ విద్యార్థులు కరీంనగర్ వచ్చాక యువకులుగా ఎదిగి వారి సంస్థ "యువ సాహితి" అయ్యింది. అది మరింత ఎదిగి "జన సాహితి"గా రూపు దిద్దుకుంది. ఈ సంస్థను 11-5-75న శ్రీశ్రీ ఆవిష్కరించాడు. ఆ సందర్భంగా ఆయన ఆ సంస్థ ప్రచురించిన "నిప్పురవ్వలు" అనే సంకలాన్ని కూడా ఆవిష్కరించాడు. "ఊగరా, ఊగరా ఉరికొయ్యలందుకొని..." అనే పాటను శ్రీ శ్రీ రాసింది అక్కడే. శ్రీ శ్రీ జనసాహితిని విరసం ముద్దుబిడ్డ అని పిలిచాడు. ఈ కార్యక్రమాలన్నిటా మిత్రుల్తోపాటు చురుకైన పాత్ర నిర్వహించినవాడు సాహు. అలా విప్లవ సాహిత్య ఉద్యమ నిర్మాతల్లో యువతరం ప్రతినిధి అయినాడు సాహు.

అపుడు విప్లవ భావాలపై రెండో అల నిర్బంధం విరుచుకుపడుతున్న కాలం. సాహిత్యం రెండు శిబిరాలుగా చీలిపోతున్న కాలం. విప్లవభావాలు ఆడవంటుకున్నట్టుగా ప్రజ్వరిల్లుతూ విస్తరిస్తున్న కాలం. విశ్వనాథ సత్యనారాయణ వంటి కవులు ఆ వేడిలో మాడిపోతామనే విషయం స్పష్టంగానే గ్రహించారు. విప్లవ సాహిత్యాన్ని నిషేధించాలని, విప్లవ రచయితలను నిర్బంధించాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు వారు. ప్రభుత్వాలకు కావలసిందీ అదే. అలా సాహిత్యంలోనూ నిర్బంధాలు నిషేధాల పర్వం సాగుతోంది. అలా కరీంనగర్ నుండి ప్రచురింపబడిన "విద్యుల్లత" (16వ సంచిక దాంతో అదే చివరి సంచిక) "బద లా" (కథలు), "నిప్పు రవ్వలు", "రెక్కలు విప్పిన రెవల్యూషన్" (శ్రీ శ్రీ) ఈ నాలుగు పుస్తకాలూ నిషేధానికి గురయ్యాయి. ఆ సాహిత్య సాంస్కృతిక సర్కిల్స్ నుండి, ఉద్యమ వాతావరణం నుండి ఎదుగుతూ తీర్చి దిద్దబడ్డ గంభీర వ్యక్తిత్వమే సాహు.

సాహు కృషి బహుముఖాలు. విద్యార్థి దశలోనే 1973 నుండి 1975 దాకా విప్లవ విద్యార్థి ఉద్యమాల్లో చురుకైన పాత్ర నిర్వహించినవాడు సాహు. విప్లవ విద్యార్థి ఉద్యమాన్ని స్వయంగా నిర్మించినవాడు సాహు. జన నాట్యమండలి ప్రదర్శన లిచ్చిన సాంస్కృతిక సైనికుడు సాహు. పౌరహక్కుల ఉద్యమాల్లో పాల్గొన్నవాడు సాహు. విద్యార్థి దశలోనే ఇన్ని రకాల అనుభవాలు గడించే ఆచరణ సాగించినవాడు సాహు.

సామాజిక పరిస్థితులు త్యాగాల్ని కోరుతున్న కాలం అది. యువతరం అందుకు ఉత్తేజంగా ముందుకు ఉరికివస్తున్న కాలం అది. నూతన సమాజాన్ని నిర్మించాలని స్వేచ్ఛకోసం రెక్కలు టపటపలాడిస్తున్న కాలం అది. కాగలిగే పూర్వం కాలమే తీరుస్తున్నట్టుగా పరుగు నడకలో కాలికి తగిలే పోట్రాయిలా చిన్న సంఘటన జరిగింది. జమ్మికుంట డిగ్రీ కాలేజీలో సాహు, అతని మిత్రులు డిగ్రీ ఫైనల్లో ఉండగా కాకతీయ యూనివర్సిటీ నుంచి వచ్చిన ఒక లెక్చరర్‌తో 12-5-1975న చిన్న గొడవ జరిగింది. పోలీసులు రంగ ప్రవేశం చేశారు. వారినుండి తప్పించుకున్న 20, 25 మంది విద్యార్థులు క్రమంగా ఒక్కుమ్మడిగా విప్లవ కార్యకర్తలుగా రహస్య ఉద్యమ నిర్మాతలుగా ప్రజల్లో పడి విడివిడిగా ముందుగా సాగిపోయారు. జిల్లేడు పువ్వులా పట్టుకుంటే అందనట్టుగ అనుకున్న లక్ష్యాలవైపు వారు సాగిపోయారు.

ఇలా సాహు 1974 నుండి విప్లవ రాజకీయాల్లో సీరియస్‌గా తల మునకలవడం

Dalithayugam-2
03-09-09
13

మొదలైంది. సమాజాన్ని చిత్రించడం కోసం, దాన్ని మార్చడం కోసం రచన చేయాలనే ఆశయం నుంచి రాజకీయాల్లోకి ఆసక్తిగా ప్రవేశించాడు. అయితే రచనకు సంబంధించిన తపన తపనగానే మిగిలిపోయింది. అడపాదడపా "సృజన"లో కవితల్ని రాసినప్పటికి వచన ప్రక్రియలో కథలు, నవలలు, వ్యాసాలు మొ॥ రాయాలనే కోరిక బలపడుతూనే వుండేది.

అక్టోబరు 1976లో "మీసా" డిటెన్యూగా జైలుకెళ్ళాడు సాహు. జైలు నుండి విడుదలైన కొద్ది రోజులకే తిరిగి అరెస్టు చేసి, నాలుగు నెలలు లాకప్పులో ఉంచారు. కేంద్రంలో జనతాపార్టీ ప్రభుత్వం ఏర్పడ్డాక 1977 ఏప్రిల్‌లో గానీ కేసుపెట్టి జైలుకు పంపలేదు. 1977లో బెయిల్‌పై బయటకు వచ్చాక 1979 దాకా పార్టీ కార్యకలాపాలు నిర్వహించాడు. 78-79ల్లో హుస్నాబాద్ ప్రాంతంలో పార్టీ నిర్మాణానికి ప్రజాసంఘాల నిర్మాణానికి కృషి చేశాడు. 1979 మే నెలలో మాణిక్యాపూర్‌లో "గ్రామాలకు తరబడి" (గోటు విలేజి క్యాంపెయిన్) కార్యక్రమంతో గ్రామాలకు తరలే విద్యార్థి యువజనులకు 10 రోజుల పాటు బహిరంగంగా రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించాడు. ఆ క్లాసులు ఉద్యమంలో ఒక మలుపు.

ఉద్యమం పెరుగుతోంది. ప్రజలు విప్లవాన్ని కోరుతున్నారు. నాయకత్వం అందించమని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు నిర్బంధంకూడా ఉద్యమ విస్తృతిని అనివార్యం చేస్తోంది. ఒక్కచోట పండిన విత్తనాల్ని నేలంతటా చల్లాలనే నిర్ణయం తీసుకోబడింది. ప్రజల్లోకి, లోతట్టు గ్రామాల్లోకి, గిరిజన ప్రాంతాల్లోకి వెళ్ళాలనే నిర్ణయం అలా జరిగిందే. మూడింట ఒకవంతు కార్యకర్తలు అలా అడవుల్లోకి పయనమయ్యారు. దాంతో కరీంనగర్, ఆదిలాబాద్ వరంగల్, నిజామాబాద్, రైతాంగ పోరాటాలు అని పిలువబడే పోరాటాలు దండకారణ్య పోరాటాలుగా ఉద్యమ లక్ష్యం విస్తృతి పెంచుకొని మరో మలుపు తిరిగింది. అలా మలుపు తిప్పేందుకు 1979లో తన వూరి యిద్దరు మిత్రుల్ని తీసుకుని ఆదిలాబాద్ అడవుల్లోకి ప్రవేశించాడు సాహు.

సాహు అలా ఆదిలాబాద్ గోండు గిరిజనుల జీవితాల్ని అధ్యయనం చేశాడు. వారి సాహిత్యాన్ని అధ్యయనం చేశాడు. వారి సంస్కృతిని అధ్యయనం చేశాడు. వారి భాషను నేర్చుకున్నాడు, వారి బాణీని నేర్చుకున్నాడు. అలా గోండు గిరిజనుల జీవితాల్లో వెలుగె నింపడం కోసం "సాహు" సాహిత్య జీవితంలో మరో మలుపు తిరిగింది. అప్పుడే వెంకన్న -"సాహు"గా మారాడు.

గోండు గిరిజన సాహిత్యానికి విప్లవ సాహిత్యపు ఒరవడి దిద్దినవాడు సాహు.

తెలుగు పాటల్ని గోండు భాషలోకి అనువదించినవాడు సాహు. గోండు భాషలో విప్లవ చైతన్యాన్ని కూర్చి పాటలు రాసినవాడు సాహు.

గిరిజన జీవితంలో గల సామూహికత్వంలో కొనసాగుతున్న సాంస్కృతిక ధారలో అందరినీ కలిపేది పాట అని గ్రహించడానికి ఆయన ఎంతో కాలం పట్టలేదు. వచనం కన్నా వారి నిత్యజీవితంలో పాటలాగా సా వారి వ్యక్తీకరణ అతన్ని ఆకర్షించింది. ప్రజల సంస్కృతిలో, పాటల్లో ప్రజల చరిత్ర కొనసాగుతున్నదని గుర్తించాడు. అలా ప్రజలు తమ చరిత్రను నిర్మించి కొనసాగించుకుంటారని గ్రహించాడు. ప్రజలు నిర్మించుకున్న చరిత్రను వెలికితీసి సమాజానికి అందించడం తన బాధ్యతగా స్వీకరించాడు. అలా ఎన్నో కథలు రాశాడు. పాటలు రాశాడు. ఆ క్రమంలోనే ప్రజావీరుడు గోండుధీరుడు "కొమురంభీం" చరిత్రను వెలికితీసి నవల రాసాడు సాహు. అతని పాటలు ఇప్పటికీ గోండు గుండెల్లో ఆత్మవిశ్వాసాన్ని, రగిలిస్తూ ఉద్యమాలకు ఉత్తేజం యిస్తూనే వున్నాయి ఇలా గిరిజనుల గురించి రాసిన బెంగాల్‌లోని గొప్ప రచయిత్రి మహాశ్వేతాదేవిగా, తెలుగు మహాశ్వేతాదేవిగా గుర్తించబడినవాడు సాహు. అలా అతని సామాజిక కర్తవ్యమే అతని సాహిత్య సాంస్కృతిక కర్తవ్యాల్ని నిర్దేశించింది.

1983లో ఆదిలాబాద్ అడవుల్లో అరెస్టయ్యాడు సాహు. అతడు తాను అరెస్టయినపుడు అడిగిన ప్రశ్నలన్నిటికీ గోండు భాషలోనే సమాధానం చెప్పేవాడు. దాంతో అతన్ని ఒక పుట్టు గిరిజనుడుగా భావించి లాకప్పులో పడేశారు. ఆనాడు గనక గిరిజనుడనుకొన కుండా, సాహును సాహుగానే గుర్తించి వుంటే సాము మనకు మిగిలి వుండేవాడు కాదు. ఎన్‌కౌంటర్ పేరిట హత్య గావించబడేవాడు. అతడు నేర్చుకున్న భాష, అతను కలిసిపోయిన జీవితమే అలా అతడు బతకడానికి కారణమైంది.

సాహు గోండు భాషలో రాసినవి ఎన్ని పాటలో .... వాటన్నిటిని ఒక్క చోటకు చేర్చవలసి వున్నది.

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చినా ఉద్యమంపై నిర్బంధంలో మార్పేమీ లేదు. పైపెచ్చు ఉద్యమంలోతు, విస్తృతి పెరగడంతో నిర్బంధమూ ఫాసిస్టు నిర్బంధంగా ఘనీభవించింది. దాంతో కొద్ది నెలల్లో బెయిల్‌పై విడుదల కాగలిగిన సాహు 1989 దాకా అయిదున్నర ఏళ్ళు జైల్లో వుండాల్సి వచ్చింది. బయటకు వచ్చి మళ్ళీ పాత సంబంధాలేమీ కొనసాగించను అని 5, 6 దఫాలుగా హామీ తీసుకుని గానీ విడుదల

చేయలేదు.

జైల్లో అతడు పడిన కష్టాలు, నరకయాతన కనీళ్ళు తెప్పించకమానవు. జైల్లోనే చంపాలని ప్రభుత్వ పన్నాగమో, జైలర్‌లోని రాక్షసత్వమో తెలియదుగానీ ఒక ఏడాదంతా సాహూనూ, మరో మిత్రుడినీ కలిపి యిద్దర్నే ఒక చీకటి గదిలో బంధించి ఉంచారు. ప్రతిరోజూ రెండు పూటలా అన్నంతో బచ్చలీ (ఆకు) కూర మాత్రమే యిచ్చేవారు. 3, 4 రోజులకే బచ్చలి కూరవల్ల విరేచనాలు పట్టుకునేవి. విరేచనాల్తో 3, 4 రోజులు ఉపవాసాలుండేవారు. నీరసించిపోయినా విరేచనాలు తగ్గేవి. బతకాలి కనక మళ్ళీ బచ్చలి కూరతోనే తినాల్సి వచ్చేది. మళ్ళీ 3, 4 రోజులు విరేచనాలు, కడుపునొప్పి, నీరసం సరిగ్గా ఒక ఏడాదంతా ఇలా ఒకే ఒక బచ్చలి కూర తిని చావకుండా బతికినవాడు సాహూ. వీరికోసం జైల్లో ప్రత్యేకంగా బచ్చలి ఆకు పండించేవారు. సాహూ! అంత గట్టిపడ్డ శరీరం నీది ఒక్క గుండె పోటుతో ఎలా ఆగిపోయావయ్యా! ఒక చీకటి గదిలో యిద్దరి ఏకాంతంలో బయటి ప్రపంచం తెలియని చీకటిలో ఏడాదంతా బచ్చలికూరతో విరేచనాలతో కడుపు నొప్పితో గడిపాడు సాహూ.

జైల్లో నించి బయటకు తెచ్చేందుకు బంధుమిత్రులు చేయని ప్రయత్నం లేదు. ఒక కేసుకు బెయిలిస్తే మరో కేసుకు కొట్టేస్తారు. ఒక్కసారా? రెండుసార్లా? ఎన్నిసార్లని .... అల అయిదున్నర ఏళ్ళు జైల్లో గడిపాడు సాహూ.

అంత నిర్బంధంలోనూ, నికృష్ట స్థితిలోనూ సాహూ చైతన్యం మొక్క వోకుండా వికసిస్తూనే వుంది. జైల్లో మిగతా సహచరుల్లో ఒకే బ్యారక్‌లో వున్నంత కాలం నిరంతరం చర్చ, అధ్యయనం, అధ్యయన తరగతులు నిర్వహించేవాడు. అలా జైలునే ఒక ప్రపంచంగా, ఒక పాఠశాలగా మార్చే కృషి చేశాడు. జైల్లో ఎన్నిసమస్యలని.... ఎన్నెన్ని సమస్యలని.... వాటన్నిటికి వ్యతిరేకంగా పోరాడాడు. దాంతో ఆయన్ని వరంగల్ నుండి రాజమండ్రి, విశాఖ జైళ్ళకు తిప్పడం ప్రారంభించారు.

వరంగల్ జైల్లో వున్నప్పుడు "బంద్" అనే రాత పత్రికను వెలువరించాడు సాహూ. దానికి తానే సంపాదకుడు. క్రమం తప్పకుండా కొన్ని సంచికలు తీశాడు. వాటి ప్రతులు జైలు బయటెక్కడో వుండే వుండాలి. వాటిని వెతికి ప్రచురించవలిసే వున్నది. జైల్లోనూ ఎన్నో పాటలు రాశాడు సాహూ. దాదాపు 30 పాటలతో ఒక గేయకావ్యంగా, దృశ్య కావ్యంగా "నూతన ప్రజాస్వామిక విప్లవం"ను, వ్యవసాయ విప్లవాన్ని మలిచాడు.

సాహు జైల్లో ఉన్నప్పుడే పీపుల్స్ వార్ పార్టీలో చీలికల చర్చలు మొదలయ్యాయి.

పార్టీ రెండుగా చీలిపోయింది. నాయకులు నాయకత్వ స్వార్థానికి ప్రజా ఉద్యమం బలికావడాన్ని సహించలేకపోయాడు. ఈ అప్రజాస్వామిక చర్యను సరిచేయడానికి తాను ఏమీ చేయలేని స్థితి. ఒకవైపు బందీ. మరోవైపు జైలు కామ్రేడ్లకు పార్టీ సభ్యత్వం ఉన్నా వారి అభిప్రాయాల విషయంలో సస్పెండయిన సభ్యుడిగా ఓటుహక్కు, మాటహక్కు లేనివాడిగా మార్చివేశాయి పార్టీ నిర్మాణ సూత్రాలు, ఇలా సాహు రెండు చేతులూ కట్టివేయబడ్డాయి. అలా పార్టీ రెండుగా చీలిపోతుంటే నిస్సహాయ ప్రేక్షకుడిలా మిగిలిపోలేదు. ఈ రెంటిలో దేనికీ మద్దతు ఇవ్వకూడదనుకున్నాడు. అసలు చీలిపోవడమే ఒక అప్రజాస్వామిక చర్య అని ఎలిగెత్తి చాటాడు. దాంతో అతన్ని చీలిపోయిన రెండు గ్రూపులూ తమవాడు కాదన్నట్టుగా చూశాయి. అతడి గురించి పట్టించుకోవడం దాదాపు మానేశాయి.

ప్రాణత్యాగం చేయడానికి సిద్ధపడి పార్టీలో ప్రజల్లో చేరిన వాడికి తన జీవితం గురించిన లెక్కేమిటి? కానీ విప్లవ పార్టీ నాయకుడగా జైల్లో చేరి ఎవరికి చెందనివాడుగా తన ప్రమేయం ఏమీ లేకుండా తాను మార్చివేయబడ్డం సాహును కుంగదీసింది. దాంతో విరామమెరుగని ఆలోచన, విరామ మెరిగిన జీవితం అతని వ్యక్తిత్వంలో ప్రవేశించాయి.

జైలునుండి బయటకు వచ్చిన సాహు మౌనం సగటు విప్లవ ప్రేమికుల నిస్సహాయ మౌనం. త్యాగమే తప్ప హక్కులడగనివ్వని పార్టీ నిర్మాణ సూత్రాల ద్వారా అధికారం చెలాయించే కొందరి స్వార్థాలకు విప్లవాల విస్తృతి కరుడుగట్టుకు పోయే క్రమానికి సాహు ఒక సాక్ష్యం. ఈ అర్థంలో కూడా సాహు కేవలం ఒక వ్యక్తి కాదు. ఒక మహత్తర చారిత్రకశక్తి, విద్వేషాలతో, విషాదాలతో, వివాదాలతో వెయ్యిముక్కలు చేయబడ్డ పల్లె హృదయాన్ని తిరిగి ఒక్కటిగా మార్చి మానవీయ సంస్కృతిని పునర్ నిర్వచించాలని కోరుకునే మహత్తర చారిత్రక శక్తి సాహు. అలాంటి చారిత్రక శక్తుల ప్రతీక సాహు.

పార్టీలో ప్రజా సంఘాల్లో జరిగే అన్యాయాలను ప్రతిఘటించాడు సాహు. సాధారణంగా సరెండరైన వారి గురించి పార్టీ ఫండు ఎత్తుకెళ్ళాడనో, ఫలానా అమ్మాయిలను మానభంగం చేశాడనో వార్తల్లో, ప్రచారాల్లో వెలుగు చూస్తుంటాయి. మచ్చలేని మల్లెపూవు వంటి వ్యక్తిత్వం సాహుది.

అన్యాయాన్ని సహించలేనితనమే అతన్ని పార్టీకి దూరం చేసింది. విరసానికి దూరం చేసింది. తానూ, మరో విరసం సభ్యుడూ "నూతన్" జైల్లో వున్నప్పుడు

విరసం సభ్యులుగా తమ గురించి విరసం ఏమి పట్టించుకోలేకపోయిందని అలిగాడు. నిలదీశాడు సాహు. జైల్లో వున్న ఇతర విరసం సభ్యుల పట్ల మాత్రం ఎన్నో రెట్లు అతిగా స్పందించి భూనభోంతరాలు పల్లె నుండి ఢిల్లీ దాకా దద్దరిల్లేలా ప్రచారం చేసిన విరసాన్ని ద్వంద్వ ప్రమాణాల సంస్థ అని విరసంనించి స్వచ్ఛందంగా వైదొలిగారు.

ఇన్ని పరిణామాల నడుమ జైలునుండి బయటకు వచ్చాక తన జీవితాన్ని తిరిగి మొదటి నుండి ప్రారంభించాల్సి వచ్చింది 1982లోనే శోభతో పెళ్ళయినా కాపురం చేసింది ఏ కొద్దినెలల్లో, 1983లోనే అరెస్టయ్యాడు. సొంత సంసారం, "తనకోసం తాను బతకడం" అనే దృక్పథమే సాహు జీవితానికి కొత్త. విద్యార్థి దశ నుండి సామాజిక సాహిత్య కర్తవ్యాలకే అంతమైన అతని జీవితాచరణకు "తనకోసం తాను బతకడం" అనే దృక్పథం, ఆచరణలను ఒక పట్టాన జీర్ణించుకోలేకపోయాడు. ఈ క్రమం సాహు వ్యక్తిత్వంలో మలుపు తెచ్చింది.

ఎందుకోసం యీ జీవితం? దేనికోసం ఈ జీవితం? అసలు జీవితం అంటే ఏమిటి? జీవితమంటే యిదేనా! తనకోసం తాను ఎందుకని జీవించాలి? అసలు యిలాంటి జీవితం తనకవసరమా? తన జీవితం గమ్యం ఏమిటి?

అలా ఆవేదనే అంతరంగమై, ఆలోచనే జీవితమై ప్రజలకోసం తాను ఏం చేసినా అపార్థం చేసుకొనే విప్లవపార్టీల, ప్రభుత్వాల మధ్య క్షణక్షణం మదనపడి మౌనంగా మారినవాడు సాహు.

క్రమంగా ఆలోచనల్లో, ఆచరణల్లో కొత్త వెలుగు ప్రసరించడం చూసి ఆశగా అవలోకించడం ప్రారంభించి, చివర అదే సరైన మార్గం అని విశ్వసించినవాడు సాహు.

అనైక్యత సాహిత్య సామాజిక ఉద్యమాలను తినివేస్తున్న విషపురుగు అని దాన్ని తొలగించాల్సి వున్నదని కదలబారినవాడు సాహు. అందుకు తొలిమెట్టుగా ఈ దళిత (ఎస్సీ, బీసీ, ఎస్టీ) మైనార్టీల రచయితల, కళాకారుల, మేధావుల ఐక్యవేదిక నిర్మాణం చేపట్టినవాడు సాహు.

ఎందరో రిసెర్చ్ స్కాలర్లలకు లెక్చరర్లకు, రచనలో పరిశోధనలో మార్గదర్శకంచేసి నడిపిన వాడు సాహు. ఎందరో జర్నలిస్టులకు వార్త అంటే ఏమిటో, వార్త వెనక వుండే నిజాలేమిటో ప్రజల గురించి ఎందుకు పట్టించుకోవాలో, ఏది ఎలా విశ్లేషించాలో నేర్పినవాడు సాహు.

లక్షలాది ప్రజల, వేలాది మిత్రుల గుండెల్లో స్థానం సంపాదించినవాడు సాహు.

ఒక బుద్ధుడిలా మనస్సనే బోధివృక్షం కింద ఎడతెగని ఆలోచనలు సాగించే వాడు సాహు. పైకి కనిపించే అతడి మౌనం మహాసముద్రపు అలలై కనబడే ప్రశాంతత. అంతరంగంలో ఎంతో అలజడి, ఎన్నో సముద్రాంతర్గర్భ నదీ ప్రవాహాలు, పైన సముద్రపు అలల్లా మిత్రులు కలసినపుడల్లా చెదిరిపోని చిరునవ్వు.

సాము ఒక ధీరోదాత్త నాయకుడు. సాహు ఒకసామాజిక పరివర్తనా క్రమంలో త్యాగాలకు వెలకట్టే వ్యవస్థలో చోటుచేసుకున్న కత్తుల వంతెన బలయిన ఒక విషాదాంత నాయకుడు. బహుజనులు నిర్మించే కొత్త చరిత్రకు తొలి పలుకు సాహు.

ఈ ఆలోచనల క్రమంలో పాత బంధుమిత్రులు ప్రవేశించారు. ఒకరు వ్యాపారం చెయ్యమన్నారు. ఒకరు సాహిత్య రచన మళ్ళీ ప్రారంభించమన్నారు. బ్యాంకులు ప్రభుత్వం కలిసి యిచ్చిన అప్పు-ట్రాక్టర్‌తో ప్రభుత్వం ఎందుకు నక్సలైట్లకు పునరావాసం చేయాలను కుంటుందో తెలిసివచ్చిందఇజీ. ట్రాక్టరుతో అతని బతుకు కుదురుకునే బదులు కుదురుకోకుండా చేసి అతనిలోని రచయితని సామాజిక శాస్త్రవేత్తని, చంపే ప్రయత్నం చేసింది. ఎరువుల వ్యాపారంలో అప్పులిచ్చి అందరూ పేదరైతులే కదా అని అరవై వేలు పోగొట్టుకున్నాడు.

బహిరంగ జీవితంలోకి వచ్చాక సాహు శోభ దంపతులకు తొలి సంతానంగా సోని పుట్టింది. సోనికి యిపుడు రెండేళ్ళు. తర్వాత ఒక బాబు. సన్నీ 5 నెలల పసిగుడ్డు యిపుడు.

వారిది మేర (దర్జీ) కులం, వృత్తిరీత్యా వ్యవసాయ కుటుంబం. తండ్రి స్వామి మొదటి నుండి కాంగ్రెస్‌వాది. కాంగ్రెస్ టికెట్‌తో ఓసారి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయాడు. తల్లి అయోధ్య వెంకన్నను చూసి గర్వపడేది. పిల్లనిచ్చిన అక్క మల్లేశం, అనసూయత్తలు కూడా నిర్బంధాల్ని ఎదుర్కోక తప్పలేదు.

సాహుకు ఒక తమ్ముడు, ముగ్గురు చెల్లెళ్ళు. పెళ్ళిళ్ళయి అందరూ ఏదో ఒక స్థాయిలో జీవిక జీవిస్తున్నారు. సాహుకేమీ ఆ బాధ్యతలు పైబడలేదు. తండ్రి అన్నిటాతానై చూసుకున్నాడు. సాహు హృదయమెరిగిన శోభ అన్నిటా చేదోడు వాదోడు నిలిచింది.

ప్రపంచం ఎవరి కొరకూ ఆగదు. రోజులు గడుస్తూనే వున్నాయి. సాహు

సామాజిక విషాదంలోంచి వివేకంలోకి పయనించాడు. సాహు మళ్ళీ సాహిత్యకారుడయ్యాడు. సాహు మళ్ళీ ప్రజల కోసం జీవించడం ప్రారంభించాడు. తనచుట్టూ వున్న ప్రజల కోసం జీవించాడు.

జైలునుండి బయటకు వచ్చి తనలాగే సాదా జీవితం గడుపుతున్న తోటి మిత్రుల కష్టాలు, కన్నీళ్ళు చూశాడు. వారిని నిత్యం పోలీసులు వేధించ పోలీసుల గాథలు చూశాడు. సరెండరయి, సరదాగా బతికేస్తున్న యువకుల్ని ఎన్‌కౌంటర్ల పేరిట అంబాలలో హత్య చేయడం చూశాడు. బతకడానికి సమకరిస్తానన్న ప్రభుత్వం, రెడ్ టేపిజం కొండచిలువలా మాజీ ఉద్యమకారులను, ప్రజలను ఎలా విలువలు నశించిన యంత్రాంగాల్ని చూశాడు. ఓపిక నశించి మళ్ళీ గళమెత్తాడు. ప్రజలకెదురైన అన్యాయాల్ని పరిష్కరించేందుకు సహకరించాడు. అలా సాహు ప్రజల వెంకన్నగానే బహిరంగ జీవితంలోనూ బతకడం ప్రారంభించాడు. తమ వూరికి, చుట్టు పక్కల వూళ్ళక గ్రామీణ అభివృద్ధి పథకాల కింద ఎన్ని స్కీములు తీసుకోవడం సాధ్యమో, అన్ని స్కీముల అమలుకు కృషి చేశాడు. అలా ప్రజల జీవన ప్రమాణాల అభివృద్ధికి చైతన్యానికి ఎంతో కృషి చేశాడు.

సాహిత్యంలో తనవైన కర్తవ్యాలు నిర్వర్తించాల్సిన చారిత్రక బాధ్యత వుందని గుర్తించాడు. సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం ప్రారంభించాడు. అలా బి.ఎస్.రాములు రాసిన "పాలు" కథల పుస్తకాన్ని ఆవిష్కరించాడు. "కన్యాశుల్కం"పై కరీంనగర్‌లో జరిగిన సెమినార్‌లో ప్రసంగించాడు. కరీంనగర్ ఫిల్మ్ సొసైటీ ప్రదర్శనల్లో, సెమినార్‌లలో పాల్గొన్నాడు. తిరిగి అధ్యయనం ఉధృతం చేశాడు. ప్రేంచంద్ "రంగభూమి", గోదాన్ నవలల్లా, ఉన్నవమాలపల్లి నవల్లా ఈనాటి గ్రామీణ సామాజిక, కుటుంబ జీవితాల్ని సమాజ చలన పరిణామ క్రమంలో భాగంగా చిత్రించాలని నోట్సు రాసుకున్నాడు. చర్చలు చేశాడు. అన్ని వ్యాపార వ్యాపకాలు యితరులకు అప్పగించి రచన కోసమే బతికేందుకు ప్రాతిపదికగా హుజూరాబాద్‌లో 5 ఎకరాల పొలం లీజుకు తీసుకున్నాడు. అక్కడే ఒక గుడిసె వేసుకుని అదే తన కేంద్రంగా మార్చుకునే క్రమంలో వున్నాడు. మన్యం అడవిలో కిడ్నాపైన బాలరాజు ఉదంతం ప్రాతిపదిక ఒక సామాజికనవల రాయాలని, మెటీరియల్ సమకూర్చుకున్నాడు.

దళిత రచయితల, కళాకారుల మేధావుల ఐక్యవేదిక నిర్మాణంలో రెండేళ్ళుగా చురుకుగా కృషి చేస్తూ వస్తున్నవాడు సాహు. వరంగల్, హైదరాబాద్ దళిత సాహితీ సదస్సులో గిరిజన సాహిత్యంపై సెమినార్ ప్రసంగాలు సమర్పించారు. సాహు. 13, 14 ఫిబ్రవరిలో హైదరాబాద్‌లో జరిగిన దళిత (ఎస్సీ, ఎస్టీ, బీసి) మైనారిటీల, రచయిత కళాకారుల మేధావుల ఐక్యవేదిక ప్రథమ మహాసభల్లో రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైనారు. కరీంనగర్ జిల్లా కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు. అంతలోనే అమరుడయ్యాడు.

తనకోసం తాను జీవించడం అనే స్వార్థభావననే మరణించేదాకా ఆరగించుకోలేకపోయినవాడు సాహు.

"సాహు" జీవితం ఆదర్శప్రాయమైనది. అతని కష్టసహిష్ణుత హిమాలయాల వలె ఉన్నతమైనది. అతని జీవితాచరణ మహోన్నతమైనది. అతని ఆశయం ఉన్నతమైనది. ప్రజల ఆశల్లో, ఆరాటాల్లో, పోరాటాల్లో, సంస్కృతిలో, సాహిత్యంలో సాహు నిత్యం జీవిస్తూనే వుంటాడు. సాహుకు మరణం లేదు. అతని లక్ష్యం నిరంతర ప్రగతిశీల గతిక్రమం అందులో అతను మృత్యుంజయుడు.

అరుదైన మనిషి, నిండైన వ్యక్తిత్వం, నిరంతరం ప్రజలకోసమే తపన సామాజిక అభివృద్ధి కోరి రచన చేపట్టడం కలిస్తే సాము వ్యక్తిత్వం.

ప్రపంచ సాహిత్యంలో "సాహు" లాంటి ఉన్నత వ్యక్తులు అరుదుగా కనపడ్తారు. ప్రేంచంద్, క్రిస్టఫర్ కాడ్వెల్, రాల్‌పాక్స్, సుబ్బారావు పాణిగ్రాహి, జ్యోతిబాపులే వంటివారి ఒరవడిలో సాహుకు ప్రపంచ సాహిత్య చరిత్రలో సముచిత స్థానం వున్నది.

సాహిత్యకారుడుగా, సామాజిక కార్యకర్తగా అతని త్యాగం, కృషి మనకు నిరంతరం వెలుగునిస్తూనే వుంటుంది.

సాహు అమర్ హై.

("నలుపు", గోదావరి కెరటాలు "దళితులొస్తున్నారు" ఎదురీత ఏప్రిల్ 93 సంచికల సౌజన్యంతో పూర్తి పాఠం)

అక్షర సూర్యుడు అలిశెట్టి

"గుండె నిండాబాధ కళ్ళనిండా నీళ్ళు న్నప్పుడు
మాట పెగలదు కొంతసమయం కావాలి
దట్టంగాకమ్ముకున్న విషాదమేఘాలు చెల్లా చెదురై
హృదయం నిర్మలాకాశం కావడానికి కొంత వ్యవధి కావాలి."

అని తన 'సిటీలైఫ్'లోపలికి అలిశెట్టి ప్రభాకర్ 12. 1. 93న రాత్రి పదకొండున్నర గంటలకు భౌతికంగా మరణించాడు. హైదరాబాద్‌లోని చిక్కడపల్లి బ్రిడ్జి ప్రక్కన గల సొంత ఇల్లులాంటి అద్దె ఇంట్లో మరణించాడు. ఈ వ్యవస్థపై కసితో రక్తం కక్కుకుని అమరుడయ్యాడు. గత పదేళ్ళుగా ప్రజల ఆర్తిపై ఆశలపై ఆచరణపై రోజు రోజుకు విస్తరిస్తున్న రాజ్యహింస ఉక్కుపాదంలా "మనిషి బతికుండగానే గుండెల్లో స్ట్రాగుచ్చి రక్తం పీల్చే యీ రాక్షస వ్యవస్థలా" అతనిలో ప్రవేశించిన టి.బి. నిరంతరం అతని ఆర్తిపై, ఆచరణపై ఉక్కుపాదం మోపి అణిచివేస్తూ విస్తరిస్తూనే ఉండింది.

మనం చెప్పినట్టు వినకపోయే గదా అని బంధుమిత్ర అభిమానులు బాధపడ్తుంటారు అది సహజమే. అయితే అలిశెట్టి భౌతికకాయం అంబర్‌పేట శ్మశానవాటికలో దగ్ధమవుతున్నపుడు కన్నీళ్ళతో వీడ్కోలిస్తూ ఒక మిత్రుడు "మనం చెప్పినట్టువింటే అలిశెట్టి మహాకవి ఎలా అవుతాడు? మహా అయితే మనలా ఒక సాదా మనిషి అయి వుండేవాడు" అని అన్న మాట ఎంతో వాస్తవం.

అలిశెట్టి ప్రభాకర్ జీవితం విప్లవోద్యమాల్లాగే సాగింది. సరిగ్గా చెప్పాలంటే విప్లవోద్యమంలోని ఆటుపోటులకు ఒక వ్యక్తి రూపాన్ని, ఒక వ్యక్తిత్వ రూపాన్ని భౌతికరూపంలో యిస్తే అది సరిగ్గా అలిశెట్టి ప్రభాకర్ జీవితంలాగే వుంటుంది. విప్లవోద్యమాల తెలంగాణా మధ్య తరగతికి అతని జీవితం ఒక ప్రతీక.

అది 1977. జగిత్యాల జైత్రయాత్ర కోంస కరీంనగర్ రైతాంగం కడలిలా కడుపులో ఉప్పొంగుతున్న కాలం అది. ఎమర్జెన్సీ అనంతరం వీచిన స్వేచ్ఛావాయువుల్లో కలగలిసి కరీంనగర్ రైతాంగ హృదయాలు ఎరుపెక్కుతున్న కాలం అది. అది వెలుగంత సహజంగా జగిత్యాల్లోని అంగడి బజార్లో ఉండిన అతని పూర్ణిమా ఫోటోస్టూడియోలోకి, దాని వెనకే వున్న వంటింట్లోకి ప్రవేశించింది.

అతని స్టూడియో ఎర్రబారింది. అతని యింట వంటి ఎర్రబారింది. అతని కవిత ఎర్రబారింది అది 1978లో "ఎర్రపావురాలు" కవితా సంకలనంగా వెలువడింది. అలా అలిశెట్టి ప్రభాకర్ కవితాకాశంలోకి ప్రవేశించాడు.

ఎంత పెద్ద మహావృక్షమైనా మట్టిలోనే ఆవిర్భవిస్తుంది. ఎంత పెద్ద హాసౌధమైనా మట్టిలోనే పునాదులుంటాయి. పిట్టరాల్చిన రెట్టలో అరగని మర్రివిత్తనం కొండరాళ్ళ నెరికలోపడి మొలకెత్తి రాళ్ళనే దొర్లిస్తుంది. అది ఎన్నో పక్షులకూ ఆశ్రయమవుతుంది.

సమాజంలో యువకులు తమ అస్తిత్వాన్ని వెతుక్కునే క్రమంలో, వ్యక్తిత్వాన్ని ఏర్పరచుకునే క్రమంలో ఎన్నో ఎన్నెన్నో ఆచరణలు చేపడ్తారు. అలా కొందరు యువకుల్లో 1974లో జగిత్యాల్లో "సాహితీమిత్రదీప్తి" అనే సంస్థ ఉషోదయమైంది. కరీంనగర్‌లో కొంతకాలం చదివి జగిత్యాల కొచ్చి సొంతయింటిలో వుంటున్న అలిశెట్టిని –గద్దర్‌ను మా భూమి నర్సింగరావు కనుగొన్నట్టుగా కలుసుకున్నారు వారు.

అప్పటికి చిలిపి చేష్టల పిల్లవాడని, చిల్లర చేష్టల జులాయి అని కోపగించుకోబడుతున్నాడు అలిశెట్టి. అందుకు కారణాలు అతడుండిన సామాజికనేపథ్యంలోనివే. 1965 పరిశ్రమల శాఖలో పనిచేస్తూ అకస్మాత్తుగా తండ్రి చనిపోయే నాటికి అతని వయస్సు పదకొండేళ్ళు. ఏడుగురు అక్క చెళ్ళెళ్ళు, యిద్దరు అన్నదమ్ముల్లో అలిశెట్టి అయిదవవాడు. ఇంటికి పెద్దకొడుకు. అతని చిన్న చెల్లాయి రెండేళ్ళ వయస్సులో తండ్రి మరణించాడు.

తండ్రి లేని పెంపకం పితృస్వామిక పురుషాధిక్య సమాజం మగ పిల్లలకు కొంత వ్యక్తిగత స్వేచ్ఛనిస్తుంది. అది అదుపు తప్పిన సామాజిక రుగ్మతలు నిరుద్యోగం దేశమంతటినీ కలిచివేస్తున్న కాలం. నక్సల్బరీలో సంతల్ గిరిజనులు యీ సంక్షోభంలో పోరాటాలకు ఉద్యమిస్తున్న కాలం. కలకత్తా వీధుల్లో విద్యార్థి లోకం భవిష్యత్తు భారతదేశం కోసం ప్రసవ వేదన పడుతున్న కాలం. ఎన్నికల్లో సగం

రాష్ట్రాలకు పైగా కాంగ్రెసునోడించి కాంగ్రెసేతర పార్టీల్ని గద్దెనెక్కించడానికి ప్రజలు సమాయత్తమవుతున్న కాలం. సరిగ్గా అదేకాలంలో తండ్రిని కోల్పోయి, అస్తవ్యస్తంగా మారిన కుటుంబంలో మగవాడిగా, పెద్దకొడుకుగా రూపుదిద్దుకున్నాడు అలిశెట్టి ప్రభాకర్.

చదువు మానేసాడు. కుటుంబానికి ఆర్థికంగా ఆధారం కావాలి. అతని అక్కలు, బావలు ఎంతో బుజ్జగించి అతన్ని ఫోటోస్టూడియోల్లో పనినేర్చుకోవడానికి కుదిర్చారు. అక్కడి నేర్చుకుని వచ్చి 1975లో పూర్ణిమా ఫోటోస్టూడియో సొంత ఇంట్లోనే పెట్టాడు అలిశెట్టి.

సాహితీమిత్ర దీప్తిని, అది ప్రచురించే కవితా బులెటిన్లనీ అలిశెట్టి జోకుల్తో, ఆటపట్టించే క్రమం నుండి సీరియస్‌గా కవిత్వం రాయాలనే ఆలోచనకు చేరుకుంటున్న దశనాటికి 9 సంచికలు వెలువరించిన సాహితీమిత్ర దీప్తి, సంస్థ నిర్మాణరూపంలో ఆగిపోయింది. అయితే అది యిచ్చిన చిన్న వెలుగు ఎందరిలోనో వెలుగును నింపింది.

జగిత్యాల సబ్ కలెక్టరు ఆఫీసు వెనకగల చెట్లకింద, లక్ష్మీటాకీసు ప్రక్కనగల డిటెక్టివ్ నవలల అద్దెషాపులోనూ, ఉబుసుపోక కబుర్లనుంచి ప్రపంచందాకా, పిచ్చి గీతల క్రమంనించి, చక్కని గీతల చిత్రకారునిదాకా అలిశెట్టి జీవితం, ఫోటోగ్రఫీ, అతనిలోని చిత్రకారుడూ, కవీ దాదాపు ఏకకాలంలో మట్టిని పెళ్ళగించుకొని మొలకగా మొలకెత్తడం ప్రారంభమైంది.

తన ఆదర్శాలకనువుగా పేదింటి అమ్మాయి అయిన 'భాగ్యం' తో 1979లో పెళ్ళి చేసికొన్నాడు. కట్నకానుకల ప్రసక్తి లేకపోగా చెల్లిపెళ్ళితోపాటు పనిలో పనిగా తన పెళ్ళీ జరుపుకున్నాడు.

భాగ్యం అతడి జీవితానికి అబ్బిన ఒక గొప్ప భాగ్యం. అతని జీవితంలోని అన్ని మలుపుల్లోనూ తానైసాగింది భాగ్యం. 1979-80ల్లో అలిశెట్టి "చురకలు", "మంటల జెండాలు" కవితా సంకలనాలు వెలువరించాడు. "చురకలు" సంకలనం అమ్మగా వచ్చిన డబ్బును చెరబండరాజు ఆర్థిక సహాయ నిధికి అందించిన కర్తవ్య దీక్షా పరుడతడు. 1983లో "రక్తరేఖ" రూపుదిద్దుకొంది. అదే ఏడు విప్లవోద్యమ ప్రభావంలాగే అతని జీవితం జగిత్యాల కరీంనగర్‌ల మీదుగా సిటీలైఫ్ లోకి ఎగబాకింది.

జగిత్యాల జైత్రయాత్ర అతని పొయ్యినీ, వంటనీ ఎర్రబార్చడంతో పాటు అతని

ఒంటికి వేడిసెగలు తగిలించింది. నెత్తురొడ్డుతున్న మట్టిపాదాల కదలిక యిచ్చే ఉద్యమ స్ఫూర్తి మనసంతా ఆచరించింది. వేడికి ఆవిరైపోయే తన జీవనౌకను తగిన దూరంలో తీరంలో కొనసాగించాలని నిర్ణయించుకున్నాడు. తన నౌకను కరీంనగర్‌కు తరలించాడు. మంకమ్మ తోటలో శిల్ప ఫోటో స్టూడియోగా అవతరించాడు.

జగిత్యాలపల్లె కరీంనగర్ ఆదిలాబాద్, నిజామాబాద్ వరంగల్ జిల్లాల పోరాటంగా విస్తరించి దండకారణ్య పోరాటంగా మలుపు తీసుకున్న క్రమం అది. గాలి నీరు వెలుతురులా ఆ ప్రభావం అన్నిటా ప్రవహిస్తుంటే అలిశెట్టిని వదులుతుందా? నిన్న వినపడినవారు, కనపడి పలకరించిన వారు కనుమరుగవుతుంటే ఆవేదనతో నిద్రపట్టని రాత్రులు అతని జీవితంలో ఎన్నో.

అతడు తన లోపలి బాధను చెప్పనూలేదు. చెప్పకుండా వుండనూ లేదు. ఉన్న స్నేహితులంతా అతని మేలుకోర వారే. వాస్తవం ఒక్కటే. దాని పరిష్కారానికి సూచనలే ఎన్నో. తనదైన నిర్ణయం తాను తీసుకున్నాడు అలిశెట్టి. మంటల్తో ఒళ్ళు మాడిపోకుండా వుండేందుకు వెలుగు వెంట తీసుకుని భాగ్యంత భాగ్యనగరానికి జీవనౌకను తరలించాడు. అప్పటికి మంకమ్మతోటలోని అతని ఫోటోస్టూడియో ఊసిరిసలపని బిజీకేంద్రం, అది సాహిత్య కేంద్రమే కాకుండా ఫోటోస్టూడియో గా కూడా బీజీ కేంద్రమైంది. భాగ్యనగరానికి అతడు బతుకు తెరువు కొరకు రాలేదు భవిష్యత్ చిత్రపటం అతనికి అయిదేళ్ళముందే అర్థమయింది. జీవిక కొరకు కాకుండా జీవన భద్రతకొరకు మహాప్రవాహంగా ఎదుగుతున్న సాహిత్యాన్నీ, స్టూడియోవ్యాపారాన్నీ అట్టపెట్టెల్లోకి మార్చుకొని భాగ్యనగరంలోని విద్యానగర్‌లో ఆంధ్రమహిళాసభ ఆసుపత్రి ఎదురుగా చిత్రలేఖ ఫోటోస్టూడియోగా మళ్ళీ జీవితాన్ని మొదటి నుండి ప్రారంభించాల్సి వచ్చింది.

అతడి గోడు అప్పట్లో కొందరికి అర్థం కాలేదు. కవితాకాశంలో అవకాశాలకోసం హైదరాబాదు తరలి వెళ్ళాడనుకున్నారు. పొట్టగడవక కరీంనగర్ నుండి స్టూడియో ఎత్తేసాడనుకున్నాడను కున్నారు. కానీ అసలు రహస్యం అతడికి తెలుసు అది సిటీలైఫ్ ముందుమాటలోనైనా మనముందుంచు తాడనుకున్నాం. ఒక ద్రోహి చేసిన ద్రోహం వల్ల యిలా అయ్యిందని సూచనతే చేశాడుగానీ అతని పేరు వెల్లడించలేదు. బహుశా అతడి పేరు ఎత్తుకోవడానికి కూడా అలిశెట్టికి అసహ్యం వేసిందేమో. ఆ రహస్యం అతడితోనే కాలిబూడిదయిపోయింది.

అతడికి జరిగిపోయిన అన్యాయం ఏమిటో "సామాజిక ఆచరణ" కు తెలుసు

అయితేనేం? లోకమే మండిపోతుంటే శోకంలో ఎవరు ఓదార్చుతారు? 1930ల నాటి యిక్కడి ప్లేగువ్యాధి ముట్టుకున్న వారినల్లా మట్టుపెట్టినట్టుగా రాజ్యహింస ప్లేగు వ్యాధిలా విరుచుకు పడుతుంటే చేయి అందించే దైర్యం మాత్రం ఎందరికి వుంటుంది.

అతడికి సానుభూతి అంటే అసహ్యం. ప్రేమంటే ప్రాణం. అతనిపై సానుభూతి చూపించే వారిని మందలించాడు. దాన్ని వారు ప్రేమగా మార్చుకున్నాక వారిని ఆప్యాయంగా స్వీకరించాడు. అంతటి ధీరోదాత్తుడు. అతడు నిజంగా ఒక కొవ్వొత్తి. అతని జీవితం అనే కొవ్వొత్తి పరులకు వెలుగు నీయడం కోసం కరిగిపోతున్నా కొద్దీ అతని త్యాగదీపం వెలుగులు విస్తరిస్తూ వచ్చాయి.

అతడు టి.బి.ని అనవసరంగా ఒక రోగంగా ముదరనిచ్చాడని ప్రేమతోనే గొణుగుకున్న స్నేహితులెందరో, అసలు విషయం మందుల్ని కూడా తిని అరిగించుకునే శక్తిని సంతరించుకున్న టిబి రోగక్రిములకు తెలుసు. అజ్ఞాత త్యాగాల వల్ల అస్తవ్యస్తమైన అతని జీవితమూ, ఆర్థిక స్థితే అక్రమానికి తీసుకువెళ్ళాయని అతడు బతికి వున్నపుడే చెపితే అతిశయోక్తి అనుకుని వుంటారు. ఇపుడతడు అమరుడయ్యాడు. ఇపుడా సత్యాన్ని దాచవలసిన పనిలేదు. అందువల్లే చెరబండరాజులాగే అలిశెట్టి ప్రభాకర్ కూడా ఈ వ్యవస్థ వల్లే రోగపీడితుడై చెరబండరాజు లాగే పిన్న వయస్సులోనే అమరుడయ్యాడు.

అలా అతన్ని చంపింది కేవలం అతని నిర్లక్ష్యం కాదు. అతన్ని చంపింది కేవలం అతని దారిద్ర్యం కాదు. అతన్ని చంపింది యీరెంటినీ తన వారసత్వంగా అందించిన యీ దుర్మార్గపు వ్యవస్థే. అందుకే అతనికి యీ వ్యవస్థ అంటే ఎక్కడలేని కసి. పల్లె నుండి ఢిల్లీ దాకా, పసిపాప నుండి ప్రపంచం దాకా దేనీ వదిలిపెట్టకుండా కవిత్వీకరించినా, ఈ వ్యవస్థపై గల కసి అది తన వారసత్వంగా అందించిన తన దేహంపై కూడా ప్రసరించినట్టుంది. తన జీవితాన్ని పరాయీకరించే యీ వ్యవస్థకు జవాబుగా తన శరీరాన్ని తనది కాని శరీరంగా భావించి దాన్నించి స్వతంత్ర అస్తిత్వం పొందిన వ్యక్తిత్వంలా ఎదిగి తెలుగు కవిత్వాన్ని ఒక మెట్టు ఎదిగించిన కళా తపస్వి అలిశెట్టి.

అలిశెట్టి ప్రభాకర్ యీ కాలంలో పుట్టిన ఒక వేమన. ఒక కబీరు, ఒక జాషువా. రసాత్మకమైన వాక్యమే కావ్యం అనే సూక్తిని సుసాధ్యం చేసుకొని వేమన, కబీరు, జాషువాల్లాగా ఒక కావ్యంలో చెప్పగలిగే భావాన్ని 5, 6 లైన్ల కవితలో చెప్పే నేర్పును. శిల్పాన్ని సాధించినవాడతడు. వారిలాగే అలిశెట్టి ప్రభాకర్ మహాకవి కాదంటే ప్రజాకవి.

"రాజుమరణించె ఒక తారరాలిపోయె

కవియుమరణించె ఒక తారగగనమెక్కె"

అన్నాడు మహాకవి జాషువా. రాజులు మరణిస్తే వారి వెలుగు అస్తమించి చీకటి మిగిలిపోవచ్చు. కవులు మరణిస్తే ప్రజలకు వేగుచుక్కలా వారి కవిత్వం వెలుగులు విరజిమ్ముతూనే వుంటుంది. అలిశెట్టి సాహితాయకాశంలో ఒక ధృవతార. అతడు చిరంజీవి. అతని సామాజిక ఆచరణలాగే అతని కవిత్వం తెలుగు సాహిత్యానికి, అశేషప్రజలకు స్ఫూర్తిని, ఉత్తేజాన్ని యిస్తూనే వుంటుంది. ఈ దుర్మార్గపు వ్యవస్థను సమూలంగా మార్చి పీడిత వర్గకుల లింగజాతి, మతభాష, విచక్షణ లను తొలగించి మహోన్నత సమాజంగా తీర్చిదిద్దడమే అలిశెట్టి ప్రభాకర్‌కు మనం అర్పించే నిజమైన నివాళి.

Dalithayugam-2

03-09-09

21

సమగ్ర సామాజిక విప్లవకారుడు జి.వై.గిరి

జీవితం బహుముఖమైనది. జీవితానికి ఎన్నో పార్శ్వాలు ఎన్నో దశలు. ఎన్నో సంబంధాలుంటాయి. బాల్యం, యవ్వనం, వృద్ధాప్యం జీవితంలోని ఒక్కో దశను సూచిస్తాయి. వ్యక్తి, కులం, వర్గం, జాతి, మతం, ప్రాంతం, భాష, సమాజం అనేవి జీవితంలోని మరో క్రమాన్ని వివరిస్తాయి. వ్యక్తి తల్లిదండ్రి, గురువు, జైండర్, కుటుంబం, సామాజిక సంబంధాలు జీవితంలోని మరికొన్ని పార్శ్వాన్ని తెలియ జేస్తాయి.

సైన్స్ వికాసాన్ని అనుసరించి ముందుకు సాగాల్సిన, ఉత్పత్తి శక్తులు సంబంధాలు, మానవ సంబంధాలు జీవికై ఆరాటాలు, అస్తిత్వంకై పోరాటాలు, జీవితాన్ని శాస్త్రీయ దృష్టితో స్పష్టం చేస్తాయి. సంస్కృతి, సభ్యత, సభ్యత అలవాట్లు, కళలు, సాహిత్యం సామాజిక శాస్త్రాలు జీవితం తీరును పరిణామ క్రమాన్ని తెలుపుతాయి.

పని–ఆచరణ. ఆచరణ నుండి ఆలోచన అవగాహన, చైతన్యం, స్పందన, అనుభూతి, అనుభవం, జ్ఞానం ప్రాపంచిక దృక్పథం మనస్సు, హృదయం, ప్రేమ, కరుణ ద్వేషం, దుఃఖం సంతోషం, మళ్ళీ ఆచరణ ఇవన్నీ జీవితంలోని అనంత స్వస్వభావాన్ని దాని తీరు తెన్నులను అర్థం చేసుకోవడానికి ఉపకరిస్తాయి.

అవయవాలన్నీ కలిసి శరీరం అవుతున్నట్లుగానే ఇవన్నీ కలిసి జీవితం అవుతున్నది. వీటన్నిటిని అఖండంగా ఒక సమగ్రతతో పరిశీలించినప్పుడే జీవితాన్ని సమగ్రంగా విశ్లేషించినట్టవుతుంది. జీవితం ఇవన్నీ సమూలంగా మారడాన్నే సమాజంలో సమూలమైన మార్పులు వచ్చాయని వ్యవహరిస్తారు. ప్రతి దశలో, ప్రతి తరంలో, ప్రతి పార్శ్వంలో, ప్రతి రంగంలో సమగ్రమైన కృషి జరిగినప్పుడే ఇది సాధ్యపడుతుంది. అలా అన్నిటా సమూలంగా మార్పులు రావడమే సమగ్ర సామాజిక విప్లవం. దాన్నే సమగ్ర సామాజిక వికాసంగా కూడా వ్యవహరిస్తారు.

జి.వై.గిరి ఒక సమగ్ర సామాజిక విప్లవకారుడు. అతడు జీవితంలోని అన్ని కోణాలను విప్లవీకరించే సామాజిక శాస్త్రవేత్త అతడు సమగ్ర సామాజిక వికాసం కోసం నలభై అయిదేళ్ళుగా నిరంతరం కృషి చేస్తున్న కవి, రచయిత, కళాకారుడు, నాయకుడు, దార్శనికుడు. రాష్ట్రంలోని విభిన్న ఉద్యమాల యాభయి ఏళ్ళ చరిత్రకు అతడొక వారధి అతని చరిత్ర విప్లవాల కూడలి. నాస్తిక హేతువాద విప్లవోద్యమాలతో పాటు మరెన్నో ఉద్యమాల చరిత్రకు అతని జీవితం ఆచరణ ఒక సజీవ సాక్ష్యం. అతడొక యుద్ధనౌక, అతని ఇల్లు ఒక యుద్ధ భూమి. అతని జీవితాచరణ నిరంతర యుద్ధాన్ని తలపిస్తుంది. కొందరు యుద్ధాన్నే జీవితంగా మార్చుకుంటే జి.వై.గిరి జీవితాన్నే యుద్ధంగా మలచుకున్నాడు. వీరి కృషిని పోల్చడానికి పంజాబ్‌లోని గురు శరణ్‌సింగ్ పదేపదే గుర్తుకు వస్తారు.

ఆయుధాలకు యుద్ధాలు అవసరం గానీ, యుద్ధం ఆ యుద్ధాల్లో ఉండదు. యుద్ధం ఆలోచనల్లో ఉంటుంది. తాత్విక దృక్పథాల మధ్య ఉంటుంది. యుద్ధం ఒక ఆలోచనకు పర్యవసానమేగానీ అది ప్రారంభం కాదు. అందువల్ల యుద్ధం యుద్ధాన్ని నిర్మూలించదు. ఆలోచనల మధ్య యుద్ధ యుద్ధమే యుద్ధాన్ని నిర్ణయిస్తుంది. ఈ రహస్యాన్ని గుర్తెరిగిన రచయితలు, కళాకారులు సమాజానికి క్రాంతదర్శులవుతారు. జి.వై.గిరి అందులో ఒకరు. ఆయన తన పాటలతో, కళారూపాలతో ప్రజల ఆలోచనల మధ్య యుద్ధాన్ని రగిలిస్తారు. సమస్త వర్గకుల లింగ జాతిమత వివక్షతలకు అసమానతలకు వ్యతిరేకంగా తన కులాన్ని, గళాన్ని గుప్పిస్తారు. స్వార్థం. అవిద్య మూఢవిశ్వాసాలకు వ్యతిరేకంగా మంచికోసం, మమత కోసం, శాంతి కోసం ప్రజల్ని ఉత్తేజ పరుస్తారు.

జీవితంలో యుద్ధం ఉండదు. యుద్ధంలో జీవితం ఉంటుంది. పాలకవర్గాలు యుద్ధంలో ఉండే జీవితాన్ని ఉత్తేజితంగా రాయాలని రచయితలను కళాకారులను కోరుతుంటాయి. అపుడపుడది ప్రజల అవసరం కావచ్చు. అయితే అది గొప్ప సాహిత్యం అని సూత్రీకరించడం. ప్రజల జీవితంలో నిరంతరం జీవితంలో నిరంతరం చేసే, రాయాల్సిన యుద్ధాన్ని చిన్నచూపు చూడ్డమే. జి.వై.గిరి జీవితంలోని యుద్ధాన్ని గురించి రాస్తారు. ఇందులోని పాటలన్ని ఆ కోవకు చెందినవే.

వర్గ పోరాటాల చరిత్రే చరిత్ర అంటారు మార్క్స్ ఆర్ఎస్ఎస్ తత్వవేత్త ఎం.ఎస్.గోల్వాల్కర్ (గురూజీ) శాంతిని యుద్ధానికి యుద్ధానికి మధ్యగల విశ్రాంతి

కాలం అని నిర్వచిస్తాడు. యుద్ధం దేనికోసం? ఆ యుద్ధాల యుద్ధమైన ఆలోచనల యుద్ధమైనా దేనికోసం జీవితం కోసం యుద్ధాలా? యుద్ధాల కోసం జీవితాలా! వ్యక్తిలో సమాజంతో సమూల సమగ్ర మార్పుల కోసం యుద్ధం అందుకు యుద్ధమే చేయాలా? ప్రేమ ద్వారా త్యాగం ద్వారా సేవ ద్వారా ప్రజల్ని గెలుచుకోలేరా? బౌద్ధం ప్రేమ ద్వారా వెయ్యేళ్ళు ప్రజల్ని గెలుచుకోలేదా?

ఏ యుద్ధం చేయకుండానే ఏకలవ్యుడు వేలునెందుకు కోల్పోయాడు. ఏ యుద్ధం చేయకుండానే శంభుకుడెందుకు హతుడయ్యాడు. ఏ యుద్ధం చేయకుండానే లక్షలాది చిట్టి చెల్లెళ్ళు వ్యభిచార జీవితంలోకి ఎందుకీడ్చబడుతున్నారు? ఏ యుద్ధం లేకుండానే ఎందుకు అరవై కోట్ల భారత ప్రజానీకం బాల కార్మికులుగా బతుకును ప్రారంభించాల్సి వస్తోంది. వీరి జీవితాలకు యుద్ధాలు అవసరమా? ఇదీ జి.వై.గిరి ఆవేదన.

నాస్తిక హేతువాదులు, కమ్యూనిస్టు నక్సలైట్లు, ఆర్ఎస్ఎస్ వాదులు యుద్ధాన్ని ప్రేమించినంతగా జీవితాన్ని ప్రేమించడం లేదు. యుద్ధం ముఖ్యమా మార్పు ముఖ్యమా అంటే వారు మార్పే ముఖ్యం అంటారు. కాని వారి ఆలోచనల యుద్ధం గురించి, ఆయుధాల యుద్ధం గురించి రాసినంత ఉత్సాహంగా జీవితం గురించి రాయడం లేదు. తద్వారా వారు యుద్ధం ద్వారా జరిగే విధ్వంసాన్ని ప్రేమించినంతగా సమగ్ర సమాజ వికాసాన్ని ప్రేమించడం లేదు. యుద్ధాల గురించే రాయాలనుకోవడం పాలకవర్గాల ఆలోచనా విధానం దీన్నించి జి.వై.గిరి కొంచెం వైదొలిగారు.

పాలకవర్గాల రాజ్య కాంక్షను యుద్ధాలు తీరుస్తాయి. మహాభారతం రామాయణం యుద్ధగాథలు రాజ్యకాంక్ష పర్యవసానాలే. కమ్యూనిస్టులు, నక్సలైట్లు, ఆరెసెస్ వాదులు యుద్ధాల గురించి రాయమని కోరతారు. వారి ఆసక్తి అంతా యుద్ధంలో కొనసాగే జీవితాల గురించే అలాంటి వారికి ఇందులోని పాటలు రుచించక పోవచ్చు.

జీవితం పరిణామ శీలమైనది. జీవితం విత్తులా మొలిచి మొక్కలా ఎదిగి వృక్షంలా విస్తరించడం ఒక పరిణామం అయిదేళ్ళ వయస్సు నుండి ఇరవై ఏళ్ళ విద్య అభ్యసిస్తే ఏదో ఒక శాస్త్రంలో, రంగంలో అంతదాకా అభివృద్ధి చెందిన జ్ఞానాన్ని అందుకోవడం సాధ్యపడుతున్నది. అందరికీ ఈ అవకాశం, ఆసక్తి కలిగిస్తే కేవలం ముప్పయేళ్ళల్లో ప్రపంచ మొత్తం ఒకే స్థాయికి చేరడం సాధ్యమే. సమాజం యొక్క అదనపు సంపదను అందుకు పెట్టుబడిగా వినియోగించడమే పరిష్కారం ఇదంతా పరిణామం రూపంలో జీవితంల కొనసాగే విప్లవం. ఈ పరిణామశీల విప్లవాల గురించి పాలక వర్గాలు, అగ్రకుల నాయకత్వాలు పట్టించుకోవు. దాన్ని జి.వై.గిరి లాంటి శ్రామిక కులాల

కళాకారులు పట్టించుకుంటారు. జీవితం ఎలా వికసింప చేసుకోవాలో అందులోని పరిణామశీలత ఏమిటో పాటల ద్వారా ఎరుకపరుస్తారు జి.వై.గిరి.

యద్ధం కన్నా జీవితం ప్రాథమికమైనది. జీవితం లక్ష్యం, యుద్ధం ఒక సాధనం. కానీ యుద్ధవాదులకు యుద్ధమే లక్ష్యం. జీవితమే అందుకు సాధనం. అందువల్లే వారు వర్గ పోరాటాల చరిత్ర అని అంటారు. యుద్ధానికి యుద్ధానికి మధ్య విరామమే శాంతిని జ(శ)పిస్తారు. యుద్ధంలోని జీవితాన్నే చిత్రించే వారు రాజులను పార్టీలను ఆశ్రయించి బతకడం సహజం. రాజులకు పార్టీలకు అలాంటి వారెంతో అవసరం. రాజుల తాలూకు పార్టీ కళ్ళతో ప్రపంచాన్ని చూసేవారు ఆ ప్రేమకు వెలుపలగల జీవిత సత్యాలను పట్టించుకోవడం ఎలా సాధ్యం? మద్యపాన జీవితంలో, సంస్కృతిలో తీసుకువచ్చే అనార్థల గురించి, కోడళ్ళపై ఆధారపడే ముసలి అవ్వల వేదన గురించి, ఇల్లాలి అగచాట్ల గురించి, ప్రజానాట్యమండలి, అరుణోదయ, జనసాహితి, జననాట్యమండలి పాటల పుస్తకాల్లో ఎన్ని పాలు ఉన్నాయో ఆత్మవిమర్శ చేసుకోవాల్సి వుంది. వాటికి ఏపాటి ప్రాధాన్యత ఇచ్చారో తమకు తామే జవాబు చెప్పుకోవాల్సి ఉంది. వందలమంది అభ్యుదయ, విప్లవకవులు ఎందుకని జీవితంలోని యిలాంటి పార్శ్వాలపై రాయలేదు? పార్టీ దృక్పథం అనే గంతలు వారిని జీవితాన్ని చూడనిరాకరించే గుడ్డివారినిగా మార్చాయా? వారే మారారా? జి.వై.గిరి అభ్యుదయ, విప్లవవాదులు, దళితస్త్రవాదులు రాసే ఉద్యమాల పాటల్నీ రాశారు. అదనంగా జీవతంలోని ఈ కోణాలన్నిటిని పట్టించుకున్నారు. శాంతి గురించి, క్రాంతి గురించే కాకుండా, వికలాంగుల గురించి, ఆడపిల్లల పెళ్ళి గురించి, పెళ్ళిపట్ల ఉండాల్సిన అవగాహన గురించి, ఎత్తిపోతల పథకం ఆవశ్యకత గురించి, ఆడ కూతుళ్ళ అవస్థగురించి, ఆడవారి సభల గురించి పర్యావరణం గురించి, ఆహారపు అలవాట్ల గురించి, ఓటు విలువ గురించి, గ్రంథాల గురించి, బ్లాక్‌మార్కెట్ గురించి, యిలా ఒకటేమిటి? జీవితంలోని సమస్త పార్శ్వాల్ని పట్టించుకోవడం జి.వై.గిరిలోని విశిష్టత. ఇవన్నీ అతను పార్టీ కళ్ళద్దాలతో కాకుండా జీవితాన్ని స్వయంగా, సమగ్రంగా పరిశీలించే దార్శినికుడని స్పష్టం చేస్తాయి.

పరిణామ శీలమైన విప్లవంలో ఒక రైతుకూలి. ఒక బాలకార్మికుడు, ఒక దళితుడు, విద్యాధికుడై రీడరై, వైస్‌ఛాన్సలర్ అయి జీవితాన్ని గెలుచుకోవడం ఒక యుద్ధం. నిన్నటిదాకా చదువు నిరాకరించిబడిన శ్రామిక కులాలు విద్యాపరంగా, ఆర్థికంగా, రాజకీయంగా అన్ని రంగాల్లో ఉన్నతంగా ఎదగడం విప్లవం జి.వై.గిరి

వంటి దళితులు దార్శనికులుగా ఎదగడం విప్లవం.

శ్రామిక కులాలు కులవృత్తులు వదిలి నూతన మానవ సంబంధాలు ఏర్పరచుకోవడంలో విప్లవం ఉంది. అగ్రకులాలు తమ ఆర్థిక, సాంఘిక, రాజకీయ, కుల హోదాలకు అనువైన వృత్తుల్ని, పదవుల్ని ఎన్నుకోవడంలో ప్రతీఘాతుక విప్లవ క్రమం ఉంది. మావో సాంస్కృతిక విప్లవ అంతస్సారంలో ఈ విషయం ఒక ప్రధానాంశం కూడా. కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు మొదలుకొని బిజెపి నక్సలైట్ల దాకా కొనసాగుతున్న నాయకత్వం అగ్రకులాధికృత కనువుగా కొనసాగుతున్న ప్రతీఘాతుక విప్లవమే ఈ అగ్రకుల ప్రతీఘాతుక విప్లవం. అసలైన విప్లవాన్ని తినేస్తోంది. ఈ విషయాన్ని కమ్యూనిస్టు నక్సలైట్లు ఎందుకు బహిర్గతం చేయడం లేదో జి.వై.గిరి మాత్రం వారికి అరగని ఆహారంగా మిగిలిపోయాడు.

జి.వై.గిరిని పోలిన వారు పంజాబ్‌లో ఒకరున్నారు. గురు శరణ్‌సింగ్‌కూ, జి.వై.గిరికి ఆలోచనలో, ఆచరణలో అతిదగ్గర పోలిక. వీరిద్దరూ కమ్యూనిస్టు ఉద్యమాల్లో పనిచేస్తూనే స్వంతంగా సంస్థలా ఎదిగారు. వీరు వ్యక్తులు కారు, వీరు ప్రజల ఆశల ఆరాటాల ప్రతీక. విసుగూ విరామం ఎరుగని పోరాట యోధులు వీరు. వీరి నిరంతర కృషితో పోల్చదగ్గ కళాకారులను లెక్కించడానికి ఒకచేతి వేళ్ళే సరిపోతాయి. అన్ని రంగాలల్లో ఐక్యఉద్యమ నిర్మాణమే వీరి ధ్యేయం సమిష్టిత సం౦ కట్టడంలో ఒక గొప్ప శక్తి ఉత్పన్నమవుతుందని, అదే సామాజిక చైతన్యంగా ముందుకు సాగుతుందని వీరు గాఢంగా విశ్వసిస్తారు.

జి.వై.గిరి ప్రజా సమస్యలపై స్పందించే కవి. ప్రజల్ని వారి కళల్ని నమ్ముకున్న విప్లవకారుడు. నా పాటల్ని సినిమాలకు తీసుకున్నారు. గానీ నేను సినిమాలో కవి రాయలేదంటారు. జి.వై.గిరి ఈ విషయం నాకు భిన్నాభిప్రాయం ఉంది. ఎంతోమంది అభ్యుదయ విప్లవ రచయితల్లా జి.వై.గిరి సినిమాలకూ పాటలు రాసి యివ్వాల్సింది. శ్రీశ్రీ, ఆత్రేయ, ఆరుద్ర, దాశరథి, సి.నా.రె కోవలో ఆ రంగంలోనూ వేగంగా రాయాల్సింది. ఇకనైనా రాయాలని కోరుతున్నాను. సినిమాలకు రాసినంత మాత్రాన వారి ప్రతిష్టేమీ తగ్గలేదు సరికదా రేడియో, సినిమాల, టీ.వి. పత్రికల్ని ఆధారం చేసుకొని రెంటిలోనూ ప్రతిష్ట పెంకున్న వారూ ఉన్నారు. బలమైన ప్రసార మాధ్యమాల్ని చిన్నచూపు చూడకూడదని నా అభిప్రాయం.

విప్లవ రాజకీయ నాయకుడికి ప్రజల్ని కూడగట్టడం తెలుసు జి.వై.గిరికి అదనంగా కళలూ, ప్రజాహృదయమూ తెలుసు. రాజకీయం కళ రెండూ తెల్సిన కళాకారుడు.

రాజకీయం ఒకటే తెల్సిన వాడి నాయకత్వంలో పని చేయాలి. విప్లవ రాజకీయాలు ఇంత తలకిందులుగా నడుస్తాయి. సొంత వ్యక్తిత్వం ఉన్న కళాకారుడు, రచయిత యిలాంటి నిర్మాణాల్లో ఒదగడం, ఒదిగినా ఎదగడం సాధ్యం కాదు. డెబ్బయి ఏళ్ళుగా కమ్యూనిస్టు విప్లవాల్లో రచయితలు, కళాకారులు, మేధావులు ఎదుర్కొంటున్న సమస్య యిది.

ఈ సమస్యను, రాహుల్, ప్రేంచంద్, గురుచరణ్‌సింగ్ మొదలగు వారు పరిష్కరించుకున్న విధంగానే జి.వై.గిరి పరిష్కరించుకున్నారు. ఈ పరిష్కారం క్రమం పర్యవసానంగా కమ్యూనిస్టు, నక్సలైటు పార్టీల్లో తత్వవేత్తలు, రచయితలు, కళాకారులు పార్టీ అధినేతలు కాలేకపోయారు. ఈ విషయంలో కాంగ్రెస్ కాస్త నయం. వారికి నచ్చిన తత్వవేత్త(?) సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను రాష్ట్రపతిగా, జుషువా, బోయి భీమన్నలను ఎమ్మెల్యేలుగా ఎన్నుకుని గౌరవించారు. కమ్యూనిస్టు పార్టీలు సుద్దాల హనుమంతునో, జి.వై.గిరినో రాజ్యసభ్యులుగానో, ఎమ్మెల్యేలుగానో ఎన్నుకోలేకపోయాయి.

నలభై అయిదేళ్ళుగా కృషి చేస్తున్న జి.వై.గిరి ఎమ్మెల్యేకాదు గదా, కనీసం తానున్న ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులుగానైనా ఎన్నుకోబడలేదంటే దళిత నాయకత్వం, తెలంగాణా నాయకత్వం యాభై ఏళ్ళుగా ఎంతగా అణచివేతకు గురవుతూ వస్తోంద స్పష్టం అవుతున్నది. ఎందరో కమ్యూనిస్టులు పద్మశ్రీలు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులూ పొందితే అందులో సుద్దాల హనుమంతుతో, జి.వై.గిరియో లేకపోవడానికి ఎవరు ఎంత బాధ్యులో ఆత్మవిమర్శ చేసుకోవాల్సి వుంది. దళితులుగా తెలంగాణా ప్రాంతీయులుగా కమ్యూనిస్టులు కళాకారులు, పార్టీలో నాయకత్వంలో కోల్పోయిందెంతో ఇప్పటికైనా లెక్కలు తీయాల్సి వుంది, నిలదీయాల్సి వుంది. అందుకు స్వీయ చరిత్రల్ని, సామాజిక చరిత్ర రికార్డుగా వీరు ప్రజలకు అందించాల్సి వుంది. షష్టిపూర్తి (అరవై ఏళ్ళ)కి దగ్గరవుతున్న జి.వై.గిరికి చరిత్ర ప్రజల చరిత్రతో ముడిపడి వుంది.

కమ్యూనిస్టు పార్టీలను తమ బతుకుతెరువుకు సాధనంగా మార్చుకున్న వారెందరో నాయకులుగా వెలుగుతుంటే నిజాయితీపరులు ఎంతకాలం ఉంటారు? "అభ్యుదయ" పత్రిక జి.వై.గిరి వంటి రచయితల రచనల్ని అచ్చేయకుండా అణచివేస్తూ వచ్చిందంటే అణచివేత ఎంత వ్యవస్థీకృతంగా కొనసాగుతున్నదో స్పష్టం అవుతున్నది. వేలాది ప్రదర్శనలకు మాత్రం జి.వై.గిరి కావాలి. ఇలాంటివాడు కొని వదిలేసే దుర్మార్గ సంస్కృతి కమ్యూనిస్టు నక్సలైటు పార్టీలను నిలువెల్ల దహించి వేస్తున్నది. రాజకీయాల్లో హత్యలుండవు. ఆత్మహత్యలే వుంటాయనే సామెతకు కమ్యూనిస్టు నక్సలైట్ల అభివృద్ధి

పతనాల చరిత్ర ప్రత్యక్ష సాక్ష్యం. అగ్రకులతత్వ పూరిత ప్రతీఘాతుక విప్లవ వ్యూహం ఎత్తుగడలే వారి పతనానికి కారణం. ఈ ఆటు పోటులను తట్టుకొని నలభై అయిదేళ్ళ రంగంపై నిలబడినవాడు జి.వై.గిరి, రావి నారాయణరెడ్డి, చంద్ర రాజేశ్వరరావు, పుచ్చలపల్లి సుందరయ్య వంటి ఎందరో నాయకులతో పాటు ఎందరికో అందరివాడయ్యాడు జి.వై.గిరి. శ్రమ పట్ల, శ్రమచేసే మనుషుల పట్ల విశ్వాసమే అతన్ని యిన్నేళ్ళుగా నిలబెడ్తూ వస్తున్నది.

జి.వై.గిరి రచనల్లో ఒక విశిష్టాంశం ఉంది. అతని పాటల్లో జీవితం ఉంటుంది. సాధారణంగా ఎవరు రాసినా నినాద సందేశం పాటల్లో జీవితం అరుదు. జి.వై.గిరి, సుబ్బారావు పాణిగ్రాహి, శ్రీశ్రీలతో కల్సి నినాద పాటలు రాసినా, చంద్రపుల్లారెడ్డి తరిమెల నాగిరెడ్డి, కె.జి.సత్యమూర్తి, కొండపల్లి సీతారామయ్యలతో కల్సి సందేశం పాటలు వ్రాసినా అందులో జీవితం మానవ సంబంధాలు తొణికిసలాడుతాయి. తెలుగులో అలాంటి వారిని మరికొందరిని చెప్పుకోవాలంటే వంగపండు, గద్దర్, సాహూ, మాష్టార్జీ, సుద్దాల అశోక్, గోరటి వెంకన్న తదితరులు యిటీవలి తరంలోని వారు. గద్దర్, వంగపండు, కంచ అయిలయ్య, గోరటి వెంకన్నను, నిజాం వెంకటేశం, సుద్దాల అశోక్‌ను దళిత మాష్టార్జీని తమ అభిమాన కవి అని చెప్పుకోవడానికి వారు జీవితాన్ని పాటల్లో బాగా చెప్పగలగడమే కారణం.

అభ్యుదయ, నాస్తిక, హేతువాద, ప్రగతిశీల విప్లవ కవుల్లో జీవితంలోని ఇన్ని కోణాలను దర్శించి సమస్యలపై రాసింది బహుశా జి.వై.గిరి ఒక్కడే ననుకుంటాను. జీవితం పట్ల సమగ్ర సామాజిక దృక్పథమే అందుకు కారణం. యువ రచయితలు, కళాకారులు, పోతులూరి వీరబ్రహ్మం వంటి శ్రవ్య, బహుజనామోద సాహిత్య ఒరవడికి, గతి తార్కిక భౌతికవాద జానపద తత్వశాస్త్రాలకు జి.వై.గిరి ఒక సమర్థుడైన వారసుడు, నాయకుడు, దార్శనికుడు, సమాజంలో మార్పుకోరే ఈ పాటలన్ని త్వరలో ఆడియో వీడియో క్యాసెట్లుగా రూపొందాలని ఆకాంక్షిస్తున్నాను.

23.10.1995 ప్రజల దినపత్రిక "వర్తమానం"

ఆమె ఒక తరానికి ప్రతినిధి

ప్రజలను సమీకరించడం ఆమెకు ఎంతో ఇష్టమైన పని

ఆమె జ్ఞాపకాలు కన్నీళ్ళు తెప్పిస్తాయి. ఆమెతో కలిసి పనిచేసిన క్షణాలు స్నేహ సౌశీల్యాన్ని గుర్తు చేస్తాయి. సైకిల్ మీద తిరుగుతూ ఆమె పనులు చక్కబెట్టేది. ఆమె ఏప్రిల్ 11, 2008న మరణించినట్లు వార్తాపత్రికల ద్వారా తెలిసింది. చనిపోయే నాటికి ఆమె వయసు 54 ఏళ్ళు.

అనురాధాగాంధీ ఒక మానవతా వాది. స్నేహశీలి. కరుణార్ధ హృదయం గల సౌజన్యమూర్తి. 1985లో ఆమె, నేను నాగపూర్‌లో కలుసుకున్నప్పటి జ్ఞాపకాలు ఇప్పటికీ కళ్ళల్లో కదలాడుతున్నాయి. కర్ణాటక లోని కూర్గ ప్రాంతానికి చెందిన అనురాధ తండ్రి ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలు నిర్వహిస్తూ అడ్వకేట్‌గా పని చేస్తూ ముంబాయికి మకాం మార్చారు. ముంబాయి కేంద్రంగా అనురాధా గాంధీ విద్యాజీవితం సాగింది. ఆమె మహారాష్ట్ర పౌర హక్కుల ఉద్యమంలో, విప్లవ విద్యార్థి, 'నవజవాన్ భారత సభ' నిర్మాణంలోనూ, ఆహ్వాన్ నాట్యమండలి నిర్మాణంలోను చురుకైన పాత్ర నిర్వహించారు.

అనురాధాగాంధీ ఒక మానవత వాది. స్నేహశీలి. కరుణార్ద్ర హృదయం గల సౌజన్య మూర్తి. 1985లో కలుసుకున్ననాటికి ఆంధ్ర, మహారాష్ట్ర శాఖల మధ్య సిద్ధాంత చర్చలు, రెండు శిబిరాలకు దారితీశాయి. ఆ సందర్భంగా ఆమె చర్చిస్తూ వరవరరావు సిద్ధాంతాలే ముఖ్యమని వాదిస్తే కలిసి పనిచేసే మార్గాలు ఉంచుకోవాలని ఆమె అభిప్రాయ పడింది. అనురాధాగాంధీ సిద్ధాంత నిబద్ధతతోపాటు, స్నేహ కరుణార్ద్ర, విశ్వమానవ ప్రేమ దృక్పథాన్ని నమ్మి ఆచరించిన కార్యశీలి. మావోయిస్టు కేంద్ర కమిటి సభ్యురాలుగా ఆమె ఈ దేశం సమూలంగా మారాలని సామాజిక న్యాయం, సామాజిక మార్పు జరగాలని అందుకు నూతన ప్రజాస్వామిక విప్లవం రావాలని కడదాకా కృషి చేసిన అనురాధాగాంధీ జీవితం, లక్ష్యం పట్ల చిత్తశుద్ధి ఎవరికైనా ఆదర్శప్రాయమే. ఆమె చిత్తశుద్ధిని స్నేహశీలతను కర్తవ్యదీక్షను గుర్తు చేసుకోవడానికి ఆమెతో నాకు, మీకు గల భిన్నాభిప్రాయాలు అడ్డంకేమి కాదు.

చరిత్ర కొన్ని సార్లు వ్యక్తుల పరంగా రికార్డవుతూ వుంటుంది. అలాంటి వ్యక్తులను చరిత్ర ప్రతినిధులు అని అంటారు. అనురాధాగాంధీ అలాంటి చరిత్ర పరిణామానికి ప్రతీక, ప్రతినిధి. ఆమె ఒక తరానికి ప్రతినిధి. 1970లలో స్వాతంత్ర్యానంతరం పుట్టి పెరిగిన యువతరం నూతన ఆలోచనలతో ముందుకు వచ్చింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా దేశంలో సామాజిక మార్పు జరగడం లేదని అసమానతలు, నిరుద్యోగం మరింత పెరగడం నాలాగే కోట్లాది మందిని అసంతృప్తికి గురి చేసింది. ఆ అసంతృప్తి సమాజిక పరిణామం పట్ల, దాని పరిపాలన పట్ల, వ్యవస్థ పట్ల అసహనంగా మారింది. ఏదో చేయాలి. ఎలాగైనా అసమానతల వ్యవస్థను మార్చాలని యువతరం తాము విన్నది, కన్నది, చదివింది, అనుభవించింది ఆధారంగా ఎక్కడికక్కడ కొన్ని ఆందోళనలు చేపట్టారు. ఇలాంటి వారందరు 1970 దశకంలో నక్సలైట్ల ఉద్యమంలోకి, లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ ఉద్యమంలోకి ఆకర్షించబడ్డారు. అలా విద్యావంతులు, యువకులు ఆయా ఉద్యమాల్లో ఉత్సాహంగా చేరిన తరానికి అనురాధాగాంధీ ఒక ప్రతినిధి. ఉన్నంతలో సౌఖ్యంగా బతక గల్గే అవకాశం ఉన్నప్పటికీ వాటిని త్యాగం చేసి ఈ సమాజంలో సరైన మార్పులు తేవాలని కష్టాలను, ఉద్యమాలను కౌగిలించుకున్న వారెందరో! అనురాధా గాంధీ అలాంటి వారిలో ఒకరు.

ముంబాయిలో ఉన్నత విద్యనభ్యసించి, నాగపూర్‌లో లెక్చరర్‌గా పని చేస్తున్న అనురాధాగాంధీతో నా పరిచయం విప్లవోద్యమంలో భాగంగా జరిగింది. 1983లో ఏర్పడిన ఎ.ఐ.ఎల్.ఆర్.సి రూపుదిద్దుకోవడంలో, అవగాహన కార్యక్రమా రూపకల్పనలో అనురాధాగాంధీ చురుకైన పాత్ర నిర్వహించారు. ఆమె సైద్ధాంతిక అవగాహనలో అందరికన్నా ముందుండి ఇతరులకు మార్గదర్శనం చేసే విధంగా నిరంతరం అధ్యయనం చేసేది. 1996 దాకా అనురాధా గాంధీ ఎ.ఐ.ఎల్.ఆర్.సి కార్యవర్గ సభ్యురాలుగా ఎన్నో కార్యక్రమాల రూపకల్పనలు చేశారు. 1997 నుండి పూర్తికాలం కార్యకర్తగా ఆదివాసీ ప్రాంతాలకు వెళ్ళారు. 1983లో ఎ.ఐ.ఎల్.ఆర్.సి ప్రథమ మహాసభలు ఢిల్లీలో జరిగినప్పుడు మాతృభాషా బోధన గురించి ఆమె నొక్కి చెప్పారు. జాతీయ భాషగా హిందీ ఉండాలని కొందరు విరసం సీనియర్లు వాదించగా మరికొందరు ఎ.ఐ.ఎల్.ఆర్.సి సభ్యులు ఇంగ్లీషును ప్రతిపాదించారు. ఆ సందర్భంగా

అనురాధా గాంధీ మాతృభాష, ప్రాంతీయ భాషల అభివృద్ధి గురించి విస్తృతంగా వాదించారు. అందరినీ ఒప్పించారు. అలా ఎ.ఐ.ఎల్.ఆర్.సి ఇంగ్లీషు అనుసంధాన భాషగా ప్రాంతీయ భాషలు, మాతృభాషలు ప్రధాన మీడియాగా ఉండాలని అవగాహన రావడానికి ఆమె కృషి ఎంతో ఉంది. ఢిల్లీలో, నాగ్‌పూర్‌లో, ఆమె, నేను పలుసార్లు కలుసుకున్నాము.

1985 జులైలో నేను రాడికల్ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, వరవరరావు, విరసం, ఎ.ఐ.ఎల్.ఆర్.సి ప్రతినిధిగా, గద్దర్, సంజీవ్ దోలకిష్టు రాజు జననాట్య మండలి ప్రతినిధులుగా 7 విప్లవ సంస్థల ప్రతినిధులుగా అఖిలభారత పర్యటనకు బయలుదేరాము. హైదరాబాద్ నుంచి బయలుదేరి మొదటి మజిలీగా నాగపూర్‌కు చేరుకున్నాం. నాగపూర్‌లో దళితులు నివసించే లక్ష్మినగర్‌లో కిరాయికి ఉంటున్న అనురాధాగాంధీ మమ్ముల్ని సాదారంగా ఆహ్వానించారు. నాగపూర్‌లో ఆంధ్రప్రదేశ్‌లోని విప్లవోద్యమాలపై సాగుతున్న నిర్బంధాన్ని ఖండిస్తూ ప్రజలకు మద్ధతుగా సీతాబర్డీలోని హాలులో పెద్ద ఎత్తున మీటింగ్ ఏర్పాటు చేశారు. ఆ సభలో సుప్రసిద్ధ సంఘసేవకులు బాబా ఆమ్టే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

1985 నాటికి పార్టీలో రెండు పంథాల మధ్య చర్చ మొదలై రెండు శిబిరాలు ఏర్పడ్డాయి. మహారాష్ట్ర మైదాన పార్టీ, ఆంధ్రలోని సత్యమూర్తి వాదన వైపు మొగ్గారు. సత్యమూర్తి 1989లో బహిరంగ జీవితంలోకి రావడంతో మహారాష్ట్ర మైదాన పార్టీ వారు 1990–91లో తిరిగి ఆంధ్రప్రదేశ్ పార్టీతో కలిసి పనిచేయడం ప్రారంభించారు. అందులో అనురాధా గాంధీ సమన్వయ పాత్ర నిర్వహించారు.

అనురాధాగాంధీ మహారాష్ట్ర మైదాన ప్రాంత విప్లవోద్యమ నిర్మాణంలో చురుకైన పాత్ర నిర్వహించారు. ఎంతోమంది రచయితలను, కళాకారులను, విద్యార్థులను, యువకులను కూడగొట్టారు. సాంస్కృతిక రంగంలో విప్లవోద్యమానికి ఆమె చేసిన చేర్పు గుర్తించుకోదగినది. విప్లవ శ్రేణిలో పలు విషయాలపై జాతీయ స్థాయి సెమినార్‌లు నిర్వహించడంలో ముఖ్యంగా జాతుల సమస్య, భారతదేశంలో కులాల సమస్య విషయంలో, ఫెమినిజం విషయంలో, విద్యార్థి, కార్మిక సంఘాల నిర్మాణంలో విప్లవోద్యమం విస్తృత పరుచుకోవాల్సిన అవగాహన గురించి చేపట్టాల్సిన ఆచరణ గురించి నిర్మాణం చేయాల్సిన ప్రజా సంఘాల గూర్చి, ఉద్యమంలో ఆమె చేసిన సూచనలు, విప్లవ శ్రేణులలోకి ఒక కొత్త శక్తి ప్రవేశించడానికి దోహదం చేసింది.

మారుతున్న సమాజంతో పాటు విప్లవ ఉద్యమాల అవగాహన ఆచరణ

ఎదగడానికి, విస్తరించడానికి ఒక మేధావిగా, క్రియాశీలిగా ఆమె నిర్వహించిన పాత్ర చరిత్రాత్మకమైనది. పార్టీ కార్యకర్తలు, నాయకులు పూర్తి కాలం కార్యకర్తలుగా పనిచేసినప్పటికీ తమ ఆదాయ వనరుల కోసం పార్ట్ టైమ్ వృత్తులు చేపట్టి దాని ద్వారానే బతకాలని ఉద్యమంలో పని చేయాలని బలంగా విశ్వసించిన వారిలో అనురాధా గాంధీ ఒకరు. అందుకే ఆమె పూర్తికాలం కార్యకర్త అయినప్పటికీ నాగ్‌పూర్‌లో పార్ట్ టైమ్ లెక్చరర్‌గా 1996 దాకా పని చేశారు. ఇటలీ కమ్యూనిస్టు పార్టీ ఇటీవల పూర్తికాలపు కార్యకర్తల నిర్మాణాన్ని రద్దు చేసి అందరూ ఎవరి పని వారు చేస్తూ పార్టీకి పని చేయాలని తీర్మానించడం చూస్తే అనురాధా గాంధీ ఆలోచనల లోతు, ముందు చూపు ఆశ్చర్యం గొలుపుతుంది. ఆమె కృషి జాతీయ, అంతర్జాతీయ ఫెమినిస్టులు విప్లవోద్యమం పట్ల ఆసక్తి చూపడానికి ప్రేరణ అయింది. గేయిల్ ఓంవెద్ లాంటి సుప్రసిద్ధ ఫెమినిస్టులు, శరద్‌పాటిల్, విలాస్ గోగ్రే వంటి దళిత రచయితల నుండి ఆమె స్ఫూర్తి పొందడంతోపాటు వారు ఆమె స్నేహశీలత నుండి స్ఫూర్తి పొందారు. కోబాడ్ గాంధీని పెళ్లి చేసుకొన్న అనురాధాగాంధీ జీవితంలో డిక్లాస్ కావాలని ఆచరించి చూపింది. అనురాధాగాంధి, డిక్లాస్ కావడంతో పాటు అడవుల్లోకి ఆదివాసుల వెంట నడిచింది. అడవుల్లో, సాధారణంగా అందరిపై మలేరియా దాడి చేస్తుంది. అనురాధాగాంధీ కూడా క్రానిక్ మలేరియాతో మెదడుకు వ్యాపించి చనిపోయారు.

కుల సమస్య విషయంలో అంబేద్కర్ కృషి గురించి, అనురాధాగాంధీ, మాకు మరో కోణంలో నూతన ఆలోచనలు కలగడానికి పురికొల్పారు. మహారాష్ట్రలో అంబేద్కర్ ప్రభావం హెచ్చుగా వుండడం వల్ల ఆమె దాని ప్రాధాన్యతను విప్లవ అవగాహనతో విస్తరింప చేయగలిగారు. మహారాష్ట్రలో మహిళలతో కేవలం మహిళలే ఒక సెషన్ నిర్వహించుకొని ప్రత్యేక సమస్యల పట్ల, ప్రత్యేక తీర్మానాలను, కార్యచరణను రూపొందించిన ఆమె పాత్ర ఇతర ప్రాంతాలకు ఆదర్శమైనది. అలాంటి సమావేశాలు ఇప్పటికీ పలు ప్రాంతాల్లో జరుగుతున్నాయి.

అనురాధాగాంధీ ఒక ఆత్మీయ చిహ్నం. ఆమెలో చిరునవ్వు, ప్రసన్నత, ఆదరత తొనికిసలాడేది. పనిపట్ల ఎంతో మక్కువ. ప్రజలను సమీకరించడం ఆమెకు ఎంతో ఇష్టమైన పని. ఆపనిలో ఉంటూనే కన్నుమూశారు ఆమె.

అడవి మొక్క - చందనగిరి దేవయ్య

అడవి మొక్కలు అన్నీ స్వతసిద్ధంగా ఎదుగుతాయి. వాటి ఆలనాపాలనా ప్రకృతి, తప్ప మరెవరూ చూసుకోరు. బహుజన రచయితలు అడవి మొక్కల్లాంటి వారు. విత్తనం పడ్డ అడుగున కొండరాళ్ళుంటే మట్టి దొరక్క వేళ్ళూనూలోలేక 'నెంగి' పడి పోతాయి. ప్రకృతి సిద్ధమైన బోన్‌సాయి మొక్కల్లా కనపడుతాయి. నిజానికవి బోన్‌సాయికి గురైనవే. సమాజంలోని అవకాశాల లేమి, పొట్టకూటి కోసం పడే తిప్పలు జీవనసారాన్ని తినేస్తే 'నెరిగి' పడుతున్న సృజన జీవులు వాళ్ళు. నాకు అడవి మొక్కలంటే యిష్టం. "నెరిగి" పడిన మొక్కల్లో విత్తనంలా నిక్షిప్తమై దాచుకున్న జీవితానుభవాలు, అభివ్యక్తి, వస్తుస్వరూపం అందులోని అంతస్సారం ఎంత బలమైనవో నిరూపిస్తాయి. పోతనీరుతో పెరిగిన మొక్కలో బోలువుంటే ఎండిపోయి చిగురేస్తూ పెరిగే అడవి మొక్క పీచుతో బలంగా వుంటుంది. చందనగిరి దేవయ్య కరీంనగర్ జిల్లా సిరిసిల్ల తాలూకా కోనరావుపేట అడవుల్లో పుట్టి ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు అడవుల్లో స్థిరపడిన అడవి మొక్క.

అడవి మొక్కలే వృక్షాలై నగరిక నగరాలకు మూలస్థంభా లయ్యాయి. దళిత రచయితల కళాకారుల మేధావుల ఐక్యవేదిక బీజం వీరింట్లోనే పురుడు పోసుకుంది. 1992 జూన్ 21 రాత్రి చందనగిరి దేవయ్య గారింట్లో ఉట్నూరులో రాత్రంతా జరిగిన చర్చల నుండే దళిత రచయితలారా కళాకారులారా ఒకే వేదికపైకి రండి అనే పిలుపు కరపత్రం రూపొందింది. దళిత రచయితల కళాకారుల మేధావుల ఐక్యవేదిక సంస్థాపక సభ్యుల్లో ఒకరవడం చందనగిరి దేవయ్య గారి సాహిత్య అభిలాషను, గాఢతను స్పష్టం చేస్తుంది.

ఆలస్యం చేస్తే ఎప్పటికీ ఆలస్యమే అయ్యే పనులు కొన్ని వుంటాయి. రాయడం, అచ్చేయడం అనేవి ఇల్లుకట్టుకోవడం వంటివి. అందరికీ భావాలున్నా ఇళ్ళు అందరికీ లేవు. కట్టుకునే శ్రమచేసే వారికే ఇళ్ళుంటాయి. అందుకు జీవితంలో కొంత

కేటాయించనపుడే సాధ్యం. చందనగిరి దేవయ్యగారి సాహిత్యం ఇపుడు వెలువడ్డానికి కారణం ఇల్లు కట్టడంలో గల అశ్రద్ధయే. దాదాపు తొమ్మిదేళ్ళ క్రితమే వెలువరించి వుంటే దళిత రచయితల యువతరం కవుల్తో పోటీ పడి రాసే కాలంలో కదిలి వుండేవారు. ఆలస్యం చందనగిరి దేవయ్యగారిని నూతన సహస్రాబ్ది ప్రారంభ కవులుగా కొత్తదనంతో కొత్త కాలాన్నిచ్చింది.

ప్రాణకోటిలో అమ్మను ఎవరితోను పోల్చలేం. సముద్రాన్ని సముద్రంతోనే పోల్చడం సాధ్యం అన్నాడు కాళిదాసు. చిన్నదాన్ని పెద్దదాంతో పోల్చడం సాధ్యం. కానీ పెద్దదాన్ని మరిదేంతోనూ పోల్చలేం. అమ్మను, అమ్మప్రేమను దేన్తోనూ పోల్చలేం. ఏ ప్రేమైనా అమ్మతో పోల్చడమే సాధ్యం. అమ్మ కేంద్రబిందువు. "అమ్మ" కవితా సంపుటి "అమ్మతనం" నిలుపుకున్న ఆర్ద్రకవితా హృదయం. చందనగిరి దేవయ్య గారి హృదయం 'అమ్మతనం'తో నిండి వుంటుంది. అతను ఆశీర్వదించడం, అభినందించడం, అభిమానించడం తప్ప ద్వేషరసం తెలియని అమ్మతనమే అతన్ని అందరికీ ఆప్తున్ని చేస్తుంది. ఆస్తికులైనా, నాస్తికులైనా, హేతువాదులైనా, దళిత బహుజనలైనా చందనగిరి దేవయ్య గారిని అభిమానించకుండా ఉండలేక పోవడానకి కారణం అతనిలోని అమ్మతనమే. ప్రతి మనిషిని తన హృదయంతో ప్రేమించే సహృదయతే చందనగిరి దేవయ్య గారి కవితల్లోనూ సాక్షాత్కరిస్తుంది.

"అనంతలోకాలకు అమ్మ ఆద్యురాలు...
అమ్మ నాన్నను పరిచయం చేస్తుంది...
అమ్మ అతీంద్రియ శక్తి...
జాలువారుతున్న ప్రేమైకమూర్తి
అమ్మ స్పర్శ హత్తుకునే తీరు
కవులు కలాలకు అందనిది."

అమ్మను సమగ్రంగా వ్యక్తం చేయడం ఎవరికైనా అసాధ్యమే. భూమ్మీద వుంటూ భూమి గుండ్రంగా వుందని సమగ్రంగా చూపడం సాధ్యమా?

"ఏ అవతారం ధరించాలన్నా
అమ్మే మాధ్యమౌతుంది.
బ్రహ్మకైనా, సూక్ష్మాతిసూక్ష్మజీవికైనా

శివునికైనా చీమకైనా

అమ్మే కావాలి."

అమ్మయిచ్చిన నవజీవన స్రవంతి

ఎన్నికోట్ల యుగాల అనుబంధమో..."

స్పష్టమైన కవిత్వానికి వ్యాఖ్యానం కన్నా ఆస్వాదనే ఆనందాన్ని స్తుంది.

సమాజంలో సామాజికంగా జీవిస్తూనే నిశ్శబ్దాన్ని మౌనాన్ని కోరుకోవడం సహజం. సామాజికంగా జీవించే వారికే మౌనం, నిశ్శబ్దం ఎంతో అవసరం. సామాజిక జీవితం అక్షరాలైతే నిశ్శబ్దం మౌనం. అక్షరాన్ని అచ్చేసిన తెల్లకాగితం. ధ్యానం, యోగను ఎంతో అభిమానిస్తూ నిత్యం ఆచరించే చందనగిరి దేవయ్య గారికి మౌనం విలువ మరింత తెల్సు. అందుకే యిలా అంటారు.

"నిశ్శబ్దంలోంచి మౌనం ప్రకటమయి

క్రొత్త రూపాలకు మొలకలు పొడిపిస్తుంది...

సమస్త ధరిత్రి మౌనరాగంలోంచి

కొత్త కూనలకు పురుడు పోస్తుంది.

నిశ్శబ్దం అజ్ఞాన ప్రక్రియకాదు విజ్ఞాన అంబులపొది."

సమూహంలో జీవిస్తూనే అంతరంగంలో మౌనంతో ఒక శూన్యస్థితిని సృష్టించినపుడు ఒక జ్ఞాన ప్రవాహంబయల్వెడలుతుంది.

అమ్మపాల ప్రశస్తి గురించి ఎంత చెప్పినా తక్కువే.

"అమ్మ ఎవరి అమ్మైనా అమ్మే"

ఎంత గొప్ప మాటయిది. ఈ మాట నిరంతరం గుర్తుంటే ప్రపంచం ప్రేమమయం అవుతుంది.

"విద్యార్థి నిరంతరం తిరుగుతున్న చక్రం

అది భూభ్రమణం, భూపరిభ్రమణం కూడా"

తన చుట్టు తాను తిరుగుతూ సూర్యునిచుట్టు తిరిగే భూమి విద్యార్థి అనడంలో గొప్ప అభివ్యక్తి ఉంది.

Dalithayugam-2

03-09-09

28

అడవుల్లో అన్నయినా, పోలీసైనా అమ్మతనంతో రెండు కళ్ళుగా వారిని చూసినపుడా ప్రేమ ఎలా ఉంటుందో తెలుగు వచన కవిత్వంలో అరుదైన అభివ్యక్తి "పోలీసు –అన్న" కవితలో కనపడుతుంది. ఒకే తల్లి కన్న కొడుకులు ఒకరు పోలీసై, ఒకరు అన్నయి అడవుల్లో తిరుగుతుంటే ఆ అమ్మతనం ఇద్దర్నీ చూసిన అమ్మ ప్రేమ ఈ కవిత.

"పెరటి మొక్కలో పూసిన పువ్వా!...

జులుంలోని జూలును చూసి

కాకిరంగు తొర్రల్లో నెలవై ఉన్నావా!

నల్లమబ్బు జలదరించి నీ కోసం ఏడుస్తుందా!"

"శ్రోతలు దేవుళ్ళని" రాయడం చందనగిరి దేవయ్యగారికే చెల్లింది. మాటల్లో అందరూ అంటారు. కాని కవిత్వంలో అన్నవారు అరుదు.

"మైకులు మోగుతున్నాయంటే

ఎవరు ఆధారం?...

ప్రజల చెవుల్లోకి నినాదాలు నింపి

దర్వులు మార్చుతూ మార్చుతూ...

మైకు సోదరా

మరిచిపోకు "శ్రోతలు దేవుళ్ళని"

చెప్పడం కన్నా శ్రోతగా వినడంలోనే గొప్పతనాన్ని అనుభవించే వారు తప్ప శ్రోతల సహృదయతను గుర్తుంచుకొని శ్రోతలు దేవుళ్ళనడం సాధ్యమా!

చందనగిరి దేవయ్య గారెంత ఎదిగినా చిన్ననాటి జీవితాన్ని మరిచిపోలేదు. ఆ జ్ఞాపకాలు అతన్ని సరిచేస్తుంటాయి. 'అందం– చందం' కవితలో కవి పల్లె హృదయాన్ని ప్రేమించే తీరు కనపడుతుంది.

"రుబాబుగా నడివీధిలో 'లైట్లు' కొడ్తున్న ముఖం అందమా?

లొట్టచెంపల్లో దిగియున్న మానవీయత

మాడిన పేగుల్లోంచి విన్పిస్తున్న. ఆప్యాయత నిశ్శబ్దాలు

అంబలిలో ప్రతిబింబిస్తున్న క్షుదా నివృత్తి బింబాలు అందరూ!

మోతు కాకుల్లో వడ్డించిన 'గట్కకారం' తో పంచుతున్న

మమతకు ఏ అందాలు చందాలు సరితూగవు".

సోమరితనానికి వీడ్కోలు చెప్పేవారికి ఈ ప్రపంచం వశమ వుతుంది.

"అలా అంగుళం మేరనన్నా కదలకుండా పడివుంటే ఎలా? కొన్నాళ్ళు పోతే నీమీద నానా గడ్డీ మొలచి నీ ఉనికే నీకు తెలిసి చావదు అంటాడు అలిశెట్టి ప్రభాకర్. అలిశెట్టి చందనగిరి మంచి మిత్రులు కూడా. చందనగిరి గారు ఇలా అంటారు.

మేము ప్రపంచ చక్రవర్తుల మవ్వాలని

గీసుకున్న భౌగోళిక పటాల్ని

సూచికతో నైసర్గిక రూపురేఖల్ని

కుచ్చి కుచ్చి బుర్రలకెక్కిస్తున్నాయి"...

సోమరితనమా మమ్ము విడిచి పో..."

అస్పృశ్యతా గేయం కవితలో తన దళిత బహుజన దృక్పథంతో చరిత్రను అవలోకించారు కవి.

"పుట్టుకతో ఎవరూ గొప్ప కాదు

పెరుగుతున్న జ్ఞానంతో

గుణజాల భావం విశ్లేషిస్తే తెలుస్తుంది ఎవరు గొప్పో?

యుగాల చరిత్రను వక్రీకరించిందెవరు?

రాజులకు పొగడ్తలందించి

చంచాగిరి పదజాలంతో

భూగోళమంతా బూజు పట్టించిందెవరు?

... అక్కడ వల్లిస్తున్నవి నిజంగా లోక కళ్యాణ మంత్రాలే అయితే

అంటరాని తనమెందుకు?

ఊరి బయట గుడిసెలెందుకు?

ఆరుబయట గ్లాసులెందుకు?

చెట్లకింద చదువులెందురు?"

ఇంత స్పష్టమైన ఈ కవితను ప్రతి హిందువు ప్రతి హిందుత్వ సభల్లో, గోష్టుల్లో చదవాలి చదివి విన్పించాలి. హృదయాంతరాళాల్లో మార్పు రావడానికి ఆరెసెస్, బి.జె.పి., ఎ.బి.వి.పి. పరివారం ఇలాంటి వందలాది కవితల్తో పలు సంకలనాలు ప్రచురించి ఇంఇంటా భరత మాత బొమ్మ అతికించినట్టుగానే ఈ ఇంటింటా ఆ పుస్తకాల్ని చేరవేయాలి.

'సరిహద్దు సిపాయి' కవికి గల ప్రేమ వ్యక్తీకరిస్తుంది. 'అబంళ్యుడు' కవిత ధ్యానచింతనా గాఢతను సంతరించుకొంది. ఆస్తికత్వమో, నాస్తికత్వమో లేదా తెలియని 'అచింత్యుడు' ఒక శూన్యవాద పూరకంలా కన్పిస్తుంది.

"కవికి మరణం లేదు" కవిత కవి ఆశయ ప్రకటన. అయితే ఈ శతాబ్దంలో కవులెపుడూ సమాజానికన్నా ఎంతో వెనబడే నడిచారు. ప్రజలతో కల్సి నడవడానికి కూడా బతుకు భద్రత భయమే. భారత రాజ్యాంగం కన్నా ఎంతో వెనకబడిన చూపులో రచయితలు కొనసాగడం ప్రజల దురదృష్టం. కవికుండాల్సిన విస్తృత కవితా వస్తువును చందనగిరి పోగు పోశారు. భూస్వామ్యమో, గ్లోబలైజేషన్, రాజ్యహింసో, హిందూ వాదమో, స్త్రీవాదమో, దళిత వాదమో, ఇలా కొన్నిటికే పరిమితమై పోతున్న రచయితలకు నిజంగానే సామాజిక చైతన్యం ఉన్నట్టేనా? సమస్త మానవాళికి, తన గొంతును ఎరువిచ్చేవాడే నిజమైన కవి. విమర్శించడమే కవిత్వంగా భ్రమిస్తే "సమాజాన్ని ఏ కీలు కాకీలు విరిచే వాడేం కవి" అన్న నిర్వచనం స్థిరపడుతుంది. సమాజాన్ని కవి ఒక అమ్మలా ప్రేమించాలి. అందుకే ఈ కవి ప్రపంచ పౌరుడిగా కవినై అభ్యర్థిస్తున్నా" అంటూ కవిత రాశారు.

"ఈ శతాబ్ది ఆరంభం నుండైనా

అంతర్జాతీయ మానవ సౌధంలో

మానవులంతా మణిదీపాలుగా వెలగాలని

మమతల కోవెలలు నిర్మించాలని

ప్రేమతత్వం తన కవితా దృక్పథం చేసికొన్నారు. 'స్నేహం' కవితలోనూ ప్రేమ స్నేహానికి మూలమనే దృష్టి చూడవచ్చు.

దోస్త్! నీవు కల్తీలేని నేస్తానివి

నీకు తరతమ భేదం లేదు –ఎల్లలు అంతకన్నా లేవు

పాడుదు మన స్నేహగీతి

పాల తెలుపు ఉండువరకు –సూర్యచంద్రులుండు వరకు"

ఈ కవితా సంపుటిలో నేటి కొందరి వచన కవిత్వానికి భిన్నమైన కవితా వస్తువు, కథా కథన కవితాశైలిని సులభంగానే గుర్తించవచ్చు. కథా కథనాన్ని వదిలేసిన వచన కవిత జీవితం కన్నా భావజాలానికి ప్రాధాన్యతనిచ్చింది. తద్వారా కవితా వస్తువులో జీవితం తగ్గిపోయింది. పల్లెల్నించి జ్ఞాపకాలు మోసుకొస్తున్న కవుల్లో ఇంకా జీవితం కథా కథన కవిత్వంగా కొనసాగడం సజీవంగానే కొనసాగుతున్నది. చందనగిరి దేవయ్య గారి కవితల్లోనూ కథలాంటి కవితా వస్తువు తలగా కనపడుతుంది. మనిషి, మానవత, బాధ హృదయం, కరుణ అతను పట్టించుకున్నాడు కనుక అతని కవితా వస్తువు విస్తృతిని, వైవిధ్యాన్ని సంతరించుకొంది. అన్నదమ్ముల గురించి రాసినా, ఎల్లయిసీ ఏజెంటు గురించి రాసినా, కడుపు తీపి గురించి రాసినా శీలం గురించి రాసినా, భార్యాభర్తల గురించి రాసినా, కళ్ళ గురించి రాసినా, కలుగుల గురించి రాసినా, కుల రక్కసి గురించి రాసినా అంతస్సూత్రం మానవతా విలువలే.

ఆలస్యంగా వస్తున్నా ఆధునిక కవితా అభివ్యక్తిని కవి అలవరచుకున్న తీరు ఆశ్చర్యమని పిస్తుంది. తనను తాను సాధనతో మార్చుకొని ఎదిగించుకునే ఈ కృషి, ఇంకా ముందుకు సాగుతుందని ఈ కవితా సంపుటి మనకు అభయం ఇస్తుంది.

దళిత రచయితల కళాకారుల మేధావుల ఐక్యవేదిక వ్యవస్థాప కుల్లో ఒకరైన చందనగిరి దేవయ్య గారి కవితా సంపుటి అమ్మతనంలో నిండివుండి కాస్త ఆస్తికత్వంతో వున్నప్పటికీ దళిత బహుజన కవిత్వంలో మరో పార్శ్వాన్ని ఇది మన ముందుంచుతుంది. ఇజాల పాత్రంల్లో పోయకుండా జీవితం, అనుభవాలు కలబోసి మానవతా విలువల్తో రంగరించిన సామాజిక వాస్తవికత యిందులో కనబడుతుంది. ఆస్తికత్వం సామాజిక వాస్తవికత కాకపోయినప్పటికీ ఆచరణాత్మక వాస్తవికతగా కొనసాగుతున్నది. ఆస్తికత్వంలోనూ దళిత బహుజన పక్షం వహించడం ఈ కవితల్లోని ప్రత్యేకత. ఆదిలాబాద్ అడవి మొక్కల నుండి మరో మంచి కవితా సంపుటి వెలువడ్డం తెలుగు సాహిత్యం, తెలంగాణా సాహిత్యం స్వాగతించాల్సిన పరిణామం. మిత్రుడు చందనగిరి దేవయ్య గారు మిగతా రచనల్ని కూడా ప్రచురిస్తారని ఆశిస్తూ అభినందిస్తున్నాను.

Dalithayugam-2

03-09-09

30

(అడవి మొక్కలు మహావృక్షాలుగా ఎదుగుతాయి. మహావృక్షాలన్నీ అడవి మొక్కలే.)

బి.ఎస్.రాములు

జగిత్యాల

12-1-2002

అక్షరసూర్యుడు అలిశెట్టి ప్రభాకర్

8వ వర్ధంతి సభ రోజున

కె. రామలక్ష్మణ్ దళిత పాటలు ఒక చారిత్రక నేపథ్యం

1. చరిత్రలో భాగంగా అతడు

సాహిత్యాకాశంలో ఎవరీకొత్త వెలుగు అని కొందరికి ఆశ్చర్యంగా ఉండవచ్చు. నిజంగా కూడా కె. రాంలక్ష్మణ్ సాహిత్యాకాశంలో కొత్త వెలుగే. అయితే అతను సామాజిక ఆచరణలో యిరవై ఏళ్ళనాటి పాత పంట. మరింత స్పష్టంగా చెప్పాలంటే బడిపిల్లడి జీవితం నుండే అతని సామాజిక అచరణ మొదలైంది.

మొదటిసారిగా కె. రామలక్ష్మణ్ పాటలు “కరీంనగర్ జిల్లా దళత పాటలు”లో ఒకే చోట కొన్ని దర్శనం ఇచ్చాయి. అప్పట్నించి ఆ పాటలు జిల్లా సరిహద్దులు దాటి విస్తరించడం మొదలైంది. కె.పి. ఆశోక్ కుమార్, జయధీర్ తిరుమల్ రావు గారలు కూర్చిన “దళిత గీతాలు” కూడా ఇతని పాటలు కొన్ని చోటు చేసుకొన్నాయి.

1993 డిసెంబర్లో జరిగిన ఆంధ్రప్రదేశ్ దళిత రచయితల కళాకారుల మేధావుల ఐక్య వేదిక కరీంనగర్ జిల్లా మహాసభలో “కరీంనగర్ జిల్లా దళిత పాటలు” పుస్తకం డా॥మలయశ్రీ చే అవిష్కరించబడింది. ఆ మహాసభలోనే కె. రామలక్ష్మణ్ దరకమే ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యాడు. దాంతో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడయ్యాడు.

తన చరిత్ర తాను వెతుక్కోకుండా కొత్త చరిత్ర నిర్మించలేరు. ఆగిపోయిన క్రమాలను కూడా చర్చించినపుడే చరిత్రను కొత్తగా పునర్ నిర్మించి యువతరాలకు అందించడం సాధ్యం. అందుకొని వర్తమాన సామాజిక అవసరాల రీత్యా చరిత్ర నిరంతరం తిరగరాయబడుతుంది. ప్రతి జిల్లా స్థాయిలో తాలూకా స్థాయిలో ఈ పని చేయాల్సి ఉంది. అందుకు యిక్కడి చరిత్రను గుర్తు చేస్తూ ప్రారంభిస్తాను. సాదాగా

కనబడే విషయల్లోంచే సాహిత్య చరిత్ర ఎలా వెల్లడి అవుతుందో కూడా దీన్లో గమనించవచ్చు.

కరీంనగర్ జిల్లా నుండి డా॥ సినారే, తాడిగిరి పోతరాజు, సి. హెచ్. రాజలింగ కవి (సిరిసిల్ల), మేర మల్లేశం, తిరుపతయ్య, మిట్టపెల్లి రాజయ్య, అందె వేంకటరాజం, రాజన్న కవి, చొప్పకట్ల చంద్రమౌళి, పురాణం రామచంద్ర, కనపర్తి లక్ష్మీనర్సయ్య, వడ్డెపల్లి కృష్ణ, జక్కని వేంకటరాజం, డా॥ మలయశ్రీ, దశరథ్, సరిపెల్లి కృష్ణారెడ్డి, కుడిక్యాల లింగయ్య, జింబో, జాకంటి జగన్నాథం, వజ్జల శివకుమార్, వానమామలై సోదరులు, గోలి కృష్ణహరి, చంద్ర ఆంజనేయులు, గుండేటి రమేష్, మిద్దె రాములు, నూకలమర్రి రాజేశం గౌడ్, ఆత్మారాం, సురమౌళి, గూడూరి సీతారామ్, ఎన్నెం సత్యం, ఎ.ఆర్. భాను, రాస భూమయ్య, బి.ఎస్. రాములు, అల్లం సోదురులు, కాలువ మల్లయ్య, ఆడెపు లక్ష్మీపతి, జి. రాములు, కె.వి. నరేందర్, సుద్దాల ఆశోక్, బైరి నర్సయ్య, అనుమాండ్ల భూమయ్య, దూడం నాంపల్లి, యాదగిరి, విజయ కుమార్, వాసాల నర్సయ్య, రాంభోజ, బి. దామోదర రావు, జె. బాపురెడ్డి, పి. యశోదా రెడ్డి, రామసింహకవి వంటి ఎందరో రచయితలున్నారు. నేను చిన్నపుడు ఎందరో జానపద కళకారుల పాటలను విన్నాను. ఎన్నో బుర్రకథలు, ఒగ్గు కథలు, కళారూపాలు చెప్పిన వారి పేర్లేవీ దొరకడంలేదు. వారిది సాహిత్య చరిత్ర కాదా ! ఎందుకు వారిని సాహిత్య చరిత్రలో రికార్డు చేయ నిరాకరించాం !

చదువుకున్నతరం సంప్రదాయిక జానపద, సాహిత్యకారులను గుర్తించ నిరాకరించింది. నిజానికి ప్రజల సాహిత్య అవసరాలను తీర్చింది. ప్రజల యిళ్ళకు వెళ్ళింది వారి సాహిత్యమే. అకడమిక్ విద్యా స్థాయి కొలతల్తో సాహిత్యాన్ని కొలిచే దృష్టి మొదలయ్యాక యిలా జరిగింది. నిజానికి అకడమిక్ విద్యవల్ల మేధస్సు పెరిగి, సృజనను మింగింది. నిజమైన “సృజన” అకడమిక్ వాసనలు లేని పల్లెల్నించే ఎదుగుతూ వస్తోంది. ఉదా॥కు పైనా పేర్కొన్న వారిలో చాలా మంది మొదటి తరం విద్యావంతులే.

తెలుగులో తెలంగాణా సాహిత్యం, సామాజిక అభివృద్ధి వెనకబడి పోవడానికి సాగు నీటి వనరులను తిరిగి సద్వినియోగంలోకి తేకపోవడం వల్ల కలిగిన కరువులు, పేదరికం ఒక కారణం. అయినా యిదే ప్రాంతం నుండి దాశరథి సోదరులు, కాళోజి, వరవర రావు, సినారే, తదితరులు ఎదిగి మరికొన్ని కులాలవారు ఎదగక పోవడానికి కారణం ఏమిటి ? ఎస్సి, బిసీ, ఎస్టీ కులాల పట్టిక లోకి నేడు వర్గీకరించబడిన –

వేల ఏళ్ళుగా కొనసాగుతూ వచ్చిన జానపదకళలు సాహిత్యం, జానపద కళల కులాల కళాకారులు, సాహిత్య కారులు ఆధునిక సాహిత్య కళారంగాల్లో తమ వాటా పొందలేక పోయారు. శారద కాల్లు, చిందు మాదిగలు, ఒగ్గు కథకులు, వీధి బాగోతాల వాళ్ళు, ఎల్లమ్మ కొలుపుల వాల్లు, జాంబవ పురాణకులు, జంగమ, దాసరులు, పాండవులోల్లు, బుడబుడకలవాళ్ళు, ఎరకలవాళ్ళు, దొమ్మరివాళ్ళు, గోండ్లు మొదలగు ఎన్నో కళాకారుల కులాల వాళ్ళు, ఆధునిక సాహిత్యంలోకి ఎదగలేదు.

అగ్రకులాలు కాపీ కొట్టి సొంతం చేసుకొని తమవని చాటి పత్రికల్లోకి, రేడియో, సినిమాల్లోకి ఎగబాకారేగాని ఆ జానపద కులాల కళాకారుల్ని పైకి రానీయలేదు. వారిది రాళ్ళెత్తిన కూలీలుగా మార్చి చరిత్ర రికార్డు చేయ నిరాకరించి అనామకులుగా మార్చేశారు. వారిని వెలికి తీయడానికి తిరిగి అకడమిక్ స్థాయిలో బిరుదు రామరాజు, యశోదా రెడ్డి, జయధీర్ తిరుమలరావు, నేదునూరి గంగాధరం, లక్ష్మీకాంత మోహన్, రుక్నుద్దీన్, సంగనభట్ల నర్సయ్య, యం. లక్ష్మయ్య, తదితరులు అవసరం అయ్యారు. బహు జనకులాలు అగ్రకులాల్నించి తీసుకున్నపుడు దాన్ని గురు భావనతో రికార్డు చేశారు.

అలాగే వేమన, పోతులూరి, కబీరు, కాళోజీల కోవలో సమాజంలోని అన్యాయాల్ని చీల్చి చెండాడుతూ తత్వాలు పాడి, అచ్చేసి పల్లె పల్లెనా ప్రాచుర్యం పొందిన కీ.శే. రామసింహకవి (రాఘవపట్నం) గురించి యితర ప్రాంతాల వారికి తెలియదు. ముప్పయి ఏళ్ళయినా గడవక ముందే యిక్కడి యువతరానికి కూడా తెలియకుండా పోయింది.

పేదరికం, నిరుద్యోగం, చిన్నకులం, చిన్న వృత్తుల్లో, చిన్న ఊర్లల్లో ఉండడం అనేవే యిందుకు కారణాలా ? అవే కారణాలైతే వేల ఏళ్ళుగా యింతకన్నా తక్కువ అర్థిక, సాంఘిక స్థితిలో మహోన్నత జానపద కళలు, సాహిత్యం, సంగీతం ఎలా అబివృద్ధి చెందించగలిగారు ? అటాంటి కళల వారసులైన దళిత బహుజనులు ఆధునిక సాహిత్యంలో మాత్రమే ఎందుకు వెనకబడి పోవాల్సివచ్చింది. వీటి చారిత్రక మూలాన్ని తెల్సుకోవలసి ఉన్నది.

జానపద సమాజం నుండి ఆధునిక సమాజంలోకి పరిణామం చెందడం అనేది ఒక పెద్ద ప్రక్రియ. ఈ విషయాన్ని కమ్యూనిస్టు, నక్సలైట్లు, హిందూత్వవాద ఉద్యమాలు గుర్తించలేక పోయాయి. ఆ ప్రక్రియ కొనసాగేందుకు చేయాల్సిన కృషి చేయనిరాకరించారు వాళ్ళు. ప్రభుత్వమూ, టెక్నాలజీ వారికి చేయూతనీయలేదు. ఆ ప్రక్రియ ఎలాంటిది ? అది పంచె కట్టు నుండి ప్యాంటులోకి మారడం లాంటిది. పిలక జుట్టునుండి కటింగ్ చేసుకోవడానికి మారడం లాంటిది. తొమ్మిది గజాల గోచీ చీరనుండి ఆరుగజాల గోచీలేని చీరకు మారడం లాంటిది. పంచెకట్టు నుండి ప్యాంటులోకి మారడానికి మధ్య ఆలోచనా పరమైనా పరిణామం కొంత జరుగుతుంది. ఎడ్లబండి నడిపిన స్త్రీలు సైకిల్ నడపడానికి మారడం లో ఆలోచనా పరమైన పరిమాణం కూడా కొంత ఉంది. ఆ పరిణామానికి సిద్దమై అధునిక పారిశ్రామిక వ్యవస్థ అందించే సైన్సు టెక్నాలజీలను తమ కనువుగా మార్చుకొని అదే సమయంలో వాటికనువుగా తమను తాము సవరించుకొని ఎదిగేవారికి వాటి తాలూకు అవకాశాలు అంది పుచ్చుకోవడం సులభమవుతుంది. దాన్ని అందిపుచ్చుకుంటే అంతదాకా వెనకబడినవాళ్ళు కూడా యితరుల కన్నా ముందుకు సాగుతారు. ఉదాహరణకు పల్లె ప్రజలకు పద్య గ్రంథాల్తో అచ్చు యంత్రం వచ్చే దాకా పరస్పర సంపర్కంలేదు. కాని అచ్చేశాక అవి పాత్య గ్రంథాలుగా వారి మీద రుద్దబడ్డాయి. దగ్గరయ్యాయి జానపదులు దృశ్య, శ్రవణ టెక్నాలజీ కనువుగా, అచ్చు కనువుగా తమను తాము మలుచుకొని ఎదగడం ఎలానో తెలియక వెనకబడిపోయారు. అగ్రకులాలు మనువు చెప్పిన పాత కుల వృత్తులకే పరిమితమై వుంటే జానపద కులాల ఎదుగుదల సాఫీగానే సాగి, ఆధునిక అభివృద్ధి ఫలాలన్నీ శూద్ర, అతి శూద్ర కులాల హక్కు భుక్తాలయి ఉండేవి. ఈ విషయాన్ని పసిగట్టి కందుకూరి, గురజాడ, త్రిపురనేని రామస్వామి, కట్టమంచి రామలింగారెడ్డి, దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, శ్రీ పాద తదితరులు తమతమ కులాలను మేల్కొలిపి ఆధునిక అభివృద్ధి వెంట పరిగెత్తించారు. తద్వారా రాజరికాల దాకా ఫ్యూడల్ విధానంలోని మేధో కార్మిక వర్గంగా సమాజానికి సకల సంపదలు సృష్టించి అందిస్తూ వస్తున్న చిల్లర కులాలకు చెందిన, లాభసాటి కాగల ఆధునిక వృత్తుల్ని ప్రక్రియల్ని, సాహిత్య కళా రూపాల్ని ఎగరేసుకుపోయి ఆధిపత్యం సాధించుకున్నారు.

అగ్రకులాల వాళ్ళు పాత కుల వృత్తుల్ని వదిలి యితర వృత్తుల్లో చేరడం వల్ల దళిత బహుజన కులాలకు ఘోరమైన ఆపద సంభవించింది. బహుజనులు కులవృత్తుల ద్వారా ఉత్పత్తి చేసే సరుకులు సేవలు పారిశ్రామిక ఉత్పత్తులో మార్కెట్ కోల్పోయాయి. ఇది మొదటి నష్టం. ఆ పారిశ్రామిక ఉత్పత్తి రంగాల్లోని లాభసాటి, గౌరవనీయ, వృత్తుల్ని అగ్రకులాలు ఆక్రమించడం రెండవ నష్టం, లాభసాటి గాని, నీచ, చిన్న వృత్తులకే బహుజనులు పరిమితం కావాల్సి రావడం మూడవ నష్టం.

ఫ్యూడల్ వ్యవస్థలోని వ్యవసాయ, సంప్రదాయ వృత్తి వర్గాలకు పారిశ్రామికీకరణ వల్ల జరిగిన నష్టం ప్రపంచంలో మరెవరికి జరగలేదు. ఇతర దేశాల్లో వృత్తిపని వర్గాల నుండే నూతన పారిశ్రామిక సైన్సు టెక్నాలజీ అందుకొని ఎదిగే క్రమం సాగింది. ఆ క్రమాల పరిణామంలో భాగంగానే వడ్రంగం వృత్తిగా గల అబ్రహాం లింకన్ అమెరికా అధ్యక్షుడయ్యాడు. చెప్పులు కుట్టే వృత్తిలోగల స్టాలిన్ సోవియట్ రష్యా అధినేత అయ్యాడు. ప్రపంచంలో ఎక్కడాలేనంత పెద్ద “నేత పరిశ్రమ” యిక్కడ ఉండేది. కబీరు, గురునానక్, చేనేత కులాల్లో పుట్టి ఎదిగినవారే. ఆధునిక భారతంలో చేనేతకులాల నుండి అబ్రహం లింకన్‌లు ఎదగాల్సి ఉండగా ఆ వృత్తిలోకి...... అమ్ముకొని తిని బలిసి బట్టల మిల్లులు పెట్టి చేనేతను దెబ్బతీసిన బనియా బిర్లాల తరపున మరో బనియా గాంధీ ఎదిగాడు. అక్కడ జర్మనీలోనూ చేనేత వృత్తుల్నించి ఆధునిక కార్మికులు, భావజాల కర్తలు ఎదిగాల్సి ఉండగా చేనేతను దెబ్బతీసిన నేతమిల్లు యజమాని అయిన ఎంగెల్స్-ఎంగెల్స్ ఆర్థిక ఆసరాతో మార్క్సు ఎదిగారు.

శ్రమను, సముచితంగా గౌరవించకపోవడం ప్రపంచం అంతటా ఉంది. ఆధునిక వృత్తుల్ని అందిపుచ్చు కున్నప్పటికి, అగ్రకులాల ఈ దృక్పథం మారలేదు. తద్వారా పనిని నీచంగా చూసే సంస్కృతి మార్చబడింది. దేశంలో యింత అవినీతి, అక్రమాలు పెరిగి అధోగతి పాలు కావడానికి పని చేయకుండా సంపాదించాలకునునే అగ్రకుల నీచ సంస్కృతి ప్రధాన కారణం.

పాత రాజరిక భూస్వామ్య గిరిజన జానపద సమాజం నుండి కొత్త సైన్సు, విధ్య, కళలు, అందుకునే పరిణామాల్ని అడ్డగించడం ద్వారా పాలక వర్గాల నుండి గాంధీ, ఎంగెల్స్, మార్క్సులు భావజాల కర్తలుగా నేతలుగా ఎదగడం సాధ్యపడింది. ఆధునిక సమాజంగా బహుజనులను ఎదిగించే యంత్రాంగం, దృక్పథం, సంస్థలు, సంస్కృతి కొరపడ్డాయి. తద్వారా కోట్లాది ప్రజలు వృత్తులు, ఉపాధి కోల్పోయారు. సాహిత్య కళారంగాల్లోనూ యిదే సాగి ఆధునిక అభివృద్ధి అందుకోలేక జానపద కళలు, కళాకారులు కులాలు, కళాకారులు, సాహిత్యకారులు అక్కడే ఆగిపోయి శిథిలమవుతూ బిచ్చగాల్లుగా మారడం జరిగింది. రేడియో, టీవీ, సినిమా రంగాల్లో, పత్రికల్లో, జానపద కళాకారులు, సాహిత్య కారులు వృత్తి ఉద్యోగాల్లో లేకపోవడం ఇలా సాధ్యమయ్యింది. అగ్రకులాలు చొరబారని రంగాల్లో అయా వృత్తి కులాల నుండే బూర్జునా సెక్షన్ ఎదుగుతూ వచ్చింది. కల్లుగీత, సారా, వ్యాపారంలో గౌడ పెట్టుబడిదారులను ఇందుకు ఉదహరించవచ్చు. పద్యాలు రాసుకొని బతికేవాళ్ళు రేడియో, సినిమా రంగాలను హై జాక్ చేసి ఉండక పోతే జానపదులే రేడియో, సినీ పాటల రచయితలుగా గాయకులుగా సహజ క్రమంలోనే ఎదిగి ఉండేవారు. అందుకు ఉదాహరణ వందేమాతరం శ్రీనివాస్, గూడ అంజయ్య, జి.వై. గిరి, వంగపండు, మాష్టార్జీ, జాలాది, కొనరాజు మొదలగువారు.

అదంతా ఆధునికత ప్రవేశించిన తొలినాటి గురించిన మాట. ఆధునికత ప్రవేశించిన తర్వాత కూడా అదే క్రమం ఎందుకు సాగింది. పల్లెపల్లెనా ఎదిగిన మొదటితరం విద్యావంతులు, అంబేద్కర్‌లా తనచట్టూ గల సమాజన్ని పట్టించుకొంటే అది సాధ్యమై ఉండేది. ముందు ఎదిగినవారు తమ తర్వాతి తరాలకూ, తమ చుట్టూ గల వారికి ప్రేరణను, తెలివిని, కలిగించి వారు ఎదగడంలో నైతిక కర్తవ్యాన్ని నిర్వహించి తమ వారసత్వాన్ని నిర్మస్తూ పోయే కృషి చేయాలి. అది జరిగిన చోట అభివృద్ధి విస్తృతమైంది. అది జరిగని చోట అభివృద్ధి అగిపోయింది.

కొంచెం ముందుగా ఆధునిక విద్య, ఉద్యోగ, అభివృద్ధి క్రమాలను అందుకున్న వారి కళ్లు నెత్తిమీద ఉండేవి. కాళ్ళు భూమ్మీద అనేవి కావు. నిలువెల్లా గర్వం అహంకారంతో తనకులంలో, ఇరుగు పొరుగుతో, మీరెక్కడ, మేమెక్కడ అంటూ దూరంనెట్టి తాము ఒక శిష్ట వర్గంగా రూపొందారు. వీరికి తమ స్వార్థం, ఆధిపత్యం తప్ప మరింకే ప్రపంచమూ పట్టదు. కనీసం తమ ఉమ్మడి కుటుంబం లోని సభ్యులనైనా తమతో పాటు ఎదిగించకుండా వ్యక్తి కుటుంబాలుగా విడిపోయారు. ప్రతి తరంలో ఇలాంటి స్వార్థపరుల వల్లే గణం, తెగ, కులం, విడి కుటుంబాలుగా విడిపోయాయి. ఆ నిర్మాణాల్లో కొనసాగే సోషలిజం విచ్ఛిన్నకులు ఈ వ్యక్తి స్వార్థపరులే. వ్యక్తి స్వార్థపరులంతా ఒక వర్గంగా కులంగా జమై కొత్త కులాల్ని సృష్టించి అగ్రకూలలయ్యారు. (“భారతదేశంలో కులాలు” – అంబేద్కర్)

ఆధునిక సమాజంలో ఎదిగిన యిలాంటివారు తమ తర్వాతి తరాలకు చేయూత నీయలేదు. వారిపట్ల అహంతో ప్రవర్తించి ఇన్ఫీయారిటీ కాంప్లెక్సుకు గురిచేసేవారు. ప్రతికులంలో తయారైన యిలాంటి విభీషణ వర్గమే రిజర్వేషన్లలో అదాయ పరిమితి ఉండొద్దని గోలచేస్తోంది. స్వార్థానికి పరిమితమైన వీరిని సొంత కులమే నమ్మడంలేదు. తద్వారా సమాజనికి నాయకులుగా ఎదిగే అవకాశం కోల్పోయారు. నిజానికి స్వార్థం వీడి సమాజానికి నాయకత్వం వహించి ఉంటే యింతకు ఎన్నో రెట్లు ఎదిగేవారని రామమనోహర్ లోహియా రచనలు స్పష్టం చేస్తాయి. వీరి కర్తవ్యాలు నిర్వర్తించి ఉంటే ఆంధ్రా గోబ్యాక్. ప్రత్యేక తెలంగాణా ఉద్యమాల

అవసరమేర్పడి ఉండేదికాదు. విద్య, ఉద్యోగ, ఉపాధి, వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో యిక్కడ మొదట ఎదిగినవారు మలితరాలకు భవిష్యత్ మార్గదర్శకం చేయకపోవడమే అందుకు ప్రధాన కారణం. సాహిత్యంలోనూ అదే జరిగింది. ఫ్యూడల్ అగ్రకుల అహంకారం పాత్రయిందులో తక్కువైందేమీకాదు.

కె. రామలక్ష్మణ్ చిన్నప్పటి నుంచీ పాటలు పొద్దంలోవేల్పుల రాజనర్సు ఒక ప్రేరణ. రాజనర్సు నా క్లాసుమేటు. అతన్ని చూసి నేను కూడా పాటలు రాశాను. ఇది 1962-64ల నాటిమాట. రాజనర్సుకు అతని అన్న వేల్పుల పెద్దిరాజం ప్రేరణ. పెద్దిరాజం మాకు పాఠశాల జీవితంలో ఒక టార్జాన్. అతను దప్పుకొట్టి దయాస్ మీద పాట అందుకుంటే మా గుండెలు ఉత్సాహంతో దడదడలాడేవి. అతను ఎన్నో జానపద గీతాలు పాడేవాడు. ఇపుడతను రిజర్వు పోలిసు సి.ఐ.గా పనిచేస్తున్నాడు. కాలక్రమంలో అతను భక్తిమార్గంలో పడి 350 పాటలురాశాడు. పుస్తకాలుగా ప్రచురించాడు. శ్రీ శివరామకృష్ణ భజనమండలి ఏర్పాటు చేసి హైద్రాబాదు, వరంగల్, కరీంనగర్ జిల్లాలో 130 శాఖలుగా విస్తరింప జేశాడు. నేను అన్వేషిస్తూనే ఉన్నా మొన్నటిదాకా అతని గురించి తెలియలేదు. నేను చేప్పేదాకా రామలక్ష్మణ్‌కూ తెలియదు. చూడబోతే వారి ఇళ్ళ మధ్య కిలోమీటరుదూరం ఉండదు. ఇంత సన్నిహితంగా ఉన్న మలయశ్రీ పది నవలలు అచ్చేశాడని తెలియదు. పక్కనే సిరిసిల్లాలో ఉండిన కృష్ణ అచ్చేసిన పాటల పుస్తకాలు ఒక్కటీ నేను చూడలేక పోయాను.

ఒక్కమాటలో చెప్పాలంటే ఉద్యోగ బదిలీలు, తరాల అంతరాలు, భావజాల పోరాటాల గ్రూపులు నిర్మించుకున్న అడ్డుగోడలు, దగ్గరి మనుషుల్ని ఎంతోదూరం చేశాయి. మనుషుల్ని ఒక్క దగ్గర చేర్చే సాహిత్య చరిత్ర నిర్మాణం జరక్కపోవడమే అందుకు కారణం, ఇపుడది రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాస్థాయిలో డా॥ మలయశ్రీ పి. హెచ్‌డి. లా జరగాల్సి ఉంది. ఈ జిల్లాలో యింతమంది రచయితలున్నా యువతరానికి వారి స్ఫూర్తి అందుతోందా ! అందితే ఆ యువరచయితలేరీ !

చిన్న వయస్సులోనే రచయితలుగా, కళాకారులుగా ఎదిగినవారు కాలక్రమంలోచాలామంది ఎందుకు కనుమరుగయ్యారు. ఏ వృత్తిలో ఉన్నా సాహిత్య కళా రంగాల్లో రాష్ట్రస్థాయికి ఎదగడానికి కావలసిన శిక్షణ, అభ్యాసం, ప్రోత్సాహం కరువై అలా జరిగింది. ఇంకా జరుగుతోంది. నాలుగు పద్యాలు గీకి తానే మహాకవి ననుకునేవాడు యితరులను ప్రోత్సహించడం ఎలా సాధ్యం ? ప్రోత్సహించాల్సిన సంస్థలు జిల్లా కేంద్రాలకు పరిమితమై పల్లెల్లోని దళిత, బహుజనుల సృజనను వెలికి

తీయలేక పోయినవి.

నాతో జంటకవిగా కొంతకాలం ఉన్న శ్రీ కోట శ్రీరంగం 1967-70ల్లోనే ఎన్నో కవితలు, కథలు, నవలలు రాశాడు. దాసరి రామస్వామి నవలలు రాసినా బతుకు తెరువు గెలుచుకోవడం కోసం రచన ఆగిపోయింది. భీమనాతి ప్రభాకర్ లోని జలను పట్టేవారు కరువయ్యారు. ముదుగంటి నర్సింహారెడ్డి 1963లో "ప్రేమ జీవుల అదర్శ త్యాగాలు" నవల రాసి ఆగిపోయాడు. సినారే విద్యా గురువు జి. రాములు 1952-54 లో ప్రగతి శీల భావాల్తో రంగనాయకమ్మ, వట్టికోట ఆళ్వారు స్వామి, దాశరథి రంగాచార్య, రావిశాస్త్రి, తదితరుల కన్నా ముందే రెండు నవలలు రాసి అచ్చేశారు. జగిత్యాల డివిజన్ పరిధిలో యిలా ఎంతోమంది 1960లో పత్రికల్లో స్త్రీ రచయితలు విజృంభించే కన్నాముందునుండే కథా, నవలా, సాహిత్యంలో కృషి ప్రారంభమైంది. ప్రోత్సాహం కరువై తెలంగాణా ప్రజలకోసం తీసే పత్రికలు కూడా కరువై ఆ క్రమం ఆగిపోయింది. తెలంగాణా పెట్టుబడి దారులకు లాభాపేక్ష తప్ప ప్రజాస్వామ్యం పట్టనందున సారా, తునికి ఆకు, వ్యాపారం, సినిమాహాల్లు, ప్రయివేటు బస్సులు, రియల్ ఎస్టేట్స్ తదితర వ్యాపారాలు తప్ప పత్రికా రంగం పట్టలేదు. నిజాం కాలంలోనే గోల్కొండ, మీజాన్ లాంటి పత్రికలు వెలువడగలిగినపుడు స్వాతంత్ర్యానంతరం మరింత విస్తరించకపోగా, ఉన్నవి ఆగిపోవడం కోస్తా పెత్తనమే కారణం అనుకోవడం అసలు నేరుస్థులను వదిలివేయడమే.

బోయిన పెల్లి వెంకట రామారావు లాంటి స్వాతంత్ర్య సమర యోధులు, గాంధేయవాది, గ్రంథాలయోద్యమంతో భాగంగా సారస్వత జ్యోతిని వెలిగించి, కరీంనగర్ జిల్లా రచయితల సంఘం ఏర్పరిచి కొన్ని దశాబ్దాలుగా దాన్నంటిపెట్టుకొని యువ రచయితలను ప్రోత్సహిస్తున్న, పల్లె పాటల రచయితలు కథా, నవలా రచయితలు యీ కృషి ద్వారా వెలికి రాలేకపోయ్యారు. అయితే బాధాకరమైన విషయం ఏమంటే విశ్వనాథ సత్యనారాయణ కరీంనగర్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్నపుడు తన లాగానైనా కథా, నవలా రచయితల్ని యువ రచయితల్నించి ఎదిగించే కృషి చేయలేక పోవడం. ఎంత సేపూ అతనికి తనకీర్తి యావే తప్ప, దళిత బహుజన యువ రచయితల్ని తీర్చిదిద్దే కర్తవ్యం వదలేసారు. నవీన్ కరీంనగర్‌లో పనిచేసిన కాలంలో ఫిలిం సోసైటిల నిర్మాణమే ప్రధాన ధ్యేయమైంది గానీ యువ కుల నుంచీ కథా నవలా రచయితల్ని తయారు చేసే కర్తవ్యం వదిలేసారు. ఎవరూ నేర్పకుండానే రచనా విద్య అబ్బడమే నిజమైతే చదువు కూడా అలాగే అబ్బాలి. ఇన్ని స్కూల్లు

విశ్వవిద్యాలయాలు ఎందుకు ?

ఏదీ పుట్టకతో రాదు. అభ్యాసం వల్ల వస్తుంది. ఆసక్తి, అవకాశం, అనివార్యతల వల్ల అది ఎదుగుతుంది. కులం, పుట్టుకతో రాదు. కుల సంస్కృతికూడా పుట్టుకతో రాదు. తల్లిదండ్రులు యిరుగు పొరుగు యిచ్చే అభ్యాసం వల్లే కులం, కుల సంస్కృతి అబ్బుతుంది. కులం పెంపకం ద్వారా ఆచరణ ద్వారా పెరుగుతున్నది మాత్రమే. సృజన, రచన, కళ, ప్రతిభ, సామర్థ్యం కూడా పెంపకం, ప్రాపకం, ప్రోత్సాహం, అవకాశాల ద్వారా పెరుగుతున్నదే. నాకు అభ్యాసం వల్లే కథ, నవల, వ్యాసం, ప్రసంగం ఈకాస్త పట్టుబడ్డాయి. ఇరవై ఏళ్ళ విద్యాభ్యాసం ద్వారానే విశ్వ విద్యాలయ స్థాయికి మేథోరంగాన్ని ఎదిగించడం, సాధ్యపడుతున్నది.

సాహిత్య కళా సంస్థలు, ముందు ఎదిగిన రచయితలు, కళాకారులు, యువతరాలను ఎదిగించడం కర్తవ్యం. రచయితల సంఘాలు, సంస్థలు, లబ్ద ప్రతిష్టులు ఈ కర్తవ్యాల్ని నిర్వహించడం కన్నా తమ సోది చెప్పడానికి తమ పెత్తనం చెలాయించడానికి, సభలు సమావేశాలు తమ రాజకీయ ప్రచారాల పట్ల మాత్రమే ఎక్కువ మోజు చూపుతున్నారు. దీని వల్ల వారికే నష్టం, రాబోయే తరాల్లో నన్నెదిగించిన గురువు అని మోసేవారు కరువై కొద్ది కాలంలోనే రంగం నుండి వారు కనుమరుగవుతున్నారు. విశ్వనాథ సత్యనారాయణ, కోవెల సంపత్‌కుమారాచార్య కరీంనగర్ జిల్లాలో ఎదిగించిన దళిత బహుజన రచయితలేరి ?

అదిలాబాద్ జిల్లా నుండి ఎస్సీల్లోంచి ఒక గూడ అంజయ్య జాతీయ స్థాయి కవిగా ఎదిగాడు. కరీంనగర్ జిల్లాలో ఎస్సీల్లోంచి అలా ఎదగాల్సినవారికోసం చరిత్ర ఎదిరి చూస్తున్నది. గూడా అంజయ్య, మాష్టార్జీ, రావిశాస్త్రీ, ప్రేంచంద్ స్థాయిలో నలుగురైనా ప్రతి జిల్లాలో ప్రతికులం నుండి స్త్రీలు, పురుషులు ఎదగాల్సివుంది.

కథ నవల ప్రక్రియల్లో తెలంగాణాలో ఎస్సీల్లోంచి నల్లగొండ నుండి బోయ జంగయ్య ను మినహాయిస్తే పెద్దగా ఎవరూ కనబడరు. ఎన్నో ఉద్యమాలు వచ్చాయి. సమాజానికి వాటి కీర్తి చరిత్ర భారమయ్యిందే గానీ తెలంగాణా ఎస్సీ, ఎస్టీల నుండి కథా నవలాకారుల్ని ఎదిగించిందెక్కడ ? మాదిగ దండోరా, మాలనాడు, గిరిజన కులాల ఉద్యమాలు ఈ కర్తవ్యాల్ని చేపట్టాల్సి ఉంది. ప్రతికులం తాలూకు గత వందేళ్ళ సామాజిక పరిణామాల్ని, ఆ కులస్థుల జీవితాల్ని చిత్రించే కథలు, నవలలు, 'ఖాకీ బతుకులు'లా వందలు వేలుగా రావాల్సి ఉంది. అపుడే దళిత బహుజన జీవితం, సంస్కృతి, చరిత్ర స్వచ్ఛంగా స్పష్టపడుతుంది. ఇంతదాకా రాసిందంతా యితర దృక్పథాలతోనే. నిబద్ధత, నిమగ్నత చర్చలు పాలక వర్గాలు, పాలక కులాలు కార్మికవర్గంపై, బహుజనులపై అంతిమంగా ఆధిపత్యం అణచివేత కొనసాగించడానికి సంబంధించినవి. ఏమంటే స్వీయ అనుభవాల్ని, చిత్రించడానికి నిబద్ధత, నిమగ్నతల్తో పనిలేదు. అభ్యాసం, ఆత్మవిశ్వాసం ఉంటే చాలు. అందుకే ప్రేంచంద్ అభ్యుదయ రచయితల ప్రథమ జాతీయ సభల్లో ప్రజల గురించే రాయాలనే నిబంధన పెట్టాలనే మాటను ఎద్దేవా చేశాడు....... ప్రజల గురించి కాక ఎవరి గురించి రాస్తారని.

బి.సి. కులాలు తమ కులాల్లో ప్రగతి శీల రచయితలకు కళాకారులకు చేయూతనిచ్చి తమలోనే ఎదిగించుకోవలసి ఉన్నది. ఇక్కడి ఎస్సీ, ఎస్టీ, బీసీ స్త్రీలు కవులుగా, కథా నవలా రచయితలుగా దళిత స్త్రీవాద దృక్పథంతో జాతీయ స్థాయికి ప్రతి జిల్లాలో కులానికి నలుగురైనా ఎదగాల్సి ఉంది. ఇప్పటిదాకా ఎదిగిన రచయితల్లో చాలా మంది అయా కులాలకు సమాజానికి చేసిందేమీ లేకపోగా వారికిచేసే సన్మానాల ద్వారా వారే ఆయా కులాలకు, రాజరికాల్లోని బ్రాహ్మణల్లాగే సమాజానికి ఎంతో బరువై కూర్చున్నారు. ఆయా కులాల్లో ఎదిగిన మధ్య తరగతి, పాలక వర్గాలు, స్వార్థం తప్ప సమాజ అభివృద్ధికి కృషి చేయలేక పోవడం వల్ల ఆయా కులాలకు, సమాజానికి భారమై కూర్చున్నారు. ఎక్కడి సంపదా, విదేశీ అప్పులూ వీరి స్వసుఖాలకు సరిపోవడం లేదు. 90 కోట్ల జనాభాలో 30 కోట్ల దాకా గల ఈ మధ్యతరగతి, పాలక వర్గాల సుఖాలు స్వార్థాల కోసం ఈ దేశం అమ్ముడు పోతోంది. ప్రతికులంలోని పేదలు సంఘటితమై తమ కులాల్లో ఎదిగిన వారిని నిలదీయల్సి ఉంది.

Dalithayugam-2

03-09-09

36

శమశ్రీ మల్లయ్య

ల

Dalithayugam-2
03-09-09
37

మాష్టార్జీ సాహిత్య జీవిత పరిచయం

తెలుగు సాహిత్యంలో ఒక చలం, ఒక జాషువా, ఒక మాష్టార్జీ...

మాష్టార్జీ స్వయంగా ఒక తత్వవేత్త. ఒక గతి తార్కికుడు. మాష్టార్జీ తన పాటల్లో జీవన దార్శనికతను తానే స్వయంగా తార్కికంగా నిర్ధారిస్తారు. యిరవై ఏళ్ళలో దళిత సాహిత్య సాంస్కృతిక ఉద్యమానికి నేతగా, పెద్ద దిక్కుగా ఎదగడంలో మాష్టార్జీ మహోన్నత స్వయంకృషి, తనకు తానుగా ఎదగడం స్పష్టం అవుతుంది. ఇంత గొప్ప అదృష్టం లేదా అవకాశం భారత రాజకీయాల్లో ఒక అంబేద్కర్, ఒక చారు మజుందార్, తెలుగు సాహిత్యంలో ఒక చలం, ఒక జాషువా, ఒక శ్రీశ్రీ, ఒక గద్దర్‌లకే దక్కింది. అంత గొప్ప అవకాశం తిరిగి మాష్టార్జీకే దక్కింది.

బహుజన రాజ్యాధికారం కోసం...

నేటి శాసనాధికారాన్ని చేజిక్కించుకోవాల్సిన అవసరాన్ని మాష్టార్జీ నొక్కి చెప్పినంత బలంగా తెలుగు సాహిత్యంలో మరెవరు చేయలేదు. మాష్టార్జీది పంచమరాగం. అది సవర్ణాధిక్యతను పొందిన జననాట్యమండలి, అరుణోదయాల్లాగ వెంటనే చప్పున సవర్ణులను ఆకర్షించదు. వాళ్లు దళితీకరణ పొందినపుడేమాష్టార్జీ కవితల్లోని లాలిత్యాన్ని ధ్వని సౌందర్యాన్ని అలంకార శాస్త్ర ఉన్నతీకరణను ఆస్వాదించడం సాధ్యపడుతుంది. మరో మాటలో చెప్పాలంటే రెండు గంటలు మాష్టార్జీ పాటలు విన్నాక కోపానికి బదులుగా దళితుల పట్ల గొప్ప సహృదయంతో ఎదగడమే వాళ్ళు డీ క్లాస్, డీ క్యాస్టు అయ్యారనడానికి గీటురాయి.

డీ క్యాస్ట్, డీ క్లాస్ కావడానికి గీటురాయి మాష్టార్జీ....

ఎవరు నిజంగా డీ క్లాస్, డీ క్యాస్టు అయ్యారో తేల్చుకోవాలంటే గద్దర్ ప్రోగ్రాం తర్వాత లేదా ఆరెస్సెస్ లేదా నాస్తిక హేతువాదుల ప్రోగ్రాం తర్వాత ప్రతిచోటా ఓ గంట మాష్టార్జీ ప్రోగ్రాం యిప్పిస్తే చాలు. కూర్చొన్నవాళ్ళు దళిత శ్రేయోభిలాషులని, లేచి పోయేవాళ్ళంతా డీక్యాస్టు, డీక్లాసు కాలేనివారని యిట్టే తేలిపోతుంది. ఇలా మాష్టార్జీ పాటలు అవినీతి, స్వార్థం, దోపిడీపై, నేను గొప్ప అనే కులాహంకారంపై గొప్ప పోరాటం చేస్తాయి. అవి మూలవాసులైన దళితులే ఈ దేశాన్ని ఎందుకు ఏలాలో స్పష్టమైన చరిత్రను, భూమికను అందిస్తాయి. అతను పాట ద్వారా దళిత బహుజన ప్రజానీకానికి అందించిన చారిత్రక చైతన్యం, రాజకీయ చైతన్యం ఎంత గొప్పదో, ఎంత విస్తృతమైనదో కొలవడానికి సాహిత్యంలో తూనిక రాళ్ళు లేవు.

సామాజిక, సాంస్కృతి ఉద్యమ నిర్మాతగా...

మాష్టార్జీ ఒక చక్కని ఆర్గనైజర్, తెలుగు సాహిత్య చరిత్రను మలుపు తిప్పిన దళిత రచయితల కళాకారుల మేధావుల ఐక్యవేదిక నిర్మాతల్లో ఆయనొకరు. దానికి ఆయన వ్యవస్థాపక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కంచ అయిలయ్య, నారగోని, బి.ఎస్.రాములు, కత్తి పద్మారావు, కె.జి.సత్యమూర్తి, కొత్తపల్లి విల్సన్, కె.ఎస్.చలం, బొజ్జా తారకం, ఊ.సా., గూడ అంజయ్య వంటి భిన్నరంగాలలో కృషి చేస్తున్న రచయితల్ని, మేధావుల్ని ఒక్క వేదిక మీదికి తీసుకురావడంలో మాష్టార్జీ చేసిన కృషి ఎనలేనిది. 1993 డిసెంబర్‌లో మూలవాసుల చరిత్ర దృక్పథంపై సెమినార్ నిర్వహించి ఏ పార్టీలు చేయలేని పనిని చేసి తన శక్తి ఏమిటో నిరూపించాడు మాష్టార్జీ. 1987లో హైదరాబాద్‌లో జరిగిన అఖిల భారత దళిత రచయితల మహాసభలో కవి సమ్మేళనానికి అధ్యక్షత వహించాడు మాష్టార్జీ.

రెండుదశాబ్దాలుగా ఊరూరా మాష్టార్జీ పాటలు, కళారూపాలు

1978 నుంచి అంబేద్కర్ సంఘాల, ఎస్సీ సంఘాల సభల్లో దళిత చైతన్యం కలిగించడంతో మొదలుకొని 1985లో కారంచేడు, 1987లో నీరుకొండ, 1990లో చుండూరు – దళిత మహాసభ ఉద్యమాలకు సాంస్కృతిక సైనికుడిగా తనవంతు కృషి చేశాడు. రెండుసార్లు ఐక్య దళిత మహాసభ రాష్ట్ర సాంస్కృతిక కార్యదర్శిగా కర్తవ్యాన్ని విస్తరించాడు. చిలకలూరిపేట చలపతి విజయవర్ధనం ఉరిశిక్ష రద్దు ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నాడు. ఒక వ్యక్తిగా ప్రారంభమై ఒక మహాశక్తిగా ఎదిగాడు. ఈ రోజు విప్లవ, దళిత, స్త్రీవాద సాహిత్య ఉద్యమ రంగంలో అతని

ప్రభావానికి గురికానివారు లేరంటే అతిశయోక్తి కాదు. ఊరూర దళిత కళామండలులు, బహుజన కళా మండలులు వెలిశాయంటే అతడి కృషి ఎంతగా ఫలిస్తున్నదో వేరే సాక్ష్యం అవసరం లేదు.

గీతం రసాత్మకం కావ్యం ....

గీతం రసాత్మకం కావ్యం అని నిరూపించిన వాడు మాష్టార్జీ. మాష్టార్జీ రాసిన 'అందుకో దండాలు బాబా అంబేద్కర్' పాట తెలుగునాట ప్రార్థనా గీతమయింది. 'శంభుకుని తల నరికివేసి పుట్టారు జ్ఞానతృష్ణను హత్య చేసి....' పాట సమాజం మొత్తాన్ని కదిలించిన పాట. 'ఎందరో పుట్టారు మహనీయులు అందరు కాలేరు దీన బాంధవులు' అనే పాట వేల ఏళ్ళ బహుజన తాత్వికతను సులభంగా నిరక్షరాస్యులకు అందేట్లు చేసింది. 'జోజోర దళితన్న' పాట, 'సదువుకోను పోతానయ్య',, 'ఇది బూర్జువా చదువని ఈ చదువు మాకొద్దని మార్క్సిస్టు నాయకులు మళ్ళీ మళ్ళీ చెప్పగానే' మొదలైన పాటలన్నీ అలంకార శాస్త్ర పరిణతితో కావ్యగౌరవం పొందాయి.

మాష్టార్జీ బాల్యం, తల్లిదండ్రులు ....

మాష్టార్జీ తండ్రి, మేనత్తలు ప్రముఖ జానపద కళాకారులు. వారు రామాయణ, మహాభారత, పురాణాలను ఆడేవారు. చిన్నప్పట్నించి మాష్టార్జీకి కళల పట్ల ఆసక్తి అలా కలిగింది. మాష్టార్జీ సికింద్రాబాద్ సమీపంలోని బొల్లారం కంటోన్మెంట్లో గంగాధరి రాజయ్య, సత్తెమ్మలకు 7.9.1952న నిరుపేద మాదిగ కులంలో జన్మించారు. ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నారు. అతనికి నలుగురు చెల్లెళ్ళు. ఒక తమ్ముడు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం వల్ల 1968లో పాఠశాలలు మూసివేయడంతో మాష్టార్జీ చదువు ఆగిపోయింది. 1974లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో మెట్రిక్యులేషన్ పూర్తి చేశారు. 1976లో ఆంధ్ర మహావిద్యాలయంలో ఇంటర్ చేరారు. అదే ఏడు భారత ఆహార సంస్థలో ఉద్యోగం వచ్చింది. చదువు ఆగిపోయింది. 1983లో ఓపెన్ యూనివర్సిటీ మొదటి బ్యాచీలో చేరి 1986లో డిగ్రీ పూర్తి చేశారు. 1992లో సిద్ధాంతి లా కాలేజీలో చేరి 1995లో ఎల్.ఎల్.బి. పట్టా తీసుకున్నారు. ప్రస్తుతం ఓపెన్ యూనివర్సిటీలో ఎం.ఏ. పొలిటిక్సు చేస్తున్నారు.

మొలకగా మాష్టార్జీ ...

ఎనిమిదో తరగతి చదివే రోజుల్లో పాఠశాల వార్షికోత్సవంలో మాష్టార్జీ చేసిన

నృత్యం చూసి అతన్ని ప్రోత్సహించారు. బాలవినోదం రేడియో కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వారిచ్చిన ప్రోత్సాహంతో భక్తిగీతాలు, భావగీతాలు, జానపద గీతాలు, ప్రేమగీతాలు రాసి పాడడం ప్రారంభించారు. ఉగాది సందర్భంగా తాండూరులో జరిగిన కవి సమ్మేళనంలో 'ఓ మనిషి ఆలోచించు' అనే కవిత చదివిన మాష్టార్జీని ఆ సభలో పాల్గొన్న డా. సి.నారాయణరెడ్డి, గజ్జల మల్లారెడ్డి, ఎల్లంద రఘురామరెడ్డి గారలుఎంతో బాగుందని అభినందించారు. ఆ సందర్భంగా సాహిత్య సమితి ప్రచురించిన 'వసంత వీచిక'లో మాష్టార్జీ కవిత తొలిసారిగా అచ్చయింది.

1978లో దళిత కళామండలి స్థాపన...

1978 సెప్టెంబర్ 7వ తేదీన తన 26వ జన్మదినం సందర్భంగా మాష్టార్జీ దళిత కళామండలిని స్థాపించారు. 1976లో విద్యాశాఖ డైరెక్టర్ యామర్తి గోపాలకృష్ణ తీసిన 16 యంయం నృత్యమాలికకు జానపద నృత్యాలకు మాష్టార్జీ దర్శకత్వం వహించారు. 1977లో సేంట్మేరి ఉన్నత పాఠశాల విద్యార్థులకు డ్యాన్సు చేస్తున్నపుడు మేడం జి.శ్రీరాములును 'మాష్టార్జీ' అని పిలవడంతో పిల్లలు కూడా అలాగే పిలవడంతో మాష్టార్జీ అనే పేరే చివరకు స్థిరపడింది. మాష్టార్జీ తెలంగాణ, ఆంధ్ర సమైక్యంగా ఉండాలనే ఆశయంతో 9.3.1980న తూర్పుగోదావరి జిల్లా పల్లంకుర్రుకు చెందిన ప్రమీల (మాల)ను కులాంతర వివాహం చేసుకొని ఆదర్శాలను, ఆచరణలో చూపించారు. వారికి మిళింద, సిద్ధార్థ, నలంద్ర అనే ముగ్గురు కుమారులు.

అఖండ విప్లవ జ్యోతి అంబేద్కర్ గేయరూపకం, ఇతర ఆడియో క్యాసెట్లు...

హైదరాబాద్ ప్రెస్క్లబ్లో పిల్లలతో 1962 డిసెంబర్ 6న అంబేద్కర్ వర్థంతి సందర్భంగా "అఖండ విప్లవ జ్యోతి అంబేద్కర్" గేయరూపకం ప్రదర్శించారు. మాష్టార్జీ రావూరి ఏకాంబరం, జస్టిస్ పున్నయ్య, బోయి బీమన్న వంటి ప్రముఖులు ఈ రూపకాన్ని ఎంతో అభినందించారు. దీన్ని రెండేళ్ళపాటు హైదరాబాద్లో ప్రదర్శించారు. ఆ తర్వాత దీన్ని మాష్టార్జీ నిర్వహణలో, ఉదయ కుమార్ దర్శకత్వంలో టీవీఫిల్మ్గా రూపొందించారు. అది అంబేద్కర్ జన్మదినమైన 1989 ఏప్రిల్ 14న దూరదర్శన్లో ప్రసారం చేయబడింది. చైతన్య గీతమాలిక, కుర్రోకుర్ర, మాష్టార్జీ దళిత గీతాలు, బహుజన గీతాలు, మొ॥ ఆడియో క్యాసెట్లు వెలువరించారు.

జననాట్యమండలి మాష్టార్జీ తనవంతు సహకారం...

మాష్టార్జీ 1981లో జననాట్యమండలి వారికిరగల్ జెండా బ్యాలే, దీపారాధన

నృత్యం బాంగ్డా డ్యాన్సు మొ॥ కళారూపాలకు రూపకల్పన చేసి అందించేవారు. రగల్ జెండా బ్యాలేలో గల 'పట్నంలో పుట్టిన పట్టుబట్ట దీని... కట్టుకుని సూడరబ్బి' మొదలైన పాటల్ని రాసి వారికందించారు. 'అడవి తల్లికి దండాలో' పాటకు స్వరకల్పన చేశారు. "జోహారులూ... జోహారులూ... లాల్‌లాల్‌సలామ్" అనే అమర వీరుల (దీపారాధన) పాటను రాసి అందించారు. చాలాకాలం పాటు జె.ఎన్.ఎం. కార్యక్రమాలు ఈ పాటతో ముగించే వారు. ఈ పాటను ఆ తర్వాత అజ్ఞాతకవి రచన పేరుతో శ్రీరాములయ్య సినిమాలో సవరించి చేర్చుకున్నారు. తనదైన ఒక ప్రత్యేక కళారూపాన్ని ప్రాచుర్యంలోకి తేవాలని కోయజాతుల వేషధారణతో "జనకథ"ను 1983లో రూపొందించారు. అప్పటి నుంచి వేలాది కళాకారులు ఈ జనక కళారూపాన్ని ప్రదర్శిస్తూ వస్తున్నారు. "మాదిగ చిందు" భాగోతాన్ని పరిష్కరించి, మహాచిందు పేరు ప్రదర్శనలిచ్చి, జాంబవ పురాణాన్ని ప్రజల దృష్టిలోకి తెచ్చారు మాష్టార్జీ.

ప్రజాచైతన్యమే మాష్టార్జీకి ప్రజలు ఇచ్చిన గొప్ప అవార్డు...

ప్రజా చైతన్యమే మాష్టార్జీకి రాష్ట్రం ఇచ్చిన గొప్ప అవార్డు. ఇతర రాష్ట్రాల్లోనూ మాష్టార్జీ పాటల్ని, కళారూపాల్ని అనువదించి ఆదర్శంగా తీసుకొని, రాసి లక్షలాదిమంది పాడుకోవడమే మాష్టార్జీకి ఒక గొప్ప అవార్డు. మాష్టార్జీ కృషిని గౌరవిస్తూ ఆం.ప్ర. యువజన కాంగ్రెస్ 1993లో "అంబేద్కర్" అవార్డునిచ్చి సత్కరించింది. సంగారెడ్డి సాహితీ సమితి సమావేశంలో గుంటూరుకు చెందిన దళిత ఓపెన్ యూనివర్శిటీ వారు "జాషువా అవార్డు"తో సత్కరించారు. బహుజన సమాజ్ పార్టీ నిర్మాత కాన్షీరాం, మాష్టార్జీ కృషి ప్రాధాన్యతను గుర్తించి అభినందించారు. వినుకొండలో జాషువా అవార్డునందజేశారు. 1999లో నవ్యసాహిత్య పరిషత్ విశాల సాహితీ సంయుక్తంగా ఇచ్చే ప్రతిష్టాత్మకమైన డా॥ మలయశ్రీ అవార్డును మాష్టార్జీని వరించింది. (గతంలో ఈ అవార్డును బోయ జంగయ్య, వెంపో, వంగపండు ప్రసాదరావుగారలు అందుకున్నారు.)

సామాజిక ఉద్యమ పాటల్లో చరిత్ర సృష్టించిన మాష్టార్జీ....

మాష్టార్జీ యిప్పటి వరకు దాదాపు 250 పాటలు రాశారు. అందులో దళిత సాంస్కృతిక ఉద్యమాన్ని బలోపేతం చేసే పాటలు వందపైనే ఉంటాయి. మాష్టార్జీ యిప్పటికి ఏడుదాకా పుస్తకాలు ప్రచురించారు. మాష్టార్జీ పాటలు పుస్తకం మళ్ళీ ముద్రణ పొంది తెలుగు సాహిత్యంలో చరిత్ర సృష్టించింది. ఉద్యమ సాహిత్యంలో

యింతగా పునర్ముద్రణ పొందిన ఒకే రచయిత పాటల సంలకనం రెండు దశాబ్దాల్లో మాష్టార్జీ పాటల సంకలనం ఒక్కటే.

యుగకవిగా, మహాకవిగా, దళిత సాంస్కృతిక విప్లవ పతాకగా మాష్టార్జీ పరిణతి...

భావాన్ని కవితాత్మకం చేయడాన్ని అనుసరించి మహాకవి అయ్యేదైతే, మాష్టార్జీ మహాకవే. "ఎందరో పుట్టారు మహనీయులు ... అందరూ కాలేరు దీనబాంధవులు..." అనే భావన ఎంతో గొప్ప తాత్విక విశ్లేషణ. ఎందరో మహాకవులున్నారు మనకు. కాని మాష్టార్జీ తీసుకున్న వస్తువును తీసుకుని దీనబాంధవులైన మహాకవుల్లో గొప్పకవి మాష్టార్జీ మాత్రమే. "చేతిలో కత్తేది లేదు సంకలో తుపాకి లేదు ఏమయో బ్రాహ్మణోడు ఈ రాజ్యమెట్లా ఏలుతున్నాడు" అనే పాట మాష్టార్జీ తాత్వీకరణకు ఒక చక్కని ప్రతీక. ఈ పాట ద్వారా తాత్విక భావజాల ప్రాధాన్యతను ఎంత గొప్పగా చెప్పాడంటే ఈ కోవలో మాష్టార్జీకి మాష్టార్జీయే పోటి. అతనికతడే సాటి. "పుట్టినావు మాకులాగె ముట్టునుండి ఉన్న కొడుక" అనే పాట ఒక గొప్ప తార్కిక విశ్లేషణ.

మాష్టార్జీ పాటల్లో మరికొన్ని ఆణిముత్యాలు

1. అందుకో దండాలు బాబా అంబేద్కరా
2. ఎందరో పుట్టారు మహనీయులు
3. శంభుకుని తల నరికివేసి
4. ఎద్దు కూర తిన్నోడె ఎంతో ముద్దుగ
5. నీలి లాలు జెండా కింద
6. ఇదేమి ధర్మమన్న
7. కుర్రో కుర్రో కోయజాతుల నుండి
8. ఎవరే ఈ పోరగాడు
9. ఈ మగవాడి రాజ్యంలో చెల్లి
10. ఎవరు రాజ్యము కొచ్చినా
11. రండిరో దళితన్నా

12. చెట్టుకు మూలయేరు యెట్లనో
13. బతుకంతా యెట్టిజేసి
14. వింటివా మల్లన్నా కులంజేసె గమ్మత్తు
15. ఎస్సీ ఎస్టీ బీసీ మనం 85%
16. ఈ దేశం నీదన్నగాని రాజ్యం నీదన్ననా
17. ఎల్లాలి ఎల్లాలి రెల్లి వీధికి
18. రావోయి మా కంట్రికి
19. యాడ గొప్పోడొ ఏపాటి మొగోడై
20. గుడి మాదె బడి మాదె
21. క్యాక్యా నహి కియా మేరా కాన్షీరాం జీ
22. ఈ దేశవాసులం ఈ భూమిపుత్రులం

పై పాటల గొప్పతనమేమిటంటే ప్రత్యేకంగా వివరించాల్సిన పనిలేదు. మాష్టార్జీ తడిమినన్ని దళిత జీవితకోణాల్ని వ్యాసాల్లోగానీ, ఉపన్యాసాల్లోగానీ, కథల్లోగానీ, పాటల్లోగానీ మొత్తం తెలుగు సాహిత్యంలో మరెవరూ అంత గొప్పగా విశ్లేషించలేదు. మాష్టార్జీ తెలుగు దళిత సాహిత్య ఉద్యమంలో ఒక జలపాతం, ఒక లెజెండ్. ఒక చరిత్ర, ఒక యుగకవి. మాష్టార్జీ రాసిన 250 పాటల్లో 70 పాటలు ఇప్పటికీ నిలబడగలిగాయంటే కవిగా అతడు ఎంత గొప్ప క్రాంతదర్శో స్పష్టం.

మాష్టార్జీ గురించి కాళోజి ఇలా అంటారు. "తరతరాలుగా దోపిడీకి, దౌర్జన్యానికీ గురై కూడా "నోరుండి మాట్లాడలేక, కళ్ళుండి చూడలేక, కాళ్ళుండి నడవలేక, వంచిన తల పైకెత్తలేక పురుగులా పడి యుండిన దళితవర్గం మేల్కొని తలెత్తి నడుస్తూ, గొంతెత్తి పాడుతూ చేసే చాటింపే మాష్టార్జీ దళిత గీతాలు. మాష్టార్జీ గొంతుతో నా గొంతు కలుపుతున్నాను."

శోకంలోంచి పుట్టిన దళిత శ్లోకం మాష్టార్జీ...

వాల్మీకి శ్లోకమే శ్లోకమై మహాకావ్యమైనట్టు మాష్టార్జీ జీవితానుభవాల శోకమే మాష్టార్జీ శ్లోకాలై, గీతాలై సమాజాన్ని చైతన్యవంతం చేశాయి. ఇలా రాసిన పాటల్లో దాదాపు 30 పాటలు అన్నీ వజ్రాలే అనే స్థాయిలో రాసిన ఉద్యమకవి మాష్టార్జీ. 70

ఏళ్ల నుండ తెలుగునాట సాగుతున్న విభిన్న ఉద్యమాల్లో రాసిన పాటల్లో ఒకే రచయిత రాసిన యిన్ని పాటలు యింత గొప్ప ప్రాచుర్యం పొందిన ఘనత మాష్టార్జీకే దక్కింది. కొందరు గొప్ప ఉద్యమకవుల క్కూడా పదికిమించి ప్రాచుర్యం పొందిన పాటలు లేవంటే మాష్టార్జీ పాటలు 40దాకా ఈ స్థాయిలో ఉన్నాయంటే అదెంతో గొప్ప విశేషం. ఉద్యమ పాటలు తొందరగా పాతబడ్డం వాటి సహజ లక్షణం. మాష్టార్జీ పాటలు ఇందుకు భిన్నంగా రోజురోజుకూ ప్రాచుర్యం పొందుతుండటం వాటి విశిష్టత. తెలుగుసాహిత్య చరిత్రలో మాష్టార్జీ చరిత్ర విశిష్టమైనది. అతను మరెన్నో మైలురాళ్ళను నాటుతాడు, అధిగమిస్తాడు. నూతన సహస్రాబ్దికి వైతాళికుడౌతాడు.

బొజ్జా తారకం "మాష్టార్జీ పాట నేను పాడవలసిన పాట. నేను పాడుకొనే పాట. ఆ పాటలు వింటూనే ఉన్నాను. విన్నప్పుడల్లా పొంగిపోతూనే ఉన్నాను. అతని గొంతులో వైవిధ్యం ఉన్నట్టుగానే అతని పాటల్లోనూ వైవిధ్యం కన్పిస్తుంది. ఎంత లోతుల్లోకి పోగలడో, అంత పైకీ వెళ్ళగలడు. అతని పాటల్లో బాధ, ఆవేశం, పట్టుదల, కసి, నిర్ణయం, ధైర్యం, బలం కన్పిస్తాయి. దళిత ఉద్యమం మాష్టార్జీకి ప్రేరణ. అతని పాట ఉద్యమానికి బలం. మాష్టార్జీ పాట ఉద్యమానికి కొత్త ఊపిరి పోస్తుంది." అని పేర్కొన్నారు.

సామాజిక దార్శనికులు దళితోద్యమ నాయకులు కత్తి పద్మారావు మాష్టార్జీ గురించి ఇలా అంటారు. "దళిత పాటల యుగానికి జాతీయగీతం రాసిన మాష్టార్జీ... మూలవాసుల జీవన తత్వాన్ని మానవగీతంగా ఆలపించిన మాష్టార్జీ ... సాంస్కృతిక విప్లవ రణభేరిని పాటలో పొదిగిన మాష్టార్జీ ... ఈ యుగ దళిత సాంస్కృతిక విప్లవ పతాక మాష్టార్జీ ... ఆయన మోగించేది గుండె డప్పు. ఆయన నాట్యం తరతరాల శ్రమ సంస్కృతికి సంకేతం. అందుకే మాష్టార్జీ నీలిపాటకు తెలుగుతల్లి సమాజాన్ని నిదురలేపిన యుగకర్త."

డా॥ కంచ అయిలయ్య "ఆంధ్రప్రదేశ్‌లోని దళితవాడల్లో ఇప్పుడు ప్రతినిధ్యం వినిపించే పాట మాష్టార్జీది. అందుకో దండాలు బాబా అంబేద్కరా! పాటతో ప్రారంభించి ఎస్సీ, బీసీ, ఎస్టీ మనం 85% పాటతో అంతమౌతుంది. మధ్యలో పాటలు విన్నంతసేపు దళితవాడలు, కులాల చరిత్ర, దళితుల పోరాటాలు మన కళ్ళముందు కదలాడుతుంటాయి." అని విశ్లేషించారు.

మాష్టార్జీ ఒక అంతర్జాతీయ గీతం

భారతీయ సాహిత్యంలో మాష్టార్జీగారిది ఒక ప్రత్యేక స్థానం. ఆయన రాసిన పాటలతో సంపుటీకరించిన ఈ "స్త్రీ తత్వగీతాలు" భారతీయ సాహిత్యంలో ఒక మైలురాయి. మాష్టార్జీ తెలుగు సాహిత్యానికి ఒక రహదారి వేశారు. అది యిప్పుడొక రాచబాట. ఇప్పుడు లక్షలాది ప్రజలకు, వేలాది సామాజిక కార్యకర్తలకు, వందలాది రచయితలకు మాష్టార్జీ మార్గదర్శకులు. ఇలా మాష్టార్జీ యిప్పుడొక లెజెండ్.

తత్వాన్ని, కవిత్వాన్ని, రస తత్వాన్ని ముప్పేటగా సమ పాళ్ళలో సమన్వయించి రాయడంలో మాష్టార్జీ దిట్ట. ఒక కళాసృష్ట. కవి గాయకుడి నుండి వాగ్గేయకారుడిగా ఎదిగిన మాష్టార్జీ దర్బన్ లోను డప్పు మోగించి జాతీయస్థాయినుండి అంతర్జాతీయ గీతం అయ్యారు.

బహుజన సాహిత్య తత్వాన్ని ప్రధాన సాహిత్య స్రవంతిగా విస్తరించడంలో మాష్టార్జీ కృషి ఎనలేనిది. దళిత కళామండలిని 1978 లో స్థాపించిన మాష్టార్జీ 1992 లో ఏర్పడిన ఆం.ప్ర.దళత రచయితల, కళాకారుల, మేధావుల ఐక్యవేదిక నిర్మాతల్లో ఒకరయ్యారు. దానికి వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శిగా చేసి ప్రస్తుతం రాష్ట్ర అధ్యక్షులుగా ఉన్నారు.

మాష్టార్జీ ఈ స్త్రీ తత్వ గీతాల్లో మానవతావాదాన్ని, మాతృస్వామ్యదృక్పధాన్ని, బౌద్ధవాద జాతీయవాదాన్ని నిక్షేపించారు. అంబేద్కరిజం మూలధాతువుగా ఆలపించిన ఈ స్త్రీ తత్వగీతాల్లో పౌరహక్కుల దృక్పధం, మానవహక్కుల దృక్పధం, స్త్రీవాద దృక్పధం దళిత స్త్రీవాద దృష్టి పెనవేసుకొని కొనసాగుతాయి. ఉన్న పరిమితుల్లోనైనా యిన్ని పాటల్తో వస్తు వైవిధ్యంతోపాటు, వస్తు సమగ్రత రీత్యా తెలుగులో ఈ "స్త్రీ తత్వగీతాలు" మొదటి సంపుటి అని చెప్పవచ్చు.

ఒకే ఒక అంశంపై పలు పాటలు రాయడం అంత సులభం కాదు. కథాసాహిత్యంలో కె.వి.నరేందర్ అమ్మయొక్కపలు కోణాల్తో "అమ్మ" కథల సంపుటిని, నాన్న యొక్క పలు కోణాల్తో "నాన్న" కథల సంపుటిని వెలువరించి చరిత్ర సృష్టించారు. ఈ పాటల పుస్తకం ద్వారా మాష్టార్జీ కవితా ప్రక్రియలో ఈ చరిత్రను ప్రారంభించారు.

స్త్రీలు ఈ నేలలో సగం. ఈ ప్రపంచంలో సగం. భావజాలం పురుషులకు మాత్రమే పరిమితమైన అంశం కాదు. తత్వశాస్త్రం, సామాజిక దృక్పధం, రాజకీయ అధికారం మొదలైనవన్నీ పురుషులకే పరిమితం అని - స్త్రీల సాహిత్యం అంటే స్త్రీలు ఎదుర్కునే ప్రత్యేక సమస్యలు మాత్రమే అనుకునే దృష్టి ఫెమినిస్టుల్లోనూ, దళితవాదుల్లోనూ కొనసాగుతున్నది. స్త్రీలకు కూడా రాజకీయ చైతన్యం అవసరం. రాజకీయ ఆర్థిక సామాజిక సాంస్కృతిక అంశాలన్నీ స్త్రీ తత్వంలో కూడా భాగంగా ఉన్నప్పుడే స్త్రీలను సమానంగా గౌరవించినట్టువుతుంది. ఫెమినిస్టు రచనలలో ఫెమినిస్ట్ సంకలనాల్లో ఈ సమగ్ర దృక్పధం కొరవడుతున్నది. కుల, వర్గ, లింగ జాతి, మత, ప్రాంత, దేశియ, సమస్యలన్నీ స్త్రీ సమస్యలలో కూడా అంతర్భాగమే. స్త్రీ తత్వ దృష్టితో వీటి చూపును, పరిపుష్టం చేయాల్సి ఉంది. అపుడే సామాజిక రాజకీయ తాత్విక రంగాల్లో స్త్రీలు మొత్తం సమాజానికి నాయకత్వం వహించడం సాధ్యపడుతుంది.

ఫెమినిస్ట్ చర్చలతో ప్రత్యక్ష సంబంధం లేకుండనే రాష్ట్ర వ్యాప్తంగా దేశ వ్యాప్తంగా స్త్రీలు యివాళ రాజకీయ రంగంలో, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన ద్వారా అధికారంలోనికి వస్తున్నారు. వారి అనుభవాల మేరకు నిర్దిష్ట స్త్రీతత్వ దృష్టితో సమస్యల్ని ప్రపంచాన్ని పరిశీలిస్తున్నారు. వాటన్నిటిని క్రోడీకరించినపుడు స్త్రీ తత్వం సమగ్రతను సంతరించుకొంటుంది. ఉత్పత్తిలో పాల్గొనే స్త్రీలు పురుషులకన్న ప్రత్యేకమైన సమస్యల్ని అనుభావాల్ని ఎదుర్కొంటారు. అందువల్ల ఉత్పత్తి కులాల స్త్రీల భావాలు, అనుభవాలు ఎంతో విలువైనవి. వాటిని సాహిత్య, సామాజిక, రాజకీయ, తాత్వికరంగాల్లో స్వీకరించినపుడే నిజమైన శ్రామిక స్త్రీ తత్వం వెలికి వస్తుంది.

అందువల్ల ఈ స్త్రీ తత్వగీతాల్లో రాజకీయ, సామాజిక చైతన్యానికి సంబంధించిన పాటలు కూడా చోటుచేసుకున్నాయి. స్త్రీల మధ్య, స్త్రీ వాదుల మధ్య ఈ పాటలు పాడడం వల్ల స్త్రీలు డీ క్యాస్ట్, డీ క్లాస్ కావడానికి ఎంతో సహకరిస్తాయి. ఈ పాటలు పాడడానికి వినడానికి ఏదో ఒక మూల అభ్యంతరం ములుకులా తొలిస్తే అదంతా దోపిడికులాలు, దోపిడి వర్గాలు, పితృస్వామిక ఆదిపత్య వాదం నుండి యింకా బయటపడకపోవడాన్ని తెలుపుతుంది.

స్త్రీలకు సమాన హక్కులుండాలని గుర్తించిన బుద్ధుడిని స్మరిస్తూ రాసిన "ఓ సమతా సాగరా" పాటతో మీ సంపుటి ప్రారంభమై బతకమ్మ పాటతో ముగించడం వెనుక సార్వజనీన మానవీయ దృక్పధానికి నిర్ధష్టస్థలకాల కుల వర్గ సంస్కృతికి మధ్య సమన్వయం సాధించడం ఉన్నది.

చార్వాకులు బుద్ధుడు నుండి మొదలుకొని అంబేద్కర్, కాన్షీరాం, మాయావతి దాక సమాంతరంగా కొనసాగుతున్న భారతీయ భావధారల్ని సామాజిక చింతనను ఈ స్త్రీ తత్వగీతాలు మనకందిస్తాయి. భారతదేశంలోని మొదటి స్త్రీ ఉపాధ్యాయురాలైన సావిత్రి పూలే పై రాసిన మాష్టార్జీ పాట ఒక గొప్ప స్ఫూర్తినిస్తుంది.

మాష్టార్జీ గారిది చారిత్రక దృష్టి. అయినప్పటికి కుటుంబ సంబంధాల్లోని సెంటిమెంట్లను, ఆత్మీయతల్ని కూడా పట్టించుకుంటారు. అమ్మ గురించి ఎంత రాసినా తక్కువే. తన వంతుగా మాస్టార్జీ కనిపించే జిమ్మా అంటూ అమ్మ తనంలోని ఆర్థ్రతను కరుణాత్మకంగా మన ముందుంచారు. "యాడ గొప్పోడా" పాట స్త్రీల ముఖ్యంగా యువతుల ఆత్మవిశ్వాసాన్ని గట్టిపరిచేదిగా హృదయాల్లో నిలబడిపోయే పాట. "మగవాడి రాజ్యంలో చెల్లి" అంటూ పురుషాధిక్యత సమాజంలోని వివక్షతను ఎదురించడాన్ని ప్రబోదిస్తారు.

స్త్రీలకు విజ్ఞానం అవసరం. వారి గురించిన చట్టాలను వాళ్ళు తెల్సుకొవడం కోసం "చట్టాలున్నాయని తెల్సుకో" అంటూ చక్కని పాట రాసారు. సంప్రదాయక మత తత్వపూరిత పెళ్ళిళ్ళ స్థానే జరుపుకునే మీటింగ్ పెళ్ళి గురించి దాని విశిష్టత గురించి "ఈ ఏందవ్వో ఈ పెళ్ళి ఏందవ్వో" అనే పాటలో విశదీరకించారు. దోపిడి వర్గ దృక్పధంతో, దోపిడి కుల దృక్పదంతో అహంకారంతో హుంకరించేవారిని "పుట్టినావు మాకు లాగె" పాట అద్భుతంగా నిలదీస్తుంది. రెల్లి కుల స్త్రీల గురించి, నర్సు సిస్టరమ్మా గురించి, మంగళమ్మా గురించి, సాదాసీదా మనిషిగా చేసిన సేవకూడా ఉదాత్త మానవ సేవేనంటు లింగమ్మ గురించి, జోగినుల గురించి పాటలు రాసి వారి జీవితాల్ని, సాహిత్యీకరించడం ఆదర్శనీయం.

రాజకీయ సామాజిక దృక్పధంతో ఈ భారతీయ హిందూ మతకుల సమాజాన్ని ఎట్లా అర్థం చేసుకోవాలో ప్రబోధిస్తూ "శంభుకుని తల నరికివేసి జ్ఞానతృష్ణను తుంచివేసి" "జోజోర దళితన్నా, నీలి లాల్ జెండాకింద, ఇది బూర్జువా చదువని, హిందూకోడ్ బిల్లు మొదలైన పాటలు మాష్టార్జీ సిద్దాంత గాఢతను, చారిత్రక దృక్పధాన్ని తెలుపుతాయి. బ్లాక్ ఈజ్ బ్యూటీ అంటూ సాగే పాట ప్రపంచ ప్రజలకు

ఒక గొప్ప సందేశం. కారంచేడు గురించి రాసిన పాటతో పాటు చీపురు పుల్లల గురించి కూడా రాయడం మాష్టార్జీకే చేతనైంది.

ఈ పాటలు విన్నప్పుడు హృదయం ఒక గొప్ప చైతన్యంతో విప్పారుతుంది. స్త్రీలముందుగల కర్తవ్యాలేమిటో తెలిపే ఈ పాటలు ప్రతి స్త్రీ పాడుకున్నప్పుడు భావజాల విప్లవం వేగవంతమౌతుంది.

కోట్లాది ప్రజానీకానికి ప్రతీకగా నిల్చిన మాష్టార్జీ "దళిత మహాసభ" కత్తిపద్మారావు గారి నేతృత్వంలో కదిలి స్త్రీలకు భూమికావాలని, వృద్దస్త్రీలకు పెన్షన్ కావాలని, చదువుకున్న స్త్రీలకు నిరుద్యోగభృతి కావాలని లక్షలాదిగా కదులుతున్న ఇవాళటి స్త్రీల ఉద్యమం కోసం కూడా మాష్టార్జీ పాటలందించడం ద్వారా ఒక గొప్ప చారిత్రాత్మక కర్తవ్యాన్ని నెరవేర్చారు.

పాట ప్రక్రియ దేశంలో 2 వేల కోట్ల రూపాయాల వ్యాపారమై విస్తరించింది. ఎలక్ట్రానిక్ మీడియాలో పాటదే పైచేయి. పాట ఆకాశయానం చేస్తుంటే ప్రజల పాటలు కాలినడక ప్రయాణంలో ఉన్నాయి. తద్వారా చేరాల్సిన గమ్యం ఏళ్ళు పూళ్ళు ఆలస్యం అవుతున్నది. ప్రధాన సాహిత్య స్రవంతికి సమాంతరంగా ప్రజా పాటలు కూడా ఆకాశయానం చేయాలి. క్యాసెట్లుగా, సి.డీలుగా ప్రతి యింట వ్యాపించాలి. మాష్టార్జీ ఈ స్త్రీ తత్వ గీతాలతో ఒకటి రెండు డాక్కుమెంటరీలు రావాలి. అప్పుడు పాట, మరింత విస్తృతమవుతుంది. గ్లోబలైజేషన్, ప్రయివేటజేషన్ పరిణామాలవల్ల 2 వేల కోట్ల పాట వ్యాపారంలో ప్రజల పాటల వాటా యెంతో బేరీజు వేసుకోవాల్సి ఉంది. సరైన వాటా కోసం ఉద్యమంగా కదలాలి. అప్పుడే సాంస్కృతిక బావజాల రంగాల్లో తనదైన వాటాను సాధించుకోవడం సాధ్యపడుతుంది.

ఉత్పత్తిలో పాల్గొనే విభిన్న రంగాల స్త్రీల గురించి భర్తపోయిన స్త్రీ – తన పిల్లల్ని పెంచి పెద్దచేసే తీరు గురించి కులరహిత, వర్గ రహిత, పురుషాధిపత్య రహిత సమ సమాజం స్త్రీల తోనే సాధ్యమవుతుందనే సత్యాల గురించి, కోడలమ్మ ఎతల గురించి, ఉద్యోగం చేస్తున్న స్త్రీలు ఎదుర్కునే సమస్యల గురించి, కాలేజీ చదివే దళిత స్త్రీ యువతుల సమస్యల గురించి, పొలాల్లో, కార్ఖానాల్లో, బీడీ కంపినీల్లో, పొగాకు కంపినీల్లో, రాళ్ళల్లో, రోడ్ల నిర్మాణాల్లో, ప్రాజెక్టుల్లో, ఇళ్ళల్లో, ఇళ్ల నిర్మాణాల్లో పనిచేసే స్త్రీల సమస్యల గురించి మాష్టార్జీ మరిన్ని పాటలు చేర్చి త్వరలోనే మలి ముద్రణగా వెలువరించాలని కోరుతున్నాను.

బహుజన సాహిత్య మార్గదర్శకులుగా మాష్టార్జీ నుంచి మనం యింకెన్నో పాటల్ని ఆశించాల్సి వుంది. సమస్త పార్శ్వాల గురించి మాష్టార్జీ సమాజానికి సాహిత్యాన్ని మరింతగా అందించాలని కోరుతున్నాను. ఈ పాటల్ని హిందీలోకి అనువదించి ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ద్వారా హిందీ పాఠ్యపుస్తకాల్లో చేర్చడం ఎంతో అవసరం. తెలుగులోను జానపదశాఖతో పాటు దళిత పాట డిపార్టుమెంటును నెలకొల్పడం ఎంతో అవసరమని దళిత సాహిత్య విస్తృతి తెలియజేస్తున్నది.

జగిత్యాల
16-12-2002

బుద్ధుడు - అంగుళి మాలుడు

అంగుళి మాలుడి గురించి డా।। బి.ఆర్. అంబేద్కర్ "బుద్ధుడు - అతని ధర్మం" అనే గ్రంథంలో పేజీకి పైగా వివరించాడు. 1940 ప్రాంతంలో అనుకుంటాను. హిందీలో భరత్ భూషణ్ హీరోగా 'అంగుళిమాల' సినిమా వచ్చింది. అది ఇప్పుడు అందుబాటులో లేదు. హిందీలో 'అంతక్ అంగుళిమాల' అనే పుస్తకం వెలువడింది. డా।। అంబేద్కర్ రచన ఆధారంగా ఈ నాటకం రూపొందించబడింది. అంగుళిమాల చరిత్రకు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. కాలక్రమంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. అవి కూడా శతాబ్దాల తరబడి రామాయణ, భారతాల్లాగా మార్పులు చేర్పులతో కొనసాగుతున్నాయి. బౌద్ధ సాహిత్యం విస్తారమైనది. బౌద్ధ సాహిత్యానికి ఎంతో చారిత్రక ప్రాధాన్యత వుంది.

అంగుళి మాలుడు, బుద్ధుని ప్రముఖ శిష్యుల్లో ఒకరు. హింస, క్రూరత్వం నుండి వివేచన కలిగించి తనకు తానే పరివర్తన చెంది సాధువుగా, బుద్ధ భిక్షువుగా మారిన వందలాది మందికి ప్రతీకగా అంగుళి మాలుడు కథ సుప్రసిద్ధం. బుద్ధుని శిష్యుల్లో ఆనందుడు, ఉపాలి, కాశ్యప, ముఖ్యులు. వీరితో సమంగా ఆనాడు గుర్తింపు పొందిన అంగుళి మాలుడి చరిత్ర ప్రత్యేకమైనది. వెయ్యి మందిని చంపి వారి బొటనవేళ్లను మాలగా ధరించి వినడానికే భయం కలిగించే రూపం, స్వభావం అంగుళి మాలుడి కథలో కనపడుతుంది. వెయ్యి మందిని చంపాలనే ఆలోచన అంగుళి మాలుడికి ఎందుకు కలిగింది? గురుపత్ని అంగుళి మాలుడిని ప్రేమిస్తే మాతృదేవతగా భావించి నమస్కరించి తగదని నిరాకరిస్తాడు. దాంతో విద్యా గురువైన మణిభద్రుడికి గురుపత్ని దుష్టపన్నాగంతో నింద మోపుతుంది. గురుపత్ని అంగుళి మాలుడిని బాగా ఇష్టపడడం తోటి శిష్యులకు అసూయ కలిగిస్తుంది. గురువు వెయ్యి మందిని చంపితేనే కాని నీకు విద్యనేర్పనని శిక్షగా శపిస్తాడు. అందువల్లే అతను క్రూర ఆకారంతో కోసల రాజ్యం దట్టమైన అడవుల్లో తిరుగుతుంటాడు. దొరికినవారిని జై చాముండేశ్వరి

అంటూ దొరకబుచ్చుకుని తల నరుకుతాడు.

కోసల రాజైన ప్రసేనజిత్ మహరాజు ఈ సమస్యను పరిష్కరించడం ఎలాగో ఆలోచిస్తాడు. విష్ణుశర్మను అంగుళి మాలుడు నిర్బంధిస్తాడు. విష్ణుశర్మ తల్లి ప్రసేనజిత్‌తో మొర పెట్టుకుంటుంది. మంత్రి, సేనాపతి ఏం చేయాలో చర్చిస్తారు. ఇంతలో అంగుళి మాలుడు తన వార్తాహరుని ద్వారా లేఖ పంపుతాడు. తన వద్ద బంధీగా వున్న విష్ణుశర్మను కాపాడే ప్రయత్నం చేస్తున్న విషయం తెలిసిందని, ఈ సాహసానికి ఇదిగో బహుమతి అని విష్ణుశర్మ తలను నరికి పళ్లెంలో పెట్టి పంపిస్తాడు. అందరూ నిర్ఘాంతపోతారు.

గౌతమబుద్ధుడు ప్రసేనజిత్ దర్బారుకు విచ్చేస్తాడు. అంగుళి మాలుని గురించి వివరిస్తాడు. అతని గురించే తెలిసే వచ్చానని, అతన్ని మార్చడం అవసరమని గౌతమబుద్ధుడు ప్రబోధిస్తాడు. ప్రసేనజిత్ మహరాజు ఆస్థానంలోని మహా పండితుడైన గార్గేయుని కొడుకే అంగుళిమాలుడు. అది బుద్ధుడు వచ్చినప్పుడు చెప్తాడు. అంగుళి మాలుడు అలా మారడానికి వెనుక ఉన్న కారణాలను పరిశీలించి పరిష్కారాన్ని వెతకవచ్చు అని బుద్ధుడు సూచిస్తాడు. అంగుళి మాలుని కలవడానికి బుద్ధుడు బయల్దేరతాడు. అంగుళి మాలుడు నిర్భయంగా వస్తున్న బుద్ధుణ్ణి చూసి ఆశ్చర్యపోతాడు. చావుకు భయపడని వారిని చూడడం అంగుళి మాలుడికి వింతగా ఉంటుంది. బుద్ధుడు అంగుళి మాలుని నోటినుండి గురుపత్ని గురించి, గురువుల గురించి, సహ అధ్యాయుల గురించి చెప్పిస్తాడు. జరిగిన మోసం, దుష్టపన్నాగం వివరిస్తాడు. అంగుళి మాలుడు తన పొరపాటు గ్రహిస్తాడు. బౌద్ధ భిక్షువుగా మారతాడు. స్థూలంగా అంగుళి మాలుని కథ ఇది.

అంగుళి మాలుడు కోసల రాజైన ప్రసేనజిత్ ఆస్థాన పండితుడైన గార్గేయుని కొడుకు అని శాపవశాన క్రూరుడుగా మారాడని చెప్పడం వర్ణవ్యవస్థ ఆధిక్యతను, గౌరవాన్ని సూచిస్తుంది. బ్రాహ్మణుడి కొడుకు కూడా ఇంత క్రూరంగా మారాడని తెలుపుతుంది. తొలి దశలో అంగుళి మాలుని కథ ఆటవిక తెగలకు సంబంధించినదై వుంటుంది. గిరిజన గణ తెగ సమాజంలో నరబలి, ఇతర మనుషుల పట్ల భయంతో చంపివేయడం జరుగుతుండేది. 18 శతాబ్దం దాకా ప్రపంచమంతటా ఈ క్రమం చూడవచ్చు. అందువల్ల, అంగుళి మాలుడి కథ ఒక ఆటవిక తెగ నాయకుడి కథ అయి వుండాలి. లేదా దోపిడీలు చేస్తూ హతమార్చే ఆటవిక తెగ రాజై వుండాలి. అంగుళి మాలుడు కథను ప్రాతిపదికగా చేసుకుని 'సహస్ర శిరచ్ఛేద అపూర్వ చింతామణి' కథ ప్రాచుర్యంలోకి వచ్చి వుంటుంది. రామాయణం రాసిన వాల్మీకి బోయవాడుగా

దారిన వచ్చిపోయే వారిని దోపిడీ చేసి చంపేవాడని ఒక కథ ప్రచారంలో వుంది. తర్వాత అతడు రుషిగా, కావ్యకర్తగా ఎదిగాడని, అతనికి తొలుత చదువు రాదని పలు కథలు ప్రచారంలో వున్నాయి. వాల్మీకి బోయ తెగ దోపిడీదారుగా ఉండేవాడు అనే కథ బహుశా అంగుళి మాలుని కథ ఆధారంగానే సృష్టించబడి వుంటుంది. బుద్ధుని తర్వాత నాలుగు శతాబ్దాలకు వాల్మీకి రామాయణం రాయబడిందని అందులోని భాష, సంస్కృతి సంఘటనలు ఆధారంగా చరిత్రకారులు ఒక అభిప్రాయానికి వచ్చారు. బుద్ధుడు ఒక ఆటవికుణ్ణి సన్మార్గంలో పెట్టి బౌద్ధ భిక్షువుగా మార్చిన కథకు సమాంతరంగా బోయ తెగ దోపిడీదారైన వాల్మీకిని సన్మార్గంలో పెట్టి అతని చేత రామాయణం రాయించబడింది అని వర్ణ సమాజం ప్రచారంలోకి తెచ్చి వుంటుంది.

క్రీ.శ. 147లో తండ్రిని చంపి రాజ్యానికొచ్చిన పుష్యమిత్ర కథను రామాయణంగా రాశారని రాహుల్ సాంకృత్యాయన్ పేర్కొన్నారు. బౌద్ధ అట్ట కథలలో, జాతక కథలలో రామాయణ కథ కూడా ఉంది. బౌద్ధ సాహిత్యం నుండే తీసుకొని బుద్ధునివంటి ఉదాత్త మానవుని చిత్రణ చేసి వర్ణ వ్యవస్థను నిలబెట్టే ప్రయత్నంలో భాగంగా రామాయణం రాయబడిందని చరిత్రకారుల అభిప్రాయం. ఏమైనప్పటికీ, బౌద్ధ సాహిత్యానికి పోటీగా వర్ణ సమాజ సాహిత్యం విస్తరించింది అని చరిత్రకారుల అభిప్రాయం. అంగుళి మాలుడి కథ ఆ క్రమంలో అగ్ర వర్ణీకరణ పొంది వుంటుంది. అతడు ఆటవికుడు కాదు, బ్రాహ్మణుని కుమారుడే. గొప్ప పండితుడే. శాపవశాన అలా మారాడు అని సమాజ అంగీకారం కోసం బౌద్ధ భిక్షువుగా అంగుళి మాలుడు తిరుగుతున్న క్రమంలో ప్రచారం చేయబడి వుంటుంది. ఎందుకంటే, వందలాది మందిని చంపిన మనిషిని చూసి భయపడడం సహజం. అతన్ని హింసించడం సహజం. హింసను భరించి తన అహింసా ప్రవృత్తిని పెంచుకున్నాక అతని పట్ల కలిగిన సదభిప్రాయం వల్లనే అంగుళి మాలుడు ప్రసేనజిత్ దర్బార్‌లోని గార్గేయ పండితుని కుమారుడని కల్పన చేయబడి వుండవచ్చు. వెయ్యి మందిని చంపడం కూడా అతిశయోక్తి అయి వుంటుంది. క్రూరుడు అనగానే అదిగో పులి అంటే, ఇదిగో బారెడు తోక అని వర్ణించినట్టు చిలువలు పలువలు చెప్పుకోవడం సహజం. ఏమైనప్పటికీ, అంగుళి మాలుడి కథ మౌలికంగా జరిగిన కథే అయి వుంటుంది. ఎంతో చరిత్ర అధ్యయనం చేశాకే డా॥బి.ఆర్.అంబేద్కర్ "బుద్ధుడు – అతని ధర్మం" గ్రంథంలో అంగుళి మాలుని గురించి పేర్కొన్నారని చెప్పవచ్చు.

మానవ సమాజం ఆటవిక సమాజం నుండి, హింసా ప్రవృత్తి నుండి, దోపిడీ

దొంగతనాల గణ తెగల జీవితాల నుండి పౌర సమాజంగా మారుతున్న క్రమంలో బౌద్ధం నిర్వహించిన పాత్ర ప్రపంచ చరిత్రలో అపూర్వమైనది. శాంతియుత పరివర్తనతో గణ తెగలను ఒక సమాజంగా కలిపి ఉంచడంలో బుద్ధుడు చేసిన కృషి మహోన్నతమైనది. అంగుళి మాలుడు కథ అందుకు ఒక ఉదాహరణ. సమాజాన్ని మార్చదలచుకున్నవారికి సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను మార్చడం కర్తవ్యం. అలా బుద్ధుడు రాజులను, వర్తకులను, ఆమ్రపాలి వంటి వేశ్యలను, ఆటవికులను, క్రూరులను, బ్రాహ్మణులను, శూద్రులను, స్త్రీలను - ఇలా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను బౌద్ధంలోకి ఆకర్షించగలిగాడు. అందరినీ సమానంగా చూశాడు. ఒక నూతన సోషలిస్టు సమాజాన్ని నిర్మించాడు. బుద్ధుడు ప్రపంచంలోని మొట్టమొదటి సోషలిస్టు సమాజాన్ని నిర్మించి మానవాళికి మహోపకారం చేశాడు. అందుకు శాంతి-అహింసలను, మానసిక పరివర్తనను, స్వీయ సంస్కార ప్రక్రియలను మార్గాలుగా స్వీకరించాడు. బుద్ధుడు సమాజంలోని అన్ని వర్గాలపై వేసిన ప్రభావానికి అంగుళి మాలుడి ఉదంతం ఒక ప్రబలమైన సాక్ష్యం.

మాష్టార్జీ ఈ నాటకాన్ని చక్కగా మలిచారు. మాష్టార్జీ ప్రముఖ వాగ్గేయకారుడు. మూలవాసుల సిద్ధాంతాన్ని, అంబేద్కరిజాన్ని జీవన దర్శనంగా సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో విస్తారమైన కృషి చేస్తున్నారు. ముప్ఫై ఏళ్లుగా దళిత కళామండలి స్థాపించి చేస్తున్న కృషి ద్వారా మాష్టార్జీ ఒక మహాకవిగా తన స్థానాన్ని సంపాదించుకున్నాడు. దళిత గేయ సాహిత్యానికి మాష్టార్జీ ఒక ప్రతీక. పాతికేళ్లుగా మాష్టార్జీ చేస్తున్న కృషి చరిత్రలో మహత్తరమైన కర్తవ్యాన్ని నిర్వహించింది. దళిత రచయితల, కళాకారుల, మేధావుల ఐక్యవేదిక 1991లో ఏర్పడినప్పుడు గూడ అంజయ్య, వి.జి.ఆర్. నారగోని నాతో పాటు దాని ప్రారంభం నుండి చురుకుగా పాల్గొన్నారు. 1992లో ప్రథమ మహాసభల్లో నేను అధ్యక్షులుగా, మాష్టార్జీ ప్రధాన కార్యదర్శిగా, దళిత రచయితల, కళాకారుల, మేధావుల ఐక్యవేదిక పూర్తి స్థాయి నిర్మాణం ఏర్పడింది. 1998లో మాష్టార్జీ దీనికి అధ్యక్షులు కూడా అయ్యారు. ఇలా రెండు దశాబ్దాల సామాజిక, సాంస్కృతిక రంగాల మా సహచరుడు మాష్టార్జీ. మాష్టార్జీ దళిత గీతాలు, స్త్రీ వాద గీతాలు ఎంతో సుప్రసిద్ధం. మాష్టార్జీ కృషిపై మద్దెల రాజు చక్కని ఎంఫిల్ గ్రంథం ప్రచురించాడు.

తాను ఎన్నుతున్న మార్గంలో మాష్టార్జీ వందలాది మూలవాసుల పాటలు రాశారు. మూలవాసుల సిద్ధాంతాన్ని ప్రచారం చేస్తున్నారు. డా॥ బి.ఆర్. అంబేద్కర్ జీవిత

చరిత్రను జనకథగా మలిచారు. అటు తర్వాత దాన్ని నాటకంగా రాశారు. అంబేద్కర్ గురించిన నాటకం గొప్ప నాటకంగా ఇప్పటికే పలువురి ప్రశంసలందుకున్నది. వచన సాహిత్యంలో కూడా మాష్టార్జీ ఎంతో శిల్పనైపుణ్యం సాధించారని అంగుళి మాలుడి నాటకం కూడా సాక్ష్యం ఇస్తున్నది. పరిణతి చెందిన విధంగా నాటక నిర్మాణం సాగింది. సంభాషణల ద్వారా నాటకం ముందు శ్రవ్య నాటకంగా ఆకట్టుకున్నప్పుడే దృశ్య నాటకంగా మరెన్నో రెట్లు ప్రభావం వేస్తుంది. ఈ శిల్ప రహస్యం తెలిసిన మాష్టార్జీ పాత్ర చిత్రణలో, సంభాషణ నడపడంలో, చర్చ నిర్వహించి బుద్ధుడు అంగుళి మాలుడిని మార్చడంలో, కథను స్పష్టంగా అర్థం చేయించడంలో తన నైపుణ్యాన్ని ప్రదర్శించారు. అందువల్ల, ఒక చక్కని కథగా కూడా ఈ నాటకం గొప్పగా చదివిస్తుంది. ఆసక్తికరంగా చదివించడంలో మాష్టార్జీ విజయం సాధించారు.

సన్నివేశ చిత్రణలో చిన్న చిన్న సన్నివేశాలతో ఎంతో గొప్పగా కథను నడిపించడం మాష్టార్జీ ఎలా చేశారో ఈ నాటకంలో గమనించవచ్చు. అంగుళి మాలుడు, విష్ణుశర్మ, విష్ణుశర్మ తల్లి, సామంతరాజు, ప్రసేనజిత్ మహారాజు, మంత్రి, సేనాపతి, గార్గేయుడు, గౌతమ బుద్ధుడు పాత్రలను, వాటి స్వభావ చిత్రణను చక్కగా చిత్రించారు. నాటకంలో అటోత్కు, ఘటోత్కుల పాత్రల ద్వారా కథను పరోక్షంగా నడపడంతో పాటు ప్రేక్షకులకు కాస్త హాస్య శృంగారాలను అందించి లోతైన కథా వస్తువు నుండి కాస్త హాయిని కలిగించారు. ఆనందుని పాత్ర కూడా ప్రవేశపెట్టి బుద్ధుడు, ఆనందుడు, అహింసకుడు (అంగుళి మాలుడు) మధ్య సంభాషణ నిర్వహించడం ద్వారా ప్రేక్షకులకు, పాఠకులకు బుద్ధుని కాలం నాటి చరిత్రలోకి మనల్ని తీసుకు వెళ్తారు. అంగుళి మాలుడు 999 మందిని చంపిన విషయమొక్కటే భయ బీభత్సం కలిగిస్తుంది. అతనిలో కలిగిన పరిణామం ఆశ్చర్యం గొలుపుతుంది. మనుషులు ఇంత తొందరగా మారగలరా అనిపిస్తుంది. ఎంతో చర్చ జరిగితే తప్ప మారడం సాధ్యం కాదు. అలాంటి చర్చ జరిగే వుంటుంది. అయితే, నాటకంలో వుండాల్సిన సంక్షిప్తత రీత్యా కొన్ని డైలాగుల్లోనే పరివర్తన క్రమం చూపడం కనపడుతుంది. ఇలా మాష్టార్జీ నాటకం పరిమితిని చక్కగా గమనించినట్టు కనపడుతుంది.

విష్ణుశర్మ తల్లికి విష్ణుశర్మను ప్రాణాలతో కాపాడలేకపోయినందుకు చింతిస్తూ కొన్ని వరహాలు ఆర్థిక సాయం పంపిస్తాడు ప్రసేనజిత్. ఒక తల్లి హృదయం ఎలా వుంటుందో ఒకే డైలాగ్‌లో రచయిత ఇలా పలికిస్తాడు. “ఇంద తీసుకోండి మీరిచ్చిన

వరహాలు, మీ వరహాలు మా కొడుకు ప్రాణాలను తిరిగి తీసుకురాగలవా?" అంటూ నేలమీద పడి రోదిస్తుంది.

గౌతమబుద్ధుని ఉదాత్త సంస్కారాన్ని చిత్రించడానికి అందునా కేవలం డైలాగులో ప్రతిఫలించాలంటే బుద్ధుని తత్వం పూర్తిగా అర్థం కావడం అవసరం. అప్పుడే డైలాగుల్లో పరిణతి సాధ్యమవుతుంది. అలాంటి డైలాగులు మాష్టార్జీ ఇలా రాశారు. "అంగుళి మాలుడి నేరాల వెనుక ఏ బలీయమైన కారణముందో, ఏ ప్రబలశక్తి అతనిచేత ఆ నరమేథం చేయిస్తుందో మనం విశ్లేషించగలిగితే అతడు క్షమార్హుడు అవుతాడేమో".

"నీవు గురుపత్నిని స్పృశించకుండానే శిక్షను అనుభవించగా లేనిది నన్ను స్పృశించకుండా వధించలేవా?" అంటూ బుద్ధుడు వేసిన ప్రశ్న చాలా లోతైనది. అంగుళి మాలున్ని మార్చడంలో కీలకమైన ప్రశ్న ఇదే.

తాను ఎక్కడ ఎలా మోసపోయాడో, బోల్తా పడ్డాడో తనను తాను పరిశీలించుకోడానికి పురికొల్పిన ప్రశ్న ఇది. మాష్టార్జీ రాసిన ఈ ఒక్క డైలాగే అంగుళి మాలుడిలో వచ్చిన మార్పును సూచించడానికి సరిపోయేంత ప్రశ్నార్థక జవాబు ఇమిడి వున్నది. గురుపత్నిని స్పృశించకుండానే శిక్ష అనుభవించినప్పుడు నన్ను స్పృశించకుండానే నన్ను హతమార్చలేవా? అనే బుద్ధుని ప్రశ్న నాటకంలో పాత్రధారుల హావభావాల ద్వారా నాటక దర్శకుడు ఆ పాత్రధారులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించినప్పుడు మరెన్నో రెట్ల ప్రభావాన్ని వేస్తుంది. మొత్తం నాటకానికి ఈ డైలాగే మూలం.

అంగుళి మాలుడు బౌద్ధ భిక్షువుగా మారిన క్రమం, ఆమ్రపాలి వేశ్య బౌద్ధభిక్షువుగా మారిన క్రమం, ఉపాలి, ఆనందుడు బుద్ధుని తల్లి గౌతమి బౌద్ధభిక్షువుగా మారిన క్రమం – ఇలా బుద్ధుడి జీవితమంతా వందల వేల మందిని ఎన్నో క్రమాల ద్వారా బౌద్ధ భిక్షువులుగా, అర్హతులుగా, శ్రమణకులుగా మార్చాడు. ప్రసేనజిత్ రాజు అందులో ఒకడు. బౌద్ధ జాతక కథల్లో ప్రసేనజిత్ రాజ్యంలోని జేత వనం అనేకసార్లు అనేక సందర్భాల్లో వస్తుంది. బుద్ధుని అట్ట కథలు (అర్థ కథలు), జాతక కథలు బుద్ధుని గురించిన ఉద్యమాల పరిణామాన్ని అనేక నీతులతో, సందర్భాలతో, పునర్జన్మలతో చెప్తాయి. అయితే, బౌద్ధంలో బుద్ధుడు పునర్జన్మను గురించి గానీ, భగవంతుని గురించి గానీ ఎక్కడా చెప్పలేదు. మనిషిని మనిషిగా గౌరవించాలని చేసిన కర్మలకు ఫలితం అదే జన్మలో ఉంటుందని చెప్పాడు. దాన్ని ఆ తర్వాత పునర్జన్మ సిద్ధాంతానికి అన్వయించి వర్ణవాదులు కర్మ సిద్ధాంతాన్ని ప్రచారంలోకి తెచ్చారు. ఇలా బుద్ధుడు

ముందుకు తెచ్చిన అనేక అంశాలు చరిత్ర క్రమంలో వక్రీకరించబడ్డాయి. డా॥ బి.ఆర్. అంబేద్కర్ వాటన్నిటినీ చెరిగి అంతస్సారాన్ని గ్రహించి 'బుద్ధుడు – అతని ధర్మం' అనే గ్రంథాన్ని రాయడంతో పాటు నవ బౌద్ధం అనే బౌద్ధ శాఖను వ్యాప్తిలోకి తెచ్చాడు. అలా, నవ బౌద్ధంలో భాగంగా రాయబడిన మాష్టార్జీ అంగుళి మాలుడు నాటకం పలు ప్రదర్శనలు పొందాలనే ఆశిస్తున్నాను. చక్కని నాటకాన్ని రాసిన మాష్టార్జీకి హృదయపూర్వక అభినందనలు. ఈ నాటకాన్ని ప్రదర్శనా యోగ్యంగా మలచిన వారికి, ప్రజల్లోకి తీసుకువెళ్తున్న దర్శకులకు, నటీనటులకు అభినందనలు.

తేది : 8-7-2008

డా॥ మొయిలి శ్రీరాములు కృషి
సాహిత్య పరిశోధనలో ఒక మైలురాయి

కత్తి పద్మారావు జీవితం - సాహిత్యం

డా॥ మొయిలి శ్రీరాములు విశేష పరిశోధనతో ఈ గ్రంథాన్ని రచించారు. 'కత్తి పద్మారావు సాహితీ సాక్షాత్కారం' అనే ఈ గ్రంథం తెలుగు సాహిత్య పరిశోధనలో ఒక మైలురాయి. కత్తి పద్మారావుగారి జీవితం, వ్యక్తిత్వం, సాహిత్యం గురించి, వాటి పరిణామాల గురించి ఈ పరిశోధనాగ్రంథం ఒక విజ్ఞాన సర్వస్వం. కొండ అద్దంలో ఒదిగిపోయినట్లు ఆకాశమంత ఎత్తు ఎదిగిన కత్తి పద్మారావుగారి జీవితం, సాహిత్యం ఇందులో కనపడతాయి.

కొండ లేకుండా అద్దంలో కనపడదు. అద్దం లేకుండా కొండను సంక్షిప్తంగా చూపించడం సాధ్యపడదు. కత్తి పద్మారావు కృషి బహుముఖాలుగా సాగింది. దాన్ని ఒక అద్దంలో ప్రతిఫలింప చేయడం అంత సులభం కాదు. బహుముఖీన వ్యక్తిత్వం, సామాజిక కార్యకలాపాలు, భావధార, సాహిత్య పరిణామాలను ఒకచోట చేర్చి అందించిన డా॥ మొయిలి శ్రీరాములు, అందుకు మార్గదర్శకత్వం అందించిన డా॥ కొండపల్లి సుదర్శనరాజుగారలు అభినందనీయులు.

కత్తి పద్మారావు స్వాతంత్ర్యానంతరం పుట్టి ఎదిగిన మహాకవి. అంతేకాదు. ఆయన మహావక్త. గొప్ప నాకుడు. గొప్ప దార్శనికులు, భారతీయ సాహిత్య తాత్విక మూలాలను తేనెపట్టు నుండి తేనెను పిండినట్టుగా ఒడిసిపట్టినవాడు. భారతీయ దర్శనాలతో అది దర్పనమైన చార్వాక, లోకాయత దర్శనం మొదలుకొని బౌద్ధం, జైనం, మాతృస్వామికం, స్త్రీవాదం, పితృస్వామ్య వ్యవస్థలో స్త్రీ, అంబేద్కర్ తత్వశాస్త్రం దాకా వేలాదవి పేజీల తాత్విక చరిత్రను అందించినవాడు. వ్యక్తిత్వంలో, సాహిత్యంలో వాటిని నిక్షిప్తం చేసుకున్నవాడు. వ్యక్తిత్వం వికసిస్తున్న బాల్యదశ నుండి

మహానాయకుడుగా ఎదిగే క్రమంలో జరిగిన పరిణామాలన్ని అతని వ్యక్తిత్వంలోను, సాహిత్యంలోను, కవిత్వంలోను, తత్వశాస్త్రంలోను విస్తారంగా రికార్డయ్యాయి. వాటన్నిటిని ఒక్కచోట చేర్చి ఒక సమగ్ర మహోన్నత వ్యక్తిత్వ ఆవిష్కారాన్ని చేసిన డా॥ మొయిలి శ్రీరాములు కృషి చరిత్రలో నిలిచిపోతుంది.

కత్తి పద్మారావుగారి జీవిత రేఖలు ఈ గ్రంథంలో సంక్షిప్తంగా పరిచయం చేయడం జరిగింది. సంక్షిప్త పరిచయం అయినప్పటికీ చాలామందికి ఇందులోని విషయాలు కొత్తగా కనపడతాయి. మనకు తెలిసిన మనిషి వెనుక ఇంత చరిత్ర వుందా? అని ఆశ్చర్యపోతారు. చాలామంది ఈ వివరాలు తెలియకుండానే అంతా తెలుసునని అనుకుంటారు. కత్తి పద్మారావు పుట్టుకతోనే ఒక సంఘర్షణ సమాజంలో సంఘర్షించే అవసరంలో పుట్టిన విషయం ఈ గ్రంథం చదివితే తెలుస్తుంది. కత్తి పద్మారావుగారి తల్లిదండ్రులు సుబ్బయ్య, జానకమ్మగారల ధైర్యం, ప్రేమ, పట్టుదల పునికిపుచ్చుకున్న క్రమం మొదటి అధ్యాయంలో కనపడుతుంది. కులం, తల్లిదండ్రుల పెంపకం, గురువుల శుశ్రూష, బాల్య వ్యక్తిత్వాన్ని ఎలా తీర్చిదిద్దాయో డా॥ మొయిలి శ్రీరాములు చక్కగా కథంత ఆత్మీయంగా విశ్లేషించారు.

కత్తి పద్మారావు పదవ తరగతిలో ఉన్నప్పటి నుంచి గ్రంథాలయ పఠనం ప్రారంభించారు. చీరాల గ్రంథాలయంలో అనేక పుస్తకాలతో పాటు జీవిత చరిత్రలను ప్రత్యేకంగా అధ్యయనం చేశారు. అలా ఎండ్లూరి చిన్నయ్యగారు రాసిన అంబేద్కర్ జీవిత చరిత్రను చదవడం జరిగింది. అప్పుడే తన ముందున్న మార్గమేమిటో స్పష్టమయింది. సంస్కృత కళాశాలలో చేరమని ఉపాధ్యాయులు సూచించడంతో సంస్కృత అధ్యయనం ప్రారంభించారు. సంస్కృత కళాశాలలో కొండవీటి వెంకట కవిగారి శిష్యరికంలో నాస్తిక హేతువాద భావాలు అలవరచుకున్నారు. చదువులో, సంఘర్షణలో ఎదురైన కష్టాల్లో వెంకట కవిగారు సహకరించిన తీరు ఇందులో చక్కగా వివరించారు.

కత్తి పద్మారావు 1975 మేలో డిగ్రీ పూర్తి కావడంతోనే తెలుగు జూనియర్ లెక్చరర్గా ఎన్నికయ్యారు. ఆ తర్వాత ఏడాదికి సంస్కృత కళాశాలలో లెక్చరరు ఉద్యోగాన్ని సంపాదించారు. 1976 ఏప్రిల్ 17వ తేదీన స్వర్ణకుమారి గారితో కులాంతర వివాహం కొండవీటి వెంకట కవిగారి చేతులమీదుగా జరిగింది. హేతువాద ఉద్యమంలో మంచి వక్తగా, కవిగా పేరు తెచ్చుకున్న కత్తి పద్మారావు మౌలికంగా సాహితీవేత్త. అయినప్పటికీ సమాజం తన చారిత్రక పురుషులను తానే తయారు చేసుకునే క్రమంలో

భాగంగా కత్తి పద్మారావు దళిత ఉద్యమ నిర్మాతగా, గొప్ప ఆర్గనైజర్‌గా, నాయకుడుగా, దార్శనికులుగా ఎదిగారు. కత్తి పద్మారావుని చరిత్ర సృష్టించింది. కత్తి పద్మారావు చరిత్ర సృష్టించారు. ఇలా వ్యక్తి, వ్యక్తిత్వం చారిత్రక అవసరం సంశ్లేషణలో భాగంగా కత్తి పద్మారావు బహుముఖాలుగా విస్తరించారు. చెల్లాచెదురుగా చరిత్ర శకలాలుగా ఉండిపోయిన వీటన్నిటినీ ఒక్కచోట చేర్చి ఒక స్పష్టమైన రూపాన్ని ఇచ్చిన గొప్ప శిల్పి డా॥ మొయిలి శ్రీరాములు.

రాష్ట్ర చరిత్రలో కారంచేడు దుర్ఘటన ఒక మలుపు. అది కత్తి పద్మారావుగారి జీవితంలో కూడా ఒక మలుపు. చరిత్ర ఇస్తున్న పిలుపును అందుకుని ఉద్యోగాన్ని కూఆ వదులుకుని సమాజం కోసం, దళిత ఉద్యమాల కోసం, సాహిత్యం కోసం పూర్తికాలపు కార్యకర్తగా తనను తాను మలుచుకున్నారు. ఈ క్రమంలో ఎదురైన ఆర్థిక బాధలు చెప్పనలవి కాదు, నిర్బంధాలు ఎదుర్కోవడం ఒక ఎత్తు అయితే ఆర్థిక బాధలు ఎదుర్కోవడం మరొక ఎత్తు. మొక్కవోని నిబద్ధత, నిమగ్నత నిలుపుకొంటూ సమాజాన్ని ముందుకు నడుపుతూ ఒక మెస్సయ్యలా తనవెంట లక్షలాది జనాల్ని నడిపిస్తూ ముందుకు సాగిన కత్తి పద్మారావు సామాజిక చరిత్రలో నిర్వహించిన మహోన్నత పాత్ర గురించి మరెన్నో పరిశోధనా గ్రంథాలు వెలువడడానికి ఇందులో వాటి మూలాలను అందించే ప్రయత్నం చేశారు.

కత్తి పద్మారావు కవిత్వాన్ని పరిశీలిస్తూ డా॥ మొయిలి దళిత సాహిత్య నిర్వచనాన్ని చర్చించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు అంతా దళితులే అనే విస్తృతమైన అర్థాన్ని దళిత పరిధిగా స్వీకరించారు. దళిత సాహిత్యం, అందుకు మూలమైన సామాజిక పరిణామాలు, ఉద్యమాలు వాటి చరిత్రని మహాత్మ జ్యోతిబా ఫూలే మొదలుకొని వివరించారు. అలాగే భక్తి ఉద్యమాలను కూడా చర్చించారు. దళిత మహాసభ కారంచేడు దుర్ఘటన తర్వాత ఏర్పడింది. ఆ తర్వాత అది ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభగా కత్తి పద్మారావు నాయకత్వంలో కొనసాగింది. ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ ప్రారంభించిన ఆత్మగౌరవ పోరాటాలు దళిత చైతన్యాన్ని పదునెక్కించాయి. వందలాది ప్రసంగాలు చేసిన కత్తి పద్మారావు వేలాది క్యాసెట్లతో ఊరూరా విన్పించారు. సింహగర్జనతో దళిత సమాజం గొప్ప చైతన్యంతో ముందుకుసాగింది. అందులో కత్తి పద్మారావు ఒక చారిత్రక పాత్ర.

ఇవన్నీ కత్తి పద్మారావు సాహిత్యంలో కూడా ఎలా ప్రతిఫలించాయో డా॥ మొయిలి తన పరిశీలనలో నిర్ధారించారు. కత్తి పద్మారావు హేతువాద ఉద్యమంలో

పనిచేస్తూ 'జనగీతం' అనే దళిత సంపుటిని వెలువరించారు. దీన్ని కారల్‌మార్క్స్‌కు అంకితం ఇచ్చారు. 'జైలుగంటు', 'విముక్తి గీతం' అనే కవితా సంపుటాలు 1988లో వెలువడ్డాయి. 'దేశం డైరీ' అనే నాలుగో సంపుటి 1989లో అచ్చయింది. నాయకుడే కవి, గాయకుడు, పథనిర్దేశకుడుగా చుండూరు ఉద్యమంలో కత్తి పద్మారావు 'రక్తక్షేత్రం' కవితా సంపుటి వెలువరించారు. ఇవి నాయకుడు, కవిగా, కవి నాయకుడుగా ఉన్న ఉద్యమాల్లో ప్రజల్ని ఉత్తేజపరిచేందుకు చేసిన కృషిని తెలుపుతాయి. అవి సాహిత్య రూపంలో కొందరికి బలహీనంగా కనపడవచ్చు. కాని ఉద్యమాల్లో మాటే మహాకావ్యంలా ప్రభావితం చేస్తుంది. అలాంటి మహత్తర కర్తవ్యాలను ఈ కవితా సంపుటాలు నిర్వర్తించాయి. వందలాది, వేలాది కార్యకర్తలను, నాయకులను తీర్చిదిద్దడంలో ఈ కవితలు నిర్వహించిన పాత్ర అపారమైనది. అందువల్ల వీటికి సాహిత్య లక్షణాలతో పాటు చారిత్రక లక్షణాలు కూడా ఏర్పడ్డాయి. అందుకే ఇప్పటికీ వాటిని చదువుతుంటే హృదయం ఉప్పొంగుతుంది. నిజమైన కవిత్వానికి ఇంతకన్నా ఏం కావాలి?

కత్తి పద్మారావు కవితా సంపుటాలను రెండుగా వర్గీకరించవచ్చు. ఉద్యమ స్ఫూర్తిని రగిలించడం కోసం మహోపన్యాసంలా ప్రవాహ శైలితో రాసిన కవితలు ఒకవైపు. సాహిత్య ప్రక్రియలో దళిత అలంకార శాస్త్రాల్ని, దళిత ప్రతీకల్ని అభివృద్ధి పరుస్తూ దళిత కవులకు, సాహితీవేత్తలకు మార్గదర్శనం చేసే సాహిత్య కృషి మరొకవైపు. ఈ రెండవ వర్గీకరణ 'నల్లకలువ' కవితా సంపుటిలో ప్రారంభమవుతుంది. దళిత రచయితల, కళాకారుల, మేధావుల ఐక్యవేదిక 1992లో ఏర్పడ్డాక దళిత సాహిత్యం ఒక మలుపు తిరిగింది. మొత్తం తెలుగు సాహిత్యమే ఒక మౌలికమైన మలుపును తీసుకుంది. దళిత సాహిత్య ప్రక్రియలు ప్రత్యేక అస్తిత్వంతో, ప్రత్యేక వస్తు శిల్ప రూప నైపుణ్యంతో విశిష్టతతో వెలువడ్డం వేగం పుంజుకుంది. అంబేద్కర్ ఆలోచనా విధానం తాత్విక భూమికగా వెలువడిన సాహిత్యం తెలుగు సాహిత్యంలోఒక సువర్ణాధ్యాయం. ఈ క్రమంలో అంతదాకా తెలుగు సాహిత్యం అందుకున్న శిఖరాలను అధిగమించి మరింత ఉన్నతంగా దళిత సాహిత్యం వెలువడింది. శివసాగర్, మాష్టార్జీ, ఉ.సాంబశివరావు, ఎండ్లూరి సుధాకర్, సతీష్‌చందర్, కలేకరి ప్రసాద్, మద్దూరి నగేశ్‌బాబు మొదలైన కవులు దళిత సాహిత్య ప్రతీకలను, దళిత సాహిత్య అలంకార శాస్త్రాలను తమ రచనల ద్వారా రూపొందించే కృషి చేశారు. ఆ క్రమంలో కత్తి పద్మారావు 'నల్లకలువ' కవితా సంపుటి వెలువరించారు.

ఆ క్రమంలో నీలికేక, ముళ్ళకిరీటం, భూమిభూష అనే కవితా సంపుటాలు వెలువరించారు. కత్తి పద్మారావుగారు సాహిత్యంలో తెస్తున్న ప్రత్యేక అభివ్యక్తి ప్రతీకలను స్వంత గొంతుకను సాహిత్యకారులు స్పష్టంగా గుర్తించారు. డా॥ సి.నారాయణరెడ్డి, అవంత్స సోమసుందర్ మొదలైన సీనియర్ కవులచేత సత్కారం పొందారు. కత్తి పద్మారావు కవితా కృషిపై ఇందులో చక్కని పరిచయం, విశ్లేషణ చూడవచ్చు. వైదిక సాహిత్యంపై విమర్శ కవితాత్మకంగా ఎలా చెప్పారో ఇందులో వివరించారు. రామాయణ, భారత పురాణ ఉపనిషత్ సాహిత్యాన్ని పూర్వపక్షం చేస్తూ వాటి "ప్రతీక" విలువలను తలక్రిందులు చేస్తూ శంభుకుడిని, ఏకలవ్యుని తమ వారసులుగా గుర్తిస్తూ వారిని అణిచివేసిన వారిగా బ్రాహ్మణవాద పురాణసాహిత్యాన్ని కుండబద్దలు కొట్టినట్టు కవితాత్మకంగా చీల్చిచెండాడారు. సైద్ధాంతిక పోరాటం సాహిత్య కవిత్వ రంగాల్లో ఎంత గొప్పగా చేశారో మొయిలి శ్రీరాములు తన పరిశీలన ద్వారా మనముందుంచారు. ఒకవేపు తీరికలేని సామాజిక నిర్మాణం, కార్యకర్తల నిర్మాణం కోసం నిరంతరం శ్రమిస్తూనే ఇంత విస్తారంగా, ఇంత వైవిధ్య పూరితంగా, ఇంత ఉన్నతంగా కవిత్వం రాయడం ఆశ్చర్యం గొలుపుతుంది. వెంటదివెంట చదివినప్పుడు కలిగిన భావం వేరు. ఇప్పుడు దశాబ్దాల కృషిని ఒకచోట రాశి పోసి చదువుతున్నప్పుడు కలిగే భావం వేరు. కత్తి పద్మారావు సాహిత్య, కవిత్వ తాత్విక రంగాల్లో ఎంత విస్తారంగా కృషి చేశారు. సింహావలోకనం చేసినట్లుగా ఈ కృషి కనబడుతుంది. ఒక్కసారిగా ఒక్కసారిగా మన హృదయ ఫలకం మీద కత్తి పద్మారావు పట్ల కవిగా ఉండే భావం ఉన్నత శిఖరాలుగా ఎదుగుతుంది. ఇంత చక్కని పరిశీలన అందించిన డా॥ మొయిలి శ్రీరాములు గారికి కత్తి పద్మారావుగారంటే ఎంత అభిమానమో చెప్పకనే తెలిసిపోతుంది.

అయితే అభిమానంతో ఈ పరిశీలన గ్రంథంలో అధిక ప్రశంస చేసినట్లు ఎక్కడా కనపడదు. పరిశీలన విశ్లేషణ ద్వారానే పాఠకులకు కూడా కత్తి పద్మారావు పట్ల, వారి కవితా కృషి పట్ల అపారమైన గౌరవాన్ని కలిగిస్తారు. ఒక నాయకుడుగా, ఉద్యమ నిర్మాతగా, తత్వవేత్తగా ప్రజలను ఎటువేపు నడిపించాలే కర్తవ్యబోధను కవితల్లో కూడా ఎలా ఉత్తేజపూరితంగా చెప్పారో ఇందులో విశ్లేషించారు. కులవివక్షతకు వ్యతిరేకంగా బ్రాహ్మణీయ హిందూ సంస్కృతికి వ్యతిరేకంగా కుల ప్రత్యామ్నాయ సంస్కృతి గురించిన కార్యక్రమాలను ఇస్తూ కత్తి పద్మారావు వందలాది కులాంతర వివాహాలను చేశారు. తన కుటుంబంలోని అందరికి కులాంతర వివాహాలను చేసిన ఆదర్శజీవి. మూడు తరాలు కులాంతర వివాహాలు చేసుకుంటే అటు తర్వాత కులం

Dalithayugam-2
03-09-09
49

అదృశ్యమవుతుంది అనే స్పష్టతతో కత్తి పద్మారావు ఆచరించి చూపారు. ఇలా చెప్పేదానికి చేసేదానికి మధ్యవైరుధ్యం లేకుండా ఆచరణ సాగించారు. వివిధ కులాల సమస్యలను, స్త్రీల సమస్యలను సమాజంలోని పలు సమస్యలను పట్టించుకుని వస్తువును శిల్పాన్ని వన్నెకెక్కించిన క్రమాన్ని మొయిలి శ్రీరాములు చక్కగా పట్టుకోగలిగారు.

దళితుల ఆలోచాన విధానాన్ని, ఆహార అలవాట్లను, మానవీయ సంస్కృతిని పేదరికంలోను ఉండే జీవసౌందర్యాన్ని, ఆత్మీయ అనుబంధాలను ఎంత గొప్పగా చిత్రించవచ్చో కత్తి పద్మారావు కవిత్వం చదివితే తెలుస్తుంది. తెలియకపోతే మొయిలి శ్రీరాములు తన పరిశీలన ద్వారా ఈ గ్రంథంలో చక్కగా విశ్లేషించి చూపారు. అందువల్ల ఈ గ్రంథం కేవలం కవిత్వ పరిశీలన గ్రంథంగా చూడనవసరం లేదు. దళిత అభివ్యక్తి, వస్తు పరిశీలన, దళిత ఉద్యమాలు, దళిత ప్రతీకలు, దళిత సాహిత్య చరిత్ర, పరిణామాలు మొదలైనవన్నీ తెలుసుకోవడానికి, తెలుసున్న వాటిని మననం చేసుకోవడానికి మళ్ళీ స్ఫూర్తి పొందడానికి ఈ గ్రంథం అందరూ చదవడం అవసరం. దళితుల్లో తల్లి సంస్కృతి, తల్లి ప్రేమ ఎలా ఎంత విస్తారంగా ఈ భూమండలాన్ని మొత్తాన్ని ప్రేమించేదిగా ఎలా కొనసాగుతున్నదో కత్తి పద్మారావు సాహిత్యంలో అది ఎంత విస్తారంగా పరుచుకుని వుందో మొయిలి శ్రీరాములు విశ్లేషించారు. మదర్ థెరిస్సాని, ఇంగ్లాండు రాణి డయానిని వారి మరణాలను ఎలిజీలతో కాకుండా సామాజిక విశ్లేషణతో కవిత్వీకరించడం ఆశ్చర్యం కలిగిస్తుంది. మునిగోపుల గ్రామంలో కారం విజయమ్మ అనే గిరిజన స్త్రీని అతి దారుణంగా పోలీసులు చంపిన సంఘటన కవిత్వీకరించారు. అంతేకాదు, సిల్క్‌స్మిత దారుణంగా చంపబడ్డాన్ని కవిత్వంలో ప్రశ్నించిన తీరు కత్తి పద్మారావు కేవలం దళిత దార్శనికుడు కాదని మానవాళి మొత్తం తన దుఖ్ఖాన్ని తన దుఖ్ఖంగా భావంచిన బౌద్ధుడని, బౌద్ధ దార్శనికుడని స్పష్టం చేస్తుంది.

ఉద్యమ కవిత్వంలో వీరరసం ప్రధానమై వీరరసం పర్యవసానంగా బీభత్సం, రౌద్రం ఉత్పన్నమై వాటి పర్యవసానంగా కరుణరసం ప్రవహించడం ప్రధానంగా కనబడుతుంది. కత్తి పద్మారావు ఉద్యమ నిర్మాతగా మాత్రమే ఆలోచిస్తే అతని కవిత్వం కూడా ఇంత మేరకే పరిమితమై ఉండేది. అతనిలో ఉద్యమ నిర్మాతతో పాటు ఒక మనీషి ఉండడం వల్ల ప్రేమ గురించి, స్నేహాన్ని గురించి, స్ఫూర్తినిచ్చిన వారి స్తుతి గురించి గొప్ప కవితలల్లాడని ఈ గ్రంథం చదివితే తెలుస్తుంది.

రిజర్వేషన్ల పరిరక్షణ కోసం చేసే కృషి కవిత్వంలోనూ ప్రతిఫలిస్తుంది. పోరాట పిలుపులు పాటలుగా, కవితలుగా రూపుదిద్దుకున్నాయి. కత్తి పద్మారావు స్త్రీల పక్షపాతి. తల్లి సంస్కృతి పక్షపాతి. శ్రమజీవుల పక్షపాతి. అంతేకాదు, ఆయన పీడిత కులాల పపాతి. ఆయన సమస్త వర్ణ వర్గ కుల లింగ జాతి మత భాష ప్రాంత దేశ వివక్షతలు, అసమానతలు లేని మహోన్నత సమసమాజాన్ని కలగన్నారు. అందుకు బుద్ధుడి నుండి అంబేద్కర్ దాకా వారసత్వాన్ని, చరిత్రను అందిపుచ్చుకుని చరిత్రకు నాయకత్వాన్ని అందించారు. కవిత్వంలోను, సాహిత్యంలోను నాయకత్వం అందించడం కోసం ఎంత జాగ్రత్తగా ప్రణాళికాబద్ధంగా కత్తి పద్మారావు కృషి చేశారో మొయిలి శ్రీరాములు బట్టబయలు చేశారు. ఉద్యమం నిర్బంధాల్లో, నిరాశల్లో, పేదరికంలో కునారిల్లుతున్నప్పుడు కవిత్వమే ఒక శక్తిగా, పాటే ఒక ఉత్తేజంగా తిరిగి ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని అందించడం కోసం రాసిన కవిత్వం ఇందులో ఎంతో వుంది. ఉద్యమ పరిణామాలను కవిత్వ పరిణామాలను తులనాత్మక అధ్యయనం చేసే భవిష్యత్ పరిశోధకులకు మొయిలి శ్రీరాములు ఇందులో రిసోర్స్‌ను అందించారు. అలాంటి పరిశోధన జరిగినప్పుడు కత్తి పద్మారావు సాహితీ సాక్షాత్కారం విశ్వరూపం దాలుస్తుంది.

విమర్శకుడిగా కత్తి పద్మారావు జాషువాని, శ్రీశ్రీని, చెరబండ రాజుని, మహాత్మా పూలేని, కరుణశ్రీని, చలంని, కందుకూరిని, గురజాడని, త్రిపురనేని రామచౌదరిని, తాపీ ధర్మారావుని, పట్టించుకొని చరిత్రలో, సాహిత్యంలో వారు నిర్వహించిన కర్తవ్యాలను బేరీజు వేశారు. భారతీయ సంస్కృతిలో స్త్రీ ఎలా వుందో, పితృస్వామ్య వ్యవస్థలో ప్రపంచ వ్యాప్తంగా స్త్రీ ఎలా వుందో గొప్ప పరిశీలనను కత్తి పద్మారావు అందించారు. వీరశైవం స్త్రీలకు, దళితులకు ఇచ్చిన ప్రాధాన్యతను కూడా పట్టించుకున్నారు. ఈ కృషిని ఈ గ్రంథంలో పరిచయం చేయడం వల్ల కత్తి పద్మారావు వైవిధ్యపూరితమైన కృషి విశాల హృదయం, విస్తారమైన అధ్యయనం స్పష్టమవుతుంది.

వ్యాసకర్తగా, హేతువాదిగా, దళితవాదిగా కత్తి పద్మారావు రాసిన వ్యాసాలు అనేకం పత్రికలోనే ఉండిపోయాయి. వేలాది ప్రసంగాలు ప్రజల హృదయాల్లోనే ఉండిపోయాయి. వాటన్నిటినీ వెలికితీసి సంపుటాలుగా అచ్చువేయాల్సిన అవసరాన్ని శ్రీరాములు పరిశీలన స్పష్టం చేస్తున్నది. కవిత్వంలో, సాహిత్యంలో, వస్తువుతో పాటు రూపం సారం సాహిత్య విలువలు ఎలా ఉన్నతీకరించడమో నిరంతర కృషి ద్వారా కత్తి పద్మారావు రోజురోజుకు పదునెక్కుతున్న విషయం మొయిలి శ్రీరాములు సోదాహరణంగా విశ్లేషించారు. బీసీల సామాజిక చరిత్ర గురించి రాసిన విశ్లేషణ

ఆయన ఆవేదనను పట్టియిస్తుంది.

కత్తి పద్మారావు బుద్ధుని గురించి, మహాత్మా పూలే, అంబేద్కర్, పెరియార్ రామస్వామి, భగత్‌సింగ్‌ల గురించి బుర్రకథ నాజర్ గురించి, అనిల్ గురించి, అలీసమ్మ గురించి, వారు చరిత్రలో నిర్వహించిన పాత్ర గురించి చేసిన విశ్లేషణను మొయిలి ఈ గ్రంథంలో పాఠకులకు అందించారు. ఉద్యమకారుడిగా కత్తి పద్మారావు కృషి గురించి కూడా ఒక ప్రత్యేక అధ్యాయంలో చర్చించారు. కారంచేడు, చుండూరు ఉద్యమాల్లో కత్తి పద్మారావు నిర్వహించిన పాత్రను పర్యవసానంగా దళితుడే రాష్ట్రపతి కావాలి అనే నినాదం ముందుకు రావడం కె.ఆర్.నారాయణన్ ఉపరాష్ట్రపతిగా ఎన్నిక కావడం, ఆ తర్వాత రాష్ట్రపతి కావడం వెనుక కత్తి పద్మారావు సిద్ధాంత భూమిక ఎలా ప్రణాళికాబద్ధంగా కొనసాగిందో మొయిలి శ్రీరాములు చక్కగా పట్టుకోగలిగారు.

కత్తి పద్మారావు "కులం పునాదుల"ను వెలికితీస్తూ దళితుల చరిత్రను బౌద్ధ దర్శనాన్ని గాంధీ, అంబేద్కర్‌ల తులనాత్మక అధ్యయనాన్ని అంబేద్కర్, మార్క్స్, పూలే, బుద్ధుడు, అంబడ్కేడర్‌ల తులనాత్మక అధ్యయనాన్ని అంతేకాదు సోక్రటీసు, ప్లేటో, అంబేద్కర్‌ల తులనాత్మక అధ్యయనాన్ని ప్రత్యేక గ్రంథాలుగా వెలువరించారు. వాటన్నిటినీ ఇందులో పరిచయం చేశారు. ఒక్కొక్క గ్రంథం మరో వ్యాఖ్యాన విశ్లేషణ గ్రంథాల్ని అభిలషిస్తుంది.

ఇంతటి విస్తారమైన కృషి కేవలం 53 ఏళ్ల వయస్సులోనే కత్తి పద్మారావుగారికి ఎలా సాధ్యపడింది? సామాజిక ఆచరణే జీవితంగా మలుచుకోవడం ద్వారా ఇది సాధ్యపడింది. దళిత ఉద్యమంలో ఎందరో పనిచేశారు. ఎందరో నాయకులు ఎదిగారు. కత్తి పద్మారావు కన్నా సీనియర్లు ఎంతో కృషి చేశారు. అయినప్పటికీ కత్తి పద్మారావు ఒక కార్యక్షేత్రానికి పరిమితం కాకుండా అన్ని క్షేత్రాల్లో కృషి చేయడం ఎలా సాధ్యపడింది? ఇది చాలామందికి అర్థంకాని ప్రశ్న. కాని అర్థం చేసుకోవాల్సిన ప్రశ్న కూడా. కత్తి పద్మారావు తాను ఒక్కడే కాకుండా తన కుటుంబాన్ని తన తచుట్టూతా ఉండే ప్రజలను, సమాజాన్ని కూడా సామాజిక ఆచరణకనువుగా మార్చగలిగారు. తద్వారా వారంతా కత్తి పద్మారావుగారి కృషికి అన్ని విధాలుగా సహకరించారు. సామాజిక సాహిత్య రంగాలలో ఇలా మొత్తం కుటుంబాలను చుట్టూ పరిసరాలను కూడా సామాజిక ఉద్యమానికనువుగా మార్చడం కొందరికే సాధ్యపడింది. అందులో కత్తి పద్మారావు ఆధునిక స్వాతంత్ర్యానంతర ఉదాహరణగా నిలిచారు. అందువల్లే ఇంత విస్తారమైన కృషి చేయగలిగారు. వ్యక్తిగత జీవితానికి సామాజిక కర్తవ్యాలకు

మధ్య వైరుధ్యం అంతరించి సామాజిక శక్తిగా వ్యక్తిత్వం ఎదిగిన వారికే ఇది సాధ్యం.

కత్తి పద్మారావు ఉద్యమ నిర్మాతగా, నాయకుడుగా ఒక ప్రత్యేక శైలిని రూపొందించుకున్నారు. చాలా ఉద్యమాల్లో కమిటీలు ఏర్పడ్డాక యాంత్రికంగా నీ పని ఇది, ఎందుకు చేయలేదు, అని కిందిస్థాయి ఉద్యోగిని నిలదీసినట్టు ప్రశ్నిస్తారు. అధికారం ప్రదర్శిస్తారు. కత్తి పద్మారావు ఉద్యమ నిర్మాణతత్వం ప్రేమతో కూడుకున్నది. స్నేహంతో పెనవేసుకొన్నది. ఆత్మీయతతో అల్లుకున్నది. అతని కోపంలోను ఆత్మీయత అంతర్లీనంగా అల్లుకొని వుంటుంది. అందుకే ఇతర ఉద్యమాల్లో అలిగి వెళ్లిపోతే పరస్పరం విమర్శలు, దూషణలు శత్రుశిబిరాల్లాగా మారిపోతే కత్తి పద్మారావుతో పెనవేసుకొన్న వాళ్లు అలిగినా, దూరమైనా అపారమైన ప్రేమతో కత్తి పద్మారావుగారిని ప్రత్యక్షంగా, పరోక్షంగా గౌరవిస్తూనే వుండడం చూస్తుంటారు. ఇది కరుణ, ప్రేమ, కన్నతల్లి ప్రేమకు సంబంధించిన బౌద్ధ నిర్మాణ సూత్రాల మానవీయ సంబంధాలను కత్తి పద్మారావు ఉద్యమాల్లో ఒక నిబద్ధతతో నిర్మిస్తూ వచ్చారని స్పష్టం చేస్తుంది. ప్రేమ, స్నేహం అతని జీవరహస్యాల్లో ఒకటి.

డా॥ మొయిలి శ్రీరాములు ఇలాంటి విషయాలను పరిశీలించడం అతని వయస్సుకు అనుభవానికి, పరిధికి మించిన పని. అందువల్ల అలాంటి వాటి జోలికి పోకుండా తన పరిధిని స్పష్టంగా ఎరిగినవాడుగా మొయిలి శ్రీరాములు కత్తి పద్మారావుగారి సాహజతీ సాక్షాత్కార పరిశీలనకు పరిమితమయ్యారు. ఇకనుండి కత్తి పద్మారావుపై చేసే పరిశోధనలకు ఒక రిసోర్స్‌గా ఉపయోగపడే విధంగా తన సిద్ధాంత గ్రంథాన్ని అందించిన మొయిలి శ్రీరాములు పరిశోధనా రంగంలో ఒక మైలురాయిగా నిలిచిపోయే గ్రంథాన్ని అందించారు.

భారతీయ కమ్యూనిస్టు ఉద్యమాల్లో దార్శనికులు లేకపోయినా గొప్ప నాయకులుగా ఎదిగినవారున్నారు. పుచ్చలపల్లి సుందరయ్య, చంద్ర రాజేశ్వరరావు, కొండపల్లి సీతారామయ్య, కె.జి.సత్యమూర్తి, ముప్పాళ లక్ష్మణరావు (గణపతి), ఏచూరి సీతారం మొదలైన వారు ఎందరో కనపడతారు. వాళ్లు ప్రజలను కార్యకర్తలుగా, నాయకులుగా సమాజం కోసం ప్రాణత్యాగం చేసేవారుగా తీర్చిదిద్దిన కృషి గొప్పది. కాని సాహిత్యరంగంలో, అలంకార శాస్త్రంలో, భారతీయ దర్శనాల విశ్లేషణలో కత్తి పద్మారావు లాగా చేసిన కృషి కనపడదు. గొప్ప వక్తగా కత్తి పద్మారావు ఆధునిక కాలంలో వారిని మించినవారుగా ప్రసిద్ధి పొందారు. అటు సాహితీ వేత్తలతోనూ, సిద్ధాంత వేత్తలతోనూ, ఇటు సామాన్య ప్రజానీకంతోనూ, ఔరా! అన్పించుకోగలిగిన

వ్యక్తి ఒక శక్తి కత్తి పద్మారావుగారు ఒక్కరే రాష్ట్రంలో కనపడతారు. ఎందరో గొప్ప రచయితలు ఉండవచ్చు. ఎందరో గొప్ప నాయకులుండవచ్చు. ఎందరో గొప్ప దార్శనికులు ఉండవచ్చు. ఎందరో గొప్ప వక్తలుండవచ్చు. కాని ఈ అన్ని సుగుణాలు కలిసి ఒకే ఒక్కరిలో మూర్తీభవించిన వ్యక్తిత్వం కత్తి పద్మారావు. అందువల్ల కత్తి పద్మారావుగారికి తెలుగు సాహిత్యంలో, తెలుగు సమాజంలో పోలికే లేదు. చిన్న వస్తువును పెద్ద వస్తువుతో పోల్చవచ్చు. కాని సముద్రాన్ని సముద్రంతోనే పోల్చగలం అంటాడు కాళిదాసు. కత్తి పద్మారావు కూడా అంతే.

30 ఏళ్ల జీవితాన్ని, సాహిత్యాన్ని సామాజిక ఉద్యమాలను, కార్యక్రమాలను సింహావలోకనం చేస్తూ సమీక్షించిన ఈ గ్రంథం తన జీవిత కాలంలోనే వెలవడ్డం కత్తి పద్మారావుగారికి చరిత్ర అందించిన ఒక గొప్ప కానుక. తాను బతికున్న కాలంలో ఇంత గొప్ప పరిశీలనను, విశ్లేషణను చూసుకోగలగడం ఏ కొందరికో సాధ్యపడుతుంది. కత్తి పద్మారావుగారు కూడా తనను తాను అద్దంలో చూసుకున్నట్టు మునుముందు మరిన్ని రచనలు చేయడానికి, సామాజిక ఉద్యమాలు నిర్మించడానికి ఒక సమీక్షగా ఈ గ్రంథం ఉపకరిస్తుంది. తెలుగు సాహిత్యం, సామాజిక ఉద్యమాలు కత్తి పద్మారావు కృషిని ఒక్కచోట ఈ గ్రంథంలో చూసి కత్తి పద్మారావు విశ్వరూపాన్ని గమనించి ఆశ్చర్యచకితమౌతాయనడంలో ఎలాంటి సందేహం లేదు. సమకాలంలో జీవించే వారి శక్తి సామర్థ్యాలను సమాజం గుర్తించి, గౌరవించి నాయకత్వాన్ని స్వీకరించినపుడు చరిత్ర వేగంగా ముందుకు సాగుతుంది. కత్తి పద్మారావు రచయితగా, దార్శకుడుగా, నాయకుడుగా సమాజానికి ఇంకా ఎంతో అవసరం ఉందని ఈ గ్రంథం మరోసారి స్పష్టం చేస్తుంది.

వల్లంపట్ల
సమగ్ర సమాజ దార్శనికుడు

స్వాతంత్ర్యానంతర తెలుగు సామాజిక ఉద్యమ సాహిత్య చరిత్రలో వల్లం పట్ల నాగేశ్వరరావు స్థానం విశిష్టమైనది. స్వాతంత్ర్యానంతరం జాతీయ దృక్పథంతో సమగ్ర సామాజిక విప్లవాన్ని, వికాసాన్ని అభిలషిస్తూ సాహిత్య కళారంగాల్లో కృషి చేస్తున్న ఆధునిక భారతీయ సామాజిక జాతీయ కవి, కళాకారుడు, దార్శనికుడు, వక్త వల్లంపట్ల నాగేశ్వరరావు. ఆధునిక వైద్యం, జ్ఞానం, అభివృద్ధి, సైన్సు, టెక్నాలజీ, సంస్కృతి, ఫలాలను అందుకోవడానికి వ్యవసాయిక సమాజం ఆధునిక సమాజంగా ఎదగడానికీ, జరగాల్సిన ప్రాథమిక మౌలిక కృషి ప్రాధాన్యతను గుర్తించి ఆ రంగాల్లో విస్తరించిన విశిష్టత వల్లం పట్ల నాగేశ్వరరావుగారిది.

వల్లంపట్ల నాగేశ్వరరావు కవిత్వం కోసం కవిత్వం రాసే కోవలోని కవికాదు. పత్రికల కోసం పట్టుబట్టి ప్రతీకాత్మకంగా రాసి ప్రతిష్ట సంపాదించుకోవాలనుకునే కోవలోని కవికాదు. అతడు అట్టడుగు వర్గాలను పల్లెప్రజలను, దళిత బహుజనులను పాట ద్వారా, మాటద్వారా, కళారూపాల ద్వారా చేరదల్చుకున్న కవి, చైతన్య పర్చదల్చుకున్న సమగ్ర సామాజిక విప్లవ దార్శనికుడు. వల్లంపట్ల నాగేశ్వరరావు గారి వంటి వాళ్ళ కృషి ప్రాధాన్యతను, సామాజిక ఉద్యమ చరిత్రలో వారి స్థానాన్ని నిర్ధారించడానికి ఆధునిక, సామాజిక సాహిత్య చరిత్రను తిరగరాయవలసి ఉంటుంది. సరిచేయాల్సి ఉంటుంది.

స్వాతంత్ర్యం వచ్చాక దేశంలో అన్ని రంగాల్లో, ఉద్యమాల్లో, సంస్థల్లో, పార్టీల్లో జాతీయోద్యమం నాటి జాతీయ స్ఫూర్తి కొరవడింది. అవి స్వాతంత్ర్యానంతరం రూపుదిద్దుకోవాల్సిన సమగ్ర సామాజిక విప్లవ దృక్పథం, సామాజిక వికాసం గురించి పట్టించుకోలేక పోయాయి. స్వాతంత్ర్యం రావడంతోనే దేశం పాడిఆవు అయిపోయినట్టు

ఎవరి హక్కులు, సుఖాలు, డిమాండ్లు చెంబులతో వారు పాలు పిండుకోవడమే తప్ప దాని పోషణ బాధ్యత ప్రభుత్వానిదో, రాజ్యాంగానిదో, ప్రణాళికా సంఘానిదో, ప్రభుత్వ శాఖలదో తప్ప తమది కాదని తప్పించుకున్నారు. తమ వ్యక్తిగత అభివృద్ధి శ్రేయస్సే ముఖ్యమనుకున్నారు. అని సమస్యలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని భావిస్తూ తమ హక్కులను, సౌకర్యాలను డిమాండు చేస్తూ అందినకాడికి పొందుతూ వచ్చారు. ఈ స్వార్థపర సుఖవాదం వల్ల జాతీయ స్ఫూర్తి, దృష్టి కొరవడడం వల్ల నేడు లక్షల కోట్ల రూపాయల అప్పుల పాలై, ఏ విదేశీ పాలనకు దోపిడీకి వ్యతిరేకంగా స్వాతంత్ర్యం కోసం పోరాటం చేశామో తిరిగి దాన్నే ఆహ్వానిస్తూ ప్రణాళికలు రూపొందే దుస్థితిలో పడిపోయిందీ దేశం.

దేశం నేడు కుల మత వర్గ ప్రాంత జాతి, లింగ వయోసమస్యలతో, దృక్పథాలతో విభేదాలతో అతలాకుతలం అవుతున్నది. మూఢ విశ్వాసాలు మతం పేరిట, సంప్రదాయం పేరిట దేశీయత పేరిట పురివిప్పి జై భజరంగభళీ అని వికటాట్టహాసం చేస్తున్నాయి. జిహ్వకో రుచి, పుర్రెకో బుద్ధి, సంస్థకోదృక్పథంతో సమాజంలో భావజాల కాలుష్యం మురుగు కంపై ప్రవహిస్తున్నది. ఈ కంపును కొందరు భావజాల సంఘర్షణ అంటూ ఆస్వాదిస్తూ అందులో స్నానాలు చేస్తున్నారు.

కుల మత వర్గ ప్రాంత జాతి భాష లింగ సమస్యలకు, మూఢ విశ్వాసాలకు మూలం సైన్సు టెక్నాలజీ, ఆధునిక విద్య, సంస్కృతి, స్వేచ్ఛ సమానత్వం, పౌర హక్కులు, ఆత్మగౌరవం సమాజ స్థాయి అందుకున్న వారికి అందుకోవాల్సిన వారికే మధ్యనున్న వైరుధ్యం ఇదే విభిన్న దృక్పథాలుగా, ఉద్యమాలుగా, కులమత వర్గ జాతి ప్రాంతాది సమస్యలుగా వ్యక్తీకరణ పొందుతున్నది.

అందువల్ల భావజాలమేదైనా ప్రతి ఒక్కరూ, ప్రతి సంస్థా, పార్టీ, ప్రతి ఉద్యమమూ, ప్రతి భావజాలమూ సమగ్ర సామాజిక వికాసాన్ని తన దృక్పథంగా, ఆచరణాత్మక కార్యక్రమంగా తీసుకొని ముందుకు సాగవలసి ఉన్నది.

భావజాలమేదైనా మనకు మనిషి ప్రాథమికం కావాలి. మనిషి సర్వతోముఖ వికాసం లక్ష్యం కావాలి. మనిషి కోసం భావజాలం తప్ప భావజాలం కోసం మనిషి కాదు. మనిషి శ్రేయస్సు కన్నా భావజాలమే ముఖ్యం అనుకునే వారు భావజాల ఆధిపత్యం ద్వారా మనిషిపై మరో మనిషి పెత్తనం, దోపిడి చేసే అణిచివేసే దోపిడి వర్గాలకు సంబంధించిన వారు. ప్రతి మనిషికి పని కల్పించి ఆత్మగౌరవం, స్వేచ్ఛ, సమానత్వంతో బుద్ధుని కరుణి, ప్రేమలను పరస్పరం పొందే దేశవాళీ సమగ్ర సమాజ

వికాసమే సమగ్ర సామాజిక విప్లవం. ప్రాపంచిక దృక్పథం ఈ విశాల దృక్పథాన్ని అలవరచుకున్న వారే సమాజాన్ని ముందుకు నడిపిస్తారు. ఈ సమాజానికి నిజమైన సరైన నాయకత్వాన్ని అందిస్తారు. వారే ఈ సమగ్ర సమాజ వికాసానికి దేశీయ స్వయం పోషకత్వానికి మార్గం వేస్తారు. ఒక చైతన్యవంతమైన కళాకారుడుగా వల్లంపట్ల నాగేశ్వరరావు ఈ సమగ్ర సామాజిక దృక్పథంతో ప్రజల్లో పద్దారు. ఇరవై యేళ్ళుగా కృషి చేస్తున్నారు.

వల్లంపట్ల నాగేశ్వరరావు మట్టిలోంచి, కష్టాల్లోంచి, పల్లెల్లోంచి పట్టుదలతో ఎదిగి వచ్చిన హేతువాది. తిరిగి మట్టికి, పల్లె ప్రజలకు చైతన్యాన్ని అందించడం తన కర్తవ్యంగా గుర్తించిన జాతీయ ఉపాధ్యాయుడు. ఆదర్శ ఉపాధ్యాయుడుగా తానుండే బడినీ, ఊరునూ ఒక చైతన్య శిబిరంగా మలిచే నిరంతర కృషీవలుడు. విద్యార్థుల్లోని సృజనను వెలికితీసి వెన్నుతట్టే విద్యాగురువు.

ప్రజారచయితలు, సామాజిక తత్వవేత్తలు ప్రజల జీవితంలోని సమస్త అంశాల్ని పట్టించుకోవాలి. ప్రజల హృదయాలతో పాటు ప్రభుత్వ పాలసీలను ప్రజలకనువుగా ప్రభావితం చేయగలిగిన వారే నిజమైన ప్రజా రచయితలు, సామాజిక తత్వవేత్తలు. వల్లంపట్ల ఈ రెంటిని సమన్వయించుకోగలిగిన కళాకారుడు.

ఒకాయన విరాళాలు సేకరించి పేదపిల్లలకు హాస్టల్ నడిపారు. వాళ్ళు ఆ హాస్టళ్ళలోనే చదువుకొని జీవితాల్ని గెలుచుకున్నారు. అన్నాహజారే రాలేగాం సిద్ధి అనే ఒక గ్రామాన్ని ముప్పయిఏళ్ళ కృషితో ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దాడు. వీరి ప్రణాళికల్ని ప్రభుత్వాలు స్వీకరించి ప్రభుత్వ హాస్టళ్ళు పెట్టారు. వాటర్‌షెడ్ పథకాలు ప్రారంభించారు అన్నాహజారే. ఒక దాత చేసిన కృషి గొప్పదై ప్రభుత్వ హాస్టళ్ళు వాటర్‌షెడ్ పథకాలు చెత్త అవుతాయా? ప్రభుత్వ పథకాల వల్ల జరిగిన మంచిని జరగాల్సిన మంచినీ చెప్పిన రచయితలెందరు? సాంఘిక సంక్షేమ హాస్టళ్ళ ద్వారా వెట్టిచాకిరీ మట్టి బతుకులు వికసించి విద్యావంతులై ఆత్మగౌరవంతో జీవితాన్ని గెలుచుకొన్న క్రమం ఒక సామాజిక వికాసం. ఇలాంటి సామాజిక వికాసం గురించి ఎందరు రచయితలు, కళాకారులు తమ రచనలు వెలయించారు. ఈ సామాజిక వికాసాన్ని రాయనివారికి సామాజిక దృక్పథం ఉన్నట్టా?

వల్లంపట్ల నాగేశ్వరరావు ఇది గమనించారు. రానిదానికి రాలేదని ఏడ్వడం కన్నా వచ్చిందాన్ని సద్వినియోగం చేసుకుంటే ఆ తర్వాత రానిదాన్ని రప్పించుకోవడం ఎలాగూ చేస్తాం. చేయగలం. అని తన పట్ల ప్రజల చైతన్యం పట్ల విశ్వాసంతో

సాహిత్య కళారంగాల్లో తనదైన విశిష్ట మార్గం వేసుకొని యువతరాలకు దారి చూపారు వల్లంపట్ల.

వల్లంపట్ల ప్రజలకు నిబద్ధుడై ప్రజల కోసం నిమగ్నుడైన రచయిత. ప్రభుత్వ శాఖల వేదికల్ని కూడా ప్రజల్ని చేరగల వేదికలే అని చాలా ముందుగా పసికట్టి ప్రభుత్వ ఖర్చుతోనూ తనదైన హేతువాద, భౌతికవాద సామాజిక దృక్పథంతో ప్రజల్ని చైతన్యవంతం చేసిన ద్రష్టస్రష్ట వల్లంపట్ల. వల్లంపట్ల కృషిని చూస్తుంటే ఇలాంటి వారి నేతృత్వంలో, ఇలాంటి వారిని మరెంతో మందిని తయారు చేసేందుకు తెలుగు విశ్వవిద్యాలయం లాంటి, మరో ప్రజా చైతన్య విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తే ఎంత బాగుంటుందో గదా అన్పిస్తుంది. వేలకోట్ల రూపాయల బడ్జెటుతో నడిచే ప్రభుత్వాలకు రాజ్యాంగ లక్ష్యాలను, ఆదేశిక సూత్రాలను, భౌతికవాదాన్నీ ప్రభుత్వ పథకాలను, ప్రజల దగ్గరికి చేర్చి చైతన్యం చేసే ప్రజా చైతన్య విశ్వవిద్యాలయం స్థాపించి నడిపించడం ఖర్చు రీత్యా ఒక లెక్కలోనిది కాదు. అప్పుడు రాజ్యాంగ లక్ష్యాలను ప్రజల్లోకి తీసికెళ్లి కూలీలుగా చూడబడ్డ పేరులేని స్థానికి కళాకారుల చరిత్ర వెలుగులోకి వస్తుంది. వారి కృషికి సామాజిక సాహిత్య గౌరవం లభిస్తుంది.

ప్రభుత్వాన్ని – దోపిడీ వర్గాల్ని విమర్శిస్తూ కూర్చోవడమే వల్లంపట్ల పనికాదు. వల్లంపట్ల మానవతా చైతన్యం కోసం, సామాజిక విలువలు, సామాజిక చైతన్యం కోసం, స్త్రీ, పురుషుల మధ్య ఉండాల్సిన ప్రేమ, సమానతల కోసం, దేశభక్తి, గ్రామ వికాసం కోసం; గ్రామీణ చైతన్యం కోసం, కార్మిక కర్షక విద్యార్థి యువజన, ఉపాధ్యాయ మేధావి వర్గాల చైతన్యం కోసం బాలల మహిళల చైతన్యం కోసం, మతతత్వ కులతత్వం మూఢవిశ్వాసాల నిర్మూలన కోసం, నాస్తిక హేతువాద భౌతికవాద ప్రాపంచిక దృక్పథం కోసం, రచన చేసి రాగం తీసి రంజిల్ల చేసి ప్రజల హృదయాల్ని గెలుచుకున్న సార్థకజీవి వల్లంపట్ల. మారుతున్న సమాజంలో జనాభా నియంత్రణ ఆవశ్యకతను గుర్తించి, నగరీకరణ పరిణామాల్ని, కాలుష్యాన్ని, వినియోగదారుల్ని, అడవుల్ని, పర్యావరణాన్ని, వ్యవసాలను, మత్తు పదార్థాల ప్రమాదాలను, ఎయిడ్స్ పోలియోలను, తల్లి పిల్లల ఆరోగ్యాన్ని పట్టించుకొని పాటల ద్వారా, జోకుల ద్వారా ప్రసంగాల ద్వారా తెలుగు ప్రజల గుండెల్లో గూడుకట్టుకొని చైతన్యం నింపి సేవాతత్వం అలవరిచే మహోన్నత కర్తవ్యాల్ని కళారూపాలతో తలకెత్తుకున్న వల్లంపట్ల స్వాతంత్ర్యానంతరం స్వయంకృషితో సమాజం కోసం ఎదిగి వచ్చిన జీవఫలం.

ఉన్నత స్థాయికి ఎదిగిన ప్రతి రచయితా దార్శనికుడూ సాహిత్యంలో తాత్విక

రంగంలో తనదైన ముద్రను, కృషిని కలిగి ఉండి తర్వాత తరాలకు అందే కృషి చేస్తారు. వాటిని వారి ప్రాతినిధ్యం తెలిపే రచనలు, భావాలు అంటారు. కదిలీకదిలించవోయి. ఏ ఊరు నీ ఊరు దన్నో దిమ్మరి, హయ్ సబ్‌భాయీ. చెల్లినీ గుండె, చెరువయినాదే 'చిన్నప్పుడు పట్టలేదు సిలేటుపలక', 'చిదిమేసిన మందారాలు', 'కులం కులమంటారు', 'ఏ దేవుడు రాసిండు ఈ రాత', 'మతమంటే మత్తురా', 'సారాజ్య మచ్చిందిరా', 'పోరగాండ్లు పుట్టాలని', 'నడిపించు, నడిపించు', 'సుజలాం మనదేశం', 'నందామా నందామా, మొక్కలు నాటాలెనె, వంటి పాటలు వల్లంపట్లకు అతని స్థాయి తాలూకు ప్రాతినిధ్య పాటలు. ఒక రచయితకు వారిని ప్రాతినిధ్యం వహించే రచనలు పది దాకా ఉన్నాయంటే వారి కృషీ, స్థాయి ఉన్నత శిఖరాల నందుకొన్నదని అర్థం.

పోస్టర్లు చూస్తే సినిమా చూసినట్టుకాదు. ఈ పాటలు చదివితే వల్లంపట్ల కృషి, ప్రజలపై వేసిన ప్రభావం అర్థం కావు. అతని కృషి, దాని ప్రభావం అర్థం కావడానికైనా, అంచనా వేయడానికైనా అతను చేరుకున్న ప్రజల్లోకి సాహితీ వేత్తలు వెళ్ళాలి. ప్రజల్లో ఒకరుగా కూర్చొని అతన్ని గమనించాలి. ఆ రసాలను ఆస్వాదించాలి. అపుడే కాస్త అర్థమవుతాడు. అదైనా పూల వాసనే మనకు తెల్సినట్లు, అతని కృషి, అవగాహనలోతు తెలవాలంటే 50 ఏళ్ళ సామాజిక ఉద్యమాల చరిత్రను తెల్సుకోవాల్సి ఉంటుంది. ఎన్ని రంగాలకు సంబంధించిన, ఎంత లోతైన విషయాలను అధ్యయనం చేస్తే వాటిని ఇంత తేలికైన భాషలో చెప్పడం సాధ్యపడిందో దీన్లో ప్రతి అధ్యాయానికి చేర్చిన ఆయా రంగాల నిపుణులు రాసిన వ్యాసాలు. విశ్లేషణలు చదివాక తెలుస్తుంది. అన్ని రంగాలను, కోణాలను పాటల్లో రాశారంటే వల్లంపట్ల నిరంతర సాధన, అధ్యయనం ఎంత విస్తారమైనదో, ఒక సమగ్ర అంచనా వస్తుంది. అట్టడుగు వర్గాల నుండి, కులాల నుండి ఎదిగిన క్రమాన్ని దాంతో జత చేసి చూసినప్పుడే రచయితకు, రచనకూ గల సంబంధాన్ని రచన రూపొందిన క్రమాన్ని దాని ప్రాధాన్యతను సమగ్రంగా దర్శించడం సాధ్యపడుతుంది.

తనది కాని సెక్షన్‌లో దృక్పథంలో జీవించే ప్రజలను అనుకోని అతిథిలా వచ్చిన వక్త. కళాకారుడు వారి హృదయాలను గెలుచుకోగలిగితే అదొక గొప్ప చరిత్ర. అలాంటివారు అజేయులు. వారినే అజాత శత్రువులు అని మిత్రులు ముందుపుట్టి తాను తర్వాత పుట్టిన వారిని మెచ్చుకోబడతారు. వల్లంపట్లకు ఇలాంటి అరుదైన అవకాశాలు ఎన్ని ఎదుచయ్యాయి. ఇటీవల ఏర్పరిచిన పాఠశాల విద్యా కమిటీల

ప్రాంతీయ స్థాయి సదస్సు ఒకటి కరీంనగర్‌లో ఏర్పాటు చేయబడింది. ముఖ్యమంత్రి రాక ఆలస్యమైన సందర్భంలో సభ విజయానికి కళాకారులు ముఖ్య పాత్ర నిర్వహించారు. ఆ సమయంలో రాక ఆలస్యమైన కలెక్టర్ కంఠంగారు వల్లంపట్లను ఆహ్వానించారు. వేలాది మంది ఆ సభలో వల్లంపట్ల మాటపాట విని ఉత్తేజపడడం ఒక అద్భుతం. ఆనాటి పాట ప్రసంగం ప్రజల హృదయాల్లో నిలిచిపోయింది. ప్రజలు, పత్రికలు ప్రశంసిస్తుంటే వినడం నా వంతు అయ్యింది. కొత్త అభిమానులను గెలుచుకోగలిగే అతని మహత్తర శక్తి సామర్థ్యాలకు అది నిదర్శనం.

నా యాభయ్యవ జన్మదిన సభలో "కదిలీకదిలంచవోయి" అలా మొదలెట్టి అందరిలో నవ్వుల పువ్వులు పూయించి, హృదయాలను కదిలించి, నిర్మలత్వం నింపే దిగేసరికి అపుడే అరగంటై పోయిందా అని నిర్వాహకులే ఆశ్చర్యపోయేట్టు మైమరిపించే ఆకర్షణ వల్లంపట్లది.

కులం లేదని, మతం లేదని అంతా ఒక్కటే, అని చెప్తూ సొంత కులం పిల్లల్నే పెళ్ళి చేసుకునే, పెళ్ళి చేసే కుహనా అభ్యుదయ వాదులు విప్లవకారులు లక్షల కొద్ది ఉన్నారు. పాతికేళ్ళ విప్లవానంతరం కూడా ఏ విప్లవం వచ్చినా పల్లెలోనూ ఏటా కనీసం ఏదైనా కులాంతర, మతాంతర వివాహాలు కావడం లేదంటే సిగ్గుచేటయిన విషయం. ఇలాంటి స్థితిలో తాను కులాంతర వివాహం చేసుకోవడమే కాకుండా కులాంతర మతాంతర వివాహితుల మధ్య ఐక్యత కోసం, సమిష్టి అవగాహన కోసం, సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర స్థాయి వేదికను ఎంతో చక్కగా నడిపి ఆదర్శప్రాయులయ్యారు వల్లంపట్ల.

వల్లంపట్ల అక్షరాస్యత గురించి రాశాక పదిహేనేళ్ళకు అక్షరాస్యతా ఉద్యమం వచ్చింది. ఎపుడోరాసిన పాటలను ప్రభుత్వ పథకాల ప్రచారం కోసం రాశాడనుకోవడం చరిత్రను వక్రీకరించడం. నేను పుట్టక ముందు కట్టిన మా ఇంటి పక్కన సరస్వతీ శిశుమందిర్, వాణి జూనియర్ కాలేజీ యిటీవల కట్టారు. మా ఇంటి పక్కనే కాలేజీ గట్టారు అని నేనంటాను. మీ ఇల్లు గా కాలేజీ పక్కకే ఉంది. అని వాళ్ళంటారు. ఇది ప్రాచుర్యంలో ఉన్నవారి కనువుగా చరిత్రను వక్రీకరించడం.

ఏ పార్టీ ఏ ఉద్యమం అండలేకపోయాక గద్దర్, చేస్తున్నదేమిటి, ప్రజల ఆరోగ్యం గురించి, విప్లవ సభలకొచ్చే ప్రజల గురించే కాకుండా మొత్తం ప్రజల గురించే కాకుండా మొత్తం ప్రజల గురించి, పాటలు రాస్తున్నాడు. శిక్షణ యిస్తున్నాడు. సరిగ్గా ఇదే పనిని 20 ఏళ్ళ ముందు నుండే చేస్తూ వస్తున్నవాడు వల్లంపట్ల. భావజాల

విప్లవ ప్రాధాన్యతను గుర్తెరిగి హేతువాద ఉద్యమ నిర్మాతల్లో ఒకరయ్యారు.

వల్లంపట్ల అవగాహనలో, ప్రాపంచిక దృక్పథంలో కేవలం అమూర్త వర్గ దృక్పథమో, వర్గేతర దళిత, స్త్రీవాద, హేతువాద దృక్పథమో లేదు. అతని దృక్పథం అమూర్త వర్గవాద, దళితవాద, స్త్రీవాద, హేతువాద, మానవతావాద ప్రాపంచిక దృక్పథాల నుంచి విస్తరిస్తూ, సమన్వయిస్తూ తిరిగి నిర్దిష్ట వ్యక్తీకరణ సాధించింది.

అందువల్లనే అతని రచనల్లో దళితవాద, వర్గవాద, స్త్రీవాద, హేతూవాద మానవతావాద దృక్పథాలతో పాటు, బాబా ఆమ్టే, మేధాపాట్కర్, శంకర్ గృహ నియోగి, పర్యావరణ వేత్త పురుషోత్తంరెడ్డి, రాజస్థాన్ రాజేంద్రసింగ్, కొఠారి విద్యా కమీషన్, గిజుబాయి, ఎ.ఎస్.నీల్, మేడం మాంటిస్సోరి ఫోబెల్, అరవిందఘోష్, జిద్దు కృష్ణమూర్తి, ఠాగూర్-శాంతినికేతన్, యం.యన్.రాయ్, వేమన, జాషువా, కబీరు, గురజాడ, చలం, శ్రీశ్రీ, మాష్టార్జీ, పెరియార్ రామస్వామి, త్రిపురనేని రామస్వామి, ఆనంద పట్వర్ధన్, షబనా ఆజ్మీ, సఫ్దర్‌హష్మీ, నాజర్, విలాస్‌గోగే జాదవ్, జి.వై.గిరి, వంగపండు, సుద్దాల హన్మంతు, సి.నా.రె., దాశరథి, కాళోజి, స్వామి అగ్నివేశ్, జయప్రకాశ్ నారాయణ్, జ్యోతిరావుపూలే, మదర్ తెరిస్సా, కాన్షీరాం, బర్సాసూకే, గ్రీన్ పార్టీ, సీపీ, రావిపూడి, కత్తి పద్మారావు, రంగనాయకమ్మ, గోరా, జసయిగోసాల్, నాస్తిక రామకృష్ణ, రామమనోహర్ లోహియా, డా॥ బి.ఆర్.అంబేద్కర్, గ్రామ స్వరాజ్య బల్వంతరాయ్ కమిటీ, రాల్ఫ్ రోనాల్డు వినియోగదార్ల ఉద్యమం, బెట్రాండ్ రస్సెల్, బి.ఎస్.రాములు, మార్క్సు, ఎంగిల్స్, మావో మొదలైనవారు నిర్దిష్ట ఉద్యమాలు, భావజాలాలు సమన్వయం పొందాయి. ఏ భావజాలమైనా సరే తొంభైశాతం ప్రజల కనువుగా మార్చితే దాని దోపిడి పీడన అణిచవేత ప్రభావం పోగొట్టుకుంటుంది. చేయాల్సిందల్లా తొంభయిశాతం ప్రజలకనువుగా ప్రజల్లోకి తీసుకెళ్ళడమే. వల్లంపట్ల చేసింది అదే. అలా అని వల్లంపట్ల అన్నిటిని యిముడ్చుకొని ఉప్పు సముద్రంగా ఎవరికీ పనికి రాకుండా పోలేదు. భౌతికవాద, పీడితవర్గ దృష్టి అతన్ని ప్రజలకే కట్టి పడేసి జీవనదిగా మిగిల్చింది.

వల్లంపట్ల అద్భుతమైన వక్త. సాధారణంగా విమర్శలో, హాస్యంలో వ్యంగ కళలలో హింస ఉంటుంది. ఈ హింస లేకుండా దాన్ని సాధించడానికి గొప్ప సాధన కావాలి. వర్గవాదులు, నాస్తిక హేతువాదులు, దళిత స్త్రీవాదులు ఎదుటి వారిని హింసించడాన్నే సాధన చేశారు. వల్లంపట్ల హింసలేకుండా నవ్వులు కురిపిస్తూ అంతకన్నా బలంఆ చెప్పి హృదయాల్ని దోచుకొనే సామర్థ్యాన్ని శిల్ప నైపుణ్యాన్ని సంపాదించుకున్నాడు.

ఈ విషయంలో అతని ప్రసంగం, పాట ఉద్యమాల సాహిత్య కళాకారులందరూ నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది. అపుడు ఉద్యమాలు, వారి రచనల అందర్ని ఆకట్టుకునే స్థాయికి ఎదుగుతాయి.

ఈ విద్య వల్లంపట్లకు ఊరకే అబ్బలేదు. నిరంతర సాధనతో ఉద్యమాల్లో ప్రజల్లో ఉండడం వల్ల అది సాధ్యపడింది. ఇతరు సలహాలను, సూచనలను స్వీకరించని ఆత్మవిశ్వాసం మూర్ఖత్వానికి, నియంతృత్వానికి దారి తీస్తుందని జీవితంలో భాగంగా అర్థం చేసుకున్నాడు. ఇక వెనుతిరిగి చూడనవసరం లేకుండా పోయింది. నాస్తిక, హేతువాద, ఉపాధ్యాయ ఉద్యమాల్లో, అంబేద్కర్ ప్రసంగాల్లో, దళిత ఉద్యమాల్లో, పర్యావరణ, సారా, అక్షరాస్యతా ఉద్యమాల్లో, విద్యార్థి, యువజన, మహిళా ఉద్యమాల్లో, స్వచ్ఛంద సేవా సంస్థల కార్యక్రమాల్లో, పౌర సమాచార మాతాశిశు సంక్షేమ, శాఖల కార్యక్రమాల్లో, రేడియోలో, టీవీలో, భారత జనవిజ్ఞాన వేదికలో వినియోగదారుల ఉద్యమంలో దళిత రచయితలు, కళాకారుల, మేధావుల ఐక్య వేదికలో, ఎన్నెన్నో కార్యకలాపాల్లో తన ఆపటా, మాటా, అభినయం అందించి ఆకట్టుకుని వాటిని ఎదిగించారు. అలాగే అవి వల్లంపట్లను ఎదిగించాయి.

ఒక్క మాటలో చెప్పాలంటే మనస్సున్న మనిషిగా, హృదయమున్న మనిషిగా సమాజం కోసం ఎన్ని విధాలుగా, ఎన్ని రంగాల్లో చైతన్యయుతంగా స్పందించి తాను కదిలి సమాజాన్ని కదిలించవలసి ఉన్నదో అన్ని విధాలుగా, అన్ని రంగాల్లో కృషి చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి వల్లంపట్ల.

వల్లంపట్లను అతని కృషిని తెలుగు పాఠకులకు కాస్త సమగ్రంగా పరిచయం చేసే తొలి గ్రంథం యిది. ఎన్నో అంశాలు ప్రజలకు పాటతో పాటు తెలియాల్సి వుందని ఎన్నో వ్యయ ప్రయాసాలకోర్చి ముందుమాటల రూపంలో ఒక విజ్ఞాన సర్వస్వాన్ని పల్లె ప్రజల ముందు, పాఠకుల ముందు, గాయకుల ముందుంచారు. అదంతా నిజానికి ఒక సంస్థ చేయాల్సిన పని. వల్లంపట్లే ఒక సంస్థగా ఎదగడం వల్ల అది సాధ్యపడింది.

ఆత్మవిశ్వాసంతో పాటు ప్రజాస్వామికంగా అందరితో కల్సి పోగలిగితే ఎన్ని అవకాశాలుంటాయో సృష్టించుకోవచ్చో ఎన్ని ఎత్తులకైనా ఎదగవచ్చో చూపడానికి వల్లంపట్ల జీవితం, కృషి ఒక ప్రతీక, స్వయంకృషితో దళిత బహుజన వర్గాల నుండి ఎదిగిన వల్లంపట్ల ఆధునిక భారతీయ సమగ్ర సమాజ దార్శనికుడు.

గద్దర్‌తో కొంతసేపు

పీపుల్స్‌వార్ పార్టీ నుండి గద్దర్ సస్పెండయ్యాడనే వార్తను చూడగానే కలవరంతో ఆయన్ని కలవాలనుకున్నాను. ముందుగా పత్రికల ద్వారా అతని స్పందన. అతని మిత్రుల స్పందన ఎలా ఉందో తెలిసేదాకా కొద్దిరోజులు ఆగడం మంచిదని నిభాయించు కున్నాను. గద్దర్ స్పందన మాత్రమే పత్రికల్లో వచ్చింది. అతని మిత్రుల నుండి, దళితుల నుండి ఏమేరకు స్పందన వచ్చిందో తెలియదు. దినపత్రికల జిల్లా స్పెసల్స్‌వల్ల ఒక జిల్లా వార్తలు మరో జిల్లాకు తెలియకుండా పోయాయి.

నా బాధ్యతగా గద్దర్ గురించిన వాస్తవాల్ని వక్రీకరించిన తీరుకు నిరసనగా వ్యాసం పత్రికా ప్రకటనలారాసి ఈనాడు, ఆంధ్రజ్యోతి, ఆంధ్రప్రభ సంపాదకులకు పంపాను. సంక్షిప్తంగానైనా ప్రచురించలేదు. దాని ప్రతే మీరు నవంబర్, 95 'బహుజన్ సమాజ్' లో, బ్లాక్ వాయిస్ దినపత్రికలో చదివారు. దినపత్రికల్తోపాటు గద్దర్‌కు కూడా దాని ప్రతి పంపాను. గద్దర్‌కు నాలేఖలందిన తర్వాత వారం పదిరోజులకు గద్దర్‌ను కలవడానికెళ్లాను.

నేను రాత్రంతా ప్రయాణం చేసి హైదరాబాద్ చేరేసరికి ఇంకా చీటకి పూర్తిగా తొలగిపోలేదు. సికిందరాబాద్ జూబిలీ బస్టేషన్లో కొంతసేపుపడుకుని అక్కడే మొహం స్నానం అయిందనిపించుకుని బస్సులో నేనూ మారెండో అబ్బాయి (డిగ్రీ రెండో సం॥) శ్రీకాంత్ కల్సి గద్దర్ ఇంటికి బయలు దేరాము.

మేం గద్దర్ ఇంటికి చేరేసరికి ఉదయం ఏడవుతోంది. అప్పటికి గద్దర్ ఇంకా నిద్రలేవలేదు. ఎవరో మిత్రులు వస్తే ఉదయం 4.30 దాకా రాత్రంతా మాట్లాడి నిద్రపోయారని అరుగుమీద కూర్చున్న మిత్రులు చెప్పారు. ఎవరు వచ్చినా లేపవద్దు అని చెప్పి మరీ పడుకున్నారట.

నిద్ర లేచేదాకా కూర్చుందాం అనుకున్నాను. మా మాటల్ని గుర్తుపట్టి ఎవరు రాములన్నానా అంటూ నిద్రలోంచిలేచి వచ్చాడు గద్దర్. భార్య విమల నిన్ను గుర్తుపట్టీ పట్టనట్టుగా పలకరించింది. గద్దరే ఫలానా రామన్న అంటూ గుర్తు చేశాడు. గద్దర్ కూతురు వెన్నెల పదవ తరగతి చదువుతోంది. మర్యాదపూర్వకంగా నమస్కారం అంకుల్ అంటూ పలకరించింది. మా రెండో అబ్బాయి శ్రీకాంత్ యివన్నీ నిశితంగా పరిశీలిస్తున్నాడు. గద్దర్ ఇంటికి రావడం వాడికిదే మొదటిసారి.

గద్దర్‌తో కుశల ప్రశ్నలయ్యేంతలో విమల టీ తీసుకొచ్చింది. నాకు టీ అలవాటులేదు. గద్దరూ, మావాడూ టీ తీసుకున్నారు. మెల్లగా విషయం కదిపాను.

"నీ ఉత్తరం అందిందే. చదివిన, దగ్గరి మిత్రులందరికి రాములన్నగిట్ల రానిండు– చదువున్ని అని యిస్తున్న" అన్నాడు గద్దర్.

"నన్ను తిట్టుకొని ఉంటవులే" నవ్వాను నేను.

"నీ అభిప్రాయం నువ్వురాసినవు. నీ భావాలు వ్యక్తం తీసుకొనే హక్కు నీకుంది. దానికి తప్పుపట్టేదేముంది? నీ హృదయం నాకు తెల్సుగదనే". నవ్వుతూ అన్నాడు గద్దర్.

మరికొంత సేపు అవీయివీ ముచ్చటించుకున్నాక గద్దర్ ఇలా అన్నాడు. "అయితే ఒక వాక్యంపట్ల– అందరం బాధపడ్డం. పార్టీలో నీకు జరిగిన అన్యాయం పట్ల నీకు కోపం ఉండడం సహజమే. అయినా పీపుల్స్‌వార్ పార్టీని వెంట్రుకతో సమానం" అని పోల్చడం గరించి బాధపడ్డం. నీలాంటి పెద్దవాడు అలాంటిమాట అనాల్సింది కాదు అని మా అందరి భావం. నువ్వే అన్నట్టు ఉన్నంతలో ఏదో మేరకు ప్రజలకోసం పనిచేస్తున్న పార్టీయే గదనే".

"నేను ఆమాటను తాత్విక సైద్ధాంతిక స్థాయిలో అన్నాను".

"నీ మనస్సు నీకు తెల్సు నాకు తెల్సు. కాని రాతలో చదివేవాళ్ళకు ఎట్ల తెలుస్తుదే?" ప్రశ్నించాడు గద్దర్.

"నువ్వు ఏమనుకోకపోతే ఒక మాట చెప్తా" మళ్ళీ తనే అన్నాడు గద్దర్.

"చెప్పు" అన్నాను.

"పీపుల్స్‌వార్ పార్టీలో నువ్వు అందర్ని వ్యతిరేకిస్తున్నావా! అగ్రకుల నాయకత్వాన్నేనా? పార్టీలో ఉన్న దళితుల్ని నువ్వు గెలుచుకోవలసిన అవసరంలేదనుకుంటున్నవా? గెలుచుకోవాలను కుంటే మొత్తం పార్టీని విమర్శిస్తే

వాళ్ళంతా నువు చెప్పదల్చుకున్న దానికి దూరం కాదా? నువ్వు కులం గురించి రాసినా, వ్యూహం ఎత్తుగడల్లో మార్పులు రావాలనిరాసినా ఔ నిజమేనని మన దళితులు నువ్వు చెప్పింది నమ్మాలాలేదా? పార్టీ ఎందుకు పనికి రానిదని తిడ్తే వాళ్ళసెంటిమెంటు దెబ్బతినదా! పార్టీలోని అగ్రకుల నాయకత్వం అదిగో చూశావా అని అది సాకుగా చూపి, దళితుల్ని దళితులపైకే రెచ్చగొట్టి తన పబ్బం గడుపుకునే అవకాశం నీవిచ్చినట్లయితలేదా?" అన్నాడు గద్దర్.

"నీవన్నదాన్లో నిజం కొంత ఉంది. అయితే కేవలం విమర్శించడం నా పని కాదు. 'దళిత రాజ్యం' మాసపత్రికలో "దండకారణ్యంలో ఏం జరుగుతోంది" అనే వ్యాసం రాశాను. అందులో తెలంగణా పోరాట ప్రజలు అనుభవిస్తున్న నిర్బంధాల గురించి, పోరాట పర్యవసానాల గురించి లోతుగానే రాశాను గదా!" అన్నాను.

"ఇగో– నువ్వు ఎన్ని మంచి మాటలన్నారాయి. కని ఒక్కచెడ్డమాట అన్నవనుకో, అగ్రకులాల వాళ్ళు, నీమీద వ్యతిరేకత కలుగజేయాలనుకునేవాళ్ళు నువ్వన్న మంచిమాటలన్ని వదలేసి ఆ ఒక్క చెడ్డమాటనే– అది కూడా మేలుకోరే అన్నప్పటికీ– అదిగో! అని సాకు చూపి నీకు వ్యతిరేకంగా మార్చే అవకాశం లేదా? ఒక ఫిలాసఫర్‌వి –నీకే సమస్య ఈజీగానే అర్థం అవుతుందనుకుంట" అన్నాడు గద్దర్.

"నేను చిత్తశుద్ధితో పనిచేసే వాళ్ళందర్నీ ప్రేమిస్తున్నాను. అయితే వారి అవగాహనమారితే మరింత మంచి ఫలితాలొస్తాయి. సామాజిక విప్లవం వేగవంతమవుతుందని నా ఆలోచన" అన్నాను నేను.

"నీ ఆలోచన నీకు కరెక్టు. వాళ్ళ ఆలోచన వాళ్ళకు కరెక్టు అన్పిస్తున్నది. ఇలా ఎవరిది వాళ్ళకు కరెక్టు అన్పించినపుడు, మన వాళ్ళ హృదయాన్ని గెలుచుకోవడం అవసరం కదా! నీ గురించి నాకు మరికొందరికి తెలుసు. కాని కొత్తగా వచ్చిన కేడర్‌కు నీ గురించి తెలువది. పార్టీని గురించి మంచి ఎందుకు చెప్తుంది. కనక నీ గురించి పార్టీ చెడ్డగా చెప్తే నీ విమర్శలు నిజమే పార్టీ చెప్పిందే కరక్టు అనుకునే అవకాశం యివ్వడం లేదా?" గద్దర్ ఆవేదన వ్యక్తంచేశాడు.

"అలా అయితే అలాంటి వారికి అవకాశం యివ్వను. పీపుల్స్ వార్ పార్టీ సభ్యత్వం వెంట్రుకతో సమానం అనే మాటను ఎడిట్ చేస్తాను. అయితే ఈపాటికే అచ్చుయిపోతే ఏం చేయలేను. అయినా నువ్వన్నట్టు ఇక నుండి ఫ్రెండ్లీ అప్రోచ్‌తోరాసే ప్రయత్నం చేస్తాను. అయితే సిద్ధాంత పోరాటంలో రాజీ ఉండదు" అని స్పష్టం

చేశాను.

"రాజీపడుమని ఎవరంటున్నరే. నీలాంటోల్లు గట్టిగ నిలబడి పోరాటం చేయడంవల్లనే ఈరోజు పార్టీ కులసమస్యను గుర్తించింది. కులసమస్యను గుర్తించడంలో ఎవలపాత్రవారికుంది. అందులో నీస్థానం నీకుంది. పార్టీ మాకాదన్నా చరిత్ర కాదునదుగా! అయితే ఇపుడు మనం చేయాల్సిందేమిటంటే సరే! ఇన్నాళ్ళు కుల సమస్యను గుర్తియలేదు. ఇపుడు గుర్తించారు. గుర్తించారు గదా– మరి ఈ కులసమస్య గురించి ఒక ప్రత్యేక కార్యక్రమం కూడా తీసికోవాలి. దీని గురించి, నీలాంటి వాళ్ళు, నాలాంటివాళ్ళం అందరం ఎవరి పరిధిలో వాళ్ళు పార్టీని నిలదీయాలి. నేటి అసలు కర్తవ్యం యిది" అన్నాడు గద్దర్.

"పార్టీ వారిని నీవు అడిగితే ఏమన్నారు?" నవ్వాను నేను.

"ఏమంటారు. ఆలోచిస్తున్నాం. చర్చిస్తున్నాం అంటున్నారు. ఇలాంటి నిరాయక చారిత్రక సన్నివేశంలో నీలాంటి తత్వవేత్తలపై ఎంతో బాధ్యత ఉంది. ఫలానాఫలానా కార్యక్రమాలు తీసుకోవాలి అని ఎన్నో రకాల కార్యక్రమాల్ని సూచించే హక్కు నీకున్నది. పార్టీ సభ్యులకు లేని సౌకర్యం నీకుంది గదా! నీవు స్వతంత్రంగా బహిరంగంగా చర్చించి నిలదీసే హక్కు నీకుంది. పార్టీలోని దళితులు నీవిచ్చిన ప్రోగ్రాం మంచిగుంటే ఆచరిద్దాం అని పార్టీలో చర్చ చేస్తారు. దానివల్ల పార్టీలోని దళితులు నీవిచ్చిన ప్రోగ్రాం మంచిగుంటే ఆచరిద్దాం అని పార్టీలో చర్చ చేస్తారు. దానివల్ల పార్టీలోని దళితులు ఎదుగుతారు. పార్టీ ఎదుగుతుంది".

"ఆ పని చేస్తూనే ఉన్నాను గదా!"

"ఏదే రామన్నా! కుల నిర్మూలన గురించి నువ్విచ్చిన కాంక్రీట్ (నిర్దిష్ట) ప్రోగ్రాం ఏది? విప్లవోద్యమంలో దానికంటూ సూచించిన ప్రత్యేక కార్యక్రమం ఏదీ! ఊరికే పార్టీని విమర్శిస్తే ఏం వస్తుంది? మనలాంటి వాళ్ళం పార్టీ ముందు కులం గురించి ఒక నిర్ధిష్ట కార్యక్రమాన్ని ప్రతిపాదించి అమలు పరచండి అని డిమాండు చేయాలి".

"ఇంత కాలంగా నేను చేస్తున్నది అదేగదా!"

"అది చాలదు. ఎంతమాత్రం సరిపోదు. ఆచరణాత్మక కార్యక్రమం ఒకటి వివరంగా రాయి. అది పార్టీ కేడర్ కిందిస్థాయి కందరికీ అర్థమయ్యే స్థాయిలో ఉండాలి. అది ఆచరించగలిగేదిగా ఉండాలి. అలా అని సాయుధ పోరాటంవదిలేసి ఈ పని చేయిమంటే కుదరదు గదా! వారి పద్ధతిలో వారు ఆచరించగలిగే కార్యక్రమం

సూచించు. దీని గురించి పుస్తకాలు రాయి. నచ్చితే పార్టీలోని దళితులు దాన్ని ఎందుకు స్వీకరించకూడదు అని ప్రశ్నిస్తారు. అగ్రకులాలవాళ్ళు అంగీకరిస్తే నాయకత్వంలో కొనసాగుతారు లేదా దళితులు కొత్త నాయకత్వాన్ని ఎన్నుకుంటారు. ఈరోజు దళంలోని 14 మందిలో 12 మంది దళితులే. కేవలం యిద్దరే అగ్రకులస్థులు. ఇద్దరి కోసం 12 మందిని వదులుకుందామా? 12 మందిని కన్విన్సు చేసికొని అగ్రకులస్థుల్ని మనకనువుగా మారతారోలేదో నిర్ణయించుకొమ్మందామా?" అన్నాడు గద్దర్.

"పార్టీ నిర్మాణంపై స్థాయి నాయకత్వానికనువుగా ఉన్నది. దీన్లో కింది కేడర్ ప్రశ్నించి గెలుపొందే అవకాశం ఎక్కడుంది?" సూటిగా ప్రశ్నించాను.

"కేడర్ అంతా ఒక్కటైతే పైస్థాయి అగ్రకుల నాయకత్వం ఏం చేయగలదే?" ఆత్మవిశ్వాసంతో ప్రశ్నించాడు గద్దర్.

"కేడర్ ఒక్కటి కాకుండా చూడ్డమే అగ్రకుల పైస్థాయి నాయకత్వం పని గదా! 70 ఏళ్ళుగా కమ్యూనిస్టు, నక్సలైటు అగ్రకుల నాయకత్వం చేస్తూవస్తున్న విచ్ఛిన్నత అంతా యిదేకదా? అది సరేగాని నీ సంగతి చెప్పు. పీపుల్స్‌వార్ పార్టీని వదిలేస్తావా లేదా? మనిద్దరం, కలిసి తిరుగుదాం. నేను నా ఉద్యోగం వదిలేస్తాను నువు సరేనంటే. ఏమంటావు?"

"నేను పార్టీలో యింకా తేల్చుకోలేదు గదనే. కులతత్వవాదిపని నిన్ను పార్టీలకెళ్ళి వెళ్ళగొడ్తే- అట్లనా బిడ్డ అని నీ రంగంలో నీవు కృషి చేస్తున్నావు. నేనలా పార్టీని వదలడానికి సిద్ధంగా లేను. ఇరవై ఏండ్ల నా కృషి ఈ పార్టీ నిర్మాణంలో వుంది. ఎవరో ఏదో అన్నారని పార్టీనెందుకు వదిలిపెట్టాలి? నా మాట విని, పాటవిని ఎందరో వీరులు అమరులయ్యారు. లక్షలాది ప్రజానీకం నా మాటవిని, పాటవిని, ఎన్నో నిర్బంధాలు ఎదుర్కొన్నారు. పార్టీ నాయకులు "వ్యవసాయ విప్లవం" పుస్తకం రాశారు. నేను దాన్ని పాటల్లోకి మార్చాను. ఏది ఎక్కువ మంది జనానికి అర్థమైంది? పార్టీ ఒక డాక్యుమెంటు రాసుకుంటే దాన్ని ప్రజల్లోకి తీసికెళ్ళేది ప్రజా సంఘాలేకదా! అందువల్ల ప్రజాసంఘాలు లేకుండా పార్టీ ఎక్కడిది? జన నాట్యమండలి ద్వారా నా రంగంలో నేను కృషి చేశాను. ఎవరి కృషి ఎంత అనే చర్చకాదు యిది. నేను కూడా కృషి చేశానన్నదే పాయింటు. నా మాటవిని పాటవిని విప్లవంలోకి వచ్చి ఎందరో అమరులయ్యారు. ఈ రోజు పార్టీని వదిలివెళ్తే అమరుల బంధువులు నిన్ను నిలదీయారా? నన్ను నమ్మి వచ్చిన ప్రజలకు ద్రోహం చేయలేను. పార్టీలో నాకొచ్చిన సమస్య ప్రజలకు నాకు మధ్య వచ్చిన సమస్య కాదు. ప్రజలు నన్ను ఇప్పటికీ ప్రేమిస్తున్నారు. ప్రజల్ని నేను గాఢంగా ప్రేమిస్తున్నాను. సాయుధపోరాటంపై నేను నీలాగా విశ్వాసం కోల్పోలేదు. అందువల్ల నీలాగా నేను ఎలా ఆలోచించగలను! నేను పార్టీలోనే ఉంటాను. పార్టీ నాపై చేసిన ఆరోపణలకు జవాబు రాశాను. చర్చ జరగుతున్నది".

"పార్టీలోని అగ్రకుల నాయకత్వం నీ ప్రాధాన్యత తగ్గించాలని, వీలైతే బహిష్కరించాలని చూస్తున్నట్టుందిగదా!"

"అలాంటి స్థితి వస్తే నేను డైరెక్టుగా జనంలోకి వెళ్తాను. ఏ ప్రజలు విప్లవిస్తున్నారో ఆ ప్రజల కడుపులో తల ఉంచి అడుగుతాను. నేను చేసిన తప్పేమిటో - నేను విప్లవోద్యమానికి పనికిరానా? అని అడుగుతాను. ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, నిజామాబాద్ జిల్లాలో ప్రారంభించి గజ్జెకట్టి యివే పాటలు పాడి నా సమస్యను ప్రజల ముందుంచాతునా. పార్టీలోని దళిత కేడర్ ఇదంతా చూస్తూ ఊరుకుంటుందా? అపుడు అగ్రకుల నాయకత్వం తన తప్పుతాను తెల్సుకుంటే ఉంటుంది లేదా దళితులు తామే నాయకత్వాన్ని చేపడ్తారు. రెంటింటిలో ఏది జరిగినా మేలు. ఈలోపు పల్లెపల్లెనా తిరుగుతుంటే పోలీసోల్లో, మరొకరో వచ్చి నన్ను చంపిపడేస్తే నాకు జరిగే నష్టం ఏమీ లేదు. నేను ఎపుడైనా చావడానికి సిద్ధమే. అయితే నేను చనిపోవడం వల్ల పార్టీకి ఏదైనా నష్టం జరిగితే అందుకు నేనను బాధ్యుడను మాత్రం కాను. పార్టీయే, పోలీసులో ఎవరో బాధ్యులవుతారు. అయితే నేను మాత్రం సత్యమూర్తిలాగా, నీలాగా పార్టీని విమర్శిస్తూ తిరగను. పార్టీ గురించి ప్రచారం చేస్తూ పర్యటిస్తాను. ఎందుకంటే ఈ పార్టీ నాకు జీవితాన్నిచ్చింది. నా జీవితం పార్టీతో, విప్లవంతో ముడివడి ఉన్నది".

"నూతన మానవీయ సంస్కృతి నిర్మాణం గురించి నీ అభిప్రాయాలేమిటి?" ప్రశ్నించాను.

"రామన్నా! పార్టీకి ప్రజా సంఘాలకు తేడాలేని ప్రస్తుత స్థితి తొలగిపోవాలి. ప్రజా సంఘాలు ప్రజల్లోకి చొచ్చుకుపోయే చొరవను అరికట్టే హక్కు పార్టీకి లేదు. ప్రజా సంఘాలకు స్వేచ్ఛ ఉండాలి. అపుడే ప్రజా సంఘాలు నూతన సంస్కృతి నిర్మాణ గురించి ప్రజల్లో చురుకుగా పని చేయడం సాధ్యమౌతుంది. అంతదాకా ప్రజా సంఘాలు పార్టీ యొక్క కేవల ప్రచార సాధనాలుగా మిగిలిపోతాయి" అన్నాడు గద్దర్.

"అంబేద్కర్ గురించి బుద్ధుని గురించి నీతో గతంలో చాలా వివరంగా

చర్చించాను. ఆ విషయంలో ఇపుడు నీ అభిప్రాయం ఏమిటి?" ప్రశ్నించాను.

"కుల సమస్య విషయంలో అంబేద్కర్ కృషిని పార్టీ సొంతం చేసుకోవాలి. అంబేద్కర్‌ను పార్టీ గౌరవించాలి. సంస్కృతి విషయంలో మనం బుద్ధిస్టు సంస్కృతిని ప్రాచుర్యంలోకి తేవాలి. నేను చెప్పే బౌద్ధ సంస్కృతి కూర్చుని తినే బౌద్ధ భిక్షువుల సంస్కృతి కాదు. బుద్ధుడు బోధించిన నైతిక సూత్రాలు, సంస్కృతి యిప్పటికి ఎంతో అనుసరణీయమైనవి. ఇలా సాంస్కృతిక రంగంలో శాంతియుత సహజీవన మానవీయ బౌద్ధ సంస్కృతిని పెంపొందించాలి. రాజకీయరంగంలోని సాయుధ పోరాటానికి శాంతియుత బౌద్ధ సంస్కృతిక మధ్యవైరుధ్యం ఏమీలేదు. సాయుధ పోరాటమేమో పాలకవర్గాలకు ప్రజలకు మధ్య జరిగేది. బౌద్ధ సాంస్కృతిక విప్లవమేమో, ప్రజల నిత్యజీవిత సంస్కృతి, సామాజిక జీవితానికి సంబంధించినది".

"ఈ మాటను అయిదేళ్ళుగా అంటూనే ఉన్నావు. కానీ ఈ మాటను నీవు పార్టీలో చర్చించాలి. ఒప్పించాలి. ఆ పని ప్రారంభించావా?"

"పార్టీలో దీన్ని ప్రతిపాదించాను. చర్చ జరుగుతున్నది. నా స్టాండ్ మీదనేనున్నాను. అయితే నీలాగా వివరంగా పుస్తకాలుగా రాసి ముందు పెట్టలేకపోతున్నాను. ఈ విషయంలో మనం వెనకబడడం వల్లనే కదా అగ్రకులాల పెత్తనం సాగుతోంది. ఏమైనా ఏదైనా సరే రాతలో పెట్టడం చర్చింపజేయడం అనేదాన్లో నీవే ఆదర్శం. మేం-కేడర్ ఆస్థాయికి తప్పకుండా వస్తాం".

ఇంకా చాలా విషయాలు చర్చించుకోవడం జరిగింది. పాత జ్ఞాపకాలు నెమరు వేసుకున్నాక అడిగాను.

"దళిత ఉద్యమంలో పని చేయమని రమ్మని కోరుతూ-ఏం జరిగింది పార్టీలో అని పరామర్శించడానికి ఇంతదాకా కత్తి పద్మారావు, తారకం, డా॥చిరంజీవి మొ॥ బి.ఎస్పీ. నాయకులు మాష్టార్జీ, కంచ అయిలయ్య, ననుమాసస్వామి, ఉ. సాంబశివరావు వంటి దళిత సాహిత్య సాంస్కృతిక ఉద్యమ రథసారథులు ఎవరెవరు మీతో చర్చించారు?"

"ఆ కోవలో నువ్వే మొదటివాడివి".

"వాళ్ళలో చాలా మంది సిటీలోనే ఉన్నారు గదా! నేనంటే ఎంతో దూరంలో ఉన్నాను. వెంటనే రాలేకపోయాను".

"వాళ్ళకా దూరం లేదు. అయినా నేను ఎవరినీ తప్పుపట్టడం లేదు. నీకు నామీద ప్రేమ ఉన్నది. మనం యిద్దరం ఒకే లక్ష్యం కోసం కలిసి పని చేశాం. ఆ ఉద్యమం యిచ్చిన సంస్కారం, అను పెనవేసుకున్న ప్రేమ అను నీవు వచ్చావు. కష్టాల్లో కలిసివచ్చేవాడే నిజమైన స్నేహితుడు. రేపు నీకైనా అంతే. నీకు కష్టాలు వచ్చినపుడు, పీపుల్స్‌వార్ నీకోసం స్పందించక మానదు. విప్లవం ఈ ప్రేమ ఆప్యాయతవల్ల ఇంకా ఉన్నతీకరిస్తుందనేదే నా విశ్వాసం" అన్నాడు గద్దర్ ఎంతో ఆత్మవిశ్వాసంతో.

మరోసారి అవీయివీ కలబోసుకుని సెలవు తీసుకున్నాం.

గద్దర్ గురించిన వాస్తవాల్ని వక్రీకరించకండి

గద్దర్ గురించిన వాస్తవాల్ని తెలిసో తెలియకో చాలామంది వక్రీకరిస్తున్నారు. గద్దర్ మీద పార్టీ తీసుకున్న చర్య కాగితాలమీద తేదీలకు, రాతలకు అందేదికాదు. గద్దర్‌పై 1986 నుండి ఏ చర్య తీసుకోవాలా? ఎలా అతడిని, అతడి ప్రాబల్యాన్ని అణిచివేయాలా అని పార్టీలో ఒకవర్గం ఆలోచిస్తూ పకడ్బందీగా అనుసరిస్తూ వస్తోంది. సరిగ్గా చెప్పాలంటే కె.బి.సత్యమూర్తిని పార్టీలోంచి తొలగించడం కోసం గద్దర్ సత్యమూర్తిపై రాసిన ఉత్తరాన్ని సాక్ష్యంగా పార్టీ డాక్యుమెంటుగా మార్చడంతోనే గద్దర్‌ను ఎలా తప్పించేయాలో ప్లాను సిద్ధమైంది. ఇది 1984లో మొదలైంది. పదకొండేళ్లు ఆలస్యంగా గద్దర్‌పై చర్య తీసుకున్నారంటే అది గద్దర్‌పై ప్రేమకాదు. గద్దర్‌కున్న యిమేజ్‌నుండి పార్టీని విడగొట్టగలిగే స్థాయి సాధించుకుంటే తప్ప, గద్దర్‌పై చర్య తీసుకోలేం అనేది అసలు విషయం. అనగా గద్దర్ ఇమేజ్, ఆయన చేసిన కృషే 11 ఏళ్ళుగా ఆయన్ని పార్టీ నుండి వెళ్ళగొట్టాలనుకున్నా వెళ్ళగొట్టకుండా కాపాడ గలిగింది.

అగ్రకులాల పీడిత కులాలకు మధ్య పార్టీలో మొదలైన సంఘర్షనలో సత్యమూర్తి ఓసారి గద్దర్‌ను కల్సి మన పార్టీలో అగ్రకుల పెత్తనం పెరుగుతోంది. పీడిత కులస్థులను నాయకులుగా ఎదగకుండా పలురూపాల్లో అణిచి వేస్తున్నారు అని వాపోయాడు. త్యాగాల విప్లవ పార్టీలో ఇదేమిగొడవ అని అయోమయంలోపడి ఇది నిజమేనా సత్యమూర్తి ఇలా అంటున్నాడు అని గద్దర్ పార్టీకి లేఖ రాశాడు. సత్యమూర్తి- గద్దర్ ఇద్దరూ ఎస్సీలేకదా- సత్యమూర్తిని విమర్శించడానికి ఏమీ దొరకనట్టు-గద్దర్ రాసిన లేఖను చూడండి సత్యమూర్తి ప్రచారం చేస్తున్న కులతత్వం అని సాక్ష్యం చేసి చూపారు. అలా ఎస్సీని ఎస్సీతోనే బలిపశువును చేశారు.

పార్టీలో అంతర్గత సంక్షోభం తలెత్తితే నక్సలైటు పార్టీలు నిర్బంధం పెరిగే వ్యూహాల తీసుకుంటాయి. తద్వారా కార్యకర్తలకు సమాచారం సక్రమంగా అందదు. నాయకత్వంలో ఉన్నవారు చెప్పిందే చెల్లుబాటవుతుంది. పార్టీలోని గ్రూపు సంఘర్షణను కొండపల్లి సీతారామయ్య అండ్ కంపెనీ నిర్బంధం పెంచే వ్యూహంలోకి మార్చుకొంది. కె.యస్. భయం ఏందంటే విరసం వంటి సంస్థలు కవి గనక సత్యమూర్తికి మద్దతు యిస్తాయి. వారికి లీగల్ అవకాశాలుంటే తమపని గోవిందా అని భయం పుచ్చుకుంది. దాంతో నిర్బంధం పెరిగే చర్యలు ఎన్నో చేపట్టింది. ఏన్టీఆర్ 1984లో నాదెండ్ల దెబ్బతో పడిపోయినపుడు ఎన్టీఆర్‌కే మద్దతు నివ్వాలి అన్న కె.యస్.గ్రూపుపై ఎన్టీఆర్ నిర్బంధం ప్రయోగించాల్సిన అవసరాన్ని ఈ కారణాల వల్ల ఏర్పరిచారు.

ఇక అంతా రహస్యమే– మీరు జైలుకు పోతారా? రహస్య నిర్మాణంలోకి వస్తారా? అని పార్టీ ప్రజా సంఘాల వారిని అడగడం మొదలెట్టింది. రహస్య నిర్మాణంలోకి వెళ్ళడం అదేదో గొప్ప అనుకున్న (ప్రివిలేజ్‌తో) చాలామంది రహస్య నిర్మాణంలోకి వెళ్ళారు. రాడికల్ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న నేను, జననాట్యమండలి అధినేతగా గద్దర్ కూడా ఇలా రహస్య నిర్మాణంలోకి వెళ్ళాం. వరవరరావు నేను రహస్య నిర్మాణంలోకి రాను జైలుకే పోతానన్నాడు. జైలుకే పోయాడు.

రహస్య నిర్మాణంలో సంధిలో దొరికించుకొని సండ్లు (రొమ్ములు) పిసికినట్టే పార్టీ ప్రవర్తిస్తుందని అర్థం కావడానికి మేధావులకు ఎంతోసేపు పట్టలేదు. సరే ఎలాగోలా చెన్నారెడ్డి ముఖ్యమంత్రి హయాంలో మళ్ళీ బహిరంగ అవకాశాలు వచ్చాయి. గద్దర్, నును, నాలాంటి వాళ్ళం మళ్ళీ బయటపడ్డాం. రహస్య నిర్మాణంలోకి వెళ్ళడం కన్నా జైలు కెళ్ళడమే మంచిదనుకున్న వరవరావు నిర్ణయమే సరైందని మా అనుభవాల ద్వారా సమీక్షించుకున్నాం. నా అభిప్రాయంమాత్రం ఇది– రచయితలు, కళాకారులు, మేధావులు రహస్య నిర్మాణంలో చేసేదేమి లేదు. బహిరంగ జీవితంలోనే ఉండాలి అని మరోసారి ఇలాంటి పరిస్థితి వస్తే ఇది గుణపాఠం కావాలి అని అందరికి చెప్తూ వచ్చాను. అందులో గద్దర్ ఒకడు.

గద్దర్ నామాట ఏమేరకు విన్నాడో తెలియదు. గద్దర్‌ను భోలా మనిషి అని చాలా మంది అంటారు. కానీ చాలా సన్నిహితంగా కలిసి జీవించిన నేను ఆమాట అనలేను. ఆయన ఎంత భోలా మనిషో అంత గుంభనంగా ఉండే మనిషి కూడా అని నా అభిప్రాయం. గద్దర్‌ను పార్టీలోంచి తీసేయగలరని నాకు 1988లోనే ఒక అంచనా వచ్చింది. 1990 నాటికి అది స్పష్టమైపోయింది. 1990 నాటికి నేను అనామకున్నయి పోయాను. గద్దర్ హవా నడుస్తోంది. ఆయన పార్టీ తరఫున వకాల్తా పుచ్చుకొని పాడుతూనే ఉన్నాడు. చర్చిస్తూనే ఉన్నాడు. ఆ స్థితిలో చెప్పినా విన్పించుకునే దశ కాదు. అయినా సందర్భం వచ్చినపుడల్లా చెప్తూనే ఉన్నాను. పంజాబ్‌లోని గురుశరణ్‌సింగ్‌ను చూశావుగా. ఆయన మనకు ఆదర్శం కావాలి. పార్టీల అంతర్గత పోరాటాల్లో ఎన్నో ఆటుపోట్లు వస్తాయి. వాటన్నిటిని తట్టుకొని నిలబడడానికి మనం స్వతంత్రంగా స్వంతకాళ్ళపై కొనసాగడం సాధ్యం అని అభిప్రాయ పడ్డాను. కుల సమస్య స్త్రీవాద సమస్యపై కూడా సానుభూతిగా ఆలోచించడం మొదలైన గద్దర్ దళిత మహాసభలకు హాజరయ్యాడు. ఆసక్తికరమైన విషయం ఏమంటే గద్దర్ ఫోటోలు పత్రికల్లో రాకుండా చూడండి, గద్దర్ ప్రాధాన్యతని తగ్గించండి అని 1990 నుండే పార్టీలో, ప్రజా సంఘాల్లో చెప్పాల్సిన వారందరికీ "చెవి కొరుకుడు" ద్వారా ప్రచారం జరుగుతూనే ఉంది. గద్దర్ స్కూలు పెట్టాడట గదా (అదేదో వ్యభిచారం అయినట్లు) పార్టీలోంచి వెళ్ళిపోయాడటగదా! అనే ప్రచారంతోనే పార్టీ చాలా నష్టం చేయాలని చూసింది. పార్టీలోంచి గద్దర్‌ను తీసేసారట అని మూడేళ్ళక్రితం నుంచే నేను వింటున్నాను. గద్దర్ పార్టీలో తనకు జరిగే అన్యాయం గురించి ఎవరికి చెప్పుకున్నాడో తెలియదు– నాకైతే చెప్పుకోలేదు. ఆయన చెప్పకుండా ఆయన గురించి మాట్లాడడం అనవసరం అని ఊరుకున్నాను.

అయినప్పటికీ పార్టీలో ఆయనకు జరుగుతున్న అన్యాయాన్ని ఖండిస్తూ అతనికి న్యాయం జరగాలని విభిన్న రూపాల్లో కోరాం. పత్రికల్లో, వ్యాసాల్లో, ప్రసంగాల్లో ఎన్నో విధాలుగా మద్దతుయిచ్చాం. అఖిల భారత విప్లవ సాంస్కృతిక సమితి (జననాట్య మండలి– విరసం వంటి సంస్థల అఖిల భారత సంస్థ యిద)కి ప్రధాన కార్యదర్శిగా గద్దర్‌ను ఎన్నుకోవాలని డిమాండు చేస్తూ దళిత రచయితల కళాకారుల మేధావుల ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ తరఫున కరపత్రాలు పంచాము. పార్టీ చెప్పింది విని రహస్య జీవితంలోకి వెళ్ళిన గద్దర్‌కు ఆ అవకాశం యివ్వలేదు. పార్టీ నిర్ణయాన్ని ధిక్కరించి జైలుకు వెళ్ళిన వరవరరావును ఒక అగ్రకులస్థుడిని దానికి ప్రధాన కార్యదర్శిని చేశారు. దాంతోనే పార్టీలో గద్దర్ భవిష్యత్ ఏమిటో స్పష్టం అయిపోయింది.

తన కీర్తి కోసం పార్టీని అంటిపెట్టుకొని ఉండాల్సిన దశలోకి గద్దర్ వచ్చేశాడు. పార్టీ తొలి విజయం ఇది. గద్దర్ తన కీర్తిని త్యాగం చేయలేకపోయాడు. తాను పీడిత కులాల గురించి మద్దతు యిస్తే ఎక్కడ కుల గజ్జి అంటారోనని నిరంతరం భయపడ్డాడు గద్దర్. నీవు భయపడ్డం మొదలైందంటే ఎదుటివాడు మనపై సగం విజయం

సాధించాడని అర్థం.

గద్దర్ యుద్ధాల గురించి బోలెడు మాట్లాడుతాడు; పాడుతాడు గానీ ఆయన కసలు యుద్ధాల గురించి తెలియదు. యుద్ధంలో మొదట చంపబడేది "సత్యం" అని కూడా తెలియదు. యుద్ధం గురించి ఏమీ తెలియకుండానే యుద్ధాల్లోకి ఉరుకుమని ఉరికించిన గద్దర్ దళిత ప్రజానీకానికి క్షమాపణ చెప్పుకోవాల్సి ఉంది. పోరాటంలో ఆరితేరిన సత్యమూర్తినే పనికిరాని తుక్కుతుక్కుగా మార్చగలిగారు అగ్రకులస్థులు. పోరాటమే తెలియని గద్దర్‌ను పార్టీ పెంటకుప్పలోకి విసరడం ఎంతసేపు? కీర్తి మీద ఆయనకు గల ఆకాంక్షే గద్దర్ ఆత్మవిమర్శ చేసికొన్నాననే ప్రకటన వెనకగల పునాది.

చరిత్రలో కొన్ని సందర్భాలు వస్తాయి. అపుడు సరైన నిర్ణయాలు తీసుకోకపోతే అదే నిర్ణయం ఆ తర్వాత తీసుకుంటే దాని పర్యవసానాలు చాలా వేరుగా ఉంటాయి. 1990 లోనే సత్యమూర్తిని బిఎస్పీ పార్టీలో చేరండి అని మేం అడిగితే నిరాకరించాడు. ఆనాడు చేరి ఉంటే ఆయన స్థానం కాన్షీరాంను మించి ఉండేది. ఉత్తరప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చాక సత్యమూర్తి బిఎస్పీలో చేరాడు- ఏం జరిగిందో చరిత్ర మన కళ్ళముందే ఉంది.

గద్దర్ క్షమాపణ చెప్పడం తప్పు. పార్టీ డబ్బుల్తో తమ పుస్తకాలేసుకున్న వాళ్ళు, పార్టీ ఫండును, లక్షలాది రూపాయల్ని దుర్వినియోగం చేసిన వాళ్ళు నిజాయితీపరులైన దళితుల్ని నాయకులుగా ఎదగకుండా వెళ్ళగొట్టినవాళ్ళు పార్టీ పైస్థాయి నాయకత్వంలో ఉన్నప్పుడు-క్షమాపణ చెప్పుకోవడం నేరస్తుల్ని న్యాయమూర్తులుగా గౌరవించడమే తద్వారా వారికి లేని ప్రతిష్టను కూడా గద్దరే అంటగట్టినట్టవుతోంది. గద్దర్‌కన్నా నూరురెట్లు తప్పులు చేసినవారు పార్టీ నాయకత్వాల్లో ఉండగా క్షమాపణ చెప్పడం అర్థరహితం. నీబాంచెను కాల్మొక్తా అని వయస్సుడిగిన గుండా, దొరను అట్టిపెట్టుకున్నట్టు పార్టీని గద్దర్ అట్టిపెట్టుకునే హక్కు ఆయనకుంది. కాని ఆయన నేను ఫలానా కులంలో పుట్టాను, ఫలానా కష్టాలు అనుభవించాను అని చెప్పుకుంటూ పీపుల్స్‌వార్ పార్టీలో చేరండి అని కోరే నైతకి హక్కు అసలే లేదు. ఏమంటే ఎవరికైతే విప్లవం అవసరమో- ఎవరు విప్లవిస్తున్నారో ఆ పీడిత కులాల నాయకత్వం నిరంతరం పీపుల్స్‌వార్‌లో హత్య చేయబడుతోంది, బయటకు తరిమివేయబడుతోంది. కల్లూరి నారాయణ, ముంజె రత్నయ్య, నేరెళ్ళ వేణు, సత్యమూర్తి, బి.ఎస్. రాములు, సాహు, వాళ్ళ పేర్లు ఏవైతేనేం? వారికి పార్టీలో పెట్టిన పేర్లు, దుష్ప్రచారం ఏమైతేనేం? అవన్నీ అగ్రకులయుద్ధ వ్యూహంలో భాగమే. ఈ విషయాలేవి అర్థంకాని పీడిత కుల

విప్లవకారులు దానికే బలి అవుతారు. అందులో గద్దర్ కూడా ఒకడవుతాడు. ఈ యుద్ధవ్యూహాలే అర్థం కాని గద్దర్ దళితుల్ని పీపుల్స్‌వార్‌లో చేరుమని కోరడం మూర్ఖత్వం అవుతుందే తప్ప మరేమీకాదు.

గద్దర్‌కు నా సిన్సియర్ సలహా ఒక్కటే. అధికారానికి తలవంచే వ్యక్తుల్నే అధికారం తల తీసేస్తుంది. నీవు పార్టీలో ఒంటరివని నీపై పార్టీ చేసిన తీర్మానమే స్పష్టం చేస్తోంది. నీది తప్పనే అధికారం వారికుందిగాని వారిది తప్పనే అధికారం నీకుందా? ఏనాడైనా నీ గురించి యిలా పత్రికల్లో వచ్చినట్టు వారి గురించి నీవు పత్రికల్లో లీకయ్యేట్టన్నా చేయగలిగావా?

గద్దర్! నీ ముందు రెండుదారులున్నాయి. ఒకటి ఈ పి.డబ్ల్యు.జి. పార్టీలోనే ఉండి ఆత్మహత్య చేసికోవడం. తద్వారా దళితుల్ని ఆర్పించి చంపించడం. రెండు నిన్ను దళిత సమాజం ఇంకా ప్రేమిస్తోంది. ఆ ప్రేమను ఇంత కాలం నీకీర్తిగా పార్టీలోని స్థానం కోసం అగ్రకుల నాయకత్వపార్టీ పాదాల ముందు తాకట్టు పెట్టావు, చరిత్ర నిన్ను క్షమించదు. ఇదొక సరైన సమయం-పీపుల్స్ వార్ పార్టీతో తెగతెంపులు చేసికొని దళిత సమాజంలో కలుపు ఇదొక దారి.

నీవు చెప్పలేకపోతున్న బాధ నాకు తెల్సు గద్దర్. దళిత సమాజంలోకి వచ్చి ఏం చేయాల్నే రామన్నా? ఓ వ్యూహమా? ఓ కార్యక్రమమా? ఏం ఏడ్చిందే? ఎంత చెత్త అయినా పీపుల్స్‌వార్‌కు అలాంటిదొక కార్యక్రమం ఉంది గదనే అని అంటావు. నిజమే- గద్దర్- నువ్వన్నది నిజమే. దళిత సమాజానికి సమగ్ర విప్లవం కోసం అలా ఒక వ్యూహం ఎత్తుగడలు, కార్యక్రమం రూపొందించి ఉంటే నీవక్కడ నేనిక్కడ యిలా ఎందుకుంటాం. వేలాది దళితులు హోల్‌టైమర్స్‌గా వస్తాం. కార్యక్రమం యివ్వండి అని నన్నడిగారు. ఏమి యివ్వలేక పోయాను. అన్నిటికీ ఆర్థిక సమస్య ముందుకు వస్తోంది. భారతదేశంలో ఏ విప్లవపార్టీ యింతదాకా ప్రజల విరాళాలపై కాకుండా ఇతరేతర ఆదాయాలపై ఆధారపడి నడుస్తున్నాయి. ఈ స్థితిని అధిగమించడం ఎలాగో తెలియలేదు. అందువల్ల సమగ్ర విప్లవ కార్యక్రమం మనసులో ఉన్నా బహిరంగంగా ప్రకటించలేకపోయాను.

అయినా-గద్దర్ పోరాట చరిత్రను ఒకసారి పరిశీలించు. 1970 లో కొండపల్లి సీతారామయ్య, సత్యమూర్తి, ఢిల్లీరావులు కల్సి పార్టీ నిర్మించాలనుకున్నపుడున్నది ఎందురు? నలుగురు మించిలేరు గదా! మన కళ్ళముందుయిపుడు ఎంత విస్తరించిందో చూడు. 45 ఏళ్ళ వయస్సులో తిరిగి కొత్త నిర్మాణం ప్రారంభించి చరిత్రలో

నిలిచిపోయాడు కొండపల్లి. నీవీ 45 ఏళ్ల వయస్సులో అలా కొత్త దళిత చరిత్ర నిర్మాణానికి ముందుకురా! గత అయిదేళ్ళల్లో దళిత దృక్పథం గురించి ఎన్ని అద్భుతాలు. జరిగాయో చూశావుగా మరో అయిదేళ్ళల్లో మరెన్ని అద్భుతాలు జరుగుతాయో చూడు. దీనికి నీవు నీ పలుకుబడిని, కీర్తిని నాయకత్వానికి ఎందుకు జతచేయకూడదు. మన మంతాకల్సి కొత్త దళిత సమాజ సమగ్ర విప్లవం కోసం మనమే కార్యక్రమం రూపొందిద్దాందా! నాలాగే వందలాది దళితులు ఉద్యోగాలు వదిలేయడానికి రెడీగా ఉన్నారు.

గద్దర్! అగ్రకులంలో పుట్టిన వరవరరావును జైలు కెళ్ళడం తప్పు అని పార్టీ అన్నందుకు అగ్రకులాలవాళ్ళు పత్రికల్నిండా ఏళ్ళతరబడి వరవరరావును సమర్థిస్తూ ఎంత రాశారో చూశావుగా- నీమీద గత నాలుగేళ్ళుగా యింత జరుగుతున్నా ఏ పత్రికలో ఎవరూ రాయలేదేమి? నీవాళ్లు నీ పార్టీలో లేకుండా చేయబడ్డారని దీంతోనైనా నీకు అర్థం అయితే సంతోషమే. రా! అగ్రకుల సంస్కరణవాద పరిమితుల్లో కూరుకుపోయిన పి.డబ్ల్యు.జి.ని వదిలేసిరా సమగ్ర సామాజిక విప్లవం కోసం దళిత సామాజిక విప్లవ నాయకత్వంలోకి రా! పీపుల్స్‌వార్ పార్టీ సభ్యత్వం అనేది నాకు వెంట్రుకతో సమానం- అని ప్రకటించు. మనిషి సమాజం కోసం పని చేయడం ముఖ్యంగానీ పార్టీల సర్టిఫికెట్లు అవసరం లేదని స్పష్టం చేసే స్థాయికి ఎదుగు. ఒక ప్రేమ్‌చంద్, ఒక రాహుల్ సాంకృత్యాయన్‌లా గద్దర్ స్వంత కాళ్ళపై కూడా నిలబడి ప్రజల హృదయాల్ని గెలుచుకోగలడు అని చరిత్రలో నిరూపించు- చరిత్రను నిర్మించు. ఇలాంటి అవకాశం మరోసారి రాకపోవచ్చునని గుర్తించు.

Dalithayugam-2
03-09-09
63

తరగని గని గద్దర్

1985లో విరుచుకు పడ్డ పాశవిక నిర్బంధంతో కోస్తా ప్రాంతాన్ని కూడా ప్రచారజోన్ నుంచి పోరాట ప్రాంతంగా రూపు దిద్దాలనే ఆచరణమొదలైంది. 17-7-85 నాడు జరిగిన కారంచేడు దుర్మార్గం పార్టీ అవగాహనకు కులనిర్మూలనా పోరాటాలు చేపట్టాలనే ఒక గొప్ప సంకేతాన్ని అందించింది. తర్వాత నీరుకొండ, బీహార్ దళితుల ఊచకోతలు, చుండూరు మారణకాండల వంటి వెన్నో జరిగాయి. అయితే "జగిత్యాల జైత్రయాత్ర, చుండూరు మారణ కాండల వంటి వెన్నో జరిగాయి. అయితే "జగిత్యాల జైత్రయాత్ర", "ఇంద్రవెల్లి" దురంతాలు దండకారణ్య గెరిల్లా జోన్ లక్ష్యాన్ని ఉత్పత్తి చేసినట్టుగా ఈ కుల సమస్య తాలూకు దుర్మార్గాలేవీ విప్లవ పార్టీకి కొత్త లక్ష్యాల్ని, కార్యక్రమాల్ని ఎజెండాలోకి తీసుకురావడానికి పనికి రాకుండా పోయాయి.

విప్లవ పార్టీలేవీ కారంచేడు దుర్మార్గం అందించిన గొప్ప సంకేతాన్ని స్వీకరించకపోయినా ప్రజల్లోకి చొచ్చుకుపోయే ఒక అవకాశంగా, ఒక ఎత్తుగడగా నైనా ఎంతో ఉపయోగం అని గుర్తించి ముందుకు సాగాయి. అంతకుముందే రాయలసీమ సమస్యలపై ఆందోళన చేస్తున్న శ్రేణుల్తో కలిసి పనిచేసిన అనుభవంతోడైంది. తానెక్కడ కాలుపెట్టినా అక్కడే అంతదాకా వున్న సంస్థల్ని, ఉద్యమాల్ని, వెనక్కినెట్టి తాను ముందుకు సాగిపోయింది పార్టీ. సింగరేణి కార్మిక సమాఖ్య ఉత్తరాంధ్ర మన్యం గిరిజన పోరాటాలు, అలా రూపుదిద్దుకున్నవే. అలాగే విప్లవస్ఫూర్తితో కొంత, ఇతర కారణాలు కొంత కలిసి పుల్లారెడ్డి పార్టీతో పోటీలో, పీపుల్స్ వార్ పార్టీ పై చేయి సాధించింది. తన లక్ష్యంతో అజేయంగా ముందుకు సాగుతున్న క్రమంలో ఎదురైన స్త్రీ సమస్యా పార్టీ అవగాహనని నిలదీయలేకపోయింది. పాతికేళ్ళ నక్సల్బరీ చరిత్రలో మొట్టమొదటిసారిగా తన ప్రాపంచిక దృక్పథం గురించి తిరిగి పరిశీలించుకోవాల్సిన స్థితికి వెనక్కి నెట్టేసి తాను నిలబడి నిలదీసినవి రెండే.

ఒకటి కుల సమస్య, లేదా దళిత సమస్య. రెండు అగ్ర నాయకుల ఫాసిజం, దుర్మార్గం, నాయకత్వం నాకే కావాలనే స్వార్థం.

1985లో పీపుల్స్‌వార్ పార్టీ చీలిపోయింది. మహారాష్ట్ర, తమిళనాడు, గోవారాష్ట్రాలు వేరేపోయాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, అటవీ ప్రాంతాలకు విస్తరించిన తెలంగాణా విప్లవ నాయకులతో పాటు కర్నాటక కార్యకర్తలు కలిసి ఒక పార్టీగా మిగిలిపోయారు. సత్యమూర్తి యిందులోంచి విడిపోయాడు లేదా బహిష్కరించబడ్డాడు. క్రమంగా బీహార్‌లోని మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ (యం.సి.పి.)తో ఒక అవగాహన కొచ్చి కలిసి పనిచేయడం మొదలైంది. పట్టణాలను వశపరచుకోవాలి. ఇది ఉద్యమ కర్తవ్యం. ఇది ఉద్యమ కర్తవ్యం. అందుకు అనువుగా నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగంగా నూతన ప్రజాస్వామిక విప్లవ చైతన్యాన్ని పెంపొందించడం జెఎన్నెం దృక్పథం.

నూతన ప్రజాస్వామిక విప్లవం అంటే ఏమిటి? పూర్వం పాశ్చాత్య దేశాల్లో ఫ్యూడల్ వ్యవస్థలుండేవి. అవి పారిశ్రామికీకరించే పెట్టుబడిదారీ అభివృద్ధికి ఆటంకంగా మారాయి. వాటిని పెట్టుబడి దారీ విప్లవాలు కూల్చివేశాయి. ప్రథమ భారత స్వాతంత్ర్య పోరాటం తర్వాత, ఫ్రాన్సులో ప్యారిస్ కమ్యూన్ అనే కార్మిక విప్లవ ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు సాగింది. దాన్ని పెట్టుబడిదారీ వర్గాలు కూల్చివేశాయి. తర్వాత దాన్నించి గుణపాఠం తీసుకుని యికనుంచి మనం భూస్వామ్య వ్యవస్థను కూల్చవచ్చు. కూల్చేస్తే మన తర్వాత కార్మికులు మనల్ని కూల్చేస్తారు. అందువల్ల రాజీ పడదాం అనుకున్నాయి. కార్మికులు అనేవర్గం పెట్టుబడిదీరా వ్యవస్థ అభివృద్ధిలోనే ఉత్పత్తి అవుతారు. వాళ్ళకు సోషలిజం అవసరం. అది పెట్టుబడిదారీ విప్లవం తర్వాత వస్తుంది. పెట్టుబడి దారీ విప్లవం భూస్వామ్య వ్యవస్థను కూల్చివేయడం నుంచి వస్తుంది. మరి పెట్టుబడి దారులు యీ లక్ష్యాన్ని వదిలేశారు. రాజీపడ్డారు. కనక కార్మికులే యీ రెండు కర్తవ్యాలు నిర్వర్తించాలి అనుకున్నారు. పెట్టుబడిదారీ విప్లవానికి ఈసారి నాయకత్వం కార్మిక వర్గానిదే కనక సోషలిస్టు విప్లవం కోసం మరో యుద్ధం అవసరం లేకుండానే శాంతియుత పరివర్తనతో సోషలిజంలోకి అది పయనిస్తుంది. ఇదీ స్థూల దృక్పథం. అందువల్ల పెట్టుబడిదారీ విప్లవాన్ని కొంచెం పేరుమార్చి నూతన ప్రజాస్వామిక విప్లవం అన్నారు. ఇలా నూతన ప్రజాస్వామిక విప్లవం అంటే సారంలో పెట్టుబడిదారీ విప్లవం, రూపంలో మార్క్సిస్టు లేదా కమ్యూనిస్టు విప్లవం.

ఈ పరిమితికి లోబడిన అంశాలు, లోబడని అనుభవాలు కలిసి

"ప్రశ్నలు-జవాబుల" రూపంలో గద్దర్ కలం నుండి 'తరగతి గని' ప్రజల పాటల పుట్టు పూర్వోత్తరాలుగా వెలువడ్డాయి.

ఇందులో పాటద్వారా సమాజాన్ని విశ్లేషించడం వుంది. పని నించి పాట ఎట్లా పుట్టిందో వివరణ వుంది. అయితే ఒకటి "ప్రజల పాటల పుట్టు పూర్వోత్తరాలు" అని అంటూ "జెఎన్నెం వర్తమాన తీరుతెన్నులు" చెప్తాడేమిటి అంటూ కొందరికి సందేహం కలుగవచ్చు. ప్రశ్నలు వర్తమాన కర్తవ్యం నుంచి గతాన్ని విశ్లేషించేవిగా రూపొందడంతో అలాంటి సందేహం కలుగుతుంది. కాని యిందులో నిజంగానే ప్రజల పాటల పుట్టు పూర్వోత్త రాలున్నాయి. వాటి తీరుతెన్నులున్నాయి. ప్రజలు తమ పాటలు తామే రాసుకొని పాడుకునే దశకు గొప్ప గైడ్‌లైన్ తాలూకు క్రమాలున్నాయి.

పాటల గురించి వేసిన ప్రశ్నల ఆధారంగా గద్దర్ యీ సమాజాన్ని, ఆయా సాహిత్య ప్రక్రియల్ని, ప్రజల స్వభావాల్ని, ఆశల్ని, ఆరాటాల్ని చర్చిస్తాడు. ఇదెలా సాధ్యమైందంటే గద్దర్ తన ముందు మాటలో అన్నట్టు కష్టజీవుల జీవితమే ఓ పాట. దాన్ని తవ్వుతూ పోతే జ్ఞానోదయ దీపాలు దర్శనమైతాయి. పాటను ప్రశ్నిస్తే సమాధానాల్లో మరో ప్రశ్నను చూపుతాయి. తిరిగి ఆ ప్రశ్నకు సమాధానం వెతుక్కోమంటాయి. అట్లా జీవితమనే పాటకు యిచ్చిన సమాధానం నుండి పుట్టిన మరెన్నో ప్రశ్నలకు యిందులో జవాబులున్నాయి. అలాంటి తరగని గని సుసంపన్నమైన అనుభవాలఖని యీ పుస్తకం.

గద్దర్ భాష పాటంత సులువుగా వుంటుంది. ఒక ఆచరణ శాస్త్రాన్ని (ఈస్థటిక్ అని పిలువబడే అలంకార శాస్త్రాన్ని) చదువుతు న్నామన్న బరువైన స్పృహే వుండదు. అందమైన పూలతోట వంటి ప్రజల్లో ఆహ్లాదకరంగా, కర్తవ్యపరంగా విహరిస్తున్నట్టుగానూ, పర్యటిస్తున్నట్టుగానూ వుంటుంది. ఎన్ని అనుభవాలో, అవి ఎంత చెప్పినా తరగనిగనిలా కనిపిస్తాయి. 300 పేజీల పుసత్కం దివినా అయ్యో అప్పుడే అయిపోయిందా? ఇంకా రాసివుంటే బావుండు అని ఆశను, ఆసక్తిని రేకెత్తిస్తుంది పుస్తకం. గద్దర్ కాబట్టే యిలా రాయగలిగాడు. ఏమంటే భారతదేశ విప్లవ సాహిత్య సాంస్కృతిక రంగాల్లో గద్దర్‌కు కలిగినన్ని పరిచయాలు, అనుభవాలు, మరెవరికి లేవు అని చెప్పడం అతిశయోక్తికాక పోవచ్చు. పాతికేళ్ళ నిరంతర కృషి అతన్ని గొప్ప కళాకారుడిగా తీర్చిదిద్దింది.

"మూడు లక్షల కాపీలకు పైన అమ్ముడు బోయి, అట్టడుగు ప్రజల గుండెల మీద ముద్రించబడ్డ 'జ.నా.మం.' పాటల పుస్తకం, పాటల యుగంలో ఓ మైలురాయి

అని మాత్రం చెప్పగలను. జ.నా.మం. ఈ దిశలో తన పాత్ర తాను నిర్వర్తించి చరిత్ర సృష్టించింది అని గద్దర్ అన్నది అక్షరాల నిజం. అలాంటి పాటలు ఎలా ఉత్పత్తి అయ్యాయి? వాటి వెనక ఎంత కృషి వుంది. ఎందరి కృషి వుంది? ఎన్ని అనుభవాలున్నాయి? అవి సృష్టించిన ఉత్పత్తి సంబంధాలేమిటి? అనే విషయాలు ఈ పుస్తకంలో పొందుపరచబడి వున్నాయి.

మన జీవితంలోని భాషలో ఎన్నో ఛాయాభేదాలున్నాయి. వాటిని గద్దర్ ఎంతో చక్కగా వివరిస్తాడు. ఒకే భాష వర్గాన్ని బట్టి, ప్రాంతాన్ని బట్టి, కులాన్ని బట్టి, హోదాని బట్టి, సందర్భాన్ని బట్టి అనేకమైన భాషలుగా ఎలా చీలిపోయి కొనసాగుతూ వస్తున్నాయో సోదామరణంగా విశ్లేషిస్తాడు. మధ్య తరగతి ప్రజల భాష కూడా ప్రజలకు అర్థమవుతుంది కానీ అది ప్రజల హృదయాలను ఎందుకు ఆకట్టుకోలేదో విరసం సభ్యుల పాటల్నీ కూడా తీసుకుని నిర్ధారిస్తాడు. మధ్య తరగతి భాషను వదిలేసి, ఆ బాణీల్ని వదిలేసి గ్రామీణ పీడిత ప్రజల, పీడిత కులాల ప్రజల భాషనే, బాణీ ప్రజల జీవితంలోని సాహిత్య కళారంగాల్లోని ఈస్థటిక్స్ (అలంకారశాస్త్ర సూత్రాలు) తెలిసిన గొప్ప సాహిత్య విమర్శకుడుగా గద్దర్ యీ రంగంలోనూ ఉన్నత శిఖరాలను అధిరోహిస్తాడు.

మధ్య తరగతి ప్రజల బలహీనతలేమిటి? గ్రామీణ ప్రజలను చేరని విప్లవ రచయితల, మేధావుల ఆలోచనల్లో ఎలాంటి అశాస్త్రీయత వుంటుంది? అది ఎందువల్ల వుంటుంది? గ్రామాలకు తరలండి క్యాంపెయిన్ ఎంత గొప్ప అవసరం, అందులో పాట ఎంత అనివార్య అవసరం, అనే విషయాల్ని సామాజిక వాస్తవాల నుండి విశ్లేషిస్తాడు గద్దర్. ప్రజలను చేరడానికి, పల్లెలను చేరడానికి పాట ఎట్లా ఒక లోనైనా మేధావులుగా ఎందుకు తయారు కాలేకపోయారు అనే ప్రశ్నకు జవాబు ఈ జ్ఞాన సిద్ధాంతంలోనే వుంది. అందువల్ల దాన్ని చర్చించి వెతికి తీయడం కోసం పై ప్రశ్నలు వేయవలసి వస్తున్నది.

గద్దర్ చెప్పిన జ్ఞాన సిద్ధాంతం కులవ్యవస్థకు సంబంధించింది. అది మనువుకు సంబంధించిన జ్ఞానసిద్ధాంతం. అందువల్ల కుమ్మరి కుండలు చేయును. బ్రాహ్మడు మంత్రాలు చదువును. అని చెప్పినంత సులువుగా, పాటలోని సాహిత్యాన్ని సాహితీ మిత్రులు, రాజకీయాల్ని రాజకీయ మిత్రులు సరిచేస్తారని చెప్పాడు.

అయితే అంతిమంగా – ప్రజల విప్లవపాటలు కాబట్టి, వాటిని దిద్దేహక్కు ప్రజలకుంది అంటాడు గద్దర్. అతడి ఉద్దేశంలో పాటని దిద్దడమే గానీ, పాటలోని

రాజకీయాలను దిద్దడం కాదు. పుస్తకమంతటా యిది గోచరిస్తుంది. ప్రజలకు తమపై నెరపుతున్న ప్రజారాజకీయాల్ని దిద్దేహక్కు లేదా? లేదనే గద్దర్ పుస్తకం తెలుపుతున్నది. "మేం రాజకీయాలు చెప్పేవాళ్ళం" అనే ఒక ప్రత్యేక కులం వంటిది "మీరు రాజకీయాలు వినాల్సిన వాళ్లు" అని ఆచరిస్తుంది. అందువల్ల జ్ఞానసిద్ధాంతంలో దిద్దుబాటుకు ప్రజల పాత్ర నిరాకరించబడుతున్నది. ఉద్యమంలోని ఈ కులవ్యవస్థ పార్టీని బ్రాహ్మణ వర్ణంగా మార్చేసింది. జ.నా.మం. నిరంతరం పనిచేసే వంటి శూద్రులు, పంచములు పార్టీ అనే బ్రాహ్మణుల సలహా మీదే నడవాల్సి వుంటుంది.

బ్రాహ్మడు ప్రజల్ని కలుస్తాడు. ఎవరితోనైనా సంబంధాలు పెట్టుకుంటాడు. కులానికొకర్ని పెళ్ళి చేసికోవచ్చు. కానీ శూద్రులు, పంచములు బ్రాహ్మడి మాటమీదుగానే ఆ మేరకే ప్రజలతో కలిసి వుండాలి. బ్రాహ్మడు లేకుండా జ.నా.మం. యే స్వయంగా ప్రజల్ని కలిసి అయ్యా! అయ్యా! మేం ఈ రాజకీయాలు చెప్తున్నాం తప్పో ఒప్పో మీరే సరిచేయండి అని వెళ్ళడానికి వీల్లేదు. పార్టీ అనే బ్రాహ్మడు చెప్పకుండా కుల సమస్య, స్త్రీ సమస్య అంటూ ఏవేవో రాసి ప్రజలకు నివేదించే హక్కు లేదు. అసలు పార్టీ అనే బ్రాహ్మడికి తెలవకుండా స్వంతంగా ఎవరికి వారు స్వీయ అనుబంధ సంస్థల వాళ్ళు కూడా కలుసు కోవడానికి పరస్పర సంబంధం, ప్రభావం నెరపుకోవడానికి వీల్లేదు. ఈ జ్ఞాన సిద్ధాంతాన్ని ఆచరించడం వల్లనే ఊరిమీద దప్పు చాటించే వృత్తిగా జ.నా.మం. కుదించి వేయబడింది దాన్లో మేధావుల ఉత్పత్తిని నిరోధించింది.

పర్యవసానంగా జ.నా.మం. పాటల చరిత్రను, జ.నా.మం. పాటలను ఎట్లా విశ్లేషణ చేయాలో చెప్పిన గద్దర్ విశేషమైన అనుభవాలుండి కూడా, ఆ పద్ధతిని, దృక్పథాన్ని తానే ఆచరించ లేకపోయాడు. ఉదాహరణకు అందుకు మొట్టమొదట జ.నా.మం. చరిత్రను తెలుసుకోవాలన్నాడు. అందువల్ల మొట్టమొదట ఆ చరిత్రను ఉద్యమక్రమంలో దాని కార్యక్షేత్రం మారుతూ, పెరుగుతూ వచ్చిన తీరుల్ని విశ్లేషించడంతో పుస్తకం ప్రారంభించవలసి వుండింది. ఈ పని తాను చేసివుంటే పైనే చెప్పినట్టు పాట ఎలా పుట్టింది? ఉద్యమంలో పాట అవసరం ఎలా పుట్టింది అనే ప్రశ్నల్ని మొట్టమొదట వేసుకొని ప్రజల చరిత్రను, పార్టీచరిత్రను, ఉద్యమాల చరిత్రను, సాహిత్య సాంస్కృతిక రంగం చరిత్రను దాని తీరుతెన్నుల్లి, క్రమాల్ని విశ్లేషించడంతో పుస్తకం ప్రారంభమై వుండేది. ఈ పనిని గద్దర్ గానీ, జననాట్యమండలి గానీ ఎందుకు చేయలేకపోయింది? నర్సింగరావు వున్నప్పుడు ఈ పని కొంత చేశాడు.

ఆ తర్వాత ఆ కర్తవ్యాన్నే మరిచిపోయారు. ఎందువల్ల? దానికి మూలం ఎక్కడ వుంది?

దానికి మూలం జననాట్యమండలి ఆచరిస్తున్న పైన చెప్పిన జ్ఞానసిద్ధాంతంలో వుంది. ఈ దేశంలోని కులవ్యవస్థలో "శ్రమ విభజనతో పాటు శ్రామికుల విభజన"లో వుంది అన్న అంబేద్కర్ సూత్రీకరణ నుంచి చూస్తే ఈ విషయం మరింత తేట తెల్లం అవుతుంది. నేను వంట చేసిపెడ్తాను. తినడం, సంపాదించడం నీవంతు తినే అగ్రకుల మధ్య తరగతి ఇల్లాలి దృక్పథం కూడా ఇది. అందువల్ల ఈ రెండు ధైర్యాన్ని కలిగింపజేయడమే సాహిత్య ప్రయోజనం అంటారు కొందరు. చరిత్ర చోదకశక్తులకు, సమాజపు అభివృద్ధికి వెనకబడినవాళ్లకు ఉపయోగపడేదే సాహిత్య ప్రయోజనం అంటారు. మరి జ.నా.మం., గద్దర్ నిర్వచించే సాహిత్య ప్రయోజనం ఏమిటి?

ఇది పాటల గురించిన పుస్తకం మాత్రమే కాదు. ఇది సమాజంలోని సమస్త కళలు, శాస్త్రాల్లో ఉత్పత్తి సంబంధాల్లో మానవ సంబంధాల్లో రావలసిన మార్పులను, వస్తున్న మార్పులను పీడిత ప్రజల కోణంలో విశ్లేషించిన పుస్తకం. ఇది పాటల గురించిన ఒక విజ్ఞాన సర్వస్వం. జీవితాల్నే పాటలుగా మార్చుకున్న పాటల గురించి విజ్ఞాన సర్వస్వం ఇది. అందువల్ల ఇందులో సమాజశాస్త్రం అవుతుంది. భాషా శాస్త్రం వుంది. సాహిత్య శాస్త్రం వుంది. అలంకార శాస్త్రం వుంది. సంగీతశాస్త్రం వుంది. మానవ సంబంధాల శాస్త్రం వుంది. అన్నిటికన్నా మిన్నగా ఇందులో ప్రజల జీవితం, జీవన విధానం వుంది. అందువల్ల వీళ్ళందరూ చదవవలసిన గొప్ప అనుభవాల సంచిత విజ్ఞాన సర్వే అయ్యింది. ఇందులోని దృక్పథంతో, విశ్లేషణతో విభేదించే వాళ్ళు కూడా తప్పని సరి చదవవలసిన పుస్తకం ఇది. కోణాల్లో చూస్తే తప్ప ఈ పుస్తకంలోని లోపాలు, జ.నా.మం. లోని లోపాలు ఇలా ఎందుకున్నాయో అర్థం కావు. చరిత్రను నిర్మించి దాన్ని పరాయీకరించడం కోసం ఇతరులకు అప్పగించడమే జ.నా.మం. చేస్తున్నపని. శ్రమ విభజనతో పాటు శ్రామికుల విభజన బ్రాహ్మణిజాన్ని సృష్టించింది. కులాల అంతస్థులను సృష్టించాయి. పార్టీ నిర్మాణ సూత్రాల్లోని శ్రమవిభజన ఆచరణలో శ్రామికుల విభజనగా కొనసాగుతున్నది. అందువల్ల జ.నా.మం. చరిత్రను తాను కాకుండా మరెవరో రాయాల్సిన అవసరానికై ఎదురుచూస్తున్నది. పూర్వం యీ ఎదురు చూపు దేవుడి మీద బ్రాహ్మడిమీద, రాజుమీద వేసే భారంగా వుంటే యిప్పుడది, పార్టీమీద, ఉద్యమం మీద, దాని 85 కోట్ల ప్రజల్లో 75 కోట్ల ప్రజలు ఒక్కటి కావాలనే జ.నా.మం. ప్రజల ఆచరణని, ఆశయాల్ని, అశేషత్యాగాల్ని రెండుగా చీల్చే పార్టీ చీలకుల్ని అనర్థం అని అప్రజాస్వామికం అనీ ఉద్యమ చరిత్రకు గుణపాఠాలు చెప్పలేక పోయింది. నాయకుల స్వార్థాలకు దేశవ్యాప్తంగా చీలికలు పేలికలవుతున్న ఉద్యమాన్ని ఒక్కటి చేయడంలో అడ్డంకిగా వున్న నాయక పూజారి వ్యవస్థను కనీసం సంస్కరించలేక పోయింది. అసలా కర్తవ్యాల్ని తన కార్యరంగంగా కూడా గుర్తించలేక పోయింది. పర్యవ సానంగా రివిజనిజం వచ్చాక సోవియట్ నుండి వెలువడిన పుస్తకాల్లో వుండే పరిమితుల్ని జ.నా.మం. ఆచరణకూ, యీ పుస్తకానికి ఏర్పడక తప్పలేదు.

జననాట్య మండలి–గద్దర్

జననాట్య మండలి గురించి గాని, గద్దర్ గురించి గాని తెలుగుదేశంలో తెలియనివారు అరుదు. దేశవ్యాప్తంగా విప్లవ శ్రేణుల్లో కూడా వీరి గురించి తెలియనవారు అరుదు. ప్రపంచంలో ఏ సాహితీ సాంస్కృతిక సంస్థకు తీసిపోని కృషి జననాట్యమండలి చేసింది. ప్రపంచం గర్వించదగిన కళాకారుడు గద్దర్. ప్రపంచం గర్వించదగిన సంస్థ జననాట్య మండలి.

గద్దర్ పాతికేళ్ళకు పైగా సాహిత్య సాంస్కృతిక సంఘంలో కృషి చేస్తున్నాడు. తన సాహిత్య సాంస్కృతిక కృషికి ఉద్యోగం కోసం కేటాయించే సమయం, అడ్డంకిగా మారిందని గ్రహించి నపుడు, తన ఉద్యోగం పరిమితికి తన కృషిని కుదించుకోలేదు. తన కర్తవ్యానికి, లక్ష్యానికి అనువుగా ఉద్యోగాన్ని వదులుకున్నాడు. సాహిత్య సాంస్కృతిక రంగం కోసం యిలా చేసినవారు అరుదు. అలా అరుదైన వాళ్ళల్లో గద్దర్ ఒక ప్రముఖుడు.

గద్దర్ 1965ల్లో అంబేద్కరిజం గురించి, కుటుంబ సంక్షేమం గురించి పాటలు పాడేవాడు. ప్రదర్శనలు యిచ్చేవాడు. చదువుకున్న దళితుల్లో సాధారణంగా మొదట అంబేద్కరిజమే ప్రాచుర్యంలో వుండేది. అలా అక్కయ్య ద్వారా మిత్రులద్వారా అంబేద్కరిజం నుండి ప్రారంభమైన ఒక తమ్ముడు, ఒక దళితుడు గద్దర్.

నక్సల్బరీ, శ్రీకాకుళాలు రగిలిరగిలి ఉవ్వెత్తున లేచి ఉజ్వలంగా ప్రకాశించిన కాలంలో గద్దర్ అంబేద్కరిజం, కుటుంబ సంక్షేమం, తదితర సంబంధిత కళాకారుడుగా వుండేవాడు. శ్రీకాళ ఉద్యమం తీవ్ర నిర్బంధానికి, అణిచివేతకు గురై కార్యకర్తలు, నాయకత్వం పాశవిక హత్యాకాండకు బలియైంది. ఆ ఉద్యమాన్ని కొనసాగింపజేయాలని, దాని నిప్పును కాపాడుకోవాలని, పోరాటాల్ని విస్తృతీకరంచాలని, ఆ క్రమంలో శత్రువు కేంద్రీకరణను తట్టుకోగలమని కొందరు ఉద్యమకారులు భావించారు. తెలంగాణాలో అలా 1968–70ల్లో నక్సల్బరీ, శ్రీకాకుళం నిప్పురవ్వలు పడి రాజుకోవడం మొదలైంది.

వర్గశత్రు నిర్మూలన ప్రధాన కార్యక్రమంగా సాగిన నక్సల్బరీ, శ్రీకాకుళ రాజకీయాలు, సామాజిక రంగంలో మేధావుల, కళాకారుల, రచయితల మద్దతు పొందాల్సిన అనివార్యతను పెరుగుతున్న నిర్బంధం క్రమంలో గుర్తించాయి. నిర్బంధం అలా ప్రజల విస్తృత మద్దతు సాధించే వ్యూహాన్ని అనివార్యం చేసింది. పలు చర్చలు, యిష్టాగోష్టుల క్రమంలో మాభూమి, రంగులకల నర్సింగరావు నేతృత్వంలో "ఆర్ట్ లవర్స్" అనే సంస్థ విప్లవ సాంస్కృతిక సంస్థగా పరివర్తన తీసుకుంది. కొలంబస్ అమెరికాను కనుగొంటే నర్సింగరావు గద్దర్‌ను కనుగొన్నాడు. కొలంబస్ కనుగొనడం అసలైన అమెరికన్లను పాశవికంగా అణిచివేసి రెడ్ యిండియన్లుగా మార్చి స్వదేశంలో బానిసల్ని, ప్రవాసుల్ని కావిస్తే నర్సింగరావు కనుగోవడం ఈ దేశానికి స్వేచ్ఛ సమానత్వం, సౌభ్రాతృత్వం, పీడిత ప్రజల చేతుల్లోకి నిజమైన అధికారం రావడం, ప్రజల విముక్తి కావడాన్ని వేగవంతం చేసింది.

విప్లవ రచయితల సంఘం (విరసం) 1970 జులై 4న ఆవిర్భవించింది నక్సల్బరీ, శ్రీకాకుళాల నేపథ్యంలోనే, "ఆర్టీలవర్స్" సంస్థ విరసం కన్నా దాదాపు ఏణ్ణర్థం ముందే ఆవిర్భవించిన విప్లవ సాంస్కృతిక సంస్థ. అయితే కొంతమంది చరిత్ర తెలియని వాళ్ళు విరసం ప్రేరణతో జననాట్యమండలి పుట్టింది అని అను కుంటుంటారు. అది సరికాదు. జననాట్య మండలియే ఏణ్ణర్ధం, రెండేళ్ళ ముందు పుట్టింది. దాని మొదటి పేరు ఆర్ట్‌లవర్స్, తర్వాత తనపేరును తన కార్యక్రమాల విస్తృతిననుసరించి జననాట్య మండలిగా రూపుదిద్దుకొంది. నాటి కళాకారుల్లో భూపాల్ కూడా ఒక ప్రముఖుడు.

ప్రజాసంఘాల అవసరంలేదు, వర్గశతృనిర్మూలనాయుద్ధం చేయడమే తక్షణ కర్తవ్యం అనే అవగాహనతో విప్లవ రాజకీయాలు సాగుతున్నపుడు జననాట్య మండలి పుట్టింది. అటు తర్వాత విరసం పుట్టింది. ఇవి రెండూ నిర్వర్తిస్తున్న కర్తవ్యాలు చూసి విప్లవ రాజకీయాలు ముగ్ధమై పోయాయి. మరో పక్క కార్యకర్తల కొరత. ఉత్సాహంగా పనిచేసే యువరక్తం కావాల్సి వచ్చింది. కాలేజీల్లో, స్కూల్లల్లోనైతే వందలాది మంది యువకులు ఒక్కచోట కుప్పబోసినట్టుంటారు. వారిని ఉద్యమ లక్ష్యాలవైపు ఆకర్షించుకోవాలి అని నేతలకు ఆలోచన కలిగింది. దాంతో విద్యార్థి సంఘం ఏర్పడింది. ఆ విద్యార్థి సంఘం తర్వాత 1974 అక్టోబరులో పి.డి.యస్.యుగా, దాన్నించి చీలిపోయి 1975 ఫిబ్రవరిలో ఆర్.యస్.యు గా ఏర్పడ్డాయి. ప్రజల్లోకి చేరడం కోసం ఆర్.యస్.యు. విద్యార్థులు "గ్రామాలకు తరలండి క్యాంపస్" తో

ముందుకుసాగారు. అందుకు పాట ఒక ఆయుధమైంది. ఈ క్యాంపేన్‌తో పార్టీ స్వరూప స్వభావాలు గుణనీయంగా అభివృద్ధి చెందాయి. కొంత విశాలదృక్పథం అలవడింది.

జననాట్యమండలి కృషికి ఈ రాజకీయ దృక్పథం తాలూకు పరిమితి వుంది. ఆనాటి కృషి అంతమేరకే సాగింది. అయితే పార్టీకి గానీ, విరసం గానీ లేని ఒక సౌకర్యం జననాట్య మండలికి వుంది. విరసం ప్రధానంగా మధ్య తరగతి మేధో, సాహిత్యరంగాలకు పరిమితమైంది. దాని ఉపన్యాస ప్రక్రియ ఒక్కటే అట్టడుగు ప్రజల దాకా చేరగలిగింది. పార్టీ రహస్య నిర్మాణానికి పరిమితమైంది. జెఎన్నెం ఈ రెండు పరిమితుల్ని అధిగమించవలసి వచ్చింది. తద్వారా ఈ రెంటికీ లేని విస్తృత ప్రజాశ్రేణి, జెఎన్నెంకు అనివార్య అవసరంగా మారాయి. ఆ క్రమంలో ప్రజల జీవితాల లోతుల్లోకి వెళ్ళడం, హృదయాలను పసిగట్టడం, వాటినించే తమ రాజకీయ, మానవీయ సంబంధాల సారాన్ని చెప్పడం మొదలయ్యాయి.

ఇతర ప్రజాసంఘాల నిర్మాణం యొక్క ఆవశ్యకతని కాలక్రమంలో విప్లవ పార్టీలు గుర్తించాయి. అవి సరిగ్గా రూపుదిద్దు కోకముందే 25-6-1975న అర్ధరాత్రి ఎమర్జెన్సీ విధించబడింది. అనేకమంది చంపబడ్డారు. ఎందరో జైళ్ళపాలయ్యారు. 1977 మార్చిలో జనతాప్రభుత్వం కేంద్రంలో ఏర్పడింది. అపుడు నిర్బంధాలు తొలగిపోయాయి. స్వేచ్ఛగా ఎంతవీలైతే అంతగా ప్రజాసంఘాల నిర్మాణం సాగింది. అలా విద్యార్థి సంఘాలతోపాటు రాడికల్ యువజన సంఘం ఏర్పడింది. అటుతర్వాత రైతుకూలీ సంఘం ఏర్పడింది. అటుతర్వాత గ్రామాభివృద్ధి కమిటీలు ఏర్పడ్డాయి. తర్వాత గ్రామ రక్షక దళాల నిర్మాణం కోసం ప్రయత్నం సాగింది. నిర్బంధం పెరిగే క్రమంలో ప్రతి ఏటా మూడింట ఒకవంతు కార్యకర్తలు యితర ప్రాంతాల్లో, లోతట్టు గిరిజన ప్రాంతాల్లో ఉద్యమాన్ని విస్తృతీకరించే కార్యక్రమంపై ప్రస్థానం సాగించారు. అలా కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్ రైతాంగ పోరాటాలు అని పిలువబడ్డ పోరాటాలు దండకారుణ్య పోరాట ప్రాంతంగా, గెరిల్లా జోన్ లక్ష్యంగా, సాయుధ దళాల నిర్మాణంగా దృక్పథం ఆచరణ విస్తృతీకరణ పొందాయి.

1977 నుంచి కోస్తా జిల్లాలను ప్రచారజోన్ లక్ష్యానికి పరిమితం చేశారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలు, తెలంగాణా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒరిస్సా, కర్నాటక, రాష్ట్రాల్లోని లోతట్టు గ్రామీణ, గిరిజన ప్రాంతాలు పోరాట ప్రాంతాలుగా లక్ష్యం ముందుకు సాగింది. 1985లో విరుచుకుపడ్డ నిర్బంధంతో కోస్తా ప్రాంతాన్ని కూడా ప్రచారజోన్ నుంచి పోరాట ప్రాంతంగా రూపుదిద్దాలనే ప్రయత్నం మొదలైంది.

Dalithayugam-2
03-09-09
68

1985లో పీపుల్స్‌వార్ పార్టీ చీలిపోయింది. మహారాష్ట్ర, తమిళనాడు, గోవా రాష్ట్రాలు పార్టీనించి వేరైపోయాయి. ఆం.ప్ర. రాష్ట్ర కమిటీ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర అటవీ ప్రాంతాలకు విస్తరించిన తెలంగాణా విప్లవ నాయకులతో పాటు కర్నాటక కార్యకర్తలు ఒక పార్టీగా మిగిలిపోయారు. వీళ్ళు క్రమంగా బీహార్‌లోని మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ (ఎం.సి.సి.)తో ఒక అవగాహనకొచ్చి కలిసి పనిచేయడం మొదలైంది.

1985లో నిర్బంధం పెరిగినపుడు అన్ని ప్రజాసంఘాల నాయకత్వం రహస్య నిర్మాణ రూపాల్లోకి మళ్ళాలని ఉద్యమ నాయకత్వం ఆశించింది. అలా జ.నా.మం. అయిదేళ్ళు తనకుతాను బహిరంగ అవకాశాలను పరిమితం చేసికొంది. అదే సమయంలో విరసం అరుణతార అవిచ్ఛిన్నంగా కొనసాగాయి.

1989 చివరి రోజుల నుండి తెలుగుదేశం పోయి కాంగ్రెస్ ప్రభుత్వం, చెన్నారెడ్డి ముఖ్యమంత్రి రావడం లీగల్ అవకాశాలు పెరగడం, పెద్ద ఎత్తున లక్షలాది ప్రజల్తో సభలు జరగడం, ప్రజా పంచాయితీలు వగైరా సాగడం చెన్నారెడ్డి దిగిపోయాక తిరిగి నిర్బంధాలు పెరగడం, పీపుల్స్‌వార్ పార్టీ, దాని అనుబంధ సంస్థలు నిషేధానికి గురి కావడం జరిగాయి.

1991 చివరిలో 1992 ప్రారంభంలో పీపుల్స్‌వార్ పార్టీ మళ్ళీ రెండుగా చీలిపోయింది. పార్టీలోని యీ చీలిక వల్లనైతేనేమి, అయిదేళ్ళ రహస్య నిర్మాణ రూపాల్లోని రుచి, అనుభవాల వల్లనైతేనేమి గద్దర్ నిర్బంధలోనూ ఈసారి బహిరంగంగా వీలైనంత మేరకు నిలబడదల్చుకున్నాడు. అందుకు అనువుగా తన ప్రాపంచిక దృక్పథాన్ని, కార్యక్షేత్రాన్ని విశాల పరచుకున్నాడు. ఈ క్రమంలో ఒంగోలులో రాష్ట్ర దళిత మహాసభల్ని ప్రారంభించాడు.

1985-90 నిర్బంధ కాలంలో "అఖిలభారత ప్రజాసమాచార సాంస్కృతిక పర్యటన"లో పాల్గొన్నాడు. ఆ తీరిక సమయాల్లో చేసిన రచనల్లోంచి సాంస్కృతికోద్యమ నిర్మాణ సమస్యలు, గద్దర్ కవితలు, "తరగని గని" ప్రజల పాటల పుట్టు పూర్వోత్తరాలు వంటివి వెలువరించాడు. ఇంకా ఆయనలో ఉద్యమంలో లాగే గుట్టల కొద్దీ పేరుకు పోయిన ముడిసరుకుంది.

ఉద్యమచరిత్ర నుండి విడదీసి జె ఎన్నెంను విశ్లేషించవద్దని ఈ "తరగని గని" ప్రజల పాటల పుట్టుపూర్వోత్తరాలులో కోరాడు గద్దర్. ఉద్యోమ దృక్పథం ఆచరణ,

దాని అవసరాల నుండి జ.నా.మం. అర్థం చేసుకోవాలన్నాడు. అందువల్ల యిక్కడ సంక్షిప్తంగా పేర్కొనడం జరుగుతున్నది.

ఉద్యమ దృక్పథం యిలా వుండేది. దేశాలు విముక్తిని, జాతులు స్వాతంత్ర్యాన్ని, ప్రజలు విప్లవాల్ని కోరుతున్నారు. ఈ దేశం అర్థ భూస్వామ్య, అర్థవలస దేశం. దేశ జనాభాలో 70 శాతం గ్రామాల్లో జీవిస్తున్నారు. 70 శాతం జనాభా వ్యవసాయం మీద ఆధారపడి బతుకుతున్నది. కనక మరీ ముఖ్యంగా యిది భూస్వామ్య వ్యవస్థ. ఈ దేశంలో అశేష ప్రజలకు నిజమైన స్వాతంత్ర్యం రావాలంటే యీ ఓట్ల ద్వారా జరగదు. అందుకు విప్లవం రావాలి. ఆ విప్లవం చైనా విప్లవం లాగా ఈ దేశంలో ముందుగా గ్రామాలను విముక్తం చేస్తూ వాహనమో బాలసంతలు, ఫకీర్లు, బచ్చిగాళ్ళు, తుర్రు మామ, ఎరుకల వాళ్ళు, గారడీవాళ్ళు, తత్వాలవాళ్ళు, కథలవాళ్ళు, మొదలైన ఎన్నో కళారూపాల్ని, తీసుకొని చర్చిస్తాడు.

బయటి రాష్ట్రాల్లో జ.నా.మం. ఎలా విజయం సాధించిందో చెప్పే క్రమంలో దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో గల సాహిత్యం, సంస్కృతి, జ్ఞానక్రమం, సమస్యలు ఎలా వుండేవో, భాషా సమస్యను, బాణీల సమస్యను ఎట్లా పరిష్కరించుకున్నారో ఎంతో హృద్యంగా వివరిస్తాడు. అనువాదం చేయడం అనే చర్చలో ఆయాభాషల సాహిత్య, సాంస్కృతిక చరిత్రకనువుగా అనువాదాలు ఎందుకు సాగాల్సి వుంటాయో తెలుపుతాడు.

పాట పల్లవిని, బాణీని ఎలా అధ్యయనం చేయాలి? ప్రజల జీవితం అనే వస్తువూ, విప్లవ కర్తవ్యబోధ అనే వస్తువు కలిసి పాట పల్లవిలో, బాణీలో సృష్టించే వైరుధ్యాల్ని ఎట్లా పరిష్కరించుకోవాలో చర్చిస్తూ అసలు పల్లవిని, బాణిని ప్రజలు ఎఅ, ఎందుకు సృష్టించుకున్నారో తెలుసుకుంటే తప్ప యీ వైరుధ్యాన్ని ఎందుకు సరిగ్గా పరిష్కరించలేమో వివరిస్తాడు.

బాణీ అంటే యూనిఫాం రిథమ్ అని అది ప్రజల శ్రమజీవన సౌందర్యంలో ఎలా ఉత్పన్నమవుతుందో చెప్పిన తీరులో కూడా సాహిత్య ప్రయోజనాన్ని నిక్షిప్తం చేస్తాడు. సినిమాపాటల బాణీ తీసుకోవడంలో వచ్చే కష్ట నష్టాలేమిటో, సాహిత్య ప్రయోజనం కుంటుబడకుండా ఆ బాణీని ఉపయోగించుకోవడం ఎంత సున్నితమైన పనితనమో చెప్పకయే చెప్తాయి.

సినిమా ప్రక్రియ మీద జ.నా.మం. అవగాహన ఏమిటి? పాటల ప్రదర్శనలో ఎదురయ్యే ఆచరణాత్మక సమస్యలు ఏమిటి? వాటిని ఎలా పరిష్కరించుకోవాలి? ఆదునిక అభివృద్ధి చెందిన వాయిద్యాలను పాటలకు ఉపయోగిస్తే ఏం జరుగుతుంది? మొదలైనవన్నీ సాహిత్య ప్రయోజనం గీటురాయిగా విశ్లేషిస్తాడు.

ఇందులో ఏ పేజీ తిరగేసినా సాహిత్య ప్రయోజనమే సాహిత్య లక్ష్యం అని స్పష్టం చేసింది. పల్లవి, బాణి, శిల్పం, శైలి, వేగం, సందర్భం, చరిత్ర, జీవితం, సంస్కృతి, జ్ఞానక్రమం, ప్రజల మధ్య వైరుధ్యాలు, శతృవుకూ ప్రజలకూ మధ్య వైరుధ్యాలు, ఇతర ప్రక్రియలకు పాటకు మధ్యగల సంబంధాలు, వైరుధ్యాలు, సాహిత్య విమర్శ, అలంకారశాస్త్ర విమర్శ, విప్లవకాల్పనికత, విప్లవ పాటల్లో ఫ్యూడల్ సంస్కృతి అవశేషాలు, ప్రజాసాంస్కృతిక, నైతిక విలువలు, నిబద్ధత, నిమగ్నత, సామాజిక కర్తవ్యం, కులాలు, మతాలు, జాతులు, స్త్రీ సమస్య, మొదలైనవన్నీ సాహిత్య ప్రయోజనమే సాహిత్య లక్ష్యం అనే దృక్పథం నుండి విశ్లేషించబడ్డాయి. అందువల్ల పుస్తకంలోని పలుశాస్త్ర విషయాలు కూడా అరటిపండు ఒలిచి తిన్నంత హాయిగా జీర్ణమవుతాయి. దేనికైనా దాని సాహిత్య ప్రయోజనమే గీటురాయి అనే వాస్తవానిన కొందరు అంగీకరించక పోవచ్చు. వారికి యీ పుస్తకం చెంపపెట్టే కాకుండా గోడదెబ్బ కూడా.

సాహిత్య ప్రయోజన వాదాన్ని అంగీకరించేవాళ్ళు కూడా ఒక్కలాగాలేరు. కొందరు ఉత్తమానసికోల్లాసం సాహిత్య ప్రయోజనం అంటారు.

ప్రజల బతుకు తత్వం తెలిసిన సామాజిక తత్వవేత్త...
తెలంగాణా సాయుధ పోరాటయోధుడు ప్రజాకవి సుద్దాల హన్మంతు వారసుడు....

సుద్దాల అశోక్‌తేజ

తెలుగు నేల ప్రపంచానికందించిన గొప్ప రచయితల్లో సుద్దాల అశోక్‌తేజ గారొకరు. ఎగదల్చుకున్న వారికి ఎల్లలు లేవు అన్న నానుడిని అక్షర సత్యం చేసిన వారు సుద్దాల అశోక్‌తేజ. ప్రపంచంలో తెలుగు వాళ్ళున్న దేశాలన్నిటా తాను రచనతోనే పరిచయం చేసుకున్న ప్రజాకవి సుద్దాల అశోక్‌తేజ.

ఆకాశమంత ఎదిగే మహావృక్షాల వేళ్ళుకూడా భూమిలోనే ఉంటాయి మహానదులు కూడా పిల్లకాలువగానే పుడ్తాయి. మహోన్నత శిఖరాల కెదిగే వాళ్ళుకూడా మట్టి మనుషుల్లోంచే కష్ట జీవుల్లోంచే ఎదుగుతారు. అలాంటి వారిలో సుద్దాల అశోక్‌తేజ ఒకరు.

జననం...

సుద్దాల జానకమ్మ, కీ.శే.సుద్దాల హన్మంతు దంపతులకు 16-5-1960న నల్లగొండ జిల్లా సుద్దాలలో జన్మించిన సుద్దాల అశోక్‌తేజ తన తండ్రి వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్నాడు.

ఒక యుద్ధం జరిగాక ఎవరో ఒకరు గెలిస్తే వారిది విజయగాథ, గెలిచినా, ఓడినా యిరుపక్షాల్లో క్షత్రగాత్రులెందరో...! తెలంగాణా సాయుధ పోరాటం గెలిచినా, ఓడినా క్షతగాత్రులు క్షతగాత్రులే. పోరాటంలో పోయినోల్లే మంచోల్లు అనుకునే బతికున్న వారి దుర్భర జీవితం ఎంత దయనీయమో...! విప్లవ పాటలకు నేటి గద్దర్‌లా తెలంగాణా రైతాంగా సాయుధ పోరాట యోధుడైన సుద్దాల హన్మంతు గొప్ప రచయితా, గాయకుడు.

"పల్లెటూరి పిల్లగాడ పసులగాసే మొనగాడా- పాలు మరిచీ ఎన్నాళ్ళయిందో" పాటతో సుద్దాల హన్మంతు ప్రజల హృదయాల్లో కన్నీరు పెట్టించాడు. తెంగాణా పోరాట అనంతరం బతుకంతా క్షత్ర గాత్రమై పోయింది. పుట్టిపెరిగి తిరిగిన ఊళ్ళల్లో బతకలేక వృద్ధాప్యంలో నల్లగొండ జిల్లా సుద్దాల ప్రాంతం నుండి కరీంనగర్ జిల్లా మారుమూల పల్లె చేరితే ఆ పల్లెజనం తమ గుండెలకు హత్తుకున్నారు. మెట్‌పెల్లికి మూడు కిలో మీటర్ల దూరంలోని మూడు బొమ్మల మేడిపెల్లి "సుద్దాల హన్మంతు కాదు, అతని కొడుకు సుద్దాల అశోక్ తేజకూ బతుకునూ, బాసటను ఇచ్చింది".

కరీంనగర్ జిల్లా మెట్‌పెల్లిలో టీచరుగా...

1977లోఅనుకుంటాను, పిడికెడు మెతుకుల కోసం సుద్దాల అశోక్ తేజ మెట్‌పెల్లిలో టీచరుగా ఉద్యోగం చేస్తూ వ్యక్తిత్వ వికాసం కోసం, అభివ్యక్తి వికాసం కోసం నిరంతర సాధన. ప్రజలకే అంకితమైన నాన్న జీవితం... ఉద్యమాల వాడివేడి ఉన్న ప్రాంతం .... శిథిలమైన జీవితం....దెబ్బతిన్న హృదయం....మనస్సు ప్రజల పక్షం వహించమంటుంది. నాన్న తాలూకు బతుకు....గతం భయపెడుతోంది. ఎన్ని రాత్రులో....ఎంత సంఘర్షణో....నెలలు... ఏళ్ళు....

అంతర్మదనం...

నన్ను నేనుగా ఎందుకు నిరూపించుకో గూడదని, నన్ను నేనుగా ఈ సమాజానికి అంకితం ఎందుకు చేసుకోకూడదని సమాజానికి అంకితం కావడానికి మధ్యవర్తి ఎందుకని భగవంతుడికి భక్తుడికి మధ్య మధ్యవర్తి ఎందుకని... ఇదే భావం పదే పదే.... దాని అభివ్యక్తికి తెలుగునాట అప్పుడే తాత్విక సిద్ధాంతాలు రూపొందుతున్న కాలం....

ప్రజాగాయకుడుగా, రచయితగా....

పల్లె నుండి పట్నం దాకా ఎన్ని మీటింగుల్లో పాటినా రాష్ట్రమంతటా ప్రజలందరికీ తన పాట చేరడానికి యింకెన్నేళ్ళు పడ్తుందో... అనే నిరాశ. ఇంకో వైపు చూస్తే రాసిన నెలలోపే వేల లక్షల క్యాసెట్లతో, రికార్డులతో సినిమా ప్రక్రియలోని పాట ప్రజలకు చేరువై వారి నాలుకలపై నడయాడుతోంది. ఇలా తీవ్రంగా మదనపడిన సుద్దాల అశోక్‌తేజ తాను, తన పాట ప్రజల్లోకి చేరడం కోసమే సినిమా పాటను ఒక సాధనంగా మలుచుకోవాలనుకున్నాడు.

సినిమా ఒక సాధనమే తప్ప లక్ష్యం కాదు....

నేడు చాలా మందికి సినిమాల్లో నటించడం, సినిమాలకు రాయడం దానికదే లక్ష్యం, ప్రజల పట్ల నిబద్ధత ఉన్న రచయితలకు, కళాకారులకు, సినిమా ఒక సాధనం మాత్రమే. సత్యజిత్ రాయ్, శ్యాంబెనెగల్, షబానా ఆజ్మీ, గిరీష కాసరవెల్లి వంటివాళ్ళ లాగే సుద్దాల అశోక్ తేజ తన భావాలకు అభివ్యక్తికి ప్రజల్లోకి విస్తృతంగా చేరడానికి సినిమాను తనకొక సాధనంగా అవసరం అని గుర్తించాడు.

విశ్వవ్యాప్తం కావడానికి....

సుద్దాల అశోక్ తేజ సినిమారంగం లో 1994 సెప్టెంబర్‌లో ప్రవేశించాడు. అప్పటికి పరిస్థితి ఎలా ఉందో! శ్రీశ్రీ, దాశరథి, ఆత్రేయ, ఆరుద్ర, సినారే వంటి సాహిత్య ఉద్దండుల తరం గడిచి సాహిత్య రంగంలో రాణించకుండానే డైరెక్టుగా సినిమాలోనే రాణించే తరం శాసిస్తున్న వ్యవస్థ! పిడికెడు మెతుకుల కోసం బతుకంతా ఖర్చయితే ఎదిగేదెలా! ఆత్మ విశ్వాసమే పెట్టుబడిగా సంకల్పమే అజేయసైన్యంగా, ఉపాధ్యాయ ఉద్యోగానికి సెలవు పెట్టి ఒంటరిగా పయనం సాగించారు.

సినిమా రంగంలోకి....

1994 సెప్టెంబర్, 26న "నమస్తే అన్న" చిత్రంలో తొలిపాట రాశారు. "గరం గరం పోరి నా గజ్జల సవారి...." అనే తొలి సినిమా పాటతోనే ప్రజల హృదయాల్లోకి చేరిపోయారు. సంగి శెట్టి లక్ష్మినారాయణ నిర్మాతగా, ఈ చిత్రం వెలువడింది. కేవలం అయిదేళ్ళలో 70 సినిమాల్లో 150 పాటలు రాసి తెలుగు సినీ గేయ రంగంలో తనదైన ఒక విశిష్ట స్థానం సంపాదించుకున్నారు. సినిమాల్లోకి రాకముందే రచయితగా గొప్ప పేరున్న సుద్దాల అశోక్‌తేజ ఆణిముత్యాల వంటి పాటలెన్నో రాశారు.

పాట పుట్టుక గురించి....

1989లో తాను ప్రచురించిన "బతుకు పాటలు" పుస్తకంలోని తొలిపాట "టప టప చెమటబొట్లు తాళాలై పడుతుంటే" అంటూ కష్ట జీవుల చెమట బొట్టు నుండి పుడ్తున్న పాట పుటకపై రాసిన పాట తెలుగు సాహిత్యంలో ఒక గొప్ప పాట. "ఆడిదాన్నిరో...నేను ఆడిదాన్నిరో...ఈడ ఎవనికి కానిదాన్ని యాడిదాన్నిరో" అంటూ స్త్రీ వ్యథకు అక్షర రూపం యిచ్చి వారికే గొంతై ఎదిగారు."కన్న తల్లి మమ్ముల కన్నప్పటి నుండి కడుపు నిండ తిన లేదు మెతుకు. కంటి నిండ కనలేదు కునుకు"

అన్న అనాథల గీతం కంట తడిపెట్టిస్తుంది.

అక్షర ఉజ్వలలో...

"అక్షర ఉజ్వల" కార్యక్రమంలో ప్రజల్ని ఉత్తేజితుల్ని చేసిన పాటల్లో సుద్దాల తేలిక పదాలతో ఎంత గొప్ప అర్థాన్ని చెప్పారో అద్భుతం! "సదువు సానా సుళువు...సిన్నక్కా..." ఇన్ని పనులు చేసే నీకు సదువు సానా సుళువంటూ స్త్రీల పనులన్నిటిని కళాత్మకంగా చిత్రించి వాటికి సాహిత్య గౌరవం కలిగించారు. "ఆకు పచ్చ సందమామ నువ్వేలే..." అంటూ రైతు జీవితాన్ని మహోన్నతంగా సాహిత్యీకరించిన పాట తర్వాత సినిమాలోకి తీసుకోబడింది.

సామాజిక తత్వవేత్త...

తత్వశాస్త్రంలో ఎమ్మే చేసిన సుద్దాల అశోక్‌తేజ ప్రజల తత్వం, ప్రజలనాడి ప్రజల అవసరాలు తెలిసిన సామాజిక తత్వవేత్త, సమగ్ర సమాజ వికాసమే రచయితగా సుద్దాల అశోక్ తేజ లక్ష్యం. ఆ లక్ష్యం కోసమే పాట, కథ, నాటకం, నవల, సినిమా, టి.వి. మొ॥ ప్రక్రియల్ని సాధనాలుగా మలుచుకున్నారు.

సుద్దాల అశోక్‌తేజ రాసిన సామాజిక నవల "వెలుగు రేఖలు" కు విశాలాంధ్ర నవల పోటీలో 1985 రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతి అందుకున్నారు. నాన్న మొదలెట్టి పూర్తి చేయలేకపోయిన "వీరతెలంగాణా సాంఘిక యక్ష గానం" పూర్తి చేసి ప్రచురించి పలువురి ప్రశంసలు పొందారు. వీరు రాసిన "ఊరుపిశాచాలు, నాలుగు దిక్కులు, తూర్పు యాక్సిడెంట్" మొ॥ నాటికలు, నాటకాలు, సుద్దాల నాటకరంగ ప్రతిభను స్పష్టం చేస్తాయి.

దళం సినిమాలో రాసిన "అవ్వనీకు దండమే...." మద్రాసు కళాసాగర్, అవార్డును హైదరాబాద్ సినీ గోయర్స్ అవార్డును అందుకున్న ఈ పాట ఒక గొప్ప తత్వాన్ని తెలిపే పాట. "ఓసేయ్ రాములమ్మా" సినిమాలో రాసిన

రామ సక్కని తల్లి రాములమ్మా రాములమ్మా...

నువ్వు రాయోలో కూసున్నవు ఎందుకమ్మో ఎందుకమ్మో...

పాట ఆత్రేయ మనస్విని పురస్కారం పొందింది.

రాష్ట్రప్రభుత్వ నంది అవార్డు...

"కంటే కూతుర్ని కన" సినిమాలో

ఆడకూతురా నీకు అడుగడుగునా వందనం

అనునిత్యం కరుగుతున్న నీవు రక్త చందనం

పుట్టుక నుండి చావు మధ్య బతుకునంతా అరగదీసిన

ఏ జీతం, ఏ సెలవులు ఎరుగని ఒక దాసివి.

అంటు సాగే పాట స్త్రీవాద సారాంశంతో పాటు మానవతా వాదాన్ని మేళవించిన అద్భుతమైన పాట. 1998లో ఈ పాటకు రాష్ట్ర ప్రభుత్వం నంది అవార్డును ఇచ్చి సత్కరించింది. ఇదే పాటకు వంశీ బర్కిలీ అవార్డు రావడం ఆ పాట గొప్పతనాన్ని స్పష్టం చేస్తున్నది.

ఆరు నంది అవార్డుల స్వర్ణక్క, కథా రచయిత...

సుద్దాల అశోక్ తేజ "స్వర్ణక్క" సినిమాకు కథ రాశారు. ఆ సినిమాకు ఆరు నంది అవార్డులు రావడం సుద్దాల అశోక్ తేజ ఎంత బలంగా ఈ కథని, పాత్రల్ని చిత్రించారో స్పష్టం చేస్తుంది.

అయిదేళ్ళలోనే విశేష కృషి...ప్రశంసలు...

ఇలా సినిమా రంగంలో ప్రవేశించిన కేవలం అయిదేళ్ళలోనే తనదైన విశిష్ట స్థానం గెలుచుకున్న సుద్దాల అశోక్ తేజ తెలుగు సినీ చరిత్రలో మైలురాళ్ళు దాటడమే కాకుండా కొత్త మైలు రాళ్ళు నాటుకుంటూ... శ్రీశ్రీ, కొసరాజు, ఆత్రేయ, దాశరథి, డా॥ సినారె. అందరు కల్సి ఒక్కరుగా సుద్దాల అశోక్ తేజలో మూర్తీభవించినట్లుగా వీరికి వారసులుగా ఎదుగుతున్నారు. ఈ అయిదుగురి విశిష్టతలను ఒక్కడే ఒక్క చేతిమీదుగా నిర్వహించడమే సుద్దాల అశోక్ తేజ ప్రత్యేకత.

బహుముఖ సృజనాత్మకత...

నవల, నాటకం, పాట, సినీ రచన, అన్నీ కల్సి ఒకే ఉన్నత స్థాయిలో ఎదగడం తెలుగు సాహిత్య చరిత్రలో అరుదైన విషయం, ఈ అరుదైన దాన్ని డా॥ దాసరి నారాయణరావు ఒకరంగం నుండి సాధిస్తే, సుద్దాల అశోక్ తేజ మరో రంగం నుండి ప్రారంభించి... ఎదుగుతున్నారు. డా॥ దాసరి వంటి దిశా నిర్దేశకులు సుద్దాల అశోక్‌తేజ లోనిప్రతిభను పసిగట్టి ఆశీర్వదించడం సుద్దాల అశోక్‌తేజకు కొండంత అండ.

తనపై తనకు ఒక స్పష్టత ఉన్నవారు జీవితంలో అంతిమంగా ఓడిపోవడం ఉండదు. పదేళ్ళ క్రితమే "బతుకు బాటలు" పుస్తకంలో సుద్దాల అశోక్‌తేజ తన గురించి తనకుస్పష్టత ఉందని ముందు మాటలో స్పష్టం చేసుకున్నాడు. "ఇందులో నానా జాతి గీతాలు ఉండవచ్చు అవి నన్ను తెలిపేవి కావు. రేడియో, టి.వి. ఇంకా అనుభూతుల కోసం రాసినవి." ఈ మాట సినిమా పాటలకు కూడా వర్తిస్తుంది. డా॥ రావూరి భరద్వాజ ఒక చోట అంటాడు! ఒక చోట అంటాడు! నేను పొట్ట కూటి కోసం కొన్ని రాసాను, నా కోసం కొన్ని రాసాను అని. అలాగే సుద్దాల అశోక్ తేజ వృత్తిపరంగా రాసినవన్నీ అతన్ని తెలిపే పాటు కావు. అయితే పొట్ట కూటికోసం చేసే వృత్తిలోను, రచనలోను మనిషి వ్యక్తిత్వం ఉంటుంది శ్రీశ్రీ, ఆత్రేయ, సినారె రాసిన సినిమా పాటల్లోనూ వారి ముద్ర ఉంటుంది. అలాగే సుద్దాల అశోక్‌తేజ ఏ పాట రాసినా అతని ముద్ర అంటూ ఉంటుంది. పాత్రలకు వాటి స్వభావాలకు హృదయాలకు తనదైన అభివ్యక్తిని అందిస్తున్నారు సుద్దాల అశోక్ తేజ.

దాసరికి నచ్చిన పాట...

తననుకున్న స్థాయిలో ఉండాలని ఒక రచయితను కోరి మరీ రాయించుకున్న పాట నచ్చక దాసరి ఖిన్నుడైనప్పుడు, సవినయంగా సార్ నా పాట వింటారా అని అడిగాడు సుద్దాల. ఈయనెప్పుడు రాశాడబ్బా అనుకుని ఆశ్చర్యపోయారు దాసరి. అతనికి కాన్సెప్టు చెప్పగా విని తాను సాధన కోసం రాసుకున్న పాట విన్పించాడు సుద్దాల. అదే బాగుందని దాసరి తీసుకున్నారు. ఇదొక మధురమైన జ్ఞాపకం. తనపై తనకు ఆత్మవిశ్వాసం ఎంతగానో పెంచిన ఘటన. అలాగే...

సినారే ప్రశంస....

డా॥ సినారే గారు కూడా "ఇప్పుడు సుద్దాల రాస్తున్నాడు కదా!" అని తనను పాటలడగవచ్చిన వారికి చెప్పడం ద్వారా పరోక్ష ప్రశంస లందుకున్న ఘనత, తన వారసుడని చెప్పకనే చెప్పిన విశిష్ఠత సుద్దాల అశోక తేజకే దక్కింది.

తెలుగువారి వందేమాతరం గీతంగా...

జన్మభూమి, మహిళా జన్మభూమి ప్రజా దీవెన వంటి ప్రభుత్వం, పార్టీ విడుదల చేసిన క్యాసెట్లలో సుద్దాల అశోక్ తేజరాసిన ఎన్నో పాటు ప్రాచుర్యం పొందాయి.

"తరలుదాము రండి మనం జన్మభూమికి
తల్లి పాల ఋణం కొంత దీర్చడానికీ
కన్న తల్లి కన్న మిన్న కదా నేల తల్లీ
కదులుదాము తెలుగు తల్లి కాల్లకు ప్రణమిల్లి
వందేమాతరం... వందేమాతరం... వందేమాతరం...

అంటూ సాగే జన్మభూమి పాట దేశ దేశాలకు వ్యాపించింది. ఇది తెలుగు వాళ్ళకు వందేమాతర గీతంలా ఉత్తేజం ఇస్తుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ పాట విషయంలో ప్రత్యేకంగా పిలిపించి మరీ సుద్దాల అశోక్ తేజను అభినందించారు. అంతర్జాతీయ గీతంలా సుద్దాల జన్మభూమి పాట ప్రపంచ దేశాలు అన్వయించుకొని, అనువదించుకొని పాడుకోవలసిన పాట.

నూతన సహస్రాబ్దిలో ప్రజా రచయిత....

తరం మారుతున్న కొద్ది కొత్త తరం కొత్త గొంతుక విచ్చుకుంటుంది. తెలుగు సినీ సాహితీ చరిత్రలో విచ్చుకుంటున్న కొత్త తరం గొంతులకు ఒక ప్రతీక సుద్దాల అశోక్‌తేజ. సంకల్పం, పట్టుదల, సృజన, వినయం, నిరంతర సాధన, సామర్థ్యం, ప్రజల పట్ల, సమాజం పట్ల, నిబద్ధత నిర్మల హృదయం, స్నేహ తత్వం కలిస్తే సుద్దాల అశోక్‌తేజ, అతను ఎంతో ఎత్తులకు ఎదగడం యీ ప్రాంత ప్రజలకు, కళా కారులకు ఎంతో ఉత్తేజం. నూతన సహస్రాబ్ధికి చైతన్యం అందించే సామాజిక తత్వవేత్తల్లో సుద్దాల అశోక్ తేజ ఒకరు.

బి.ఎస్ రాములు, వంగపండు ప్రసాదరావుల ఇష్టా గోష్టి

(వంగపండు ప్రసాదరావు గొప్ప కవి, గాయకుడు, కళాకారుడు. బి.ఎస్. రాములు సామాజిక తత్వవేత్త. ఇద్దరు కలుసుకున్నప్పుడు సాహిత్య సాంస్కృతిక అంశాల్లో గాఢత ఎక్కువగా ఉండడం సహజం. సాంస్కృతిక రంగంలో కొనసాగుతున్న కొన్ని భావాలను వెలికి తీసుకురావడానికి, వంగపండు కృషిని, భావాలను రికార్డు చేయడానికి బి.ఎస్. రాములు గారు ఒక ప్రయత్నం చేశారు. ఆ ఇష్టాగోష్టిని చర్చరూపంలోంచి ప్రశ్నలు జవాబులు రూపంలోకి వారే అనువదించారు. దాన్ని సంక్షిప్తంగా అందిస్తున్నాము - సంపాదకులు)

బి.ఎస్: ఒకరిద్దరు కవిగాయకులు పాటకు మెలోడి ప్రాణం అని, అదేం కాదని చర్చలు చేశారు. ఈ విషయంలో మీరు ఏమనుకుంటున్నారు?

వం: పాటకు మెలోడి చాలా అవసరం పాటపూజకు కావచ్చు పుణ్యానికి కావచ్చు. కరుణకు కావచ్చు, ప్రేమకు కావచ్చు, ఉద్యమాలకు కావచ్చు. పాటకు మెలొడీ ప్రాణం రసరమ్యత, లాలిత్యం, గాంభీర్య, పాట విరుపులు పాటకు ప్రాణం పోస్తాయి. అబ్బ ఎంత చక్కగా పాడాడురా అని దారిన పోతున్న వాళ్ళు నిలబడి వినడం మెలొడీ. ఏది రాస్తున్నాడో దాని పల్లవిని సృష్టించుకోవాలి. భూపాల్ లాంటి వాళ్ళు వీటిని నేర్చుకున్న వాళ్ళేగాని వాటి సృష్టికర్తలు కారు, సృష్టికర్తలు కావాలంటే జానపదుడుగా మారిపోగలగాలి. మన జ్ఞానానికి జానపదుల భాషనుండి కారం, జోడించి, సజీవత్వంతో రాయాలి అందుకు రచయితకు జానపద పిల్లల తత్వం ఉండాలి.

బి.యస్: లయ-పద చిత్రాల విషయంలో మీ పాటల ప్రత్యేకత ఏమిటి?

వం. వాగ్రూపమై జన సమూహంలో బతకడమే దాని ప్రత్యేకత, జానపద గీతానికి రు.,. .,. సులక్షణం ఉండాలి. అది ఉంటేనే జానపదగీతం అవుతుంది. అలాకాకపోతే కొద్ది కాలం ఉండి అంతరించిపోతుంది. నా పాటలుకూడా చాలా వరకు అంతరించిపోతాయి.

బి.ఎస్: మీ పాటల శిల్ప రహస్యం ఏమిటి?

వం: నా పాటల ప్రతిదానికి కథాశిల్పం ఉంటుంది. విడివిడగా దేనికదిగా ఎప్పుడూ రాయను. అలా రాస్తే అది ప్రచార పాటగా మిగిలి పోతుంది. అలాంటి పాటలు ఎన్నికల ప్రచార పాటల్లాగా సందర్భం పాతబడగానే అదృష్యమవుతాయి. అందుకని కథనాశిల్పం తీసుకున్నాను.

తీసికొని శిల్పానికి అవసరమైన అంగసౌందర్యాన్ని (పాటలోని జీవిత విధానానికి) సంబంధించి చెప్పే అలంకారాలు, ప్రయోగాలు, పద ప్రయోగాలు స్వతంత్రమైనవి సమకూర్చుకున్నాను. స్వతంత్ర్యాన్ని అనాగరికుల, నిరక్షరాస్యుల నుడికారాల్నించే తీసుకురావాలి. నిఘంటువులో లేని పదాలు, అనాగరిక మానవుల్లో వుంటాయి. అందువల్ల ఆమాండలిక శిల్ప సౌందర్యాన్ని పాటకు ఒనగూర్చిన నాడే అది జానపదపాటవుతుంది.

బిఎస్: 1971 నుండి ఎన్నిపాటలు రాశారు. ఇప్పుడు పాతబడకుండా పాడుకుంటున్నవీ, రేపు పాడుకోవడానికి మిగలగలగేవి ఎన్నుంటాయి?

వంగ: మూడు వందల పాటలు రాశాను. పదికాలాలపాటు నిలబడే పాటలు, బాగా ప్రచారంలో ఉన్నపాటలు, అన్ని ప్రజలు, మేధావులు మెచ్చుకున్న పాటలు 25-30 దాకా ఉంటాయి.

బిఎస్: మీ దృష్టిలో ఉన్న ఆ పాటలేవి?

వం: ఒకటి యంత్రమెట్టా నడుస్తున్నదంటే. రెండు. ఏంపిల్లడో ఎల్దమొస్తవా సికాకుళంలో సీమ కొండకి. మూడు ఉంద్రా మాలపేట- ఆవూరి చివర - కష్టాలున్న చోట - కాష్టాలున్నచోట. నాలుగు రండిరోకూలన్న సంగం చెడదాము - సంగతేందో జూద్దాము. అయిదు వత్తున్నాడొత్తున్నాడు భూములన్న బుగతోడు. ఆరు మా కంపెనీకి జీతాలు పెరిగినై. ఏడు జజ్జనకర జనారే జనకీ జనకే జనరే. ఎనిమిది రావణ సెందనాలి రాజానా కొందనాలో. తొమ్మిది జ్ఞానమొక్కరి సొత్తుగాదన్నా - అది సకల జాతుల సంపదోరన్నా. పది తుపాకి రాజ్యంతో ఉన్న నువ్వు తుపాకి వైతవారన్నా, పదకొండు సుత్తీ కొడవలి గుర్తుగ ఉన్న ఎర్రని జెండా ఎగురుతున్నది, పన్నెండు ఇంద్ర వెల్ల

కొండల్లో దండు పుట్టింది. నేస్తమా రావా పదమూడు యంత్రాలోడ కాలి జీతగాడ – మరలు తిప్పి మండి పోయినోడు. ఇంకా కొడవలెత్తరా తమ్ముడా. అట్లే అంబాతిక్కాడే తుంబలు గట్టి. అట్లే అయ్యోరయ్యో అప్పుల కొండో..

బిఎస్: జానపద పాటలకు శాస్త్రీయ సంగీతంతో పనిలేదా!

వం: పనిలేదు. సంగీతం కూడా జాన పద పాటనుండే పుట్టిందని అందరికీ తెల్సు అది మానవులు ఆడిన మాటలన్న లయబద్దమైన మాటలే.

బిఎస్: ఇప్పుడు మాటలకు ఆ లయ ఎందుకు పోయిందనుకుంటున్నారు?

వం: ఆధునిక మానవులకు ప్రకృతి గురించిన జ్ఞానం ఆలోచన, తక్కువ ప్రకృతిలో లీనమవడం తక్కువ. ఉదా: నాగరికులు కుండను సృష్టించలేదు. అనాగరికులు కుండను సృష్టించారు. దాన్ని అనుకరించి ఇత్తడి స్టీలు బిందెలు చేశారు.

బిఎస్: జానపద సాహిత్యం ప్రత్యేకత ఏమిటి?

వం: జానపద విజ్ఞానం వేరు, జానపద సాహిత్యం వేరు. జానపద విజ్ఞానంలో జానపద సాహిత్యం ఒక కొమ్మ మాత్రమే. జానపద సాహిత్యంతో కథ, పాట, పాటకథలుంటాయి. కాని ఏ పాటకు సంపూర్ణమైన కథ ఉండదు. అయితే మానవుని ఆలోచనలనుండి వచ్చినదల్లా చిరస్థాయికాదు. అది చిరస్థాయిగా ఉండాలంటే – దానికొక పద్ధతి, ఆచరణ ఉండాలి, ఉంటేనే అది బతుకుతుంది. అంచేత అమూల్యమైన మాటలు కొనసాగాయి.

బిఎస్: జానపద సాహిత్యానికి – జానపాటలకు గల వస్తుపరిమితి ఏమిటి, శిల్పి పరిమితులేమిటి, లయ సంగీతాల పరిమితులేమిటి! లయ సంగీతాల పరిమితులేమిటి? జననాట్యమండలి అరుణోదయ వంటి సంస్థలు పాడే విప్లవ పాటల్లో పది పదిహేను బాణీలే మళ్ళీ మళ్ళీ వస్తున్నాయని ఒక వాదన ఉంది ముప్పయ్యేళ్ళు వందలాది కళాకారులు కలిసి చేసిన కృషితో 10–15 బాణీలే సాధ్యమైనప్పుడు శాస్త్రీయ సంగీతంతో కొన్ని వందల బాణీలు తయారు చేశారు. అందువల్ల కర్నాటక సంగీతంగానీ, హిందుస్తానీ సంగీతంగానీ, శాస్త్రీయ సంగీతంగానీ దాన్ని వ్యతిరేకించడందేనికి గుడ్డి ద్వేషం పనికి రాదు అని కొందరు అంటున్నారు.

వం: నిజమే. శాస్త్రీయ సంగీతం, లేదా కర్నాటక హిందూస్తానీ సంగీతం లేదా సరిగమపదనిసల రాగ లయ తాళాల ద్వారా కొన్ని వందల బాణీలను మెలాడీలను రూపొందించారు. రూపొందించి శాస్త్రం చేశారు. దాన్ని తప్పకుండా నేర్చు కోవాలి.

ఎందుకండి ఆధునికతలో అనాగరికం రాటుతేలుతుంది. అయితే జాన పదాలకున్న రాగం అంటారే – ఆ రాగం, విలువలు, జానపద పౌరవడి, శిల్పం భాష, నుడి కారం పడగొట్టకూడదు. మధ్య తరగతి, బూర్జువా, పదజాలాలు, సంస్కృతపదాలు, శిష్టవ్యవహారిక పదాలు వాడకూడదు. వాడితే లలిత గీతాల్లా, సినిమా పాటల్లా మారిపోతాయి. జాన పదుల జాను తెనుగు నుడికారమే వాడాలి.

శాస్త్రీయ సంగీతం జానపదరాగాలలోగల రాగాన్ని చెప్పగలదు. కాని జాన పదాల్ని జానపదపాటల్లా తన నోటితో పలకలేదు, పాడలేదు. ఎందుకంటే ఆ సంగీతశైలి అగ్రవర్ణ, బూర్జువాపదాలు, భూస్వామ్యపదాలు అగ్రవర్ణ, భూస్వామ్య, బూర్జువా సంస్కృతిపై ఆధారపడుతాయి. వారి ఆధిక్యతపై ఆధార పడతాయి వారి ఆధిక్యతను ప్రచారం చేస్తూ నిలబెడుతాయి. అవి సౌమ్యంగా ఉంటాయి, జోల పాటల్లా ఉంటాయి. రాగం మెలోడి లయ ప్రాధనమై భావం ప్రాధాన్యత కోల్పోయి ప్రభావం వేసే శక్తి కోల్పోతాయి. విశ్రాంతి కులాలు, వర్గాల కనువుగా ఉంటాయి. వాటిల్లో దండకం విప్లవం. ఇది కూడా మాతృస్వామ్య తన ఆసిరమ్మలు, మీ బొమ్మల గురించి పాడుకున్న పాటల రాగ మాలికలే. నా పాటలు పరాగమో నేను విశ్వేషించలేను. కాని వాళ్ళు విశ్లేషించగలరు. ఆదివాస్తవం. కాని ఆ పాటను వాళ్ళు పాడాలంటే కష్టం. ఆ మాధుర్య రాదు. సినిమాల్లోకి ఎక్కిన జానపదపాటలు పాడేప్పుడు వాళ్ళ యిబ్బంది నెదుర్కొన్నారు.

"తెలుగువీర లేవరా దీక్షబూని సాగరా" సాపు పాట.

"రండిరో కూలన్న సంగం బెడదాం" ఉద్యమపాట ఉద్రేకపాట.

బిఎస్: అంటే మనిషికి ప్రశాంతతను, నిర్మల చిత్తానిచ్చే రాగం, లయ, పాట, భావం జానపదుల కవసరంలేదనుకుంటున్నారా?

వం: ఎందుకులేదు ఉంది. అదీ ఉంది. ఇదీ ఉంది. శౌర్యం, కోపం, ప్రేమ, కలిగినప్పుడు పాడే పాటలున్నాయి. అయితే ఉద్యమ పాటలు కర్తలుగా మేం ఆలోచన, ప్రశాంత చిత్తం గురించి కన్నా, ఆవేశంతో, ఆవేదనతో కలిదించే పాటల్నే రాశాం.

బిఎస్: జానపద సాహిత్యంలో కరుణ, శృంగారం, వీరం, భక్తి రస పాటలే ఎక్కువ, సామాజిక చైతన్యం గల పాటలు, వ్యవస్థపైగాని కుల వ్యవస్థపైగాని, సమాజంపైగాని, అధికారంపై గాని తిరుగు నేర్పే చైతన్యం గల పాటలు లేవు. రాజుమీదగాని, అగ్రకులాలమీదగాని, భూస్వాములమీదగాని ఎదిరిస్తూ పాటలు లేవు. దోపిడివర్గాలకు, దోపిడి కులాల వ్యతిరేకంగా జానపదపాటలు లేవు.

వం: లేవు నిజమే. కాని మతంలో ఉన్నాయి. మతానికి సంబంధించిన రూల్సులో ఉన్నాయి. రావుణుడిపై ఆంజనేయులు తిరగబడ్డ పాట ఉంది. అయితే అది శిష్ట జనపదం.

బిఎస్: అట్లాంటి తిరుగబడే పాటలు సన్నివేశాలు ఎన్నో ఉన్నాయి. రామాయణ భారతాలు, పల్నాటి యుద్ధం, బొబ్బిలి యుద్ధం మొదలైన వాటిల్లో ఎదుటి పక్షం మీద తిరగబడాలని, యుద్ధం చేయాలని ఉన్నాయి. కాని తన యజమానిపై తన మీద పెత్తనం చేసేవారిపై తిరగబడ్డ యుద్ధం చేయమని చెప్పే పాటలు లేవు. ఏమంటారు.

వం: నిజమే.

బిఎస్: వర్ణ వ్యవస్థను అంగీకరించిన వాళ్ళు జాన పద సాహిత్యం సృష్టించినపుడు వాళ్ళు కుల వ్యవస్థకు వ్యతిరేకంగా రాయడం సాధ్యం కాదు. కబీరు, వేమన కులవ్యవస్థను వ్యతిరేకిస్తూ రాశారు. అందువల్ల పోయింది పోగా యిపుడు మిగిలి మన దాకా వచ్చిన జానపద సాహిత్యం, పాటలు, బాణి, భాష, నుడికారం అనేవి కూడా దోపిడివర్గాల దోపిడి కులాల పరిమితుల మేరకు, వారు అనుమతించిన మేరకే కొనసాగాయి. గిరిజన సాహిత్యం ఇందుకు మనహాయింపు. అందువల్ల దోపిడి వర్గాలకు, దోపిడికులాలకు వ్యతిరేకమైన నుడికారం, భాష, భావం, బాణీ జానపద సాహిత్యంలో మిగిలి ఉందా?

వం: లేదు.

బిఎస్: అయితే అవర్ణుల్లో ఉంది. చిందు బాగోతం అని ఆడే "జాంబపురాణం" మాదిగల పురాణం. అది బ్రాహ్మణవాద, కుల వ్యవస్థపై, ఎత్తిన కత్తి. ఇప్పటికీ పల్లెల్లో అది పాడబడుతూనే ఉంది. దోపిడి వర్గాల్ని, దోపిడి కులాల్ని వ్యతిరేకించే భాష, భావం, నుడికారం, బాణీ అందులో ఉన్నాయి. వాటిని ప్రజలకోసం పాటలు రాసే వాళ్ళు యిప్పటికీ స్వీకరించలేక పోయారు. అందువల్ల జననాట్యమండలి, ప్రజానాట్య మండలి, అరుణోదయతో సహా రాసే ప్రజల పాటలు దోపిడి వర్గాల, దోపిడి కులాల, భాషకు, నుడికారానికి, భావానికి, పరిమితమై కులవ్యవస్థను అంగీకరించే నుడికారాన్ని, భాషనే ప్రచారం చేశారు.

వం: నాకీ విషయం తెలియదు. ఎవరికైనా చిన్న విషయాలు తెలియడం కష్టం మీరన్నది. ఆలోచించాల్సిందే. నేనా జాంబపురాణం వినలేదు. అయితే మీరన్నట్టు

జానపద సాహిత్యంలో ఆధిపత్య వర్గాల, దోపిడి కులాల ప్రయోజనాల్ని, దోపిడి నివృత్తి రేకిస్తూ వచ్చింది తక్కువ. వారిని ప్రశ్నిచకుండా ఉన్న మేరకే పరిమితమై జానపద సాహిత్యం కొనసాగింది. జానపదులకు అక్షరాల్ని నిరాకరించిన పాత్ర యిందులో ఎంతో ఉంది. లిఖిత సాహిత్యం నేర్చుకునే అవకాశాలుంటే చైతన్యం పెరిగి తిరుగుబాటు తత్వంగల జానపద సాహిత్యం వచ్చి ఉండేది.

బిఎస్: శ్రామిక కులాల్లో, గిరిజనుల్లో స్త్రీ పురుషుల సమానత్వం కాస్త హెచ్చు అని మాతృ స్వామ్య లక్షణాలింకా పదిలపర్చుకున్నారని చెప్తున్నామనం కాని కుల వృత్తిలో భాగంగా గానీ, కళాకారుల కులాల్లో గానీ డప్పు, కంజెర, తంబూర, కొమ్ము, తప్పెలు, మొదలైన ప్రధాన వాయిద్యాలన్నీ మగవాళ్ళే వాయిస్తున్నారు. గజ్జెలు, వంతలు, చప్పట్లు మాత్రం స్త్రీలకు కాస్తంత మిగిలాయి. ఇందంతా బహుజనులలా మగపెత్తైన వ్యవస్థనే కొనసాగిస్తున్నారని స్పష్టం చేస్తున్నది.

వం: నిజమే, స్త్రీలతో నాట్యాలు చేయించాలి. కాని వాయిద్యాలు వాయించడ్ సంప్రదాయం కాలేదు. స్త్రీని పితృస్వామ్య భావజాలంతో ప్రధాన స్థానాలించి దూరం చేసిన క్రమంలోనే సంగీతవాయిద్యాలపై హక్కులేకుండా చేశారు. మగ అదుపు ఆజ్ఞల్లో ఉండిపోయాయి.

బి.ఎస్: అందువల్ల సంగీత వాయిద్యాలు, సంగీతం పురుషాధిపత్య భావజాలానికి, భాషకు, బాణీలకు, నుడికారానికనువుగా మార్చబడ్డాయని అంగీకరిస్తారు.

వం: కరెక్టే అవన్నీ మగవాళ్ళ కనువుగా మార్చి వేయబడ్డాయి. స్త్రీలకు మిగిల్చిన బాణీలన్నీ వయ్యారాల బాణీలే.

బి.ఎస్: కనక ఇపుడు స్త్రీలు, స్త్రీవాదులు మగవాళ్ళతో సమానమైన బాణీలు తీసుకుంటే అవి కూడా మగ పెత్తైన స్వభావాన్ని కొనసాగిస్తాయి గదా. ఉదా॥కు ప్యాంటూ షర్టు స్త్రీలు వేసుకుంటే స్త్రీలు కూడా పురుషుల్లాగే కనపడ్డట్టు. స్త్రీల స్త్రీవాదుల పాటల రూపంలో మగలెత్తన స్వభావమే కొనసాగుతుంది గదా.

వం: మీరన్నది నిజమే. స్త్రీ సంగీతవాయిద్యాలు, భాషను బాణీల్ని, భావజాలాన్ని, నుడికారాన్ని సంగీతాన్ని స్త్రీలే రూపొందించుకోవాలి.

బి.ఎస్: పిల్లలే రేపటి పౌరులు. పిల్లల సాహిత్యం పిల్ల వ్యక్తిత్వా వికాసానికి తోడ్పడుతుంది. బాల్య ముద్రలు బలంగా ఉంటాయి. పిల్లల కోసం మీరు ఏ యే పాటలు రాశారు.

వం: నేను పిల్లల కోసం పాటలు రాయలేదు. అయితే రాయలేక కాదు. రాయాలనే అవగాహనలేక. చెప్పేవారు లేక, అడిగేవారు లేక రాయలేదు మీ చర్చలో చక్కని అవగాహన కనిగింది ఇక రాస్తాను.

బి.ఎస్: పిల్లల కోసం, సార్వకాలిక మానవీయ సంస్కృతీ విలువలకోసం, ప్రేమా, కరుణ, స్నేహం, కోసం మీరు పాటలేమి రాయకపోతే మీ పాటలకు ఓట్ల కోసం తాత్కాలిక ప్రయోజనాల కోసం పాడి ప్రచారం చేసే పాటలకు తేడా ఏమిటీ?

వం: జన నాట్యమండలి యిలాంటి పాటలు రాయడంలో పిల్లల్ని చైతన్య చేయడంలో కృషి చేయలేకపోయింది. పిల్లల సాహిత్యం ఒక ప్రత్యేక శాఖ, అందరూ పిల్లల కోసం కూడా రాయాలి. పిల్లల్ని మలచడానికి పిల్లల పాటలెంత అవసరం ఇక నుండి పిల్లల గురించి పీడిత వర్గ దృక్పథంతో, శ్రామికుల దృక్పథంతో స్రీల దృక్పథంతో నాస్కిక హేతువాద,మానవతావాద, భౌతిక వాద దృక్పథంతో పాటలు తప్పకుండా రాస్తాను.

బి.ఎస్: మీరు నిజంగా జాన పద ప్రజల్ని వారి జీవితాల్ని చైతన్యం పంచేదే అయితే వారి సంస్కృతిని మార్చేదే అయితే కులాంతర వివాహాల్ని ప్రోత్సహించే పాటల్ని, కులాంతర వివాహాల్లో పెండ్లి గురించి పాడుకునే పాటల్ని, స్రీలను గౌరవించాలని, మగ వాళ్ళు ఆడవాళ్ళలా అన్ని యింటి పనులు, వంట పనులు, పిల్లల పెంపకం చేయాలని, తల్లిదండ్రుల్ని గౌరవించాలని, తోటి వారి స్వేచ్ఛను, సమానత్వాన్ని సౌదరత్వంతో గౌరవించి సహకరించాలని రాశారా? మీరు సాంస్కృతిక చైతన్యం ఉద్యమాలున్న పల్లెల్లో అయినా ఏటా కనీసం 5 అయినా కులాంతర వివాహాలు చేసుకునేట్టు యిలా ముప్పయి ఏళ్ళల్లో చేయలేక పోయిందంటే – మీ వర్గ చైతన్యం వారి వారి కులాధిక్యతల స్వార్థాని కనువుగా మాత్రమే ఉపయోగపడిందని అర్థం. మీరు నేర్పిందంతా ఎదుటు పక్షాన్ని విమర్శించడాన్నే తప్ప తనను తాను సంస్కరించుకోవడానికి ఉద్దేశించలేదని అర్థం.

వం: ఇవన్నీ విప్లవం వచ్చాక సాంస్కృతిక విప్లవంతో పరిష్కరించుకునేవి అని అందర్లాగా నేను భావించాను.

బి.ఎస్: అంటే విప్లవం వచ్చేదాకా అగ్రకులాల కుల అహంకారాన్ని ఆచరించి కింది కులాలను కించపరిస్తే భరిస్తూనే ఉండాలన్నమాట. అలాగే మగవాళ్ళ పెత్తనాన్ని విప్లవం వచ్చేదాకా భరిస్తూనే ఉండాలన్నమాట. అంటే కులాధిక్యతకు, మగ పెత్తనం ఆచరణల్ని ఆచరించడానికి లైసన్సులిచ్చేశారన్నమాట.

Dalithayugam-2
03-09-09
77

వం: మీరన్నట్టు విప్లవ పనివిధానాన్ని సంబంధించిన తిరుగుబాటు తత్వాన్ని కష్ట జీవులకందించింది నిజం. అదే మా పరిమితికూడా. ఆ గౌరవాలు కూడా పొందుతాం అయితే నేటి సమాజం ఆ మనిషిని మనిఖి అర్థం చేసికొని ప్రేమించే ఆత్మీయతలు బాగా లోపిస్తున్నాయి, రూ.,. పాన్ని తీర్చడానికి ప్రముఖ కళాకారులు, కవులు, మీరన్న కర్తవ్యాల్ని స్వీకరించి నడుంబిగించి పూర్తి కృషి చేయాల్సి ఉంది.

బి.ఎస్: ఆర్థిక సమానత్వం వస్తే చాలా సమస్యలు పోతాయంటారు కొందరు కుల అణిచివేత, స్రీల అణిచివేత కూడా పోతాయంటారు. ఇది ఆర్థికంగా లేనివారిని సమానంగా చూడనవసరం లేదనే దోపిడివర్గాల దృక్పథంకదా.

వం: అసలు ఆర్థికంగా సమానత్వం వస్తే సమస్య పరిష్కారమవుతుందనడం తప్పు. స్రీలు సమానంగా సంపాదిస్తున్నా అగ్రకుల పెత్తనం పోలేదు. దళితులు జీన్‌ప్యాంటు తొడగడం ఏమిటి అంటారు.

బి.ఎస్: ఇంత మంది సంస్కర్తలు, విప్లవాలు వచ్చినా ప్రజలు కులాల్ని ఎందుకు ఆచరిస్తున్నారు?

వం: కులాల కట్టు దిట్టాలు కొనసాగుతున్నందువల్ల. కులం ఉండకూడదని చట్టంలో ఉన్నా జీవన విధానంలో కుల, ఫ్యూడల్ సంస్కృతి కొనసాగుతున్నది. వర్గ తారతమ్యం కన్నా కుల తారతమ్యం చాలామందు పుట్టింది. పెద్ద కులాలవాళ్ళు చిన్న కులాల వారిని ఉపయోగించుకోవడంతో పెత్తందార్ల అనుభూతులు, వైభవాలు ఎన్నో ఉన్నాయి. పెరు ప్రతిష్టలున్నాయి. డబ్బులో కులాన్ని తీసివేయడం ఆర్థికంగా సాంఘికంగా బలపడ్డానికి ఉపయోగపడ్తున్నాయి గనక పీడిత వర్గంలోని కులాలు కూడా కుల పెత్తనాన్ని కొన సాగిస్తున్నాయి.

బి.ఎస్: మరి మనమిచ్చిన చైతన్యం ఎక్కడపోయింది?

వం: స్వార్థం ముందు అన్ని చైతన్యాలు దిగదుడుపే అవుతున్నాయి. అంచేత స్వా'ర్థ రాహిత్యాన్ని, ఇతరులపై గల తన పెత్తనాన్ని వదిలించుకునే చైతన్యం పెంచాలి. భావజాల రంగంతో, సాంస్కృతిక రంగంలో ఈ వైఫల్యమే పీడిత వర్గాల్లోనూ కుల తార తమ్యాలు కొనసాగడానికి కారణం.

బి.ఎస్: అంటే విప్లవించే ప్రజలు కూడా మనిషిని మనిషిగా గౌరవించడానికి సిద్ధంగా లేరని అర్థం. రోజు వారీ జీవితంలో కులాల్ని, మగ పెత్తనాన్ని ఆచరించకపోతే కులం ఉండదు.మగ పెత్తనం ఉండదు. ఇపుడు కుల్ ఉందంటే అది ఆచరణత

ఉందని అర్థం. కమూనిష్టుల్లోనూ, వారి మద్ధతు నిచ్చేవారిలోను కులం నిత్య ఆచరణలో ఉండడం వల్లనే వారి మధ్య కూడా కులాలు కొనసాగుతున్నాయి. మనిషిని మనిషిగా గౌరవించే సంస్కృతి, స్వార్థాన్ని త్యాగం చేసే, తన పెత్తనాన్ని వదలు కోగలగే సంస్కతే దీనికి పరిష్కారం. మనిషిని మనిషి ప్రేమించే క్రమంలోనే అన్ని రకాల పెత్తనాలు వదులు కోగలగాలి.

వం: అవును. మీ రన్నట్టు మనిషి నిరంతరం తనపైతాను పోరాటంచేసి కోవాలి. సోషలిజ్ రావాలి.

బి.ఎస్: భూపోరాటాలు, విప్లవం, సోషలిజం అనేవి సాధనాలా లక్ష్యాలా?

వం: లక్ష్యాలే.

బి.ఎస్: ఎట్లా లక్ష్యాలు?

వం: ఆర్థిక సమానత్వాన్ని అందించే సోషలిస్టు సమాజం లక్ష్యంగా తీసుకొంటే సాంస్కృతిక కార్యక్రమాలు సాధనాలుగా ఉపయోగపడ్తాయి.

బి.ఎస్: సోషలిజం అనేది ఆర్థిక సమానత్వం కోసం అయినప్పుడు ఆర్థిక సమానత్వం అనేది లక్ష్యం అవుతుంది. సోషలిజం అనే నిర్మాణ రూపం అందుకొక సాధనమవుతుంది. అంతిమ లక్ష్యం. ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుదల, స్వేచ్ఛ, సమానత్వం, సోదరత్వం, తోటి మనిషి పట్ల ప్రేమ, కరుణే కదా!

బి.ఎస్: అయినప్పుడు అసలైన లక్ష్యాల గురించి పార్టీలు, ఉద్యమాలు, సాంస్కృతిక ఉద్యమాలు ఏ మేరకు కృషి చేశాయనేదే నిర్ణాయక అంశమవుతుంది. ప్రజల జీవన ప్రమాణాల పెరుగుదల కోసం జీతాలు కూలీలు పేరగాలన్నారు. పెరిగాయి. డబ్బు వచ్చింది. డబ్బు లక్ష్యమా సాధనమా?

వం: డబ్బు సాధనమే.

బి.ఎస్: అయితే జీవన ప్రమాణాల పెరుగుదల కోసం జీతాలు, కూలీలు పెంచుకొని డబ్బు అనే సాధనాన్ని సమకూర్చాక దాన్ని ఎట్లా ఏ ఏ లక్ష్యాల కోసం, అవసరాల కోసం ఉపయోగించి పైకి పోవాలో నేర్పే చైతన్యం, సంస్కృతిని, పార్టీలు, ఉద్యమాలుకవులు, కళాకారులు, రచయితలు ఏ మేరకు చెప్పగలగారు. ఎన్ని కథలు, ఎన్ని పాటలు ఈ విషయంపై వచ్చాయి.

వం: రాలేదు.

బి.ఎస్: అనగా డబ్బు అనే సాధనాన్ని పట్టించుకున్నాం గాన, అసలు లక్ష్యల్ని గాలికి వదిలేశాం తద్వారా జీతాలు పెరిగితే తెల్ల కల్లునుండి బీరుకు విస్కీకి ప్రమోషన్లు పొందుతున్నారు. యాభయి కిలోమీటర్ల దూరంలోని దేవున్ని మొక్కడం నుండి 500 కి.మీ. దూరపు తిరుపతి వెళ్తున్నారు. కాని జీవన ప్రమాణాల పెరుగుదల గురించి పిల్లల పెంపకం గురించి, ఆ కుటుంబం సంబంధాల గురించి, పిల్ల చదువుల గురించి, మానవీయ సంస్కృతి, ప్రేమ, కరుణ గురించిన సంస్కారం అభివృద్ధిని వదిలేశారు.

వం: మీరన్నది నిజమే. డబ్బులు ఎప్పుడైతే ఉన్నాయో సామ్రాజ్యవాద సంస్కృతిని స్వీకరించి విప్లవాన్ని వదిలేస్తున్నారు. టీవీ, సిన్మాలు, అనేక వస్తువులు వచ్చేశాయి. వాటికి అలవాటు పడ్తున్నారు. అంచేత నీజమైన మానవజాతి సంస్కృతిని మనం మెరుగులుపెట్టి అవసరమైన మార్పులు చేసి కూడా ప్రజల జీవన విధానాల్ని మలచవలసిఉంది. ఈ కర్తవ్యాన్ని మేం గాలికి వదిలేసింది వాస్తవం ఇకనుంచైనా కవులు, రచయితలు అందరు ప్రజల జ్ఞానం, చైతన్యం పెరగడానికి ఉన్నడబ్బును ఎలా ఖర్చు చేయాలో, దేనికెంత ఖర్చు చేయాలో, దానికెంత ఖర్చు చేయాలో, పండుగల్ని ఎలా జరుపుకోవాలో భార్యా భర్తలు, ఎలా కల్సి ఉండాలో, ఇరుగు పొరుగుతో, స్నేహితుల్తో, ఎలాంటి సంబంధాలు ఆప్యాయత ప్రేమ, సార్థ త్యాగం ఎలా ఉండాలో నేర్పే పాటలు, కళారూపాలు రాయాల్సి ఉంది. ఇదంతా నిజమైన ప్రజల విప్లవంతో ప్రధాన కర్తవ్యంకూడా ఎందుకంటే నిత్య జీవిత జీవన విధానాల్ని మన ఆదర్శాలకు, దృక్పథాల కనువుగా జీవించేట్టు చేయాలి. స్వేచ్ఛ, సమానత్వం, సోదరత్వం, ప్రేమ, కరుణ, మేం ఎప్పటికైనా నిరంతరం పరస్పరం ఆచరించుకోవాల్సినవి.

బి.ఎస్: మీరు యింతదాకా ప్రధానంగా ద్వేషరసాన్ని, ఎదుటివాన్ని విమర్శించడాన్ని ప్రచారం చేశారు. ఆరెఎస్ఎస్ వాళ్ళదీ ఇతరుల పట్ల ద్వేష ప్రచారమే. ముస్లింలదీ అదే. కమ్యూనిస్టు నక్సలైట్లదీ అదే. నాస్తిక హేతువాదులదీ ద్వేషరసమే. మీరు ద్వేషాన్ని ప్రచారంచేసినంతగా ప్రేమను ప్రచారం చేయలేదు. ద్వేషించాల్సిన వాళ్ళు పదిశాతమే. కాని 90 శాతం. సాహిత్యం వారి గురించే రాశారు. ప్రజలు పరస్పరం ప్రేమించుకోవల్సిన వాళ్ళు 90 శాతం కాని వారి మధ్య ప్రేమ ఆప్యాయతలుండాల్సిన తీరు గురించి రాయలేదు. దోపిడి వర్గాల్ని, దోపిడి కులాల్ని ద్వేషించడం, ప్రజల్ని, శ్రామిక కులస్థుల్ని ప్రేమించడం రెండూ ఒకటి కాదు. రెండూ ఒకటే అయితే రెండో పని ద్వారానే మొదటి పని ఎందుకు చేయలేదనే ప్రశ్న వస్తుంది. మీలాంటి వారిదంతా నెగెటివ్ దృక్పథం.

Dalithayugam-2
03-09-09
79

వం: నేను ఇక నుండి మీరంటున్న ప్రజల భౌతిక సాంఘిక జీవితానికి సంబంధించిన కథలు, పాటలు, కంజర కథలు, బుర్రకథలు సారి ప్రచారం చేస్తాను. ఉదా॥కు పారమ్మకథ. ఆమె దళిత స్త్రీగా కథ అల్లిల రాస్తాను అట్లా రాయకపోతే మనం అనుకున్న మానవసంబంధాలు, మానవీయ సంస్కృతి, ప్రేమ, కరుణ, మొ॥వి చెప్పడం కుదరదు. అందుకని ఉద్యమ జీవిత కథల్లోకి కాకుండా ప్రజల సాంఘిక కథల్లోకి కూడా వెళ్ళాలి. ఆ పని చేస్తాను.

బి.ఎస్: ప్రజా కవులకు బహుజన కవులకు మీరిచ్చే కర్తవ్యాలేమిటి?

వం: అన్ని రకాల ప్రజాసాంస్కృతిక సంఘాలతో ఐక్యతతోపని చేస్తుండాలి. స్వార్థాన్ని విడనాడాలి. కులాన్ని ఆచరణ నుంచి తొలగించుకోవాలి. ఎవరిమీదా పెత్తనం చెలాయించకూడదు. ఒక మానవీయ ప్రజాస్వామ్య సంస్కృతిని రూపొందించాలి. తోటి మనిషి పట్ల ద్వేషాన్ని కాకుండా ప్రేమను, స్నేహాన్ని కరుణను ప్రచారం చేయాలి. జాన పద ప్రజాకవులుగా రాయాలనుకున్నవాళ్ళు రాసేందుకు శిక్షణ యిచ్చి విస్తృతంగా కళా కారుల్ని, కవుల్ని తయారు చేసి ప్రజల్లోకి పంపాలి. డబ్బు యావను తగ్గించి, సామ్రాజ్య వాద, కన్సుమరిస్టు సంస్కతిని, స్వార్థాన్ని తగ్గించి తోటి వారితి తోడ్పడే హృదయ సంస్కారాన్ని, మానసిక చైతన్యాన్ని తీసుకువచ్చే వేల పాటలు, కళా రూపాలు రాయాలి రావాలి.

బి.ఎస్: ఇప్పటి ఉద్యోగాలు, పరిశ్రమలు, ఎన్నికల ద్వారా వచ్చే రాజకీయాధికారం, సినిమాలు, టీవిలు, పత్రికలు మొ॥ అన్ని విప్లవం వచ్చేదాకా దోపిడి వర్గాలు, దోపిడికులాలే నిరంతరంగా అనుభవించాలని రిజర్వేషన్ చేయడమే కదా – వాటిని బహిష్కరించడం ద్వారా జరిగేది. ఇది స్పష్టంగా దోపిడి వర్గాల దృక్పథమే. ఈ రీత్యా ఇది ప్రజా ద్రోహం కాదా!

వం: దళితులకు చదువులో ఉద్యోగాల్లో రిజర్వేషన్లు అవసరమని పాటలు రాశాను. అట్లానే రాజ్యాంగంలో ఉన్నటువంటి నాయకత్వంతో, రాజకీయ అధికారంలో దళితులుండాలని కోరుకుంటున్నాను. ఈ రాజ్యాంగం ద్వారాలు బహుజనులు అధికారంలోకి రావాలని కోరుకుంటున్నాను. పల్లెల్లో దళితులనుండి నాయకులై అధికారంలో ఉన్నవాళ్ళు బూర్జువా నాయకుల కన్నా ప్రజలతో అతి సన్నిహితంగా ఉండడం, సమస్యలు పరిష్కరించడం చూశాను. అయితే ప్రపంచంలో ఎనిమిదో వింతైన సినిమా రంగంలో దళితులు హీరోలవడం నేనెక్కడా చూడలేదు. ఆర్థికం సమకూరితే ఏ నాటికైనా దళితున్ని హీరోపెట్టి సినిమా తీస్తాను. అయితే డబ్బు

సంపాదిస్తున్నారు తప్పితే ఇళయరాజాను ముఖ్యమంత్రిని చేయలేదు. టికటిస్తే ఎమ్మెల్లే అయినా అతడు అవుతాడు.

దళితులు పరిశ్రమలు పెట్టాలి. కంట్రాక్టర్లవ్వాలి. స్కూల్లు పెట్టాలి. డ్యాములు కట్టాలి. పెట్టుబడిని నిర్ణయించేది మనిషి చైతన్యమే. సోషలిస్టు చైతన్యంతో పెట్టుబడిని వినియోగిస్తే కొంత కాలమైన రష్యా చైనాల్లో జరిగిన అభివృద్ధి, సమసమాజ నిర్మాణం సాధించింది. చూశాం గదా. అందుకని దళిత బహుజన చైతన్యంతో పెట్టుబడిదారులు, పారిశ్రామిక వేత్తలు, కూడా రావాలి.

ప్రజల్లోకి వెళ్ళే ప్రజారచయిత
కె.సీతారాములు

కె. సీతారాములు రాసి, పాడి, ప్రదర్శించిన పాటలు, నాటికలు యిందులో వున్నాయి. ఇవి అచ్చు వేసుకోవడంకోసం రాయలేదు. ప్రజల్ని ముఖ్యంగా ఆధునిక అభివృద్ధికి, సైన్సుకు, చైతన్యానికి దూరంగా ఉండిపోయిన గిరిజన, దళిత కులాల ప్రజల్ని చైతన్యవంతం చేయడం కోసం రాసిన రచనలివి. రాయడం మాత్రమే కాదు వాటిని ప్రజల్లోకి తీసుకెళ్ళి ఆడిపాడి ప్రదర్శించిన రచనలివి. ప్రజల నుండే కళాకారులను తయారుచేసి ప్రజలను మేల్కొలిపే రచనలివి.

ఈ రచనల గురించి, ప్రదర్శనల గురించి ఈనాడు, వార్త ఆంధ్రభూమి, ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతివంటి దిన పత్రికల్లో ఎన్నో ప్రశంసలు మరెన్నో వార్తలు వచ్చాయి. అవన్ని ఆయా జిల్లా ఎడిషన్లోకి పరిమితమవడంవల్ల ఇతర ప్రాంతాలకు తెలిసింది తక్కువ. అందువల్ల ఈ రచనలనుగురించి, రచయితగురించి, ప్రదర్శనలగురించి వచ్చిన వార్తలను ఈ పుస్తకంలో చేర్చడం ఎంతో ఉపయుక్తంగా ఉంది.

అన్నాహజారే 'రాలేగాం సిద్ది' అనే మహారాష్ట్రంలోని ఒక గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దారు. అది ప్రాచుర్యంలోకి వచ్చాక దేశానికి ఒక ఆదర్శ నమూనాగా స్వీకరించబడింది. అలాగే కె.సీతారాములు పదేళ్ళుగా చేస్తున్న కృషి ప్రాచుర్యంలోకి రావాలి. పార్టీల అండలేకుండా, ఏ ప్రభుత్వం అధికారంలో ఉందనేదాంతో నిమిత్తం లేకుండా సామాజిక చైతన్యంకోసం రాష్ట్రంలో ఎందరో రచయితలు, కళాకారులు కృషి చేస్తున్నారు. వరంగల్‌జిల్లాలోని జి.వై.గిరి వల్లంపట్ల నాగేశ్వరరావు వంటివాళ్ళు ఈ కోవలోకి వస్తారు. ప్రతిజిల్లాలో యిలా కృషిచేసే వాళ్ళెందరో ఉన్నారు వారి కృషిని సాహిత్య, సాంస్కృతిక, కళారంగాల చరిత్రలో ప్రముఖంగా రికార్డు చేయాలి.

వీరికృషిని ప్రతి ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆదర్శంగా స్వీకరించాలి. ఇలా సంఘటితంగ ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మికులు వారికున్న తీరిక సమయాన్ని, తీరికలేని సమయంలో తీరిక చేసికొని తమకన్నా అభివృద్ధిలో, చైతన్యంలో వెనుకబడి ఉన్న ప్రజలను మేలుకొల్పాలి.

కె. సీతారాములు ఈ పాటల్ని, నాటికల్ని వందల గ్రామాల్లో ప్రదర్శింపజేశారు. వందల మందికి శిక్షణ యిచ్చి కళాబృందాలను రూపొందించారు. సులభంగా అర్థమయ్యే ఈ రచనల్ని పాఠ్యపుస్తకాల్లో చేర్చడం ఎంతో అవసరం. ఒక వైపు ఉద్యోగం చేస్తూ కళారంగంలో నిరంతరం కృషి చేస్తున్న సమగ్ర సామాజిక విప్లవకారుడైన సీతారాములు తాను చేపట్టిన ఏ రంగంలోనైనా ఉన్నత శిఖరాలకు ఎదిగారు. వార్డెన్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నో సమస్యలపై పోరాటం చేసి విజయం అందించారు. వార్డెన్స్‌కు ఒక సామాజిక గౌరవాన్ని గుర్తింపును తెచ్చారు. కళాకారుడిగా, రచయితగా ముఖ్యమంత్రి నుండి ప్రత్యేక ప్రశంసలు, సత్కారాలు పొందారు.

ప్రభుత్వ శాఖల అధికారులు తమ అవసరాలకు వాడుకోవడానికి పరిమితం కాకుండా వారు తమ శాఖల ద్వారా యీ ప్రదర్శనల్ని దూరదర్శన్‌లో, టీవీ ఛానల్స్‌లో ప్రసారం చేయించాలి. ఎలక్ట్రానిక్ మీడియా ఎంతో అభివృద్ధి చెందింది. ఇలాంటి ప్రదర్శనల్ని వీడియోతీసి ఊరూరా ప్రదర్శించాలి. గ్రామీణ పేదల మేలుకొలుపుకోసం దూరదర్శన్ ఒక టీవీ ఛానెల్ ఏర్పాటు చేయడం అవసరం. ఎక్కడ ఏ కృషి జరుగుతున్నదో తెల్సుకోవాల్సిన బాధ్యతను దూరదర్శన్, ఇతర టీవీ ఛానళ్ళు స్వీకరించాలి.

ఇందులోని ఆరోగ్య పథకం వచ్చిందన్నా గత్తరొచ్చెనే, గ్రామసభలో మనం కొండకోనలేలె గిరిజనుడా, ఆరోగ్యమే ఆనందం, మళ్ళీ చదవాలమ్మ వెన్నెలా మొదలైనవి చక్కని గ్రూపు డ్యాన్సు పాటలు, వీటిని టీవీల్లోకూడా ప్రసారం చేస్తే ప్రజలకోసం ఎలాంటి కృషి జరుగుతున్నదో తెలుస్తుంది. సినిమా పాటైనా, దాన్ని వినకుండా, చూడకుండా కేవలం అచ్చుతో దాని పూర్తి మాధుర్యం పొందడం సాధ్యంకాదు. చదువుకోవడం ద్వారా యిందులోని పాటలు భావం అందుతుందేగానీ రసం అందదు అది ప్రదర్శనతోనే సాధ్యం.

ఆరోగ్య రక్షణ కోసం కోయదొర ఏకపాత్ర హాస్య ప్రధానమవుతూనే ఒక పాత కళారూపాన్ని చైతన్య కళా రూపాన్ని చైతన్య కళారూపంగా ఎంతబాగా

మార్చుకోవచ్చో చూపుతుంది.

"బుడబుడమంటూ కూనల్ని కన్నావు, రెండు పుంజులు, నాలుగు పెట్టలు అవునా! నీ యింటి సుట్టూత మురికి కాలువలే, పందుల్లాగా దోమలు బాగా బల్సిపోయినాయి, గాదోమలుకుట్టి ఒక పుంజు మలేరియా రోగమొచ్చి సచ్చిండు. నీపెట్ట అతిసారవ్యాధి సోకి చనిపోయింది. ఇంకోపెట్ట బువ్వ సరిగ్గా పెట్టక రక్తహీనత జబ్బుచేసి సచ్చింది."

కోయదొర ఏకపాత్రలోని సంభాషణయిది. ఇక్కడ పుంజు అంటే మగపిల్లడు, పెట్ట అంటే ఆడపిల్ల, ఆ కళారూపం తాలూకు భాషాధోరణితో రాసిన ఈ ఏకపాత్రభినయ నాటిక ఎంతో అకర్షిస్తుంది. ఆరోగ్య రక్షణ వీధినాటికలో ఆరోగ్యాన్ని మూఢ నమ్మకాలకు ముడిపెట్టి గొర్లు, కల్లు వగైరా ఖర్చులపాలయ్యే తీరును బిడ్డ రోగానపడి చనిపోయిన తీరును హృదయవిదారకమైన దృశ్యాలను చిత్రిస్తూ ఆదశ నుంచి వైద్య చైతన్యం దిశగా మారాల్సిన క్రమాన్ని సంఘటనల్తో చక్కగా వ్రాశారు.

"రోగం నొప్పులు రాకుండా ఊరూ వాడను శుభ్రంచేయి, కాలువతవ్వి రోడ్డును పోసి, త్యాగం చేసే దారులు వెయ్యి" అని సందేశాన్నందిస్తారు రచయిత.

గొల్ల సుద్దులు కళారూపంలోని 'రైతురాజ్యం' రచనల బహుళజాతి కంపెనీల గురించి టెర్మినేటర్, బోల్‌గార్డు విత్తనాల గురించి మేలుకొలపడంవుంది.

"అది తిరిగి మొలకెత్తవు, చుట్టు ప్రక్కల పంటలుకూడా నాశనమవుతాయి. తిరిగి మనకు విత్తనాలు కావాలంటే మళ్ళీ ఆకంపెనీ దగ్గరే పంట విత్తనాలు కొనాలి. ఈవిధంగా అమ్మే విత్తనాల్లో విషం ఉంటది. ఈవిత్తనాలతో వచ్చె పంటలుకూడా విషంతో ఉంటాయి. అందుకే కొత్త కొత్తరోగాలు వస్తున్నాయి. కొత్త కొత్త కలుపు మొక్కలు పుట్టుకొస్తున్నాయి." ఇలా కళారూపంతో వినోదంతోపాటు సమాచారాన్ని చక్కగా అందించి చైతన్య పరుస్తారు రచయిత.

"అన్నదాత" నాటికలోకూడా బహుళజాతి కంపెనీల మోసాల గురించి హెచ్చరికలు చేస్తారు. సాగునీరు దొరికే తీరుననుసరించి పంటలు వేసుకోవాలని హితవు చెప్తారు.

"ఆరు తడి పంటలయిన జొన్న, కంది, పెసర, పత్తి, మిర్చి పొద్దుతిరుగుడు, శనగ వేసికోవాలి. క్యాంపు పెట్టినప్పుడు ఆపరేషన్ చేయించుకోవాలి. కొండనీరు వాగునీరు కాలువచేసి కళ్ళెం వెయ్యి" అని కర్తవ్యం సూచిస్తారు.

పూర్వం సమాచార పౌరసంబంధశాఖ ద్వారా ఊరూరా చిన్న ప్రాజెక్టులతో వ్యాన్‌లో వచ్చి 16 యం.యం. సినిమాలు చూపేవారు. వాటిలో ఆరోగ్యం, విద్య, పంటలతీరు మొదలగు ఎన్నో అంశాలుండేవి. ఈనాడు రోడ్లు పెరిగాయి, టెక్నాలజీ పెరిగింది అలాంటి ప్రదర్శనలు యిపుడెంతో సుళువు, కాని జరగడం లేదు.

కె. సీతారాములుగారి నాటికల్లో, నృత్యగీతాల్లో ఆకలివుంది, పేదరికంవుంది, పల్లె పాత్రలున్నాయి. నిజ జీవితంలోని సంఘటనలున్నాయి. ప్రజల దురలవాట్లు, దుబారా, మూఢవిశ్వాసాల తీరువుంది. అభివృద్ధిని, సైన్సును అందుకోవాల్సిన తీరువుంది. ఆర్థత, ఆవేశం, ఆలోచన, ఆవేధన, సుఖం, దుఃఖంతో సజీవ పాత్రల చిత్రణ వుంది. ప్రదర్శనల్ని రక్తి కట్టించడం వుంది. ఆకర్షనీయంగా వున్న కొన్ని పదాలు చూడండి.

"వెన్నెల పైటేసి కిన్నెరసాని – రేరేలో రేలా
పరువాల పంటకు పాకాల చెరువు – రేరేలో లేలా"

అలాగే రారో రైతన్న కోలాటం పాటలో చూడండి.

"అమెరికావోడు వచ్చిండు – ఆశలెన్నొ చూపిండు
అగ్రిమెంటు హక్కులతోటి,
భారతీయ వ్యవసాయంను
బానిసగా మార్చుతుండు"

'కొత్త పద్ధతులు' పాటలో వ్యవసాయంలో వచ్చిన కొత్తపద్ధతులను పరిచయం చేస్తారు. 'రైతుహక్కు' పాటలో "దళారీ చేతిలో బందీలయ్యాము" అని మొదలై "విదేశాలకు మనం బానిసకావద్దు" అని హెచ్చరిస్తారు. భారత రైతన్నా బృందగానంలో "నేలకోతతో నెర్రలు బాసి తేమలేక మొక్కలెండెనా – భూమి సారం తెలియకపాయె, నీటి పొదుపు తెలియక" అంటూ పలుసూచనలు అందిస్తారు.

"బాలవెలుగు" నాటిక బాలలు బాలకార్మికులుగా పనిచేస్తున్న తీరును తెలుపుతుంది. వారిని పని భారం నుండి విముక్తిచేసి చదువుకునే అవకాశాలు కల్పించాలని కోరుతూ, ప్రస్తుతం ఉన్న అవకాశాలను ఎలా వినియోగించుకోవాలో చూపిస్తారు. ఇందులో కూలిపనిచేసే తల్లిసీతాలు తండ్రి తాగుబోతు సూరయ్య, కూలి పనిచేసే బాల కార్మికుడు కొడుకు రాముడు, వెంకన్న, కూతురు సుజాత, భారతి

బాలవెలుగు టీచర్ చంద్రం, ఇటుక బట్టీలు, పెంకులు చేయించే మేనేజరు కోటేశ్వరరావు, మెకానిక్‌షాపు ఓనరు సోందుమియా పాత్రలు. ఏవూళ్ళోనైనా పోల్చుకోవచ్చు. ఈ నాటికలో పుట్టపై ఎక్కి కాయలు తెంపుకోబోతున్న సీతాలు సూరయ్యల కూతురు భారతిని పాము కాటేయడం, తల్లి దండ్రులు ఏడ్చే దృశ్యం ప్రేక్షకుల్ని కంటతడి పెట్టిస్తుంది. హృదయాలను కదిలిస్తుంది. ఈ నాటిక ఆసాంతం ప్రేక్షకులు జీవితానికి నాటికకు మధ్య అంతరం తొలగి ఏకత్వం పొందుతారు. తండ్రి సూరయ్య కొట్టే దెబ్బల బాధకు కొడుకు వెంకన్న యింటి నుండి పారిపోతాడు.

పాతసామాన్ల సంచి భుజాన వేసుకొని పాతసీసాలు, ప్లాస్టిక్ సామాన్లు కాగితాలు ఏరుకుంటూ బతుకుతాడు. మెకానిక్ రాముడు వెల్డింగ్ చేస్తుంటాడు. భారతిని తల్లి సీతాలు తమ్ముని ఎత్తుకొని ఆడించడంకోసం ఇంట్లో ఉంచుతుంది.

ప్రజల్లో గల తప్పుడు అభిప్రాయాల్ని ఈ నాటికలో సవరించే కృషి కనపడుతుంది. తాగుబోతు సూరయ్య "పిల్లల్ని బడికి పంపుతే మాపొట్ట గడవడమెట్లాగని పంపలేదుసారు" అంటే చంద్రం ద్వారా యిలా సందేశం ఇస్తారు రచయిత. "పక్షులు జంతువులు చూడండి. వాటి పిల్లల్ని కనిపెంచి పోషించడానికి ఎంతో కష్టపడి ఆహారాన్ని తెచ్చిపెడుతాయి. అలాగే మీరుకూడా కష్టపడి పనిచేసుకుంటూ మీపిల్లల్ని చదివించుకోవాలి."

ఈ పుస్తకంలో లంబాడి, కోయ భాషల్లోకూడా పాటలున్నాయి. "అజోరే నాణిక్యా......./ అచో అచోసదవ్‌లా......../ పలక బలపం ఘలేర్ హత్ / పలుగు పార ఘలేక......" అంటూ బాల కార్మికుల్ని చదువుకొవాలని సందేశం యిస్తుంది.

అలాగే కోయభాషలోని "చిన్నా చిన్నా కూనకూ పెరసరమందె పిల్లాకు అక్కోచంద్రక్కా" అంటూ రోగ నివారణ ముందు జాగ్రత్తల సూదులు మందులు వాడాలని కొండకోనల గిరిజనులకు సైతం అర్థమయ్యేలాగ సందేశాన్నిస్తుంది.

ఇవాళ ఈనాడు దినపత్రికలో ప్రొక్లెయిన్‌లు కావాలని రైతులు నిలదీస్తున్న వార్తలు వస్తున్నాయి. ప్రొక్లెయిన్‌ల వల్ల ఎంత మందికి పని లేకుండా పోతున్నది వారి ఆర్తిని, పోరాటాన్ని వార్తలు రాకుండా అణిచివేస్తున్నారు. ఈ రచయిత ప్రజల పక్షమే తప్ప ప్రభుత్వ పక్షం కాదని "రంగులకల" పాట నిరూపిస్తుంది.

"ఈ రాష్ట్రం దళారిచేతిలో పెట్టారో – ఎల్లన్నోరి, మల్లన్న
మన పేదల కొంపలు నిలువున ముంచాడే – ఎల్లన్నోరి, మల్లన్న

ప్రొక్లెయిన్లను తెచ్చినారులే – కాంట్రాక్టర్లను పెంచినారులే
కంప్యూటర్లను పెట్టినారులే – నిరుద్యోగం పెంచినారులే.....
పేదల పొట్టలు కొట్టినారన్నో – ఎల్లనోరి, మల్లన్న
దళారులను పెంచినారన్నో – ఎల్లనోరి మల్లన్న
ప్రజల ఆవేదనకు అక్షర రూపం పాట"

హైటెక్కు పాలన టెక్కులు చూపి టక్కరి మాటల ట్రిక్కులు చెప్పె అంటూ దళారి పాలన తరిమి కొట్టరన్నా అని ప్రజల్ని మేలుకొలుపుతాడు రచయిత.

"నేనొక నిప్పురవ్వనై" పాటలో నిప్పురవ్వనై సమాజంలోని దోపిడి, పీడన, అసమానతల్ని, నిరుద్యోగాన్ని చీకటి బజారు, వరకట్న పిశాచాలను, రాజకీయ రౌడీలను కాల్చివేయనా అంటూ ఆగ్రహిస్తారు.

'నేస్తం మరువలేను' పాటలో "స్నేహం కోసమని ప్రేమించిన హృదయాలు, మానవ సంబంధమె అనురాగ బంధమై శ్రమ శక్తులమై జాతి విముక్తులమై, జీవనరాగమై భావన రూపమై" సాగే మరువలేని నేస్తంను మనకు మళ్ళీ గుర్తుచేస్తారు.

'కొత్తపాట'లో సీతారాములు పేదరికం, పెరిగే ధరలు, బాల కార్మికులు గురించి యిలా అంటారు.

"ఈ పేదవాని బతుకు నా పాత పాట వినండి నేటికి అది ఒక కొత్త పాటగానే ఉంది."

పల్లవితోనే సగంభావం చెప్పడం పూర్తయిపోయింది. శ్రోతల మనస్సు ఆవేదనతో తల్లడిల్లుతుంది.

ఫెమినిజం రాకముందునుండి స్త్రీల పక్షం వహించే సాహిత్యం వస్తూనేవుంది. "ఆడదంటే అలుసేల" పాటలో ఆడది ఆదిశక్తి, పరాశక్తి, సమక్క, సారమ్మ, ఝాన్సి వీరనారి, రుద్రమ్మ, సత్యభామ సాహసం, కట్టకింది మైసమ్మ, కట్టమీది పోలేరమ్మ, ముత్యాలమ్మ, ఎల్లమ్మ, నవమాసాలుమోసి కనిపెంచిన తల్లి అంటూ చరిత్ర నుంచి స్ఫూర్తినందిస్తారు. ఏపుల్ జయకర్ అమ్మ దేవతల గురించి చేసిన పరిశోధనల్ని నేటి ఫెమినిస్టులు ప్రాచుర్యంలోకి తేవడం అవసరమని మరిచి పోతున్నారు కె. సీతీరాములు, తనకు తెలియకుండానే ఈపని చేశారు.

కార్గిల్‌లో పోరాడిన సైనికులకు నివాళియిస్తూ పేరుపేరున స్మరించారు. ఆంగ్లేయుల పాలనకు వ్యతిరేకంగా సాగిన జాతీయోద్యమ రథసారథులను వారి కృషితీరును "భారతమాతకు పూజలు చేసి" అనే పాటలో చక్కగా యిమిడ్చారు. "బాలవితంతువు బసివిని మొగ్గ"ల గురించి. ఈ దురాచారాన్ని హేతువాదంతో ప్రశ్నిస్తారు. కొండాకోన బతుకుల గురించి, 'అడవితల్లి ఘోష' గురించి వ్రాసిన పాటలతో ఈ సంపుటి ముగియడం ఒక పరిణామ క్రమాన్ని సూచిస్తుంది.

ఇలా కె. సీతారాములు తన చుట్టూ వున్న సమాజం కోసం తానేదైనాచేయాలని రచయితగా, కార్యకర్తగా, నిరంతరం తపిస్తున్నారు. ఆచరిస్తున్నారు. కుటుంబాన్ని కూడా ఈ కృషిలో ప్రధాన భూమిక నిర్వహించేట్టుగా తీర్చిదిద్దుకున్నారు. కుటుంబమంతా యిలా ఔత్సాహికంగా సాహిత్య సాంస్కృతిక రంగంలో సమిష్టి కృషి చేయడం రాష్ట్రంలో అరుదైన విషయం. ఈ విశిష్టతకు కారకులైన కె. సీతారాములు సతీమణి సావిత్రి, పిల్లలు తులసి, చైతన్య, కిరణ్‌లను అభినందిస్తున్నాను.

వీరి ప్రదర్శనలు ఖమ్మం జిల్లా నుండి శ్రీకాకుళం, నల్గొండ, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాలకు విస్తరించి ప్రజల్ని ఆకట్టుకున్నాయి. 'ఆరోగ్య రక్షణ' వీధినాటిక పన్నెండు వందల ప్రదర్శనలు యివ్వబడ్డాయి. 'బాలవెలుగు' నాటిక డెబ్బయి అయిదు. 'అన్నదాత – ఆహార హక్కులు' నాటిక 160 ప్రదర్శనలు యివ్వబడ్డాయి. ఇట్లా జరిగే కృషిని విశ్వవిద్యాలయాలు, సాంస్కృతిక మండలులు, తగు రీతిలో ప్రోత్సహించడం అవసరం. ఆయాజిల్లాల్లో స్థానికంగా సాగే యిలాంటి కృషివలుల ప్రదర్శనల కోసం తెలుగు విశ్వవిద్యాలయం, నాటక పరిషత్తు, సాంస్కృతిక మండలి ప్రత్యేక విభాగంగా వారం పది రోజుల పాటు రవీంద్ర భారతిలో ప్రదర్శనలు నిర్వహింపజేసి నంది బహుమతులను యిచ్చి సత్కరించడం అవసరం.

ఇవాళపని చేయకుండా, కీర్తిసంపాదించే వారెక్కువ. తక్కువ శ్రమతో ప్రజలతో సంబంధం లేకుండానే, ప్రజల వద్దకు పోకుండానే తమ రచనల్ని ప్రజల వద్దకు చేర్చకుండానే ఎంతో మంది ప్రజారచయితలుగా, కళాకారులుగా సాహిత్య సాంస్కృతిక రంగాల్లో తిష్టవేసుకున్నారు. వాళ్ళు నిజంగా ప్రజల వద్దకెళ్తున్న నిజమైన ప్రజారచయితలకు సాహిత్య సాంస్కృతిక చరిత్రలో స్థానం లేకుండా చేస్తున్నారు. నాటకాల పోటీల్లో పోటీల కోసమే ప్రదర్శనలిస్తూ గొప్ప కృషిగా, కళాకారులుగా, రచనలుగా చలామణి చేస్తూ చరిత్రను ఖరాబు చేస్తున్నారు. ఇటీవల జరిగిన నాటాకాల

పోటీల్లో తెలంగణా నుండి ఒక్క నాటిక, నాటకం ప్రదర్శింపబడలేదు. ప్రదర్శించిన నాటికల్లో తెలంగణా జీవితాలేలేవు. ఇంతగొప్ప రచయితలు కళాకారులు, సామాజిక ప్రయోజనం కోసం పని చేస్తుండగా వారికి నాటిక, నాటకాల పోటీల్లో స్థానం లేక పోవడం విషాదం. నాటిక, నాటక ఎంట్రీలు మన వద్దకు రావాలనేది ఏరకమైన దృష్టి ప్రజల్లో ఏవి ప్రాచుర్యం పొందుతున్నాయో, పరిశీలించి పిలిపించే కృషి, దృష్టి ఉన్ననాడే నిజమైన రచనలు, కళాకారులు ఎదగడం పెరుగుతుంది. అది ఆయా సంస్థల కనీస ధర్మం.

కె. సీతారాములు, ప్రభాతం నాటిక 'హాస్టలు కతలు', 'జన్మభూమి' నాటికలు పాటలతో సాహిత్యాభిమానుల అభిమానం చూర గొన్నారు. ఇది నాలుగవ సంపుటి. దళిత రచయితల కళాకారుల మేధావుల ఐక్యవేదిక సమాజానికి అందించిన మరో ఆణిముత్యం కె. సీతారాములు. కథా ప్రక్రియలలో కూడా కె. సీతారాములు అడపాదడపా కాకుండా విరివిగా కృషిచేయాలని కోరుతున్నాను. అపుడు వీరి శక్తి సామర్థ్యాలు మరింత వికసిస్తాయి. విస్తరిస్తాయి.

కొక్కుల భాస్కర్ ప్రజల మనిషి

కొక్కుల భాస్కర్‌గారు ప్రజల మనిషి. ఈ సమాజం బాగుపడాలని అందరు సుఖసంతోషాలతో ఉండాలని, అందుకు ప్రజల జీవన ప్రమాణాలు పెరగాలని పరితపించే వ్యక్తి. వ్యక్తి ఒక శక్తిగా ఉద్యమంగా ఎదిగిన క్రమానికి కొక్కుల భాస్కర్ ఒకప్రతీక. పదిహేను ఆగస్టు 1995 స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రారంభించిన 'పద్మపీఠం' మాసపత్రిక ప్రచురణ కన్నా ముందు ఆయనొక సామాజిక కవి. ఈగ రాజమౌళి గారితో కలిసి ప్రతిరూపం మాసపత్రికను 15-8-1984 నుండి ఆరు సంచికలు వెలువరించారు. పదిహేనేళ్ళు కళా సాంస్కృతిక రంగాల్లో కృషి చేశారు. సినిమా రంగంలో ప్రవేశించి దర్శకుడుగా ఆరు రీళ్ళు తీసి ఆగిపోయారు. ఎందరెందరో విభిన్న రంగాల ప్రముఖులు కొక్కుల భాస్కర్‌ను ప్రేమిస్తారు. అతని తపనను, చిత్తశుద్ధిని, నిజాయితీని గౌరవిస్తారు. వినయమే పెట్టుబడిగా, ఆత్మవిశ్వాసమే దిక్సూచిగా, ఒంటరిగా 'పద్మపీఠం'తో పత్రికారంగంలోకి ప్రవేశించారు. పదవతరగతైనా పూర్తి కాక, ఎనిమిదో తరగతితోనే ఆగిపోయిన కొక్కుల భాస్కర్ నిరక్షరాస్య పేదలతో పాటు, విద్యావంతులకు, ధనవంతులకు, కళా వతంసులకు తలలో నాలుకలయ్యారు. మేల్కొఉపు గీతమయ్యారు. ఎంతోమంది చేయాలనుకొని చేయలేకపోతున పనిని కొక్కుల భాస్కర్ చేస్తూ ప్రశంసాపాత్రులయ్యారు.

ప్రతి ప్రారంభమూ ప్రసవ వేదనతో వ్యధతో, వేదనలతోనే మొదలవుతుందన డానికే 'పద్మపీఠం' ప్రారంభం ఒక ఉదాహరణ. ప్రారంభం తేలికగా కన్పించినా పాలనాపోషణ మరెంతో ప్రయాసతో బాధ్యతా యుతంగా మారుతుంద.. తల్లిదండ్రులు తాము బతికున్నంత కాలమూ కన్నబిడ్డలపట్ల తల్లిదండ్రులుగానే కర్తవ్యంతో వాత్సల్యంతో తమపాత్ర నిర్వర్తిస్తారు. 'పద్మపీఠం' పట్ల కొక్కుల భాస్కర్ కన్నబిడ్డల కన్నా అమితంగా ప్రేమించే సొంతబిడ్డగా తన బాధ్యతని నెరవేరుస్తున్నాడు. సినిమారంగం అచ్చిరాకపోయినా, కళారంగం భుక్తినీయక పోయినా అభిరుచి చంపుకోలేక కొక్కుల భాస్కర్ ప్రఖ్యాత పబ్లిసిటి ఆర్టిస్టు గంగాధర్‌తో కలిసి స్వీయ పర్యవేక్షణలో 1994లో 'శాంతి కిరణం' అనే 20 నిమిషాల టెలిఫిల్మ్ నిర్మించారు. దీనికి ఆరు బంగారు నంది అవార్డులు రావడం వీరిద్దరి కృషి ఎంత ఉన్నత శిఖరాలకెదిగిందో తెలుపుతుంది. 2000 సం॥లో "సాధనశూరులు" సంప్రదాయకుల మ్యాజిక్ విద్యలను టెలిఫిల్మ్‌లో బంధించారు. దానికి తుదిమెరుగులు దిద్ది విడుదల చేయాల్సి వున్నది. ఇటీవలే కోరుట్లలో 'పద్మపీఠం' పదవ వార్షికోత్సవం సందర్భంగా జిల్లాలోనే ప్రత్యేకతను సంతరించుకున్న సభను నిర్వహించి ఎందరినో సత్కరించారు. దీనికి దక్షిణ దేశాల జర్నలిస్టు సంఘం అధ్యక్షులు యస్. వెంకట నారాయణ ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఇలా అతని కార్యకలాపాలు విస్తృతవమైనవి.

అయితే ఒకానొక చారిత్రక నిర్దిష్ట కాలంలో అవసరమై, అనివార్యమై అందరి కోసం పరితపించే వారు, తన కులం కోసం పాటుపడ్డానికి పరిమితం కావాల్సి రావడం బిసి, ఎస్సీల పట్ల సామాజిక ఆర్థిక చరిత్ర విధిస్తున్న పరిమితి. ఒక అగ్రకులం ఆయన తన కులనాయకుడుగా కాకుండా మొత్తం సమాజానికి కృషి చేస్తున్న నాయకుడిగా ప్రాచుర్యం పొందదానికి, ఒక దళిత బహుజనుడు ఎంతచేసినా బడుగు బలహీన వర్గాల నాయకుడుగా మాత్రమే గుర్తింపు పొంది, మొత్తం సమాజానికి నాయకుడుగా ప్రాచుర్యం పొందకపోవడానికి కారణం కులవ్యవస్థ, ఒక బ్రాహ్మణుడు తన కులం గురించి రాసుకున్నా గురజాడని మొత్తం సమాజానికి చెందిన రచయితగా గౌరవిస్తున్నారు. కానీ జాషువా అందరి గురించి సమస్త కులాల గురించి రాసినా దళిత రచయిత అని అంటున్నారే గానీ మొత్తం సమాజాన్ని మేల్కొల్పిన రచయిత అనడం లేదు. ఇది కొన్ని కులాలు గొప్పవి. కొన్ని కులాలు తక్కువని అనే భావం సమాజం ఆమోదించడం వల్ల జరుగుతున్న పరిణామాలివి. వాజపేయి, అద్వాని, బాహ్మణ అగ్రకులాల కోసం పనిచేసినా మొత్తం జాతి నాయకులనబడుతూ, రామోజీరావు, చంద్రబాబు నాయుడు తమ కమ్మ లాబీకోసం పనిచేస్తే మాత్రం మొత్తం జాతీయ నాయకులని, రాష్ట్ర నాయకులని అనకుండా వేరు చేస్తున్నారు. ఇది కులం నిర్వహిస్తున్న కుటిలనీతి, అందువల్లనే మొత్తం సమాజం కోసం పరితపించే కొక్కుల భాస్కర్ కేవలం పద్మశాలీల బాంధవుడుగా పద్మశాలీ కులపత్రిక సంపాదకుడుగా మాత్రమే చూడ్డం జరుగుతున్నది. నిజానికి కొక్కుల భాస్కర్ 'పద్మపీఠం' పత్రిక సంపాదకుడైనా వాజపేయి, రామోజీరావు, ఇతర పత్రిక వారికన్నా ఏ మాత్రం తక్కువ కాకుండా జాతి గురించి, మొత్తం సమాజం గురించి పరితపించే వ్యక్తి అని పత్రకారుడని ఈ సంపాదకీయాలు స్పష్టం చేస్తాయి. మొత్తం దక్షిణాసియా దేశాల జర్నలిస్టుల

సంఘం అధ్యక్షులుగా ఎన్నికైన సిరిమల్లె వెంకట నారాయణగారు పద్మశాలీకే గర్వకారణం. ఈ దేశానికే మొదటిసారి దక్కిన గొప్ప గౌరవం అయినప్పటికీ ఈ అగ్రకుల జర్నలిస్టు సంఘాలు జాతీయ స్థాయిలోగానీ, రాష్ట్రాల స్థాయిలోగానీ అతన్ని గుర్తించి ప్రాచుర్యంలోకి తేలేదు. ఒక అగ్రకులస్థుడైతే వాళ్ళు యిలాగే ప్రవర్తిస్తారా?

'పద్మపీఠం' పత్రిక పద్మశాలీయుల విషయాలకే పరిమితమైనా కొక్కుల భాస్కర్ హృదయం పద్మశాలీయులకే పరిమితం కాకుండా అందరికోసం స్పందించింది. 'పద్మపీఠం' పత్రికలే ఇతర కులాల వాళ్ళు రాసిన కథలు కూడా ప్రచురించడంతో పాటు ఇతర కులాల గురించిన కథలు కూడా ప్రచురించారు. ఇపుడీ సంపాదకీయాలు చూస్తే – కొక్కుల భాస్కర్‌కు "మనిషి" కేంద్రం అని 'మనిషి'లో పద్మశాలీయులు ఒక భాగమని స్వీకరించారని స్పష్టమవుతుంది. పద్మశాలీయులు మొత్తం సమాజానికి నాయకత్వం వహించే దృష్టికోణంతో ఎట్లా ఆలోచిస్తున్నారో, ఎంత హృదయ వైశాల్యంతో ముందుకు నడుస్తారో, చెడు ఎక్కడున్నా యిలా చీల్చి చెండాడుతారో ఈ సంపాదకీయాలే మనకు సాక్ష్యం.

1995 నుండి వెలువరిస్తున్న పద్మపీఠం పత్రికలోని ఈ సంపాదకీయాలు, వ్యక్తిస్వార్థం వదిలి సమాజం కోసం కృషి చేయాలని పిలుపునిస్తాయి. "మన సమాజంలోని అజ్ఞానాన్ని పారదోలి విజ్ఞాన జ్యోతులు వెలిగించి, కుల ఐక్యతను హిమశిఖరాలపై నిలబెట్టాలని – సంకల్ప శుద్ధి వుంటే – సిద్ధి లభిస్తుందన్న సదభిప్రాయంతో కృషి, పట్టుదల, ఏకాగ్రత, దృఢనిశ్చయం, గుండె నిబ్బరాలే పెట్టుబడులుగా ముందుకు సాగే ఈ ప్రయత్నంతో నేనిపుడు బాల్యదశలో వున్నాను. బాల్యదశలో తప్పటడుగులు తప్పనిసరే అయినా నమ్ముకున్న కలాన్ని అమ్ముకోకుండా చేస్తున్న ప్రయత్నం అని ప్రారంభ సంచికలో తన లక్ష్యాలు ప్రకటించారు.

ఎంతోమంది మేధావులు సాధించలేకపోయినదాన్ని పల్లెటూరి హైస్కూలైనా పూర్తికాని వాళ్ళు సాధించడం ఒక గొప్ప స్ఫూర్తి, నిరంతర తపన కృషి అన్నిటికన్నా ముఖ్యం. విశ్వబ్రాహ్మణుల కోసం 7 ఏళ్ళు ప్రచురిస్తున్న సూర్యశ్రీ మాసపత్రిక సంపాదకుడు గాలిపెల్లి జ్యోతిప్రకాశం, కొక్కుల భాస్కర్ నిరూపిస్తున్నారు. ఇద్దరూ కరీంనగర్ జిల్లా వారు కావడం విశేషం.

కుల సంఘాల్లో అనైక్యత ఒక పెద్ద అవరోధం. "విభజించి పాలించే రాజకీయ ఎత్తుగడలకు మనందాసోహం అంటూ మనదారి మార్చుకోలేక, ఇంకా కొనేవాడుంటే అమ్ముడు పోవడానికి సిద్ధమే అంటూ తలలు ఊపుకుంటూ కూర్చునే" వారిని హెచ్చరిస్తూ యింకా యిలా అంటారు. ముందు నడిచేవాడెప్పుడు, మార్గదర్శకుడుగా, వెనుక వాళ్లమేలు కోసం ఆలోచించాలే తప్ప ఆర్థికం, అధికారం అంటు మొండితనం, వ్యక్తి పెత్తనం అంటు మూర్ఖంగా ఆలోచిస్తే ముందు నడిచేవాడెప్పుడు, మార్గదర్శకుడుగా, వెనుక వాళ్ల మేలు కోసం ఆలోచించాలే తప్ప ఆర్థికం, అధికారం అంటు మొండితనం, వ్యక్తిపెత్తనం అంటు మూర్ఖంగా ఆలోచిస్తే ముందుచూపులేని మూర్ఖులుగా మన వార చరిత్రలో లిఖించబడతారు." అని రెండో సంపాదకీయంలోనే హెచ్చరిక, సూచన చేశారు. అనగా కులసంఘాల నాయకత్వం ఏ దశలో వుందో చెప్పకయే చెప్తూ దాని దిశమారాలని స్పష్టం చేశారు. అందువల్ల పత్రిక స్వార్థపర నాయకత్వం యొక్క విభిన్న రూపాల నిర్బంధాలను ఎదుర్కోవాల్సి వచ్చింది. ప్రకటనలు రాకుండా చేయడంతోనైతేనేమి, వార్తలు పంపకపోవడం ద్వారానేమి, చందాలు, విరాళాలు నిరాకరించడం ద్వారా నైతేనేమి, దుష్ప్రచారం చేయడం ద్వారా నైతేనేమి సకలవిధాల సహాయ నిరాకరణ సంఘ నాయకుల కార్యక్రమంగా మారిన వారెందరో – చరిత్రకు తెల్సు–కొక్కుల భాస్కర్‌కు తెలుసు.

అదేం దురదృష్టమో కానీ 'మాదిగ దండరా' ఉద్యమం తర్వాత ఎన్నో కుల సంఘాల్లో యువతరం ముందుకొచ్చి పాత సంఘాల పరిధికి వెలుపల తిరిగి కొత్తగా గొప్ప ఉత్తేజంతో ముందుకొచ్చినా పద్మశాలీ సంఘాల్లో ఈ యువతరం కుదుపు 1 నూతన నాయకత్వం, నూతన నిర్మాణం రావడం జరగలేదు. తద్వారా ముందుడగు వేయలేక ముసలివాళ్ళు పరిమితులకు లోనై సంఘం, పద్మశాలీ సమాజం కోల్పోయిందెంతో లెక్కలకందదు.